సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 338

సోమవారం 21-8-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'



భారత్ బంగారు గురి

ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఇషాసింగ్ బృందానికి స్వర్ణం - 12లో



విదేశీ విద్యానిధికి 'డాలర్' రూట్!

డాలర్ మారకంలో పెట్టుబడులు.. కరెన్సీ విలువ క్షీణతకు హెడ్జింగ్ - 13లో



సీడబ్ల్యూసీలోకి రఘువీరారెడ్డి

కాంగ్రెస్ పార్టీ అత్యున్నత నిర్ణయాత్మక మండలి అయిన.. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో ఏపీ నుంచి రఘువీరారెడ్డికి చోటు దక్కింది.

వివరాలు 3లో ▸



లూనా-25 ప్రయోగం విఫలం

జాబిల్లిపై పరిశోధనలకు రష్యా చేపట్టిన లూనా-25 ప్రయోగం విఫలమైంది. చంద్రుడిపై దిగకముందే ల్యాండర్ కుప్పకూలింది.

వివరాలు 6లో ▸



పాకిస్తాన్‌లో ఘోర ప్రమాదం

పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో ఓ బస్సు.. వ్యాన్‌ను ఢీకొట్టడంతో 18 మంది ప్రయాణికులు మరణించగా.. 16 మంది గాయపడ్డారు.

వివరాలు 6లో ▸



ఆక్రమించలేదనడం అబద్ధం

లద్దాఖ్‌లోని అంగుళం భూమిని కూడా చైనా ఆర్మీ ఆక్రమించుకోలేదంటూ ప్రధాని మోదీ చేసిన ప్రకటన అబద్ధమని రాహుల్ అన్నారు.

వివరాలు 6లో ▸

20 లక్షల మంది రైతుల చేతికి..

సరికొత్త సంపద

32 లక్షల ఎకరాలపై ఆంక్షల తొలగింపు.. ఆర్థిక వ్యవస్థలో పెను మార్పులు

భూములపై సంపూర్ణ హక్కులతో అన్నదాతల ఆనందం

- దశాబ్దాల భూ సమస్యలకు దారి చూపిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులతో 27.41 లక్షల ఎకరాలపై తొలగిన ఆంక్షలు
- చుక్కల భూములు 2.06 లక్షల ఎకరాలు.. సర్వీసు ఈనాం 1.68 లక్షల ఎకరాలు.. షరతులు గల పట్టాలు 33 వేలు, ఖాళీ కాలమ్ భూములు 30 వేల ఎకరాలు
- ఈ భూములన్నింటినీ 22 (ఎ) జాబితా నుంచి తొలగించిన ప్రభుత్వం
- తద్వారా కొత్త రుణాలు, భూ మార్పిడి, క్రయవిక్రయాలు
- ఇది రాష్ట్ర ప్రగతికి ఎంతగానో దోహదం.. విలువ పెరగడంతో పాటు వివాదాలు తగ్గుముఖం
- తమకు ఎలాంటి లాభం లేదని పట్టించుకోని గత టీడీపీ ప్రభుత్వం

2 లో



ఎక్కడైనా వివాదంలో ఉన్న మన 4 సెంట్ల భూమి మన సొంతమైతే ఆ ఆనందమే వేరు. ఆ కుటుంబానికి అది స్థిరాస్తిగా నిలిచిపోతుంది. అలాంటిది ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 32 లక్షల ఎకరాల భూములపై రైతులకు సర్వ హక్కులు కల్పించడమంటే మాటలు కాదు. ఒక్కసారిగా ఆ రైతుల ఆర్థిక పరిస్థితి మారిపోతుంది. సంపద సృష్టి ద్వారా ఇటు రైతులు, అటు ప్రభుత్వానికి లబ్ధి కలుగుతుంది. ఇంతటి కీలక నిర్ణయానికి కారణమైన ఏపీ ప్రభుత్వంపై భూ చట్టాల నిపుణులు ప్రశంసలు కురిపిస్తున్నారు. రాష్ట్రంలో లక్షల కోట్ల విలువైన సంపద అన్నదాతల చేతుల్లోకి రావడం దేశంలోనే విప్లవాత్మక మార్పు అని కొనియాడుతున్నారు.

'ఘోస్ట్' చందా.. మార్గదర్శి దందా!

మరో అక్రమం బట్టబయలు

- కొత్త వ్యక్తుల పేరుతో వారికి తెలియకుండానే చిట్టీ గ్రూపులు.. ఆధార్ నంబర్లు తెలుసుకుని సభ్యత్వం
- చందాలు చెల్లించకుండానే బుక్ అడ్జస్ట్‌మెంట్ ద్వారా కనికట్టు
- చిట్టీ పాట కొల్లగొడుతున్న మార్గదర్శి యాజమాన్యం
- సూళ్లూరుపేట వ్యక్తి పేరిట చీరాలలో చిట్టీ
- చందాదారులను అప్పుల ఊబిలోకి నెడుతూ మరో దందా
- ఫిర్యాదులతో మార్గదర్శిపై మూడు కేసుల నమోదు
- మేనేజర్లను అదుపులోకి తీసుకున్న సీఐడీ
- వివరాలు వెల్లడించిన సీఐడీ అదనపు డీజీ సంజయ్, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రామకృష్ణ



మీడియాతో మాట్లాడుతున్న సీఐడీ అదనపు డీజీ సంజయ్. చిత్రంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రామకృష్ణ, సీఐడీ ఎస్పీ అమిత్




సుబ్రహ్మణ్యం

సాక్షి, అమరావతి: ఈయన పేరు సుబ్రహ్మణ్యం. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం కోటపోలూరు గ్రామస్తుడు. బాపట్ల జిల్లా చీరాలలోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయంలో ఓ చిట్టీ గ్రూపులో చందాదారుగా నమోదయ్యారు. ఈయన ఏనాడూ చీరాల మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయానికి వెళ్లలేదు. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో చందాదారుగా చేరనే లేదు. కానీ చీరాల మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయంలో మాత్రం ఆయన్ను చందాదారుగా నమోదు చేయడం గమనార్హం. విడ్డూరంగా ఉన్నప్పటికీ ఇది నిఖార్సైన నిజం. దేశంలో ఇంత వరకు

మిగతా 10వ పేజీలో ▶

ఫ్యాక్ట్ చెక్



బకాయిలు చెల్లించినా బాధేనా?

- చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.969.40 కోట్ల సూక్ష్మ సేద్యం బకాయిలను చెల్లించింది సీఎం జగనే
- గత నాలుగేళ్లుగా లబ్ధిదారుల్లో 18,756 మంది ఎస్సీ, ఎస్టీలే
- ఆ వర్గాలకు రూ.131.52 కోట్ల సబ్సిడీ చెల్లించింది ఈ ప్రభుత్వమే
- 90% సబ్సిడీపై సూక్ష్మసేద్యం యూనిట్లు మంజూరు
- కేంద్రం ఇచ్చేది 33%.. 57% భారం రాష్ట్ర ప్రభుత్వానిదే
- జీఎస్టీ పన్నుల భారంలో 50 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది.. 2022-23లో రూ.639 కోట్లతో 2.26 లక్షల ఎకరాల్లో విస్తరణ
- ఈ దఫా రూ.902 కోట్లతో 2.50 లక్షల ఎకరాల్లో విస్తరణ లక్ష్యం

3 లో

రుతురాజ్, సామ్సన్ మెరుపులు

రెండో టీ20లోనూ భారత్‌దే గెలుపు

12 లో



'చోడవరం'లో గ్రీన్ ఫీల్డ్ ఇథనాల్ ప్లాంట్

షుగర్ ఫ్యాక్టరీలో రోజుకు 60 కిలోలీటర్ల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు

పర్యావరణ అనుమతులు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం

డీపీఆర్ తయారీకి బిడ్లు ఆహ్వానించిన పరిశ్రమల శాఖ

సాక్షి, అమరావతి: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సహకార చక్కెర కర్మాగారాలను తిరిగి బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా పంచదార ఉత్పత్తికంటే అధికాదాయాన్నిచ్చే బయో ఇథనాల్ ఉత్పత్తిని పెద్ద ఎత్తున ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటోంది. తద్వారా చెరకు రైతులను అన్ని విధాలా ఆదుకోనుంది. తొలి దశలో అనకాపల్లి జిల్లా చోడవరంలోని చోడవరం సహకార సంఘ చక్కెర కర్మాగారంలో గ్రీన్ ఫీల్డ్ బయో ఇథనాల్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రోజుకు 60 కిలోలీటర్ల ఇథనాల్‌ను ఉత్పత్తి చేసేలా ఈ యూనిట్ ఏర్పాటుకానుంది. చోడవరం చక్కెర కర్మాగారంలో బయో ఇథనాల్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించి కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి కోసం దరఖాస్తు చేయగా.. జూలై 10న అనుమతులు మంజూరు చేసి పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదికను పంపాల్సిందిగా కేంద్రం కోరింది. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమల శాఖ పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక కోసం

మిగతా 3వ పేజీలో ▶

నేడు ఏపీఎన్జీవోల రాష్ట్ర మహా సభ

హాజరుకానున్న సీఎం జగన్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నేతలు

సాక్షి, అమరావతి: విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం జరగనున్న ఏపీఎన్జీవో అసోసియేషన్ (ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం) 21 వ రాష్ట్ర మహా సభల్లో సీఎం వైఎస్ జగన్ పాల్గొననున్నారు. మధ్యాహ్నం 12.05 గంటలకు సీఎం తాడేపల్లి నివాసం నుంచి బయల్దేరి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంకు చేరుకుంటారు. కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

మహాసభలను జయప్రదం చేయండి

ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం

మిగతా 5వ పేజీలో ▶

పాడేరులో బస్సు ప్రమాదం

ఇద్దరి మృతి.. 28 మందికి గాయాలు

- ఐదుగురు విశాఖ మెడికవర్ ఆస్పత్రికి తరలింపు.. విషమంగా ఓ మహిళ పరిస్థితి
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రభుత్వం
- శాశ్వత వైకల్యం పొందిన వారికి రూ.5 లక్షలు.. గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున పరిహారం
- సీఎం జగన్ ఆదేశాలతో తక్షణం ఘటనా స్థలానికి మంత్రి అమర్‌నాథ్




ఘటనా స్థలిలో బస్సు

సాక్షి, పాడేరు, పాడేరు రూరల్, సాక్షి, అమరావతి, నెట్‌వర్క్: విశాఖ నుంచి పాడేరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఘాట్ రోడ్డులో అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయిన ప్రమాదంలో ఇద్దరు ప్రయాణికులు మృతి చెందారు. మరో 28 మందికి గాయాలయ్యాయి. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఈ దుర్ఘటన గురించి తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అక్కడకు చేరుకున్నారు. ఆర్టీసీ, పోలీస్ శాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని సీఎం జగన్ ఆదేశించారని తెలిపారు. శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి రూ.5 లక్షలు, గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తామన్నారు. పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను

మిగతా 5వ పేజీలో ▶

ఇదం జగత్



చిరుధాన్యాల ఎగుమతుల్లో..

ఏడో స్థానంలో ఆంధ్రప్రదేశ్



2022-23లో దేశం మొత్తం 1,69,049 మెట్రిక్ టన్నులు ఎగుమతి

- రాష్ట్రం నుంచి 1,319.78 మెట్రిక్ టన్నులు.. గుజరాత్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమ బెంగాల్ నుంచి అత్యధికంగా..
- కేంద్ర ప్రభుత్వం వెల్లడి
- ఇతర దేశాల్లో వీటికి బాగా డిమాండ్
- ఉత్పత్తి పెంచేందుకు కేంద్రం చర్యలు
- ఏపీ సహా పలు రాష్ట్రాల్లో మిల్లెట్ మిషన్ల ఏర్పాటు

2 లో



అమెరికాలో భారతీయ విజయపతాక!

యూనికార్న్ స్టార్టప్స్‌లో మనవాళ్లదే హవా

యూఎస్‌లో 2022 వరకు 582 యూనికార్న్ స్టార్టప్స్

అందులో 319 విదేశీ మూలాలున్న వ్యక్తులు ప్రారంభించినవే

ప్రవాస భారతీయులు ప్రారంభించినవి 66

యూనికార్న్ స్టార్టప్స్ సంఖ్యలో మొదటి రెండుస్థానాల్లో భారత్, ఇజ్రాయెల్

వెల్లడించిన నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ

14 లో

వినూత్న ఆలోచనలతో వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకొని భారతీయులు అమెరికాలో సత్తా చాటుతున్నారు. యూనికార్న్ స్టార్టప్స్ స్థాపించడంలో ప్రవాస భారతీయులు మొదటి స్థానంలో నిలిచారు. 2022 వరకు అమెరికాలో 582 యూనికార్న్ స్టార్టప్స్ ఏర్పాటు కాగా, అందులో 66 ప్రవాస భారతీయులు ఏర్పాటు చేశారు. అమెరికాలో మొత్తం యూనికార్న్ స్టార్టప్స్‌లో ఇండియా, ఇజ్రాయెల్‌కు చెందిన ప్రవాసులు స్థాపించిన కంపెనీలు 20 శాతం ఉన్నాయి.



జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన అనుచరులు ధ్వంసం చేసిన కాలేజీ ప్రహరీ నిర్మాణ పనులు

3 లో

జేసీ.. జేసీబీ!

నాడు-నేడు ఫేజ్-2లో భాగంగా తాడిపత్రి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేపట్టిన ప్రహరీ నిర్మాణ పనులను టీడీపీ నేత, మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అడ్డుకున్నారు. శనివారం రాత్రి తన అనుచరులతో కలిసి.. జేసీబీతో కాంక్రీట్ పిల్లర్లను కూల్చివేశారు. ఆదివారం ఆ పిల్లర్లను తిరిగి నిర్మించేందుకు ప్రయత్నించిన కార్మికులపై దాడికి ప్రయత్నించారు.

క్లుప్తంగా...

నేడు కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ భేటీ



సాక్షి, అమరావతి : రెండు రాష్ట్రాల్లో కృష్ణా బేసిన్‌లో లభ్యత ఆధారంగా తాగు, సాగు అవసరాలకు నీటిని కేటాయించడమే అజెండాగా కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సోమవారం భేటీ కానుంది. బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే అధ్యక్షతన జరిగే భేటీలో ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి, తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్‌లు పాల్గొనాల్సి ఉంది. కానీ.. త్రిసభ్య కమిటీ భేటీని వాయిదా వేయాలని శుక్రవారం తెలంగాణ ఈఎన్‌సీ కృష్ణా బోర్డును కోరారు. దీనిపై బోర్డు స్పందించకపోవడంతో త్రిసభ్య కమిటీ సోమవారం యథాతథంగా సమావేశమవుతుంది.

యువగళం.. గందరగోళం



పెనమలూరు/కంకిపాడు : టీడీపీ నేత నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఆదివారం ఎన్టీఆర్ జిల్లాలో ముగించుకుని కృష్ణా జిల్లాలోకి ప్రవేశించింది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలోని పటమట పంట కాలువ రోడ్డు మీదుగా కానూరు సనత్‌నగర్ వద్ద కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గంలోకి పాదయాత్ర ప్రవేశించింది. ముఖ్యనేతల మధ్య గ్రూపు విభేదాలు స్పష్టంగా కనిపించాయి. మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, దేవినేని గౌతమ్, వెలగపూడి శంకర్‌బాబు, గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, అనుమోలు ప్రభాకర్, ఇతర నేతలు వేర్వేరుగా ఏర్పాట్లుచేశారు. కానూరు సనత్‌నగర్ నుంచి బందరు రోడ్డు మీదుగా పోరంకి సెంటరు అక్కడి నుంచి గన్నవరం నియోజకవర్గం నిడమానూరుకు పాదయాత్ర చేరుకుంది. ఇక పాదయాత్ర స్వాగత ఏర్పాట్లు ప్రజలకు ఇబ్బందులు తెచ్చిపెట్టాయి. పోరంకి నుంచి నిడమానూరు వెళ్లే రోడ్డు మార్గాన్ని మూసివేయటంతో అటుగా వెళ్లే ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భారతీయ వైద్య విద్యార్థుల కోసం ఉజ్బెకిస్థాన్ హెల్ప్‌లైన్




లక్డీకాపూల్ (హైదరాబాద్): ఉజ్బెకిస్థాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ, తాష్కెంట్ మెడికల్ అకాడమీ (టీఎంఏ) కలిసి భారతీయ ఎంబీబీఎస్ విద్యార్థుల కోసం జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) ప్రమాణాల ప్రకారం 18001232931 అనే టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్, www.studyinuzbek.uz అనే వెబ్‌సైట్‌ను ప్రారంభించాయి. కొంతమంది మోసపూరిత ఏజెంట్లు ఎంబీబీఎస్‌లో ప్రవేశాలు కల్పిస్తామని చెబుతూ, మధ్య తరగతికి చెందిన తల్లిదండ్రుల నుంచి పెద్ద మొత్తాల్లో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ విషయం కేంద్రం దృష్టికి వెళ్లడంతో ఎన్ఎంసీ తాజాగా కొత్త నిబంధనలు విధించింది.

రాష్ట్రంలో పెట్టుబడులకు 'సియోల్' ఆసక్తి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దక్షిణకొరియాకు చెందిన 'సియోల్ సెమీకండక్టర్' అనే ప్రముఖ కంపెనీ ఆసక్తి చూపుతోందని ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. ఆదివారం అనంతపురం జిల్లా రాయదుర్గంలో మెట్టు గోవిందరెడ్డితో సియోల్ సెమీకండక్టర్, సియోల్ వయోసిస్ కంపెనీల ఉపాధ్యక్షుడు(భారత్) క్రిష్టాచార్ సమావేశమయ్యారు. అనంతరం కృష్ణాచార్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పెట్టుబడులకు సానుకూల వాతావరణం ఉందని.. రూ.800 కోట్లతో సెమీకండక్టర్ కంపెనీ ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. భూ కేటాయింపు, నీటి వసతి తదితర అంశాల్లో తగిన సహకారం అందించాలని గోవిందరెడ్డిని కృష్ణాచార్ కోరారు.

దేశంలో తొలి భారీ విద్యుత్ నిల్వ వ్యవస్థ!

నైవేలీ కార్పొరేషన్ సీఎండీ మోటపల్లి ప్రసన్నకుమార్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్ : దేశంలోనే తొలిసారిగా 8 మెగావాట్ల భారీ నిల్వ సామర్థ్యంతో 'బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టం(బెస్)'ను దక్షిణ అండమాన్ దీవిలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఎల్‌సీ) ఇటీవల ఏర్పాటు చేసింది. నైవేలీ సంస్థ సీఎండీ మోటపల్లి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ దక్షిణ అండమాన్‌లో విద్యుత్ ప్రాజెక్టులేవీ ఉండవని, ఇన్నాళ్లూ డీజిల్ జనరేటర్ల విద్యుత్‌పై ఆధారపడేవారని తెలిపారు. ఈ క్రమంలోనే దీనిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఏపీతోపాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లోని జలాశయాలపై పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్టు వివరించారు.

22 నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

- గ్రామ, వార్డు సచివాలయాల్లో నాలుగు రోజుల పాటు నిర్వహణ
- గత పదేళ్లుగా ఆధార్ అప్‌డేట్ చేసుకోనివారు 1.49 కోట్ల మంది
- క్యాంపుల్లో అప్‌డేట్ చేసుకోవడానికి అవకాశం
- కొత్త ఆధార్ కార్డుల నమోదు కూడా..

సాక్షి, అమరావతి: ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఆధార్ కీలకంగా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆధార్‌లో తప్పులు కారణంగా అర్హులెవరూ ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఈ నెల 22 నుంచి 25 వరకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించనుంది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ క్యాంపులు ఉంటాయి. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ లక్ష్మీశ అన్ని జిల్లాల కలెక్టర్లతో పాటు ఆయా జిల్లాల గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఇన్‌చార్జిలకు ఆదేశాలు జారీ చేశారు.



ప్రతి ఒక్కరూ కనీసం పదేళ్ల వ్యవధిలో ఒక్కసారైనా తమ ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని కార్డుల జారీ సంస్థ యూఐడీఏఐ కొత్తగా నిబంధనలు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఆధార్ అనుసంధానంతో కూడిన కార్యక్రమాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలంటే వివరాలను తాజాగా అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 5.56 కోట్ల మందికి ఆధార్ కార్డులు ఉన్నాయి. వీరిలో 1.49 కోట్ల మంది గత పదేళ్లలో ఒక్కసారి కూడా తమ వివరాలను అప్‌డేట్ చేసుకోలేదు. ఈ నేపథ్యంలో వీరితోపాటు కొత్తగా ఆధార్ నమోదు, ఇతర మార్పులుచేర్పుల సేవలు అందజేసేందుకు ఈ ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తున్నట్టు లక్ష్మీశ తన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఎక్కువ మంది క్యాంపులను వినియోగించుకొని ఆధార్ సేవలు పొందేలా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్‌లు ఇందుకు ప్రచారం చేయించాలని ఆదేశించారు.

అదో విఫల గళం

- వైఎస్సార్‌సీపీ నేతలు వెలంపల్లి, మల్లాది, అవినాశ్ ధ్వజం
- టీడీపీ నేతలే ఆ యాత్రను పట్టించుకోవట్లేదు
- లోకేశ్ యాత్రను బహిష్కరించిన ఎంపీలు కేశినేని నాని, గల్లా జయదేవ్



మీడియాతో మల్లాది, వెలంపల్లి, అవినాశ్

సాక్షి, అమరావతి: నారా లోకేశ్ పాదయాత్రకు బాహుబలి స్థాయిలో బిల్డప్‌లు ఇచ్చేందుకు చంద్రబాబు, ఎల్లో మీడియా ఎంత ప్రయత్నించినా ప్రజలు జోకర్‌గానే భావిస్తున్నారని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త(విజయవాడ తూర్పు) దేవినేని అవినాశ్ వ్యాఖ్యానించారు. ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. పాదయాత్రకు ప్రజా స్పందన లేకపోవడంతో చంద్రబాబు తన దత్తపుత్రుడు పవన్‌ను రంగంలోకి దించారని చెప్పారు. చంద్రబాబు, లోకేశ్, పవన్ సైకోల్లా ప్రవర్తిస్తుండటం వల్లే వారిని ప్రజలు ఆదరించడం లేదన్నారు. సంక్షేమాభివృద్ధి పథకాలతో ప్రజలు మెచ్చేలా పరిపాలిస్తున్న సీఎం వైఎస్ జగన్ ప్రభంజనంలో ఆ ముగ్గురూ కొట్టుకుపోవడం ఖాయమన్నారు.

ఆ ముగ్గురూ ద్రోహులే: వెలంపల్లి శ్రీనివాస్

అధికారంలో ఉండగా విజయవాడ, గుంటూరు ప్రాంతాలను ఏమాత్రం అభివృద్ధి చేయకుండా చంద్రబాబు, లోకేశ్ ద్రోహం చేశారు. టీడీపీ సర్కార్‌కు మద్దతిచ్చిన పవన్‌కళ్యాణ్ కూడా ద్రోహే. ఆ ముగ్గురూ కృష్ణా పుష్కరాల పేరుతో విజయవాడలో 45 దేవాలయాలను కూల్చేసిన హిందూ ద్రోహులు. మహాత్మాగాంధీ, పొట్టిశ్రీరాములు విగ్రహాలను సైతం ధ్వంసం చేసిన ద్రోహులు. కుల మతాలు, పార్టీలకు అతీతంగా సీఎం జగన్ సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. వాటిని పొందిన వారిలో టీడీపీ నేతలు వర్ల రామయ్య, బుద్దా వెంకన్న కూడా ఉన్నారు. లోకేశ్ పాదయాత్రకు టీడీపీ నేతలు కూడా స్పందించడం లేదు. టీడీపీకి ఉన్న ముగ్గురు ఎంపీల్లో కేశినేని నాని, గల్లా జయదేవ్.. లోకేశ్ పాదయాత్రను బహిష్కరించారు. లోకేశ్ పాదయాత్రపై చంద్రబాబుకు నమ్మకం ఉంటే 175 నియోజకవర్గాల్లో ఒంటరిగా పోటీ చేస్తానని చెప్పే ధైర్యం ఉందా? 175 స్థానాల్లో జనసేన అభ్యర్థులను పోటీకి పెట్టే దమ్ము పవన్‌కు ఉందా? రాజకీయాల్లో జీరో అయిన పవన్ ఇప్పుడు సినిమాల్లో కూడా జీరో అయిపోయారు. ఆ ముగ్గురూ సన్నాసులు కాబట్టే కలసి పోటీ చేసి జగన్‌ను ఎదుర్కోవాలని ప్రయత్నిస్తున్నారు. విదేశీ విద్య పథకం ద్వారా ఆర్య వైశ్యుల పిల్లలను కూడా విదేశాలకు పంపిన ఘనత సీఎం జగన్‌ది. పొట్టిశ్రీరాములు ప్రాణత్యాగం ఫలితంగా నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరిస్తే రాష్ట్ర అవతరణ దినాన్ని జూన్ 2కు మార్చింది చంద్రబాబే. దాన్ని మళ్లీ మార్చి నవంబర్ 1న ఏపీ అవతరణ దినోత్సవాన్ని సీఎం జగన్ నిర్వహిస్తున్నారు.

బ్యారేజ్‌పై ఫొటో షూట్‌కు రూ.5 కోట్లు: మల్లాది విష్ణు

టీడీపీ హయాంలో వైఎస్ జగన్ పాదయాత్ర చేస్తున్నప్పుడు ప్రకాశం బ్యారేజీ మీదుగా వెళ్లామంటే అనుమతి ఇవ్వకుండా అడ్డుకున్నారు. నల్ల బెలూన్లతో నిరసన తెలిపి పసుపు నీళ్లతో కడిగే స్థాయికి దిగజారిపోయారు. ఇప్పుడు లోకేశ్ పాదయాత్రను మేం ఎక్కడన్నా అడ్డుకునే ప్రయత్నం చేశామా? డబ్బులు, మద్యాన్ని పంచి పెయిడ్ వర్కర్లతో ప్రకాశం బ్యారేజ్‌పై ఈవెనింగ్ వాక్ చేసిన లోకేశ్ ఫొటో షూట్‌కు రూ.5 కోట్లు ఖర్చు పెట్టారు. విజయవాడ అభివృద్ధికి కేంద్రం ఇచ్చిన రూ.500 కోట్లను దారి మళ్లించి ద్రోహం చేసింది చంద్రబాబే. దొంగ టీడీఆర్ బాండ్లను తయారు చేసి అమ్మిన పార్టీ టీడీపీ. అమ్మవారి దేవాలయంలో క్షుద్ర పూజలు చేసిన వ్యక్తి లోకేశ్. బ్రాహ్మణ వీధిలో గోశాలను కూలగొట్టి గోవులకు నిలువ నీడ లేకుండా చేశారు. నదీ తీరంలో పురోహితులకు చోటు లేకుండా చేసిన ఘనత కూడా టీడీపీదే. మేం 11 అంశాలతో రూపొందించిన చార్జ్‌షీట్‌కు లోకేశ్, చంద్రబాబు సమాధానం చెప్పాలి. జగనన్న కాలనీల ద్వారా విజయవాడలో 90 వేల మందికి ఇళ్ల స్థలాలు అందించిన ఘనత సీఎం జగన్‌ది. టీడీపీ పాలనలో వైశ్యులు, ముస్లింలు, బ్రాహ్మణులకు ఏం చేశారో లోకేశ్ చెప్పాలి. ఆర్–5 జోన్‌లో విజయవాడకు చెందిన 30 వేల మందికి సీఎం జగన్ ఇళ్ల పట్టాలిస్తుంటే వాటిని రద్దు చేస్తానని చంద్రబాబు చెబుతున్నాడు. చంద్రబాబు, లోకేశ్, పవన్ ముగ్గురూ సైకోలే. విజయవాడ నగరం వైఎస్సార్‌సీపీ అడ్డా.

ఎర్ర పుస్తకం పట్టుకుని సైకోలా: దేవినేని అవినాశ్

పెయిడ్ వర్కర్లతో ఈవెనింగ్ వాక్ చేస్తున్న లోకేశ్‌కు 2014–19 మధ్య ప్రజలకు ఏం చేశారో చెప్పే దమ్ముందా? ఎర్ర పుస్తకం పట్టుకుని సైకోలా ఊగిపోతున్నాడు. లోకేశ్ యాత్ర వల్ల చంద్రబాబు సీఎం కాలేరు. లోకేశ్ ఎమ్మెల్యే కాలేడు. చంద్రబాబూ? ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది. గత నాలుగేళ్లలో సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో విజయవాడ నగరం మౌలిక సదుపాయాల కల్పనతో వేగంగా అభివృద్ధి చెందుతోంది. రిటైనింగ్ వాల్, ఫ్లైఓవర్‌లు వంటి అనేక నిర్మాణాలు పూర్తి చేశారు. పాదయాత్రలో లోకేశ్ వాటిని చూడాలి. టీడీపీ హయాంలో పీడబ్ల్యూడీ గ్రౌండ్స్‌ను సింగపూర్ కంపెనీకి కట్టబెట్టాలని చూస్తే ఇప్పుడు సీఎం జగన్ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

చిరుధాన్యాల ఎగుమతుల్లో.. ఏడో స్థానంలో ఏపీ

- 2022–23లో దేశం మొత్తంమీద 1,69,049 మెట్రిక్ టన్నుల ఎగుమతి
- రాష్ట్రం నుంచి 1,319.78 మెట్రిక్ టన్నులు..
- గుజరాత్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమ బెంగాల్ నుంచి అత్యధికం



2022-23లో రాష్ట్రాల వారీగా చిరుధాన్యాల ఎగుమతులిలా.. (మెట్రిక్ టన్నుల్లో)

రాష్ట్రం	ఎగుమతి
గుజరాత్	78,106.15
మహారాష్ట్ర	50,486.43
బిహార్	19,917.76
పశ్చిమబెంగాల్	12,587.49
తమిళనాడు	2,952.63
తెలంగాణ	1,680.25
ఆంధ్రప్రదేశ్	1,319.78
కర్ణాటక	429.25
రాజస్థాన్	405.71
మధ్యప్రదేశ్	345.76
కేరళ	326.95
హరియాణ	301.59
ఉత్తరప్రదేశ్	112.14
పంజాబ్	50.64
ఇతర రాష్ట్రాలు	20.69

సాక్షి, అమరావతి : చిరుధాన్యాల ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ దేశవ్యాప్తంగా 7వ స్థానంలో ఉంది. మొదటి ఆరు స్థానాల్లో గుజరాత్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, తమిళనాడు ఉన్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. చిరుధాన్యాలను ఎగుమతి చేసే మొదటి ఐదు దేశాల్లో భారత్ ఉందని కూడా పేర్కొంది. ఈ నేపథ్యంలో.. దేశం నుంచి 2022–23 ఆర్థిక సంవత్సరంలో 1,69,049.22 మెట్రిక్ టన్నుల చిరుధాన్యాలను ఎక్కువగా ఐదు దేశాలకు ఎగుమతి చేసినట్లు తెలిపింది. ఇందులో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు 17.8 శాతం, సౌదీ అరబ్‌కు 13.7 శాతం, నేపాల్‌కు 7.4 శాతం, బంగ్లాదేశ్‌కు 4.9 శాతం, జపాన్‌కు 4.4 శాతం ఎగుమతి చేసినట్లు కేంద్రం పేర్కొంది. ఇతర దేశాల్లో వీటికి డిమాండ్ ఎక్కువగా ఉన్నందున దేశంలోని వివిధ రాష్ట్రాల్లో చిరుధాన్యాల ఉత్పత్తి పెంచడంతో పాటు స్థానిక వినియోగం, ఎగుమతులను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలను తీసుకుంటోందని వివరించింది. ఇందులో భాగంగా అగ్రికల్చరల్–ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీఈడీఏ) చిరుధాన్యాల ఎగుమతిని ప్రోత్సహించాలంటూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇందుకు ఎగుమతుదారులకు సహాయం అందిస్తుందని తెలిపింది.

అంతర్జాతీయ మార్కెట్లో ప్రోత్సాహం..

ఇక ప్రపంచ మార్కెట్లలో భారతీయ మిల్లెట్లను ప్రోత్సహించడానికి స్టార్టప్‌లు, అకడమిక్–రీసెర్చ్ సంస్థలు, భారతీయ మిషన్లు, ప్రాసెసర్లు, రిటైలర్లు, ఎగుమతిదారులతో భాగస్వామ్యాన్ని పెంచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కృషిచేస్తోందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్‌లో చిరుధాన్యాలను ప్రోత్సహించడానికి ప్రత్యేకంగా ఎగుమతి ప్రమోషన్ ఫోరమ్ (ఈపీఎఫ్)ను ఏర్పాటుచేసినట్లు కూడా తెలిపింది. 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఏడాది పొడుగునా వీటి ఉత్పత్తితో పాటు వినియోగం పెంచేందుకు వివిధ కార్యక్రమాల నిర్వహణపై దృష్టిసారించాయని పేర్కొంది.

ఉత్పత్తి, వినియోగం పెంపు..

అలాగే, స్థానికంగా చిరుధాన్యాలను ఆహారంగా తీసుకునేలా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌తో పాటు అసోం, బిహార్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలు ఉత్పత్తి, వినియోగాన్ని పెంచడానికి రాష్ట్ర మిల్లెట్ మిషన్లను అమలుచేస్తున్నాయని కేంద్రం తెలిపింది. అంతేకాక.. రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు భారత రాయబార కార్యాలయాలు చిరుధాన్యాల వినియోగంపై అవగాహన కల్పించేందుకు పలు చర్యలను తీసుకున్నట్లు పేర్కొంది. అలాగే, ప్రభుత్వోద్యోగులు, అధికారుల్లో చిరుధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహించడానికి.. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సమావేశాల్లో మిల్లెట్ స్నాక్స్‌ను, డిపార్ట్‌మెంటల్ క్యాంటీన్లలో మిల్లెట్ ఆధారిత ఆహార పదార్థాలను చేర్చాలని సూచించినట్లు కేంద్రం పేర్కొంది.

20 లక్షల మంది రైతుల చేతికి.. సరికొత్త సంపద

32 లక్షల ఎకరాలపై ఆంక్షల తొలగింపు.. ఆర్థిక వ్యవస్థలో పెను మార్పులు

భూములపై సంపూర్ణ హక్కులతో అన్నదాతల ఆనందం

సాక్షి, అమరావతి : భూములపై ఆంక్షలు తొలగేలా వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు రాష్ట్రంలో సరికొత్త సంపదను సృష్టించాయి. ఈ కొత్త సంపద సృష్టి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో పెను మార్పులు తీసుకువచ్చేందుకు దోహద పడుతుందని భూ చట్టాల నిపుణులు స్పష్టం చేస్తున్నారు. 32 లక్షల ఎకరాలను నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించడం ద్వారా వాటిపై సంబంధిత రైతులకు సంపూర్ణ హక్కులు లభించనున్నాయి. అంటే ఆ భూములన్నీ కొత్తగా మార్కెట్‌లోకి ప్రవేశించినట్లే. ఇప్పటి వరకు ఎటువంటి లావాదేవీలు జరగని ఆ భూములన్నీ కొత్తగా మార్కెట్‌లోకి రావడం వల్ల వాటిపై జరిగే వ్యాపారం ఆర్థిక వృద్ధికి దోహదపడుతుంది. ఆ భూములకు చెందిన 20 లక్షల మంది రైతుల ఆర్థిక స్థితిగతులు మారతాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. పేదల భూములకు విలువ పెంచడం ద్వారా పేదరిక నిర్మూలనకు ఇది ఉపయోగపడుతుందని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్ర చరిత్రలోనే ఇది గొప్ప ఆర్థిక సంస్కరణగా అభివర్ణిస్తున్నారు.

32 లక్షల ఎకరాలకు విముక్తి

అత్యంత వివాదాస్పదంగా ఏళ్ల తరబడి లక్షలాది మంది రైతుల కుటుంబాల్లో చీకట్లు నింపిన నిషేధిత జాబితా భూముల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం సునాయాసంగా పరిష్కరించింది. ఎక్కడైనా నాలుగైదు ఎకరాలను నిబంధనల ప్రకారం నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగిస్తేనే వివాదాలు ఏర్పడేవి. ఇప్పుడు ఆ పరిస్థితిని పూర్తిగా మారుస్తూ ఏకంగా లక్షల ఎకరాలను ఆ జాబితా నుంచి తొలగిస్తోంది. తద్వారా దశాబ్దాలుగా అనేక కష్టాలు పడుతున్న సుమారు 20 లక్షల మంది రైతుల జీవితాల్లో వెలుగులు నింపింది. అసైన్డ్ భూములు, చుక్కల భూములు, షరతులు గల పట్టాలు, అనాధీనం, ఖాళీ కాలమ్, సర్వీసు ఈనాం భూములతోపాటు ఇవే తరహా మరికొన్ని కేసుల్లో మొత్తం 32 లక్షల ఎకరాలను నిషేధిత ఆస్తుల జాబితా నుంచి ప్రభుత్వం తొలగిస్తోంది.

27.41 లక్షల ఎకరాల భూములపై హక్కులు

రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పిస్తూ వైఎస్ జగన్ ప్రభుత్వం చట్టాన్ని సవరించింది. కేటాయించిన 20 సంవత్సరాల తర్వాత అసైన్డ్ భూముల యజమానులకు సర్వ హక్కులు కల్పించింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు సుమారు 19,21,855 మందికి 33,29,908 ఎకరాలు అసైన్‌మెంట్ చేస్తే ఆ రికార్డులు క్షేత్ర స్థాయికి తగ్గట్టుగా లేవు. అసైన్‌మెంట్ జరిగి 20 ఏళ్లు పూర్తయిన భూములకు హక్కులు కల్పించడం ద్వారా 15,21,160 మంది భూమి లేని నిరుపేదలకు వారికి సంబంధించిన 27,41,698 ఎకరాలపై పూర్తి యాజమాన్య హక్కులు లభిస్తున్నాయి. రైతుల ప్రమేయం లేకుండా రెవిన్యూ యంత్రాంగం 20 సంవత్సరాలు పూర్తయిన భూముల జాబితాను తయారు చేసి వాటిని 22(ఎ) నుంచి తొలగిస్తుంది. నెల రోజుల్లో ఆంక్షలు తొలగిపోయేలా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం చకచకా అడుగులు ముందుకు వేస్తోంది.



2.06 లక్షల ఎకరాల చుక్కల భూములకు విముక్తి

15 జిల్లాల్లో 2.06 లక్షల ఎకరాల చుక్కల భూములను నిషేధిత ఆస్తుల జాబితా (22 ఏ (1) ఇ) నుంచి ఒకేసారి తొలగించింది. రాష్ట్ర వ్యాప్తంగా చుక్కల భూముల పేరుతో ఉన్న 4.06 లక్షల ఎకరాలను సుమోటోగా రీ వెరిఫికేషన్ చేసింది. ఆర్డీఓలు, తహశీల్దార్లు 1.81 లక్షల సర్వే నంబర్లలోని 4.06 లక్షలపైగా ఎకరాలకు సంబంధించిన భూములను రీ వెరిఫికేషన్ చేశారు. రికార్డుల్లో రైతు పేరు ఉన్నట్లు ధృవీకరించుకోవడంతోపాటు 11 ఏళ్లుగా అతని ఆధీనంలోనే భూమి ఉంటే ఆ భూమిని 22 (ఏ)1ఇ నుంచి తొలగించారు. తద్వారా చుక్కల భూములపై సంబంధిత రైతులకు సర్వ హక్కులు లభించాయి. తద్వారా చాలా సంవత్సరాల నుంచి నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు ఇప్పుడు జరుగుతున్నాయి. పంట రుణాలు కూడా వస్తున్నాయి. నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించిన సభలో చుక్కల భూముల రైతులకు పట్టాలిచ్చే కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రారంభించారు.

షరతుల పట్టా భూములు 33 వేల ఎకరాలు

చుక్కల భూముల తరహాలోనే సమస్యాత్మకంగా తయారైన షరతులు గల పట్టా భూములకు ప్రభుత్వం పరిష్కారం చూపింది. 33 వేల ఎకరాల షరతులు గల పట్టా భూములను నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించి ఆ రైతులకు మేలు చేకూర్చింది. బ్రిటీష్ హయాం నుంచి రైతుల చేతుల్లో ఉన్న భూములను తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో తమకెలాంటి ఉపయోగం ఉండదని భావించి, వాటిని 22(ఏ) కేటగిరీలో పెట్టింది. అలా పెట్టడం అన్యాయమని భావించి నిబంధనల ప్రకారమే ప్రస్తుత ప్రభుత్వం వాటిని ఆ జాబితా నుంచి తీసివేసింది. 17,730 సర్వే నెంబర్లకు సంబంధించిన 33 వేలకుపైగా ఎకరాలను 22ఏ నుంచి తొలగించింది. ఈ నిర్ణయం మోడు వారిన సుమారు 50 వేల మంది రైతుల జీవితాల్లో వెలుగులు నింపింది. ఒక్క కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోనే 18 వేలకుపైగా ఎకరాలను 22ఏ నుంచి తీసేశారు. 2022 అక్టోబర్ 20న అవనిగడ్డలో బహిరంగ సభ ఏర్పాటు చేసి సీఎం వైఎస్ జగన్ నిషేధిత భూముల జాబితా నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించి కొందరికి పట్టాలిచ్చారు. ఇప్పుడు ఆ భూముల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. బ్యాంకు రుణాలు వస్తున్నాయి. ఆ భూములను సర్వ హక్కులతో రైతులు అనుభవిస్తున్నారు.


అనాధీనం, ఖాళీ కాలమ్ భూములు 50 వేల ఎకరాలు

చుక్కల భూముల మాదిరిగానే కొన్ని ప్రాంతాల్లో అనాధీనం, ఖాళీ కాలమ్ భూముల సమస్యను ప్రభుత్వం పరిష్కరించింది. ఈ భూములను చుక్కల భూముల చట్టం పరిధిలోకి తీసుకువచ్చి వాటిని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించేందుకు మార్గం సుగమం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50 వేల ఎకరాలకు సంబంధించిన 35 నుంచి 40 వేల మంది రైతులు దీనివల్ల లబ్ధి పొందారు.

1.68 లక్షల సర్వీసు ఈనాం భూముల సమస్యకు పరిష్కారం

సర్వీసు ఈనాం భూముల సమస్యనూ సానుకూలంగా పరిష్కరించింది. నిషేధిత ఆస్తుల జాబితా 22(ఎ) నుంచి 1.68 లక్షల ఎకరాల సర్వీసు ఈనాం భూములను తొలగిస్తోంది. 25 జిల్లాల్లో 1.13 లక్షల మంది కుల వృత్తులు చేసుకునే రైతుల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. 1956లో ఈనాం చట్టం రావడంతో ఈనాం భూములను రద్దు చేసి వారికి రైత్వారీ పట్టాలు ఇచ్చారు. 2013 వరకు ఇవి రైత్వారీ పట్టా భూములుగానే ఉన్నాయి. 2013లో జరిగిన ఈనాం భూముల చట్ట సవరణతో నిషేధిత భూముల జాబితాలో చేరాయి. గ్రామ సర్వీసు ఈనాం భూములను అందరి మేలు కోసం పనిచేసిన కుల వృత్తుల వారికి (నాయీబ్రాహ్మణులు, రజకులు, వడ్రంగి వంటి వృత్తులు) ఇచ్చారు. ఆ భూములు ఆ వృత్తులు చేసుకునే వ్యక్తులు, వారి వారసులకు వస్తాయి. ఇలా సర్వీసు చేసిన కుల వృత్తుల వారి సంఖ్య గ్రామాల్లో చాలా పెద్ద సంఖ్యలో ఉండడం వల్లే వారికి రైత్వారీ పట్టాలు మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో 2013లో ఈనాం చట్టానికి చేసిన సవరణలు గ్రామ సర్వీసు ఈనాం భూములకు వర్తించవని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఈ భూములన్నింటినీ త్వరలో 22(ఎ) నుంచి తొలగించనుంది.

కొత్త ఆర్థిక వ్యవస్థకు మార్గం సుగమం



భూములపై ఆంక్షలన్నింటినీ ఒక్కొక్కటిగా తొలగించుకుంటూ రావాలని గత 20 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం, అంతర్జాతీయ సంస్థలు చెబుతున్నాయి. మార్కెట్‌లో పెన్ను, పేపర్ ఎంత సులభంగా అమ్ముకుని, కొనుక్కుంటున్నామో.. భూమిని కూడా అలాగే కొనుక్కుని, అమ్ముకునే పరిస్థితి ఉండాలి. అలా ఉంటేనే పేదరిక నిర్మూలన, సంపద సృష్టి జరుగుతుందనే వాదన అన్ని దేశాల్లో బలంగా వినిపిస్తోంది. ఆ దిశగానే ఏపీ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది. 32 లక్షల ఎకరాలపై ఆంక్షలు తొలగించడం అందులో భాగంగానే జరిగిందని భావించాలి. ఈ భూములపై హక్కులు కల్పించడం ద్వారా ఏపీ ప్రభుత్వం సరికొత్త ఆర్థిక వ్యవస్థను సృష్టించింది. ఉన్న భూమికి సరైన కాగితాలు, సంపూర్ణమైన హక్కులు లేకపోవడం వల్ల ఆ రైతుకు, సమాజానికి ఆర్థికంగా జరిగే నష్టం చాలా ఎక్కువ. ఆస్తి ఉన్నా.. దాన్ని సంపదగా మార్చుకోలేకపోతున్నాం. ఈ సమస్యను పరిష్కరిస్తే మన దేశం సుసంపన్న దేశంగా మారుతుందని అంతర్జాతీయంగా మేధావులు చెబుతున్నారు. అంటే ఉన్న భూమికి పత్రాలు సక్రమంగా ఉండేలా చూడాలి. ఆ భూముల మీద వారికి పూర్తి హక్కులు కల్పించాలి. ఇప్పుడు ఏపీలో ఇదే జరుగుతోంది. ఏపీలో 33 లక్షల ఎకరాల అసైన్డ్ భూములున్నాయి. అసైన్డ్ భూముల చట్ట సవరణ ద్వారా అసైన్‌మెంట్ జరిగిన 20 ఏళ్లు పూర్తయిన భూములన్నీ పట్టా భూములుగా మారతాయి. అప్పుడు రైతులకు అన్ని విధాలా లాభమే. విలువ పెరిగి, సంపద సృష్టి జరుగుతుంది. సమస్యలకూ పరిష్కారం లభిస్తుంది. వాటితో ముడిపడిన గొడవలూ తగ్గిపోతాయి.

– ఎం. సునీల్‌కుమార్, భూ చట్టాల నిపుణుడు, నల్సార్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్, హైదరాబాద్

సదరం సులభతరం

- టీడీపీ హయాంలో 56 ఆస్పత్రుల్లో నెలకు సగటున 2,715 అసెస్‌మెంట్‌లు
- ప్రస్తుతం 173 ఆస్పత్రుల్లో నెలకు 8,680 అసెస్‌మెంట్‌లు
- నాలుగేళ్లలో 3.36 లక్షల సర్టిఫికెట్లు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: దివ్యాంగులు, వివిధ జబ్బుల బాధితులు, విభిన్న ప్రతిభావంతులు ప్రభుత్వ ఆసరా పింఛను పొందాలన్నా.. విద్య, ఉద్యోగాలు, ప్రమోషన్లలో రిజర్వేషన్లకు సదరం సర్టిఫికెట్ తప్పనిసరి. టీడీపీ హయాంలో సదరం సర్టిఫికెట్ పొందడం ఓ ప్రహసనంగా ఉండేది. అప్పట్లో మొక్కుబడిగా క్యాంపులు నిర్వహించేవారు. దీంతో ఆయా వర్గాల వారు అనేక అగచాట్లు పడేవారు. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగడంతో పాటు దళారులకు డబ్బులు ఇచ్చి మోసపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ పరిస్థితులకు చెక్ పెడుతూ 2019లో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం సులభతరంగా సదరం సర్టిఫికెట్‌ల జారీ మొదలు పెట్టింది. సర్టిఫికెట్‌ల జారీ ప్రక్రియలో పలు సంస్కరణలు చేపట్టింది. దీంతో దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులకు ఎంతో మేలు చేకూరుతోంది.

నాలుగు రెట్లు పెరుగుదల

టీడీపీ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 56 ప్రభుత్వాస్పత్రుల్లో వారంలో ఒక రోజు మాత్రమే క్యాంపులు నిర్వహించేవారు. ఈ క్యాంపుల్లో సగటున నెలకు 2,715 అసెస్‌మెంట్‌లు చేసేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అప్పటికే ఉన్న 56 ఆస్పత్రులకు అదనంగా మరో 117 ఆస్పత్రులను కలిపి 173 చోట్ల సదరం క్యాంపులు ప్రారంభించారు. వారానికి 229 క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఈ లెక్కన పరిశీలిస్తే క్యాంపుల నిర్వహణ గత ప్రభుత్వంతో పోలిస్తే నాలుగు రెట్లు పెరిగింది. అదేవిధంగా నెలకు 8,680 అసెస్‌మెంట్‌లు చేపడుతున్నారు. అసెస్‌మెంట్‌లలోను గతంతో పోలిస్తే మూడు రెట్లు పెరుగుదల నమోదైంది.

3.36 లక్షల మందికి..

ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా సర్టిఫికెట్‌ల జారీలో గణనీయమైన మార్పు చోటుచేసుకుంది. 2018–19లో టీడీపీ హయాంలో కేవలం 10,913 సర్టిఫికెట్‌లను జారీ చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆ తర్వాత ఏడాది 55,856 సర్టిఫికెట్‌లు జారీ చేశారు. ఇలా 2019–20 నుంచి ఇప్పటివరకూ ఏకంగా 3,36,555 సర్టిఫికెట్‌లను మంజూరు చేశారు.

క్లుప్తంగా...

తాయెత్తులు కట్టుకుని నిన్ను తలుచుకోవాలా?!

చంద్ర'బాబా' అవతారంపై కోలగట్ల ఎద్దేవా



విజయనగరం: రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకే చంద్రబాబు బాబా అవతారం ఎత్తారని.. 'తాయెత్తులు ఇస్తాను.. పూజించి కట్టుకోండి.. ఏదైనా కష్టమొచ్చినప్పుడు నన్ను తలచుకోండి.. అంటూ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఎద్దేవా చేశారు. విజయనగరంలోని తన నివాసంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబా తాయెత్తులకు అంత బలమే ఉంటే గత ఎన్నికల్లోనే గెలిచి సీఎం అయ్యేవారని చెప్పారు. చంద్రబాబు ఎన్ని వేషాలు వేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ప్రజలను మోసగించడమే చంద్రబాబు నైజమని, ఒంటరిగా ఎన్నికలకు వెళ్లే సత్తా లేకే అన్ని పార్టీలతో పొత్తుకు పాకులాడుతున్నారని ధ్వజమెత్తారు. లోకేశ్ పాదయాత్రకు జనాదరణ లేకపోవడంతో చంద్రబాబు ఫ్రస్టేషన్‌లోకి వెళ్లిపోయారని, అందుకే ఊర్లు పట్టుకుని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని కోలగట్ల మండిపడ్డారు.

చంద్రబాబు, పవన్‌లు బీసీ వ్యతిరేకులు

కుల సంఘాల సమావేశంలో బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేష్




సాక్షి, అమరావతి: బీసీలను ఓటు బ్యాంకుగానే వాడుకుని వదిలేసిన చంద్రబాబు ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ బీసీ మంత్రాన్ని జపిస్తారని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మారేష్ ఎద్దేవా చేశారు. చంద్రబాబు ట్రాప్‌లో పడిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సైతం బీసీ వ్యతిరేకిగా మారారని మండిపడ్డారు. విజయవాడలోని బీసీ సంఘం రాష్ట్ర కార్యాలయంలో 34 బీసీ కుల సంఘాల నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. మారేష్ మాట్లాడుతూ 14 ఏళ్ల పాటు సీఎంగా ఉన్న చంద్రబాబు బీసీలను బానిసలుగా చూశారని విమర్శించారు. మంత్రివర్గం, రాజ్యసభ, స్థానిక సంస్థల సీట్లలో సైతం బీసీలకు ప్రాధాన్యం ఇవ్వకుండా అణగదొక్కిన వ్యక్తి చంద్రబాబని ధ్వజమెత్తారు. చంద్రబాబు, పవన్‌ల అబద్ధపు మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ బీసీలు నమ్మరని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలను రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో వెన్నెముక వర్గాలుగా తీర్చిదిద్దిన సీఎం వైఎస్ జగన్‌కు అండగా ఉందామని పిలుపునిచ్చారు.

బకాయిలు చెల్లించినా బాధేనా?

చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.969.40 కోట్ల సూక్ష్మ సేద్యం బకాయిలను చెల్లించింది సీఎం జగనే

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా సూక్ష్మ సేద్యంలో నాలుగో స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ఉత్తమ యాజమాన్య పద్ధతులను పాటిస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్న రాష్ట్రంగా ఇటీవలే కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డు సైతం పొందింది. పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పెద్ద పీట వేస్తూ వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చేలా కృషి చేస్తుంటే ఈనాడు రామోజీ మాత్రం బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారు.



ఎస్సీ, ఎస్టీ రైతులపై ఇంత కక్షా!

ఆరోపణ: సూక్ష్మ సేద్యానికి తూట్లు..

వాస్తవం: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సూక్ష్మ సాగు నీటి పథకాన్ని అమలు చేస్తోంది. ప్రతి నీటి బొట్టును రైతులు సద్వినియోగం చేసుకునేలా బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహిస్తోంది. రాష్ట్రంలో 12 లక్షల మంది రైతులు 34.70 లక్షల ఎకరాల్లో బిందు సేద్యాన్ని, 12.98 లక్షల ఎకరాల్లో తుంపర సేద్యాన్ని చేస్తున్నారు. రాష్ట్రంలో మరో 28 లక్షల ఎకరాలు ఇందుకు అనువైనవిగా గుర్తించారు. ఈ మేరకు దశల వారీగా విస్తరించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది.

ఆరోపణ: మూడేళ్లుగా నిలిపేసిన పథకం..

వాస్తవం: 2019-20లో రూ.720.08 కోట్లు ఖర్చు చేసి 3,04,705 ఎకరాల్లో సూక్ష్మ సేద్యాన్ని విస్తరించడంతో 1,03,453 మంది లబ్ధి పొందారు. ఆ తర్వాత రెండేళ్లు కరోనా కారణంగా రాష్ట్రంలోనే కాదు దేశంలో ఎక్కడా ఈ పథకం విస్తరణ జరగలేదు. 2022-23లో 1.87 లక్షల ఎకరాల్లో విస్తరించాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా రూ.636 కోట్లతో 2.27 లక్షల ఎకరాల్లో సూక్ష్మ సేద్యాన్ని విస్తరించారు. తద్వారా 82,289 మంది లబ్ధి పొందారు. సబ్సిడీ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.465 కోట్లు సర్దుబాటు చేయగా రైతులు తమ వాటాగా రూ.174 కోట్లు చెల్లించారు. 2023-24లో రూ.902 కోట్ల అంచనాతో 2.50 లక్షల ఎకరాల్లో విస్తరించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఇప్పటివరకు రూ.218.38 కోట్లు వెచ్చించి 71,690 ఎకరాల్లో విస్తరించగా 26,051 మంది రైతులకు ప్రయోజనం చేకూరింది. అలాంటప్పుడు పథకాన్ని ఎక్కడ నిలిపివేశారో రామోజీకే తెలియాలి.

ఆరోపణ: ఎస్సీ, ఎస్టీల పట్ల వివక్ష..

వాస్తవం: సంక్షేమ పథకాల అమలులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పెద్ద పీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం విషయంలో ఎందుకు వివక్ష చూపుతుంది? 2019-20లో 1,03,453 లబ్ధి పొందితే వారిలో 8,525 మంది ఎస్సీలు, 3,583 మంది ఎస్టీలున్నారు. 2022-23లో 82,833 మంది లబ్ధి పొందితే వారిలో 3,241 మంది ఎస్సీలు, 1,889 మంది ఎస్టీలున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 26,498 మంది లబ్ధి పొందగా వారిలో 1,015 మంది ఎస్సీలు, 503 మంది ఎస్టీలున్నారు. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు చెందిన 46,497 ఎకరాల్లో బిందు, తుంపర పరికరాలను అమర్చేందుకు రూ.131.52 కోట్లు సబ్సిడీ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసింది.

ఆరోపణ: పన్నుల భారం రైతులపైనేనా?

వాస్తవం: తుంపర, బిందు సేద్యం పరికరాలపై 12 శాతం జీఎస్టీ విధిస్తుండగా రైతులపై భారాన్ని తగ్గించేందుకు 50 శాతం పన్నుల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. ఇలా ఒక్క 2022-23లోనే రూ.47 కోట్లకు పైగా జీఎస్టీ భారాన్ని రైతుల తరఫున ప్రభుత్వం భరించింది.

ఆరోపణ: రాయితీలలో కోత

వాస్తవం: సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలను అందజేస్తున్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న వాటా కేవలం 33 శాతం మాత్రమే. మిగిలిన 57 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది.

ఆరోపణ: సిఫార్సులున్న వారికే పరికరాలు?

వాస్తవం: గత ప్రభుత్వ హయాంలో సిఫార్సులుంటేనే బిందు, తుంపర సేద్యం పరికరాలు అమర్చేవారు. ఇప్పుడు ఆర్బీకేలో వివరాలు నమోదు చేసుకుంటే చాలు అర్హతే కొలమానంగా ప్రతి రైతుకు ఎలాంటి సిఫార్సులతో పని లేకుండా అందిస్తున్నారు. రైతులు తమ వాటా చెల్లించిన 2-3 వారాల్లోపే నేరుగా వారి వ్యవసాయ క్షేత్రాలకు పరికరాలను తీసుకెళ్లి మరీ అమర్చుతున్నారు. ఏపీ ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా దరఖాస్తుల స్వీకరణ, అర్హుల ఎంపిక జరుగుతోంది. అర్హుల జాబితాలను ఆర్బీకేల్లో సామాజిక తనిఖీల కింద ప్రదర్శిస్తున్నారు.

ఆరోపణ: సూక్ష్మ సేద్యంపై అవగాహన ఏది?

వాస్తవం: బిందు, తుంపర సేద్యంపై ఆర్బీకేలు, ఆర్బీకే ఛానల్ ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఎరువుల యాజమాన్యం, విద్యుత్ ఆదా, కూలీల ఖర్చు, నీటి ఆదాలపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈ పథకం విస్తరణ ద్వారా 5 వేల టన్నుల ఎరువులు, 1,553 టన్నుల విద్యుత్, 15 టీఎంసీల నీరు ఆదా కాగా రైతులకు రూ.210 కోట్ల మేరకు కూలీల ఖర్చు మిగిలింది.

బాబు ఎగ్గొట్టిన బకాయిలు చెల్లించింది ఎవరు?

టీడీపీ సర్కారు ఎగ్గొట్టిన బకాయిలు సూక్ష్మ సేద్యం పథకానికి గుదిబండలా మారాయి. రైతు సంక్షేమమే లక్ష్యంగా సాగుతున్న సీఎం జగన్ ఆ బకాయిలను చెల్లించి అన్నదాతలకు బాసటగా నిలిచారు. చంద్రబాబు చెల్లించకుండా చేతులెత్తేసిన రూ.969.40 కోట్ల బకాయిలను అణా పైసలతో సహా ఆయా కంపెనీలకు సీఎం జగన్ ప్రభుత్వం చెల్లించింది. తద్వారా రాష్ట్రంలో సూక్ష్మ సేద్యం విస్తరణకు మార్గం సుగమం చేశారు. ఇంత భారీగా బకాయిలు పెట్టిన చంద్రబాబు సర్కారుపై రామోజీ కలం కదల్లేదు ఎందుకో మరి?



'చోడవరం'లో గ్రీన్ ఫీల్డ్ ఇథనాల్ ప్లాంట్

▶ మొదటి పేజీ తరువాయి

కన్సల్టెన్సీ సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించింది. ప్రాజెక్టు ఎంత వ్యయం అవుతుంది.. ముడిపదార్థాలు ఎంత అవసరం.. ఆదాయం.. రుణం ఎంత కాలంలో తీర్చగలం? వంటి అన్ని అంశాలతో ఈ నివేదికను తయారు చేయాల్సిందిగా కోరింది. ఆసక్తి గల సంస్థలు ఆగస్టు 28లోగా దాఖలు చేయాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం ముడి చమురు దిగుమతులను తగ్గించుకోవడానికి పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని కలిపి వినియోగించుకోవాలని నిర్ణయించింది. ఇప్పటికే లీటరు పెట్రోల్‌లో 10 శాతం ఇథనాల్ కలుపుతుండగా, ఈ మొత్తాన్ని 2025-26 నాటికి 20 శాతానికి పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకుని ఆ మేరకు మిగులు ధాన్యాల నుంచి ఇథనాల్ ఉత్పత్తిని ప్రోత్సహించేలా ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్(ఈబీపీ) పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం బయో ఇథనాల్‌లో పెద్ద ఎత్తున పరిశ్రమలను ఆకర్షించేలా ప్రత్యేకంగా ఓ పాలసీనే తీసుకొచ్చింది. ఇప్పుడు సహకార చక్కెర కర్మాగారాల్లో కూడా బయో ఇథనాల్ యూనిట్లను ఏర్పాటు చేయడం ద్వారా వాటిని ఆర్థికంగా పరిపుష్టి చేయనుంది.

జేసీ.. జేసీబీ!

- తాడిపత్రిలో కాలేజీ ప్రహరీ నిర్మాణ పనుల అడ్డగింత
- అనుచరులతో కలసి నిర్మాణాల కూల్చివేత
- నాడూ నేడూ.. దాడులే ఆనవాయితీ



జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటి వద్ద పోలీసులు

తాడిపత్రి: ప్రభుత్వ విద్యాసంస్థల ప్రాంగణంలో దర్జాగా అసాంఘిక కార్యకలాపాలు, పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్న టీడీపీ నేత, మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రహరీ గోడ నిర్మాణాన్ని అడ్డుకోవటమే కాకుండా తన అనుచరులతో కలసి కూల్చివేతలకు పాల్పడ్డారు. శనివారం రాత్రి అనంతపురం జిల్లా తాడిపత్రిలోని జూనియర్ కళాశాల ప్రహరీ నిర్మాణ పనుల వద్ద వీరంగం సృష్టించారు. జేసీ గ్యాంగ్ కూలగొట్టిన పిల్లర్లను తిరిగి నిర్మించేందుకు ప్రయత్నించిన కార్మికులపై ఆదివారం ఉదయం దాడి చేసేందుకు ప్రయత్నించారు.

ఏం జరిగిందంటే...

నాడు-నేడు ఫేజ్ 2 పనుల్లో భాగంగా తాడిపత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ నిర్మాణ పనులను మూడు రోజుల క్రితం చేపట్టారు. జూనియర్ కళాశాల సమీపంలోనే జేసీ ప్రభాకర్‌రెడ్డి నివాసం ఉంది. శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో నిర్మాణ పనుల వద్దకు అనుచరులతో కలసి చేరుకున్న జేసీ 'రేయ్ జేసీబీతో పిల్లర్లను కూలదోయండిరా..' అంటూ హుకుం జారీ చేశారు. జేసీబీతో కాంక్రీట్ పిల్లర్లను కూలదోశారు. మర్నాడు అక్కడకు వచ్చిన కూలీలను పనులు నిలిపి వేయాలంటూ జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన అనుచరులు అడ్డగించారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రహరీ నిర్మిస్తున్నామని, అడ్డు తగలడం సమంజసం కాదని చెప్పినా వినిపించుకోలేదు. దీనిపై మేస్త్రీ గురుశంకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ నిర్మాణాలను దౌర్జన్యంగా కూలగొట్టడంపై జేసీ ప్రభాకర్‌రెడ్డి, వెన్నపూస మల్లికార్జునరెడ్డి, సుబ్బయ్య, వడ్డే మధు, సోమశేఖర్ నాయుడు, దినేష్‌రెడ్డి, పవన్ నాయుడు, మునిసిపల్ కాంట్రాక్టర్ తిరుపాల్‌రెడ్డి, కుమ్మరి వెంకటేష్, రాంబాబు, గురుజాల శివశంకర్‌రెడ్డి, చరణ్, హరినాథ్‌రెడ్డి, గండికోట కార్తీక్ తదితరులపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు.

రైతులకు చేయూత.. మహిళలకు ఉపాధి

- పంట ఉత్పత్తులకు అదనపు విలువ కల్పనే లక్ష్యం
- 35 శాతం సబ్సిడీపై మరో 5వేల యూనిట్ల ఏర్పాటుకు కసరత్తు
- ఆర్థిక చేయూతనిచ్చేందుకు ముందుకొచ్చిన బ్యాంక్ ఆఫ్ బరోడా
- నేడు బ్యాంకుతో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ అవగాహనా ఒప్పందం



కర్నూలు జిల్లాలో సోలార్ డీహైడ్రేషన్ యూనిట్

సాక్షి, అమరావతి: ఉల్లి, టమాటాలతో పాటు కూరగాయల రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం.. పొదుపు సంఘాల్లోని మహిళలకు స్వయం ఉపాధి కల్పన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 5వేల సోలార్ డీ హైడ్రేషన్ యూనిట్ల ఏర్పాటుచేయనుంది. వీటికి ఆర్థిక చేయూతనిచ్చేందుకు ముందుకొచ్చిన బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ)తో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (ఏపీఎఫ్‌పీఎస్) నేడు (సోమవారం) అవగాహనా ఒప్పందం చేసుకోబోతుంది.

తొలిసారి కర్నూలు జిల్లాలో ఏర్పాటు..

ఉల్లి, టమాటా రైతుల వెతలు తీర్చేందుకు ఏపీఎఫ్‌పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే తొలిసారి కర్నూలు జిల్లాలో రూ.కోటి అంచనాతో 100 సోలార్ డీ హైడ్రేషన్ యూనిట్స్ (సూక్ష్మ పరిశ్రమలు) ఏర్పాటుచేశారు. రూ.లక్ష అంచనా వ్యయంతో కూడిన ఈ యూనిట్ల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి 35% సబ్సిడీతో వీటిని మంజూరు చేశారు. ఒక్కో యూనిట్ ఆరు టన్నుల చొప్పున ఏటా 7.200 వేల టన్నుల ఉల్లి, టమాటాలను ప్రాసెస్ చేసే సామర్థ్యం కల్గిన ఈ యూనిట్ల 100 మందికి ఉపాధి లభిస్తుండగా, ఆయా ప్రాంతాలకు చెందిన 500 మంది ఉల్లి రైతులకు లబ్ధిచేకూరుతోంది. వీటిని ఇటీవలే సీఎం జగన్ ప్రారంభించారు. ఇంట్లోనే ఏర్పాటుచేసుకునే ఈ యూనిట్ల ద్వారా ప్రతీనెలా రూ.12వేల నుంచి రూ.18వేల వరకు అదనపు ఆదాయాన్ని పొదుపు సంఘాల మహిళలు ఆర్జిస్తున్నారు. ఇదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పొదుపు సంఘాల మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధంచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 5వేల యూనిట్లు మంజూరుచేయాలని సంకల్పించింది.

బీఓబీ ఆర్థిక చేయూత..

మరోవైపు.. ఈ సోలార్ డీ హైడ్రేషన్ యూనిట్ల విస్తరణ పథకానికి ఆర్థిక చేయూతనిచ్చేందుకు బ్యాంక్ ఆఫ్ బరోడా ముందుకొచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన పొదుపు సంఘాల మహిళలకు సబ్సిడీపై వీటిని మంజూరు చేయనున్నారు. కర్నూలు జిల్లాలో రూ.లక్ష అంచనాతో ఒక్కో యూనిట్ ఏర్పాటుచేయగా, ఇక నుంచి రూ.2లక్షల అంచనా వ్యయంతో రెట్టింపు సామర్థ్యంతో వీటిని ఏర్పాటుచేయనున్నారు. ఇందుకోసం రూ.100 కోట్లు వెచ్చిస్తున్నారు. ఈ మొత్తంలో రూ.35 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో ఖర్చుచేయనుండగా, లబ్ధిదారులు తమ వాటాగా రూ.10కోట్లు భరించాల్సి ఉంటుంది. రూ.65 కోట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్థిక చేయూతనిస్తోంది. ఇక బీఓబీ-ఏపీఎఫ్‌పీఎస్‌లు సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపట్టనున్నాయి. ఈ మేరకు ఈ రెండు సంస్థలు నేడు అవగాహనా ఒప్పందం చేసుకోబోతున్నాయి.

కరిరాజుకు కరెంట్ కాటు

కౌండిన్య ఎలిఫెంట్ శాంచురీని నుంచి మేతకోసం అడవిని దాటి పంట పొలాల్లోకి వచ్చే ఏనుగులకు కరెంట్ పెద్ద శత్రువులా మారింది. ఇప్పటి వరకు కరెంట్ షాక్‌లతో 14 ఏనుగులు మృతిచెందగా.. తాజాగా బైరెడ్డిపల్లె మండలం నల్లగుట్లపల్లె వద్ద మరో ఆడ ఏనుగు కరెంటుకు బలైంది. వంటిపై దురద తీర్చుకోవడానికి కరెంటు స్థంభాలను రుద్దడం, తొండంతో విరగ్గొడుతుండడంతో తీగలు పైన పడుతున్నాయి. మరికొన్ని చోట్ల రైతుల పొలాల వద్ద తక్కువ ఎత్తులోని 12కేవీ కరెంటు వైర్లు తగిలి మృతిచెందుతున్నాయి.

బైరెడ్డిపల్లె మండలంలో కరెంటుకు ఏనుగు బలి

- పదేళ్లలో కరెంట్ షాక్‌లతో 15 ఏనుగుల మృతి
- విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్‌చేస్తున్న ఏనుగులు
- అడవి దాటితే ఏనుగులకు తప్పని ప్రాణగండం



బైరెడ్డిపల్లె మండలం నల్లగుట్లపల్లి వద్ద శనివారం రాత్రి కరెంట్ షాక్‌తో మృతి చెందిన ఏనుగు

పలమనేరు: కౌండిన్య అభయారణ్యంలో కరెంటుకు ఏనుగులు బలి అవుతున్నాయి. ఇప్పటి పలు ఘటనల్లో 20 ఏనుగులు మృతిచెందగా, ఇందులో 15 ఏనుగులు కరెంట్ తీగలు తగిలి చనిపోవడం బాధాకరం. అభయారణ్యంలో మొత్తం వందకుపైగా ఏనుగులున్నాయి. ఇవి గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ముసలిమొడుగు, జగమర్ల, మొగిలిఘాట్, నెల్లిపట్ల, వెంగంవారిపల్లి, తోటకనుమ ప్రాంతాల్లో గుంపులుగా తిరుగుతున్నాయి. మదపుటేనుగులు ఒంటరిగానే సంచరిస్తున్నాయి. కౌండిన్య అభయారణ్యం నుంచి ఏనుగులు బయటికి రాకుండా అటవీశాఖ నిర్మించిన ఎలిఫెంట్ ట్రెంచీలు, సోలార్‌ఫెన్సింగ్ పెద్దగా ఫలితాలను ఇవ్వడం లేదు. తెలివైన జంతువుగా పేరున్న గజరాజులు ట్రెంచీలను పూడ్చి, బండలను వాటిల్లోకి దొర్లించి, సోలార్ ఫెన్సింగ్‌ను విరగ్గొట్టి అడవి నుంచి బయటకు వచ్చేస్తున్నాయి. ఏనుగుల సమస్యకు శాశ్వతచర్యలు తీసుకోకుంటే భవిష్యత్తులో కౌండిన్యాలో ఏనుగుల జాడ కనుమరుగైయ్యే అవకాశం ఉంది.

బలమైన ఫెన్సింగ్ నిర్మాణంతోనే కట్టడి...

కౌండిన్యా అడవిలో 66 కిలోమీటర్ల మేర సోలార్ ఫెన్సింగ్‌ను గతంలో నిర్మించారు. ఇందులో కొన్ని చోట్ల సోలార్ ఫెన్సింగ్‌కు అమర్చిన డీసీ బ్యాటరీలు పనిచేయక విద్యుత్ ప్రసరించడం లేదు. కొత్తగా ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్‌లో మరీ తేలిగ్గా ఉన్న పైపులున్నచోట వీటిని ఏనుగులు తొక్కి నాశనం చేస్తున్నాయి. సోలార్ ఫెన్సింగ్‌తోబాటు కౌండిన్య అటవీప్రాంతంలో 12 చోట్ల 74 కిలోమీటర్లమేర ఎలిఫెంట్ ప్రూఫ్ ట్రెంచెస్ పనులను గతంలో చేపట్టారు. అయితే ట్రెంచికి మధ్యలో రాతి బండల కారణంగా అక్కడక్కడ గ్యాప్‌లున్నాయి. ట్రెంచి వెడల్పు మూడు మీటర్లుగానే ఉంది. ఏనుగులు కొన్ని చోట్ల గుంతలు ఉన్న గుట్టల గుండా, లేదా గుంతల్లోకి మట్టిని నింపి వెలుపలికి వస్తున్నాయి. కేరళ, అస్సాం రాష్ట్రాల్లో ఏనుగులు అడవిలోంచి బయటకు రాకుండా పాత రైలు పట్టాలకు ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసినట్టు ఇక్కడా చేపట్టాలి. స్థానిక అడవిలో కొంతమేర ఇప్పటికే నిర్మించిన కర్ణాటక టైప్ వేలాడే ఫెన్సింగ్‌నైనా పూర్తిస్థాయిలో చేపట్టాలి. అడవికి ఆనుకుని ఉన్న బఫర్‌జోన్‌లో ముళ్లకలిగిన కలిమిచెట్లు, గారచెట్లు, నిమ్మచెట్లు లాంటివి పెంచితే ముళ్లకు బయపడి ఏనుగులు రాకుండా ఉంటాయని రైతులు సూచిస్తున్నారు. అయితే కౌండిన్య అభయారణ్యం మూడు రాష్ట్రాల పరిధిల్లో ఉండడంతో మూడు రాష్ట్రాలు కలసి ఎలిఫెంట్ కారిడార్ ఏర్పాటు చేస్తేనే సమస్యకు శాశ్వతమైన పరిష్కారం దొరుకుతుంది.

కొత్త ఫెన్సింగ్‌కు ప్రతిపాదనలు పంపాం



పాత, కొత్త సోలార్ ఫెన్సింగ్‌ల మధ్య నున్న గ్యాప్‌లతో పాటు పాత సోలార్ దెబ్బతిన్న చోట్ల మరమత్తులకు ఇప్పటికే రూ.28 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి నిధులందితే ఫెన్సింగ్ పనులు ప్రారంభిస్తాం. అడవిలోంచి బయటకొచ్చిన ఏనుగులు ఇలా కరెంట్‌షాక్‌లకు గురై మృతి చెందుతుండడం మా శాఖకు చాలా బాధగా ఉంది. – శివన్న, ఎఫ్ఆర్వో, పలమనేరు

సీఎం దృష్టికి తీసుకెళ్లా..



ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఏనుగుల సమస్య ఉంది. గతంలో నిర్మించిన సోలార్ ఫెన్సింగ్ నాశిరకంగా ఉండడంతోనే ఏనుగులు సులభంగా అడవిలోంచి బయటకు వచ్చేస్తున్నాయి. ఇందుకోసం పటిష్టమైన సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. సీఎం ఈ సమస్యను తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. – వెంకటేగౌడ, ఎమ్మెల్యే, పలమనేరు

సీడబ్ల్యూసీలోకి రఘువీరారెడ్డి

- ఏపీ నుంచి సుబ్బిరామిరెడ్డి, కొప్పుల రాజు, పళ్లంరాజు
- తెలంగాణ నుంచి దామోదర రాజనర్సింహ, వంశీచంద్‌రెడ్డికి అవకాశం
- మొత్తం 84 మందికి చోటు కల్పించిన అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అత్యున్నత నిర్ణయాత్మక మండలి అయిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో ఏపీ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎస్.రఘువీరారెడ్డికి చోటు దక్కింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఏర్పాటు చేసిన నూతన కమిటీకి సంబంధించిన ఉత్తర్వులను ఆదివారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విడుదల చేశారు. మొత్తం 84 మందితో ఏర్పాటు చేసిన నూతన సీడబ్ల్యూసీలో 39 మంది సభ్యులు, 32 మంది శాశ్వత ఆహ్వానితులు, 9 మంది ప్రత్యేక ఆహ్వానితులు, నలుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. ఏపీ నుంచి మాజీ పీసీసీ అధ్యక్షుడు ఎస్.రఘువీరారెడ్డిని సీడబ్ల్యూసీ సభ్యుడిగా, సీనియర్ నేతలు సుబ్బిరామిరెడ్డి, కొప్పుల రాజులను శాశ్వత ఆహ్వానితులుగా, కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజును ప్రత్యేక ఆహ్వానితుడిగా చోటు కల్పించారు. తెలంగాణ నుంచి సీనియర్ నేత దామోదర రాజనర్సింహను శాశ్వత ఆహ్వానితుడిగా, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డిని ప్రత్యేక ఆహ్వానితునిగా అవకాశం కల్పించారు.

సీడబ్ల్యూసీ సభ్యులు

మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, మన్మోహన్‌సింగ్, రాహుల్ గాంధీ, అధీర్ రంజన్ చౌదరి, ఏకే ఆంటోని, అంబికా సోని, మీరా కుమార్, దిగ్విజయ్‌సింగ్, చిదంబరం, తారీఖ్ అన్వర్, లాల్ తన్హావాలా, ముకుల్ వాస్నిక్, ఆనంద్ శర్మ, అశోక్ చవాన్, అజయ్ మాకెన్, చరణ్‌జీత్ సింగ్ చన్నీ, ప్రియాంకా గాంధీ వాద్రా, కుమారి సెల్జా, గైఖంగం, ఎస్.రఘువీరారెడ్డి, శశిథరూర్, తామ్రధ్వజ్ సాహు, అభిషేక్ మను సింఘ్వీ, సల్మాన్ ఖుర్షీద్, జైరాం రమేశ్, జితేంద్ర సింగ్, రణదీప్‌సింగ్ సూర్జేవాలా, సచిన్ పైలెట్, దీపక్ బాబరియా, జగదీశ్ ఠాకూర్, జీ.ఏ.మీర్, అవినాశ్ పాండే, దీపాదాస్ మున్షీ, మహేంద్రజీత్ సింగ్ మాల్వీయా, గౌరవ్ గొగొయ్, సయ్యద్ నాసిర్ హుస్సేన్, కమలేశ్ పటేల్, కేసీ వేణుగోపాల్.

శాశ్వత ఆహ్వానితులు

వీరప్ప మొయిలీ, హరీశ్ రావత్, పవన్ కుమార్ బన్సల్, మోహన్ ప్రకాశ్, రమేశ్ చెన్నితల, బీకే హరిప్రసాద్, ప్రతిభాసింగ్, మనీశ్ తివారీ, తారిఖ్ హమీద్ కర్రా, దీపేంద్ర సింగ్ హుడ్డా, గిరిశ్ రాయ చోదంకర్, టి.సుబ్బిరామిరెడ్డి, కె.రాజు, చంద్రకాంత్ హందోరే, మీనాక్షి నటరాజన్, ఫూలోదేవి నేతం, దామోదర రాజనర్సింహ, సుదీప్ రాయ్ బర్మన్, డా.ఎ.చెల్లకుమార్, భక్త చరణ్ దాస్, అజోయ్ కుమార్, హరీశ్ చౌదరి, రాజీవ్ శుక్లా, మాణిక్కం ఠాగూర్, సుఖ్విందర్ రంధావా, మాణిక్‌రావ్ థాక్రే, రజినీ పటేల్, కన్హయ్య కుమార్, గురుదీప్ సప్పల్, సచిన్ రావ్, దేవేందర్ యాదవ్, మనీశ్ ఛాత్రత్.

ప్రత్యేక ఆహ్వానితులు


పళ్లంరాజు, పవన్ ఖేరా, గణేశ్ గొడియాల్, కొడిక్కునిల్ సురేశ్, యశోమతి ఠాకూర్, సుప్రియా శ్రీనాథే, పరిణీతి షిండే, అల్కా లాంబ, చల్లా వంశీచంద్‌రెడ్డి.

ఎక్స్ అఫీషియో సభ్యులు

బీవీ శ్రీనివాస్, నీరజ్ కుందన్, నెట్టా డి డిసౌజా, లాల్జీ దేశాయ్

ఏపీ విలేజ్ అగ్రికల్చర్ అనుబంధ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా విజయమోహన్

సాక్షి, అమరావతి: ఏపీ విలేజ్ అగ్రికల్చర్ అనుబంధ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కె.విజయమోహన్ ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడ ఎన్జీవో హోమ్‌లో జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా విజయ్ మోహన్, ఉపాధ్యక్షులుగా ఎ.సత్యరాజ్, అసోసియేట్ అధ్యక్షుడిగా పి.రాంప్రసాద్, ప్రధాన కార్యదర్శులుగా బి.జాన్ క్రిస్టోఫర్, బాలసాగర్, కోశాధికారిగా ఎన్.రాంచరణ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షుడు డి.వేణుమాధవరావు అభినందించారు.



మంచి స్నేహితుడు, కఠినమైన శత్రువు...
ఇద్దరూ అవసరమే. స్నేహితుడు ఉపదేశిస్తాడు.
శత్రువు కార్యోన్ముఖుణ్ణి చేస్తాడు.
– డైయొజినీజ్

సాక్షి

సోమవారం, 21 ఆగస్టు 2023

కాలం కార్ఖానా

కాలం ఒక కార్ఖానా. మనం నేల మీద పడిన క్షణం నుంచి కాలం కార్ఖానాలో మన కోసం ఉత్పత్తి మొదలైపోతుంది. ఆ ఉత్పత్తులలో మనకు కావలసిన రకరకాల ఆహార్యాలు, ఆలోచనలు, రుచులు, అభిరుచులు, అలవాట్లే కాదు; వాటిని నియంత్రించే హద్దులూ ఏర్పడిపోతాయి. పుట్టిన మరుక్షణం నుంచి కాలం మనకు తెలియకుండానే మనతో కలసి నడుస్తుంది, మనల్ని నడుపుతుంది. కానీ మనం ఆ సంగతి గుర్తించం, మనల్ని మనమే నడుపుకుంటున్నామనుకుంటాం. అంతా మన ప్రయోజకత్వమేననుకుని విర్రవీగుతాం. కాలాన్ని కేలండర్‌గా మార్చి గోడకూ; గడియారంగా మార్చి మణికట్టుకూ బంధించామనుకుంటాం. కానీ గుప్పిట్లో నీళ్ళు వేళ్ళ సందుల్లోంచి జారిపోయినట్టుగా కాలం కూడా ఏ బంధనాలకూ లొంగకుండా జారుకుంటూనే ఉంటుందన్న వాస్తవం మన తెలివిని నిరంతరం వెక్కిరిస్తూనే ఉంటుంది.

కాలంలో ఒకానొకనాడు మనిషి నగ్నత్వాన్నే ఒంటికి చుట్టుకున్నాడు. తర్వాత తర్వాత ఒళ్ళంతా వస్త్రంతో కప్పుకోవడమే సంస్కారంగా, నాగరికతగా మారింది. మొన్నటికి మొన్న, తగినంత తిండికీ, చాలినంత ఆచ్ఛాదనకూ నోచుకోని ఈ దేశంలోని కోట్లాది నిరుపేదల బతుకు టద్దంగా మారుతూ మోకాళ్ళు దాటని అంగవస్త్రాన్ని మొలకు చుట్టుకోవడం ఆదర్శం కాదు, అవసరమనుకున్నాడు మహాత్మా గాంధీ. ఆ తర్వాత స్త్రీ పురుష వస్త్రధారణ అనేకానేక మార్పుల మలుపులు తిరుగుతూ ఒంటినిండా కప్పుకోవడమనేది 'అనాగరికం'గా మారి గాంధీగారి అంగవస్త్రంలా మోకాళ్ళు దాటని షార్ట్స్ ధరించడం అతి నవీనమైన పోకడగా మారింది. కాలం చేసే చిత్రాలు అలా ఉంటాయి. అది మన పట్టు తప్పించుకుంటూ ముందుకే కాదు, వెనక్కీ, పక్కలకీ కూడా పరుగులెడుతూ మనతో ఆడుకోగలదు.

కాలం అఖండంగా ఉంటూనే నిన్న, నేడు, రేపు రూపంలో ఖండితంగానూ ఉంటుంది. కానీ మన ఊహాపోహలకు, జీవనగమనానికి మేకులు దిగేసి వర్తమానమనే కట్టుకొయ్యకు బంధించి ఉంచుతుంది. కవి ఎంత క్రాంతదర్శి అయినా ఆ మేకుబందీ నుంచి పూర్తిగా తప్పుకోలేడు. రేపటి కాలంలో పోస్ట్ మ్యాన్ ఆరోవేలుగా మారబోతున్నాడని తెలిసి ఉంటే దేవరకొండ బాలగంగాధర తిలక్ ప్రసిద్ధ కవిత 'తపాలా బంట్రోతు' ఏ రూపం దిద్దుకొని ఉండేదో! 'దేశాంతరగతుడైన ప్రియుడి వార్త' మొబైల్ రూపంలో అరచేతి దూరంలో ఉన్న ఈ రోజున, ఏ అమ్మాయీ 'పద్దెనిమిదేళ్ళ పడుచుదనాన్ని భద్రంగా దాచి పళ్ళెరంలో పెట్టి ప్రాణనాథుడి కందించా'లనే ఆశతో, 'చూపులు తుమ్మెద బారులు కట్టి' పోస్ట్ మ్యాన్ కోసం ఎదురుచూడాల్సిన అవసరమే లేదు. చిరునవ్వుతోనే కబురు లేదని చెప్పి వెళ్లిపోతున్న తపాలా బంట్రోతు వెనుక ఆ కళ్ళు 'విచ్చిన రెండు కల్హార సరస్సులు' కావలసిన అవసరమూ లేదు. అలాగని ప్రియుడి వార్త కోసం పడుచుదనం పడే ఆరాటం కాలభేదాలకు అతీతంగా నిత్యనూతనమూ అవుతుంది కనుక ఒక అపురూప భావస్పందన కలిగించే కవితగా అది భవిష్యత్తులోకి తన అస్తిత్వాన్ని పొడిగించుకుంటూనే ఉంటుంది. మరోపక్క గతకాలపు చరిత్ర శకలంగానూ మారుతుంది.

గతంపై మసక తెర కప్పి మాయ చేయడం కాల స్వభావాలలో ఒకటి. మన పాదముద్రలు గతంలోకి వ్యాపించి ఉన్నాయన్న ఎరుక తప్పి, మన నడక వర్తమానంలోనే మొదలైందని అపోహ పడతాం. నేడు మన కళ్ళముందు ఉన్నవే నిత్యాసత్యాలు కావనీ, మొదటి నుంచీ ఈ ప్రపంచం ఇలాగే లేదనీ కొంత తెలిసినా కొంత తెలియనట్టే భ్రమావలయంలో గడుపుతూ ఉంటాం. ఎన్నో రకాల నియంతృత్వాలను దాటి ప్రజాస్వామ్యంలోకి వచ్చామనీ, అది కూడా ఇంకా ప్రయోగ దశలోనే ఉంది తప్ప పూర్తిగా పాదుకోలేదనీ, నేటి మన అనేకానేక సమస్యలు, సంక్షోభాల మూలాలు గతంలో ఉన్నాయనీ, వాటి పరిష్కారాల వెతుకులాటలో వందలు, వేల సంవత్సరాల గతంలోకి మన చూపుల నిడివి పెంచుకోవాలనే ఊహ రాకుండా మన బుద్ధికి కాలం దడి కడుతుంది. వర్తమానాన్ని ఒక మత్తుమందులా అలవాటు చేస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా వాఙ్మయ పరిణామ క్రమాన్నే కనుక చూస్తే, క్రతు సంబంధమైన తంతు నుంచి మూకాభినయమూ, దాని నుంచి నాట్యమూ, నాట్యం నుంచి నాటకమూ ఎలా అభివృద్ధి చెందాయో; క్రతు సందర్భ గానం నుంచే పాట పుట్టి కావ్యస్థాయికి ఎలా పెరిగిందో; అనేకమంది అజ్ఞాతకర్తలు కలిగిన మౌఖిక సంప్రదాయం నుంచి, ఏక కర్తృకమైన లేఖన సంప్రదాయానికి వాఙ్మయం ఎలా పరివర్తన చెందిందో చెప్పే ఆసక్తికరమైన అధ్యయనాలు ఈరోజున అందుబాటులో ఉన్నాయి. అయినాసరే, నాట్యం, నాటకం, పాట, పద్యం, వచనపద్యం, గద్యం, కథ, నవల వంటి వివిధ ప్రక్రియలను పరస్పర సంబంధం లేని భిన్న రూపాలుగా విడదీసి చూడడాన్ని కాలం మనకు అలవాటు చేసింది. మౌఖిక సంప్రదాయానికి, అనేక కర్తృకానికి చెందినవాటిని కూడా లిఖిత సంప్రదాయం నుంచీ, ఒక్కరే రచించారన్న భావన నుంచీ చూడడం కూడా కాలం మప్పిన అలవాటే. కాలం పోయే చిత్రగతులు మనిషిని మొదటినుంచీ తికమకపెడుతూ ఆలోచనకు లోనుచేస్తూనే ఉన్నాయి. మహాభారత కథకుడు కాలానికి చెప్పిన భాష్యంలో అసాధారణమైన లోచూపు కనిపించి ఆశ్చర్యచకితం చేస్తుంది. భూత, భవిష్యత్, వర్తమానాలకు చెందిన అన్ని భావాలూ కాలనిర్మితాలేనంటాడు. భావాలు మనిషివే కనుక మనిషీ కాలనిర్మితుడే నన్నమాట. కాలం గురించిన తెలివిడితోనే దాని మాయాజాలం నుంచి ఏ కొంచెమైనా తప్పించుకోగలం.

భారత ప్రధానుల నిర్ణయ విధానాలు!

కామెంట్



కరణ్ థాపర్

ఆరుగురు ప్రధానమంత్రులపై నీరజా చౌధరి తాజాగా 'హౌ ప్రైమ్ మినిస్టర్స్ డిసైడ్' పుస్తకాన్ని వెలువరించారు. ఈ పుస్తక విజయ రహస్యం అంతా కూడా... చరిత్రనూ, జీవిత చరిత్రనూ మిళితం చేసి, దానికి ఉల్లాసభరితమైన చిట్టి పొట్టి కథల్ని, కబుర్లూ–కాకరకాయలను జోడించడంలోనే ఉంది. ఈ ప్రధానులలో ఎవరి మీదనైనా మీకు ఇదివరకే ఉన్న అభిప్రాయాన్ని పునరాలోచింపజేసేంతటి రహస్యాల వెల్లడింపులేమీ ఈ పుస్తకంలో లేవు. ఇది పునఃసమీక్ష కాదు. కానీ ఇందులో ఉల్లేఖనాలు, ఉటంకింపులతో పాటు... మీకు ఇప్పటికే తెలిసి ఉన్న వివరాలకు జోడింపుగా పరిశోధనాత్మక వివరాలు ఉన్నాయి. విషయాలను మీరు మరింత బాగా అర్థం చేసుకోడానికి ఈ పుస్తకం సహాయపడుతుంది.


ప్రధానంగా జీవిత చరిత్రలు నాకు మనోరంజకంగా ఉంటాయి. అందుకు కారణం ఆ ముఖ్య పాత్రల జీవితాలలో మనం పాలుపంచుకోవడం ఒక్కటే కాదు, అవి చదవడానికి సరదాగా అనిపించే అనేక చిన్న చిన్న నిజ జీవితపు ఘటనల ఆసక్తికరమైన కథలతో నిండి ఉంటాయి. గంభీరమైన చరిత్ర పుస్తకాలు ఇందుకు భిన్నమైనవి. అవి మరింత విశ్లేషణాత్మకంగా ఉండడం వల్ల వాటిని చదివేందుకు ప్రయాస పడవలసి వస్తుంది. ఇక అవి దేనినైనా పునఃమూల్యాంకనం జరుపుతున్నట్లుగా ఉంటే కనుక అవి అర్థం చేసుకునేందుకు దుర్భేద్యంగా తయారవడం కద్దు.

పఠనీయతను, పారవశ్యాన్ని రెండు శైలులుగా జతపరచి ఆరుగురు ప్రధానమంత్రులపై నీరజా చౌధరి తాజాగా 'హౌ ప్రైమ్ మినిస్టర్స్ డిసైడ్' పుస్తకాన్ని వెలువరించారు. ఈ పుస్తక విజయ రహస్యం అంతా కూడా... చరిత్రనూ, జీవిత చరిత్రనూ మిళితం చేసి, దానికి ఉల్లాసభరితమైన చిట్టి పొట్టి కథల్ని, కబుర్లూ–కాకరకాయలను జోడించడంలోనే ఉంది.

ఉదాహరణకు, రాజీవ్ గాంధీపై నీరజ రాసిన అధ్యాయం ఇలా మొదలౌతుంది. ''రాజీవ్! ఈ ముస్లిం మహిళా బిల్లుపై మీరు నన్నే ఒప్పించలేకపోతే, దేశాన్ని ఎలా ఒప్పించబోతారు? అని సోనియా తన భర్తతో అన్నారు.'' ఇక పీవీ నరసింహారావు అధ్యాయ ప్రారంభ వాక్యం అయితే మరింతగా ఆసక్తిని రేకెత్తించేలా ఉంటుంది. ''డిసెంబరు 6వ తేదీ మధ్యాహ్నం పన్నెండు గంటల సమయం తర్వాత మీరు పూజలో కూర్చొని ఉన్నారని విన్నాను అని వామపక్ష పాత్రికేయుడు నిఖిల్ చక్రవర్తి ప్రధాని నరసింహారావుతో అన్నారు'' అని ఉంటుంది. ఆ విధమైన ప్రారంభ వాక్యంతో లోపలికి వెళ్లకుండా ఉండటం అసాధ్యం.

ఇప్పుడేమిటంటే, ఈ ప్రధానులలో ఎవరి మీదనైనా మీకు ఇదివరకే ఉన్న అభిప్రాయాన్ని పునరాలోచింపజేసేంతటి రహస్యాల వెల్లడింపులేమీ ఈ పుస్తకంలో లేవు. ఇది పునఃసమీక్ష కాదు. కానీ ఇందులో ఉల్లేఖనాలు, ఉటంకింపులతో పాటు... మీకు ఇప్పటికే తెలిసి ఉన్న వివరాలకు జోడింపుగా పరిశోధనాత్మక వివరాలు ఉన్నాయి. విషయాలను మీరు మరింత బాగా అర్థం చేసుకోడానికి ఈ పుస్తకం సహాయపడుతుంది.

నరసింహారావుపై ఆమె చేసిన వ్యాఖ్యలైతే విశేషంగా మనల్ని ఆకట్టుకుంటాయి. మొదటిది – ఆ మనిషి గురించి ఆమెకు ఉన్న అవగాహన. ''పీవీ నరసింహారావు... తనతో తను వాగ్వాదానికి దిగుతారు. ఒక విషయాన్ని ఆయన అంతర్గతంగా చర్చించుకుంటారు. ఎంత లోతుగా వెళతారంటే, ఏ వైపూ స్పష్టమైన చిత్రం కనిపించని స్థాయిలో ఆ విషయంలోని రెండు దృక్కోణాలనూ వీక్షిస్తారు'' అంటారు నీరజ.







నీరజా చౌధరి

ఇంకా అంటారూ, 1996లో ఆయన మెజారిటీ కోరుకోలేదనీ, ఆయన కోరుకున్న విధంగానే మెజారిటీ రాలేదనీ! ఎందుకంటే మెజారిటీ వస్తే సోనియాగాంధీకి దారి ఇవ్వవలసి వస్తుంది కదా! ''కాంగ్రెస్ మైనారిటీలో ఉంటేనే రావుకు మళ్లీ ప్రధాని అయ్యే అవకాశం ఉంటుంది'' అని రాశారు నీరజా చౌధరి. ఆమె సరిగ్గానే చెప్పారు. ఇంతకు ముందెప్పుడూ నాకు ఆ ఆలోచనే తట్టలేదు.

వాజ్‌పేయితో నరసింహారావుకు ఉన్న దగ్గరితనం నా దృష్టిని మొత్తం అటు వైపునకే మరల్చింది. ''ఇద్దరూ కలిసి చాలా దూరం ప్రయాణించారు. సంక్షోభ సమయాలలో ఒకరినొకరు కాపాడుకున్నారు'' అని రాస్తారు నీరజ.

1996 అక్టోబరులో జరిగిన ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో వాజ్‌పేయి... నరసింహారావుకూ, భువనేశ్ చతుర్వేది అనే ఒక జూనియర్ మంత్రికీ మధ్య కూర్చొని ఉన్నారు. అప్పుడు ''వాజ్‌పేయి... రావు వైపు ఒరిగి, 'కల్యాణ్ సింగ్ హమారే బహుత్ విరోధ్ మే హై, ఉస్ కో నహీ బన్‌నా చాహియే' (కల్యాణ్ సింగ్ నన్ను వ్యతిరేకిస్తున్నారు. ఆయన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టకూడదు) అన్నారు'' అని భువనేశ్ చతుర్వేదిని ఉటంకిస్తూ నీరజ రాశారు.

ఆ సాయంత్రం చతుర్వేది, 'వాజ్‌పేయికి సహాయం చేయాలా?' అని రావును అడిగారు. అందుకు ఆయన 'హా... కెహ్ దో వోరాజీ కో' (అవును... అవసరమైనది చేయమని వోరాజీకి చెప్పండి) అన్నారు. వోరా ఆనాటి యూపీ గవర్నర్.

నరసింహారావు సందేశం వోరాకు అందింది. కల్యాణ్ సింగ్ ముఖ్యమంత్రి కాలేదు. నీరజ వివరణ ఎక్కువ మాటలతో ఉండదు. ''లక్నోలో కల్యాణ్ సింగ్‌ను ముఖ్యమంత్రిగా నియమించడం అంటే అధికారం అద్వానీ చేతుల్లోకి వెళ్లడం. ఇది వాజ్‌పేయికి సమస్యల్ని సృష్టించ వచ్చు. వాజ్‌పేయి విషయంలో యూపీకి ఉన్న ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకుని, తన స్నేహితుడికి సహాయం చేయాలని రావు నిర్ణయించు కున్నారు'' అని ఒక్కమాటలో చెప్పేశారు నీరజ.

తిరిగి ఐదేళ్ల తర్వాత పీవీ నరసింహారావుకు ప్రతిఫలంగా వాజ్‌పేయి సహాయం అందించారు. 2000 సెప్టెంబరులో అవిశ్వాస తీర్మానాన్ని వీగి పోయేలా చేసేందుకు ఎంపీలకు లంచం ఇచ్చిన కేసులో ట్రయల్ కోర్టు రావును దోషిగా నిర్ధారించింది. అప్పుడు, ''ఆ కేసును మూసి వేయించడానికి వాజ్‌పేయి సహాయం కోరారు నరసింహారావు'' అని నీరజ రాశారు. ''మధ్యవర్తిగా తను వాజ్‌పేయి దగ్గరకు వెళ్లినట్లు చతుర్వేది నాతో చెప్పారు: 'నేను అటల్‌జీని కలవడానికి వెళ్లాను. అప్పుడు ఆయన నన్ను లోపలికి పిలిచారు. 'ఇస్ కో ఖతమ్ కీజియే' (ఆ విషయాన్ని ముగించండి) అని అన్నారు'' అని భువనేశ్ చతుర్వేది తనతో చెప్పి నట్లు నీరజా చౌధరి పేర్కొన్నారు.

2002 మార్చిలో ఢిల్లీ హైకోర్టు నరసింహారావును నిర్దోషిగా ప్రకటించింది. ''హైకోర్టు తీర్పుపై అప్పీలు చేయకూడదని వాజ్‌పేయి ప్రభుత్వం నిర్ణయించుకోవడం గమనార్హం'', ''సీబీఐ కూడా కేసును ఉపసంహరించుకుంది'' అని రాశారు నీరజ.

నా ఇన్నేళ్లలోనూ నేను ఇలాంటి ఇచ్చిపుచ్చుకోవడాలను చూడలేదు. వాళ్లిద్దరూ ప్రత్యర్థులు. ప్రధాని పదవి కోసం తలపడ్డవారు. అయినప్పటికీ తమకెదురైన సవాళ్లను మొగ్గలోనే తుంచేయడానికి ఒకరికొకరు సహాయం చేసుకున్నారు.

'నా వీపు నువ్వు గోకు, నీ వీపు నేను గోకుతా' అనే మాటకు ఇదొక చక్కని నిదర్శనం. అత్తరు వాసనలా బయటికి కూడా రాదు. ఈ విషయంపై వారి వారి పార్టీలు ఎలా స్పందిస్తాయో తెలుకోవాలని నాకు ఇప్పుడు కుతూహలంగా ఉంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఇదేనా ప్రజాస్వామ్యం?



నాకేమీ అర్థం కావడం లేదు. 'ఉపా' కింద 2020లో అరెస్ట్ అయిన జేఎన్‌యూ విద్యార్థి ఉమర్ ఖాలిద్ బెయిల్ పిటిషన్‌పై వాదనలను సుప్రీంకోర్టు మరో రెండు వారాలకు వాయిదా వేసింది! మరోవైపు, 'ప్రజాస్వామ్యానికి మాతృమూర్తి' అనే నినాదంతో మనం జీ20 సమావేశాలను నిర్వహిస్తున్నాం! ఈ ద్వంద్వ వైఖరి ఇంకా ఎంత కాలం?

– మనోజ్ కుమార్ ఝా, ఆర్జేడీ ఎంపీ

వాళ్లవి మాటలే!



మోదీ ప్రభుత్వం 2014లో ప్రారంభించిన పీఎం జన్‌ధన్ యోజన కింద ఈ ఆగస్టుకు ఉచిత బ్యాంకు ఖాతాల సంఖ్య 50 కోట్లకు చేరుకుంది. వీటిల్లో 50 శాతం ఖాతాలు మహిళలవి కాగా, 67 శాతం ఖాతాలు గ్రామీణ ప్రాంతాలకు చెందినవి. గత ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎప్పుడూ మాట్లాడుతుండే ఈ విధమైన ఆర్థిక సమ్మిళితాన్ని కాంగ్రెస్ ఎందుకు అమలు చేయలేకపోయిందో?

– రిపీ బాగ్చీ, పన్ను చెల్లింపుదారు

లెక్కించని సంపాదన



జస్ట్ ఇప్పుడే, ట్విట్టర్ నుంచి నా అకౌంట్‌కి డబ్బులు వచ్చి పడ్డాయి! ఎంతనుకుంటున్నారు? 148.46 డాలర్లు. రూపాయలలో అదెంతో లెక్క చూసుకోవాలి. అన్నట్టు, "ట్విట్టర్‌కు మీ సృజనాత్మకతను సమర్పిస్తున్నందుకు ధన్యవాదాలు" అని కూడా వారు నాకు మెసేజ్ పంపారు.

– ఇషాన్ శర్మ, యూట్యూబ్ క్రియేటర్

అంతర్వీక్షణ



ఫొటోగ్రఫీ అనేది విలువైన క్షణాలు, సంఘటనలు, ప్రకృతి సౌందర్యం, సాంస్కృతిక – చారిత్రక ప్రాముఖ్యం ఉన్న ప్రదేశాలను సంగ్రహించే అద్భుతమైన కళ. లెన్స్ వెనుక ఉన్న కళాత్మకతను వేడుక చేసుకుందాం. ఫొటోల ద్వారా కథలు చెప్పే ఫొటోగ్రాఫర్‌లను అభినందిద్దాం.

– నవీన్ పట్నాయక్, ఒడిశా సీఎం

కోర్టు కూడానా?!



రిజర్వేషన్‌తో ఐఐటీలో ప్రవేశం పొందుతారు. పరీక్షలు ఫెయిల్ అవుతారు. తక్కువ స్కోర్ కారణంగా తొలగించబడతారు. దానిపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తారు. 'మెరిట్ సాకుతో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను తొలగించలేము' అని కోర్టు తీర్పు పొందుతారు. భారతదేశంలోని అగ్రశ్రేణి కళాశాలలను ఎంత అపహాస్యం చేస్తున్నారు!

– అనురాధా తివారీ, రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమకారిణి

లోగుట్టు పెద్ద హీరోలకు ఎరుక!

విస్తృత ప్రజాదరణ, ప్రాచుర్యం ఉన్న క్రికెట్, సినిమా ఈ దేశంలో మతాన్ని మించినవని అంటారు. జాతీయ గుర్తింపును తీర్చిదిద్ది, భారతదేశపు 'సాఫ్ట్‌పవర్'కు ప్రతీకగా నిలిచే ఈ రెంటి గురించి ఎవరి అభిప్రాయం వారిదే! పబ్లిక్‌లోకి వచ్చాక... వీటిపై మాట్లాడద్దని ఎవరన్నా అంటే అది అజ్ఞానం, అర్థరహితం. సినీ పరిశ్రమ ప్రస్తుత పరిస్థితి, మితిమీరిన పారితోషికాలు, అదుపు తప్పిన చిత్ర నిర్మాణవ్యయం, అందుకుంటున్న పారితోషికాలకు తారలు లెక్కలు సరిగ్గా చూపుతున్నారా, ప్రభుత్వానికి పన్ను కడుతున్నారా, ఆడని సినిమాలకు సైతం శత – ద్విశతదినోత్సవ 'వీర' రికార్డులు లాంటి అనేక అంశాలపై ఇటీవల జరుగుతున్న చర్చను ఈ దృష్టితో చూడాలి. పార్లమెంట్‌లో వచ్చిన పారితోషికాల ప్రస్తావనను 'పిచ్చుకపై బ్రహ్మాస్త్రం' అంటూ అగ్రతార చిరంజీవి 'వాల్తేరు వీరయ్య' చిత్ర ద్విశత దినోత్సవ వేదికపై నుంచి చేసిన వ్యాఖ్యలు రచ్చను పెంచాయి.

'భోళా శంకర్' చిత్రం రిలీజ్‌కు కొద్దిరోజుల వ్యవధి ఉండగా, ప్రత్యేక ఆహ్వానితులతో 'వాల్తేరు వీరయ్య' 200 రోజుల విజయోత్సవ వేడుక జరిగింది. ఆ వేదికపై ఆయన ఆచితూచి తన తమ్ముడు పవన్ కల్యాణ్ పేరెత్తకుండానే తారల వివాదాస్పద పారితోషికాల అంశాన్ని ప్రస్తావించారు. సినిమా వాళ్ళకు ఎక్కువ రెమ్యూనరేషన్లు ఇస్తున్నారనే అంశం పార్లమెంట్‌లో చర్చించాల్సిన విషయం కాదనీ, వరుసగా సినిమాలు చేస్తున్నది పరిశ్రమలోని వారికి ఉపాధి లభిస్తుందనే ఉద్దేశంతోనే అనీ అన్నారు. పాత రాజకీయ వాసనలు పోని చిరంజీవి ప్రత్యేక హోదా, ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణం, ఉద్యోగ – ఉపాధి అవకాశాలపై రాజకీయ నేతలు దృష్టి సారించాలనీ సలహా ఇచ్చారు. పారితోషికాల విషయాన్ని పెద్దది చేసి దేశవ్యాప్తంగా ప్రాజెక్ట్ చేయద్దనీ అభ్యర్థించారు. గమనిస్తే – 'ఆచార్య' చిత్ర సమయంలో జరిగిన పరిణామాలు, ఆ చిత్రానికి ఆరంభ వసూళ్ళు సైతం ఆశించినంతగా రాని పరిస్థితితో అక్కడ నుంచి చిరు కొత్త ధోరణిలోకి దిగారు. కారణాలు ఏమైనా ఆ తరువాత నుంచి తన ప్రతి కొత్త సినిమా రిలీజు ముందు అనివార్యంగా అన్నయ్య నోట తమ్ముడి మాట వినిపిస్తోంది. ఇది కేవలం యాదృచ్ఛికమే అనుకోగలమా? ఇదీ విశ్లేషకుల ప్రశ్న. దానికి జవాబు లోతైన వేరే చర్చ.

అది అటుంచితే... పరిశ్రమ బాగు కోసమే సినిమాలు చేస్తున్నామని పైకి ఎవరు ఎంతగా చెబుతున్నా, అసలు చిత్ర నిర్మాణ వ్యయంలో అత్యధిక భాగం అగ్రతారలు, అగ్ర టెక్నీషియన్ల జేబులోకే చేరుతుందనేది నిష్ఠుర సత్యం. తారల ఈ భారీ పారితోషికాల వ్యవహారంపై చర్చ ఇవాళ కొత్తది కాదు. ఆ మాటకొస్తే తీసుకొనే రెమ్యూనరేషన్‌లో మనమే జాతీయ స్థాయిలో ఘనులమంటూ, 'బిగ్గర్ దేన్ (అమితాబ్) బచ్చన్' అని జాతీయ ఆంగ్ల పత్రికల్లో సైతం మన హీరోలే రాయించుకున్న సందర్భాలూ ఉన్నాయి. అయితే, అంతకంతకూ సినిమాల సక్సెస్ శాతం తగ్గి, భారీ నష్టాలు పెరుగుతున్నందున... పారితోషికాల లాంటి అనుత్పాదక వ్యయం తగ్గాలనీ, సినిమా మేకింగ్ కోసం పెట్టే ఉత్పాదక వ్యయం పెరగాలనీ సాక్షాత్తూ పరిశ్రమలో పెద్దలే ఎప్పటి నుంచో మొత్తుకుంటున్నారు. ఇవాళ తెలుగులో పెద్ద సినిమాల బడ్జెట్‌లో సగటున మూడింట రెండొంతులు, మరోమాటలో 65 నుంచి 70 శాతం దాకా రెమ్యూనరేషన్లకే పోతోంది. అదేమంటే మార్కెట్‌లో ఉన్న డిమాండ్, సినిమాకు జరిగే వ్యాపారాన్ని బట్టే అంతంత పారితోషికాలు ఇస్తున్నారని వాదిస్తున్నారు. సమర్థించుకోవాలని చూస్తున్నారు. కానీ, ఈ ధోరణి పరిశ్రమ దీర్ఘకాలిక ప్రయోజనాలకూ, పైకి చెబుతున్న సోకాల్డ్ కార్మిక ఉపాధికీ పని కొచ్చేదైతే కానేకాదు.

అసలు ఇంతంత పారితోషికాలకూ ఓ కథ ఉంది. పైరసీ సినిమా చూడడం రక్తపుకూడు లాంటిదని మన స్టార్లు డైలాగులు చెబుతారు. కానీ, కొత్త సినిమా రిలీజంటే అధికారికంగా, అనధికారికంగా టికెట్ రేట్లు పెంచుకొని, పబ్లిక్ బ్లాక్‌మార్కెటింగ్ చేసే ధోరణిని ఆరంభించినదే మన మెగా తారలు. పైగా ఆ అధిక రేట్లతో సహజంగానే వచ్చే వసూళ్ళ లెక్క వేరు, ప్రభుత్వానికి చూపి పన్నుకట్టే లెక్క వేరు! ప్రభుత్వ ఖజానాకు వేస్తున్న ఈ కన్నానికి తోడు... బలుపు కాక వాపు అయిన ఆ ఓపెనింగ్ కలెక్షన్లే గీటురాయిగా టాప్‌స్టార్స్ పారితోషికాలను పెంచేస్తూ... నిర్మాతల జేబుకు పెడుతున్న చిల్లు అదనం. వెరసి... పైరసీ పెరగడానికీ, థియేటర్లలో సినిమా ఆడే రోజులు తగ్గి అన్ని సెక్టార్లలో పరిశ్రమ ఇక్కట్లలో పడడానికీ పరోక్షంగా కారణమయ్యారు.

అధిక టికెట్ రేట్లకూ, పారితోషికాలకూ జరుగుతున్న ఆ పన్నుల ఎగవేత మాట అటుంచుదాం. ఇటీవల 100 – 200 రోజులు బలవంతాన లాగించి ఆడిస్తున్న అగ్రతారల సినిమాలకు ప్రభుత్వానికి జీఎస్టీ కూడా దక్కట్లేదు. ఆశ్చర్యపరిచే ఈ లోగుట్టు ఇన్ని పెద్ద కబుర్లు చెబుతున్నవారికి తెలుసా? చాలా మందికి తెలియనిదేమిటంటే... వార్షిక టర్నోవర్ రూ. 20 లక్షల లోపుంటే, జీఎస్టీ కట్టనక్కర్లేదని చట్టం. ఈ లొసుగును అడ్డం



పెట్టుకొంటూ... సినిమాలు రిలీజయ్యే చిన్న సెంటర్లలోని పలు నాన్–ఏసీ థియేటర్లు తమ వార్షిక టర్నోవర్ రూ. 20 లక్షల లోపేనని బొంకుతున్నాయి. అలా అవి తాము ప్రదర్శించే సిన్మాలకు ప్రభుత్వానికి దఖలు పరచాల్సిన 'డైలీ కలెక్షన్ రిపోర్ట్' (డీసీఆర్) రాయనక్కర్లేదు, జీఎస్టీ కట్టనూ అక్కర్లేదు. జీఎస్టీ లేని ఆ థియేటర్లను వాటంగా చేసుకొని, ఆడని సినిమాకు సైతం శత, ద్విశత దినోత్సవాలు చేసే సంస్కృతికి పలువురు హీరోలు, వారి భజన బృందాల వారు తెర తీశారు. ఇటీవల జరుగుతున్న పెద్ద హీరోల సినిమాల విజయోత్సవాల తెర వెనుక భాగోతం ఇదే! అలాంటి వేదికపై నిల్చొని చిరు సుద్దులు చెప్పడం పెను బోద్యం! పిచ్చుక లాంటి పరిశ్రమపై బ్రహ్మాస్త్రం వేస్తున్నారనడం విడ్డూరం.

జీఎస్టీ చట్టాన్ని సందు చేసుకొని... స్టార్ హీరోల సినిమాకు దొంగ రికార్డుల వీరతాళ్ళు వేసేందుకు ఈ నాన్–జీఎస్టీ సినీ థియేటర్లు భలే అక్కరకొస్తున్నాయి. ఇన్ని రోజులకు ఇంత అని ఫ్యాన్స్ దగ్గర ఎంతో కొంత మొత్తం గుత్తగా మాట్లాడుకొంటూ, ఆ హాళ్ళు అయినకాడికి సొమ్ము చేసుకుంటున్నాయి. వెరసి, మూసేసిన చాలా థియేటర్లకు బయట మాత్రం వాల్‌పోస్టర్లు ప్రదర్శిస్తూ, ఆడని సినిమాను సైతం శతదినోత్సవ విజయంగా ప్రకటిస్తున్నారు. కొద్దికాలంగా ఇద్దరు, ముగ్గురు అగ్ర హీరోల సినిమాలకు ఎక్కువగా జరుగుతున్నది ఇదే! గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో ఒక సూపర్‌తార అభిమానులు ఆయన ఫ్లాప్ సినిమాలన్నిటికీ ఇలానే శతదినోత్సవాలు చేస్తుంటారు. ఇక, ఒక దివంగత నటుడి సినిమా చిత్తూరు జిల్లా అరగొండలో ఆడింది ఒక్కరోజు ఒకే ఒక్క ఆట అయినా, 100 రోజులు గడిచాక ఈ ఏడాది శతదినోత్సవం చేయడం ఈ పెడ ధోరణికి తాజా పరాకాష్ఠ. అంతెందుకు... ఈ ఏడాదే సంక్రాంతికి రిలీజైన అగ్రతారల చిత్రాలూ తాజాగా ఇదే పద్ధతిలో 200 రోజులంటూ హంగామాగా షీల్డులు అందుకున్నవే! ఒకరు కర్నూలు జిల్లా ఆలూరులో చేస్తే, మరొకరు కృష్ణాజిల్లా అవనిగడ్డలో చేశారు. సెంటర్లు తేడానే తప్ప, మిగతాదంతా సేమ్ టు సేమ్!

నిజానికి, కింది సెంటర్ల నాన్–జీఎస్టీ థియేటర్లు సైతం ప్రతి పెద్ద సినిమానూ దాదాపు రూ. 3 – 4 లక్షల డబ్బు పెడుతూ ప్రదర్శిస్తున్నాయి. ఏటా కనీసం అలాంటి ఆరేడు సినిమాలు ఆడుతూ, 20 లక్షల నాన్–జీఎస్టీ టర్నోవర్ పరిధి దాటి మరీ వార్షిక లాభాలూ గడిస్తున్నాయి. పైకి మాత్రం జీఎస్టీ పరిధిలో లేమంటూ పన్ను ఎగవేస్తున్నాయనేది చిదంబర రహస్యం. చిరు దుకాణాలకు ఊరటగా ప్రభుత్వమిచ్చిన ఈ 20 లక్షల నాన్–జీఎస్టీ రూల్‌ను సినిమా హాళ్ళు మోసానికి వాడుకోవడం దురదృష్టకరం. నిజానికి, ట్యాక్స్ లేని హాళ్ళలో డీసీఆర్ ఉండదు గనక, అక్కడ సినిమా ఆడినా సరే బాక్సాఫీస్ పరిధిలో ఆడనట్టే లెక్క. ఇవాళ ప్రముఖులు ఇళ్ళల్లోనే క్యూబ్ కనెక్షన్లు పెట్టుకొని కొత్త సినిమాలు చూసుకుంటున్న ప్రదర్శనలతో అదీ ఒక రకంగా సమానం. ఇంత చిన్న లాజిక్ మర్చిపోయి, ఒకపక్క అభిమాన హీరోకు లేని రికార్డ్ తేవాలనే వెర్రి ప్రేమతో సామాన్య ఫ్యాన్స్ జేబులో సొమ్ము పోగొట్టుకుంటుంటే... మరోపక్క ప్రభుత్వానికి సినిమాహాళ్ళ పన్ను ఎగవేత సాక్షిగా హీరోలు విజయోత్సవ వేలంవెర్రిలో సాగడం విచారకరం. తెలిసో తెలియకో ఈ తప్పులో భాగమవుతున్న మన పెద్ద హీరోలు ముందు కళ్ళు తెరవాలి. ఈ అవాంఛనీయ వైఖరిని ఇకనైనా సరిచేసుకోవాలి.

చాలామంది గ్రహించని మరొక్క సంగతి – ఉభయ తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 1500కు పైగా థియేటర్లుంటే, ఇవాళ వాటిలో ఏడాదంతా సినిమాలు ప్రదర్శిస్తున్న హాళ్ళు రెండొంతులే! సుమారు 500కు పైగా హాళ్ళు ఏటా కొన్ని నెలలు మూసివేసే ఉంటున్నాయి. ఇటు సక్సెస్‌ఫుల్ సినిమాలూ, అటు కరోనా అనంతర కాలంలో హాళ్ళకు ప్రేక్షకులు రావడమూ తగ్గిపోయాక అదీ వర్తమాన సినీ పరిశ్రమ దుస్థితి. అందుకే, అడ్డగోలు పారితోషికాలు, అవసరం లేని రికార్డులతో బంగారు బాతును ఒకేసారి కోసుకుతినాలని చూస్తే అది యావత్ సినీ పరిశ్రమకే మెగా కష్టం. ఇది పిచ్చుకలు తమ గూటిపై తామే వేస్తున్న బ్రహ్మాస్త్రం. ప్రభుత్వానికి పన్ను ఎగవేతతో లేని హైప్ సృష్టిస్తూ, ఏకంగా పరిశ్రమ నెత్తిన పెడుతున్న భస్మాసుర హస్తం!

– రెంటాల జయదేవ

కృష్ణ భక్తి

'మురారి పదభక్తిః చేత్, తదా మాఘే రతిం కురు' అని సంస్కృతంలో ఒక శ్లేషోక్తి. అంటే ఈ వాక్యానికి రెండు అర్థాలు చెప్పుకోవచ్చు.

మొదటిది, కేవలం సాహిత్య పరమైన అర్థం. 'మురారి మహాకవి కవిత్వంలో పదవిభజన, పద నిర్మాణం ఎలా ఉంటుందో తెలుసుకోవాలంటే, ముందు మాఘ మహాకవి కవిత్వంలో ఆసక్తి చూపు' అని! భక్తి అంటే విభజన, రచన అని కూడా అర్థం.

మురారి ప్రసిద్ధ సంస్కృత కవి. నాటక కర్త. తొమ్మిదో శతాబ్దం వాడు. 'అనర్ఘ రాఘవం' అనే పేరుతో



రామాయణ కథను ఏడంకాల నాటకంగా రచించాడు. ఈయన తన రచనలో తనకు పూర్వీకుడైన మాఘ కవిని అభిమానించి, కొంతవరకు అనుసరించాడంటారు. మాఘుడు సంస్కృత పంచ కావ్యాలలో ఒకటయిన 'శిశుపాల వధ' కావ్యాన్ని రచించిన ఘనుడు. వ్యాకరణ జ్ఞానంలో అఖండుడని పేరు పొందినవాడు. తన కావ్యంలో తరచుగా క్లిష్టమైన పదాలు వాడి, తన వ్యాకరణ వైదుష్యాన్ని ప్రకటిస్తూ ఉంటాడు. మురారి కూడా ఆయన బాటలోనే నడిచాడు. కనక, మురారి వాడిన పద బంధాలను వ్యుత్పత్తులతో చక్కగా విభజించి బాగా అర్థం చేసుకోవాలనుకొనే వారు, ముందుగా మాఘుడి కవిత్వం బాగా అధ్యయనం చేయటం మంచిది అని ఇక్కడ సూచన.

ఈ శ్లేషోక్తికి రెండో అర్థం, 'మురారి (మురాసురుడిని సంహరించిన శత్రువు – శ్రీకృష్ణుడు) మీద నీకు భక్తి ఉంటే, 'మా– అఘే రతిం కురు'– పాప కృత్యాలలో ఎలాంటి ఆసక్తి పెట్టుకోకు' అని. 'నేను కృష్ణ భక్తుడిని. నాకు ఆయన స్వామి' అని ఘడియకు పది సార్లు చెప్పుకొని లాభం లేదు. కృష్ణ భక్తుడు కావాలంటే ముందు ఒక భక్తుడికి ఉండవలసిన ప్రాథమిక లక్షణాలు – సౌశీల్యం, సాత్వికత, ధర్మ ప్రీతి, పాపకర్మల పట్ల వైముఖ్యం– ఇత్యాదులు ఉండాలి. అవి లేకుండా కేవలం స్తోత్రాలు, పూజలు, వ్రతాల వల్ల ఆయన మనకు దగ్గర కాడు. పాపభీతి లేకుండా, దుష్టకర్మలూ, దురాలోచనలూ చేసే వాడికి కృష్ణ భక్తి అబ్బదు. నిర్మలమైన మనసు కలిగి, పాపాలకు దూరంగా ఉన్న వాడే పరమాత్ముడికి దగ్గరవుతాడు.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** శు.పంచమి రా.9.46 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** చిత్త రా.3.38 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** ఉ.10.40 నుండి 12.20 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.27 నుండి 1.17 వరకు, తదుపరి ప.2.58 నుండి 3.49 వరకు, **అమృతఘడియలు:** రా.8.48 నుండి 10.32 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.47, **సూర్యాస్తమయం:** 6.20.

క్లుప్తంగా...

సంబంధం లేని కార్యక్రమాలతో విధులకు గైర్హాజరైతే చర్యలు

- అధికారులకు దేవదాయ శాఖ కమిషనర్ హెచ్చరిక

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖలో జిల్లాల్లో పనిచేసే అధికారులు తమకు సంబంధం లేని కార్యక్రమాల్లో పాల్గొంటూ తరచూ కార్యాలయాలకు గైర్హాజరవుతున్నారని, ఇలా వ్యవహరించేవారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఆదేశాలు జారీచేశారు. క్షేత్రస్థాయిలో కొందరు అధికారుల తీరువల్ల పాలనా వ్యవహారాల్లో అనవసరమైన చిక్కులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. అధికారులు నిబంధనలకు లోబడి పనిచేయాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా పనిచేసే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

దండకారణ్యంలో బూబీ ట్రాప్‌ల స్వాధీనం

చింతూరు: పోలీసులను లక్ష్యంగా చేసుకుని దండకారణ్యంలో మావోయిస్టులు అమర్చిన బూబీ ట్రాప్‌లను చింతూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై రంపచోడవరం ఓఎస్డీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదివారం ఎటపాక పోలీస్ స్టేషన్లో వివరాలు వెల్లడించారు. ఈ నెల 18న ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా చింతూరు మండలం మల్లంపేట అటవీ ప్రాంతంలో పోలీస్ బలగాలు కూంబింగ్ నిమిత్తం వెళ్లాయి. ఈ క్రమంలో పోలీసులను లక్ష్యంగా చేసుకుని అటవీ ప్రాంతంలో రహదారికి ఇరువైపులా అమర్చిన బూబీ ట్రాప్‌లను ఈ బలగాలు గుర్తించాయి. ఏడు బూబీ ట్రాప్‌లను స్వాధీనం చేసుకున్నాయి. వీటితోపాటు మావోయిస్టులకు సంబంధించిన కరపత్రాలు, విప్లవ సాహిత్యం లభ్యమయ్యాయి. త్వరలో ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కూంబింగ్‌కు వచ్చే పోలీసులకు భారీ ప్రాణ నష్టం చేకూర్చాలనేదే మావోయిస్టుల ఉద్దేశం. బూబీ ట్రాప్‌లను కనుగొన్న పోలీసులను ఎస్పీ తుహీన్‌సిన్హా అభినందించారు. ఈ సమావేశంలో చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా పాల్గొన్నారు.

వన్య మృగాల సంచారం సీసీ కెమెరాల్లో నమోదు




కెమెరాలకు చిక్కిన చిరుత, ఎలుగుబంటు

తిరుమల: అలిపిరి–తిరుమల నడక మార్గంలోని ఏడో మైలు, నరసింహస్వామి ఆలయ సమీపంలో చిరుతలు, ఎలుగుబంట్ల సంచారం కొనసాగుతోంది. టీటీడీ అటవీశాఖ ఏడో మైలు వద్ద ఏర్పాటు చేసిన ట్రాప్ సీసీ కెమెరాల్లో శుక్ర, శనివారం అర్ధరాత్రి వేళ ఎలుగు బంటి, రెండు చిరుతలు సంచరించడం నమోదైంది. ఆదివారం సాయంత్రం నరసింహస్వామి ఆలయ సమీపంలో ఎలుగు బంటి సంచారాన్ని గుర్తించారు. అటవీ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు జంతువుల సంచారాన్ని ట్రాప్, సీసీ కెమెరాల ద్వారా గుర్తించి.. అందుకు తగిన విధంగా నడకదారిలో వెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు టీటీడీ అటవీశాఖ డీఎస్‌వో శ్రీనివాసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఏనుగు మృతి

- చిత్తూరు జిల్లా నల్లగుట్లపల్లె అటవీ ప్రాంతంలో ఘటన



బైరెడ్డిపల్లె(చిత్తూరు జిల్లా): విద్యుత్ షాక్‌తో ఏనుగు మృతి చెందిన ఘటన బైరెడ్డిపల్లె మండలం నెల్లిపట్ల పంచాయతీ పరిధిలోని నల్లగుట్లపల్లె అటవీ ప్రాంత సరిహద్దు పొలాల్లో ఆదివారం వెలుగులోకి వచ్చింది. అటవీశాఖ, విద్యుత్‌శాఖ అధికారుల కథనం ప్రకారం... కౌండిన్య అభయారణ్యంలో సుమారు 100కుపైగా ఏనుగులు సంచరిస్తున్నాయి. కౌండిన్య సమీపంలోని నల్లగుట్లపల్లె అటవీ ప్రాంతంలో 14 ఏనుగుల గుంపు తరచూ పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయి. శనివారం రాత్రి ఈ ఏనుగుల గుంపు పంట పొలాల్లోకి చొరబడి విధ్వంసం సృష్టించాయి. తిరిగి అటవీ ప్రాంతంలోకి వెళ్లే సమయంలో నల్లగుట్లపల్లెకు చెందిన శ్రీనివాసులు సాగు చేసిన మల్బరీ తోటలోని విద్యుత్ స్తంభానికి తగలడంతో విద్యుత్ వైర్లు నేలవాలాయి. ఆ విద్యుత్ వైర్లు తగిలి ఓ ఏనుగు అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన ఏనుగులు అక్కడి నుంచి పరారయ్యాయి. ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన శ్రీనివాసులు ఏనుగు మృతి చెందిన విషయం గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఏడీ చిన్నబ్బ, ఎఫ్ఆర్‌వో శివన్న ఏనుగు కళేబరాన్ని పరిశీలించారు. ఏనుగుకు తిరుపతి జూ పార్కుకు వైద్యాధికారి తాయిబాసింగ్ పోస్టుమార్టం నిర్వహించారు.

నేడు ఏపీఎన్జీవోల రాష్ట్ర మహా సభ

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండి శ్రీనివాసరావు, కేవీ శివారెడ్డి ఉద్యోగులను కోరారు. మహా సభలు జరిగే విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం ఏర్పాట్లు పరిశీలించిన అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. 73 సంవత్సరాలు పైబడి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల సాధనే పరమావధిగా ఎన్జీవో సంఘం పనిచేస్తోందన్నారు.

ఆడుతూ, పాడుతూ 'అమ్మ'



నొప్పి లేకుండా సుఖ ప్రసవం

- ఎపిడ్యూరల్‌తో సాధ్యమే
- అనవసర సిజేరియన్లకు చెక్
- నిపుణుడైన అనెస్థీసియాలజిస్ట్ ఉంటే చాలు
- అభివృద్ధి చెందిన దేశాల్లో ఇదే విధానం
- ప్రోత్సహించాలంటున్న డబ్ల్యూహెచ్‌వో
- మన దేశంలోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో అందుబాటు
- సినీ నటుడు రామ్‌చరణ్ భార్య ఉపాసన ఇలాగే..

వీఏవీ రంగాచార్యులు, సాక్షి సెంట్రల్ డెస్క్

మాతృత్వంలోని కమ్మదనం గురించి 'అమ్మ'కు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదు. అయితే బిడ్డకు జన్మనిచ్చి తల్లి అవ్వడం అనేది ఆ 'అమ్మ'కు పునర్జన్మేనని చెప్పవచ్చు. అంటే ఓ మహిళ గర్భం దాల్చి.. తొమ్మిది నెలలపాటు శిశువును మోయడం ఒక ఎత్తు అయితే, ఆ బిడ్డను బాహ్య ప్రపంచంలోకి తీసుకురావడం మరోఎత్తు. ఈ క్రమంలో ఆ చివరి రోజు ఆ మహిళ పడే కష్టం, బాధ వర్ణనాతీతం. ఈ బాధ భరించలేక చాలా మంది సిజేరియన్ (ఆపరేషన్ చేసి బిడ్డను బయటకు తీయడం) చేయించుకోవడానికే మొగ్గు చూపుతుంటారు. ప్రైవేట్ ఆస్పత్రులు కూడా ఎక్కువ ఫీజు వస్తుందని మారు మాట్లాడకుండా ఇదే విధానాన్ని కొనసాగిస్తున్నాయి. ఇది సరికాదని, ఇతరత్రా ఎలాంటి సమస్యలు లేకపోతే నార్మల్ డెలివరీ చేయడానికే ప్రాధాన్యత ఇవ్వాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) గట్టిగా చెబుతోంది. దీంతో చాలా వరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో, పీహెచ్‌సీల్లో నార్మల్ డెలివరీకే అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. రిస్క్ తీసుకోవడానికి ప్రైవేట్ ఆస్పత్రులు సిద్ధంగా లేనందున అనవసర సిజేరియన్లు కొనసాగుతూనే ఉన్నాయి. వీటికి అడ్డుకట్ట వేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ కసరత్తు చేస్తూనే ఉంది.

ఎపిడ్యూరల్ విధానం ఒక వరం

అభివృద్ధి చెందిన దేశాల్లో, మన దేశంలో ఎగువ మధ్య తరగతి, ధనికులు ఇప్పుడిప్పుడే ఈ విధానం ద్వారా సుఖ ప్రసవం అయ్యేలా దృష్టి సారిస్తున్నారు. ఎపిడ్యూరల్ అంటే ఇదొక రకమైన అనస్థీషియా. మామూలుగా శరీరంలో ఒక భాగానికి నొప్పి తెలియకుండా ఉండేందుకు స్పైన్ (వెన్ను)కు మత్తు మందు ఇచ్చినప్పుడు ఆ భాగం నుంచి మెదడుకు నొప్పి సంకేతాలు వెళ్లవు. అదే సమయంలో మెదడు నుంచి మోటార్ సిగ్నల్స్ రావు. అప్పుడు ఆ భాగానికి సంబంధించి కండరాలు వదులవుతాయి. సిజేరియన్ కోసమైతే ఇలా చేయాలి. నొప్పి తెలియకుండా నార్మల్ డెలివరీ చేయాలంటే ఇందులో ఒకదాన్ని ఆపి, మరొకదాన్ని పని చేయించాలి.

వైద్యులతో ముందే చర్చించాలి

కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులకు ప్రసవం కోసం వచ్చే వారిలో చాలా మంది నొప్పి తట్టుకోలేక సిజేరియన్ చేసేయండని అడుగుతున్నారని, ఇలాంటి సమయంలో ఎపిడ్యూరల్ విధానం పాటించాలని డబ్ల్యూహెచ్‌వో సూచిస్తోంది. ఈ విధానానికి నిపుణుడైన అనెస్థీషియాలజిస్ట్ మాత్రమే అదనంగా అవసరం. అందువల్ల దాదాపు సిజేరియన్‌కు అయ్యే ఖర్చే అవుతుంది. ఇప్పటికే ఈ విధానం గురించి తెలిసిన వారు చాలా కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యులతో ముందుగానే చర్చించి తగిన శ్రద్ధ తీసుకుంటున్నారు. వారి సూచనల మేరకు నిత్యం వ్యాయామం చేస్తూ ఆడుతూ, పాడుతూ గడుపుతున్నారు. పురుటి నొప్పులు మొదలవుతాయనడానికి ముందుగానే ఆస్పత్రిలో చేరుతున్నారు. వీరికి యాక్టివ్ లేబర్ కంటే (తీవ్రమైన నొప్పులు) ముందు నుంచే పెల్విక్ (కండరాలు వదులయ్యేలా) ఎక్సర్‌సైజ్‌లు చేయిస్తారు. ఆ సమయంలో వేడి నీళ్లలో తడిపిన టవల్ ద్వారా ఒత్తిడి తేవడం, కొన్ని ఎక్సర్‌సైజ్‌ల ద్వారా సుఖ ప్రసవం అయ్యేలా చూస్తారు. ఇటీవల సినీ నటుడు రామ్‌చరణ్ సతీమణి ఉపాసన ఈ విధానంలోనే బిడ్డకు జన్మనివ్వడం గమనార్హం. కొన్ని ఆస్పత్రుల్లో ఐవీ అనాల్జీషియా, ఎంటొనాక్స్ (మాస్క్ ద్వారా గ్యాస్ ఇవ్వడం) తదితర పద్ధతుల్లో కూడా నొప్పి లేకుండా ప్రసవాలు చేస్తున్నప్పటికీ ఎపిడ్యూరల్ మాత్రమే ఎక్కువగా ప్రాచుర్యంలో ఉంది. సిజేరియన్ కంటే ఇదే మేలు కాబట్టి, దీని గురించి అందరికీ తెలియాలని డబ్ల్యూహెచ్‌వో కోరుకుంటోంది.

స్పైన్ పై భాగంలోనే మత్తు

స్పైన్‌లోపలికి కాకుండా పై భాగంలో ఉన్న పొరలోకి మత్తు మందును తక్కువ మోతాదులో ఇంజెక్ట్ చేస్తారు. ఇలా చేస్తే అనాల్జీషియా (నొప్పి లేకపోవడం) మాత్రమే పని చేస్తుంది. అంటే మెదడుకు ఆ భాగం నుంచి నొప్పి సంకేతాలు వెళ్లనందున నొప్పి తెలియదు. మెదడు నుంచి యథావిధిగా మోటార్ సిగ్నల్స్ వస్తూనే ఉంటాయి. అందువల్ల ఆ భాగంలో కండరాలు యథావిధిగా పని చేస్తాయి. దీంతో గర్భసంచి చుట్టూ ఒత్తిడి పెరిగి, కొద్ది కొద్దిగా బేబీ బయటకు వస్తుంది. ఇందుకోసం సర్జరీలకు వాడేంత డోస్ కాకుండా తక్కువ డోసులో మత్తు మందు వాడతారు. అన్ని అనెస్థీషియాల్లాగే దీనికీ కొంత సైడ్ ఎఫెక్ట్ ఉన్నప్పటికీ సిజేరియన్ చేయాల్సిన పరిస్థితి రాదు. మామూలుగా కంటే ఓ గంట సమయం ఎక్కువ పడుతుంది.

మంచి బెనిఫిట్ ఉంటుంది



ఎపిడ్యూరల్ వల్ల మంచి ఫలితం ఉంటుంది. పెయిన్‌ను బాగా తగ్గించవచ్చు. బెనిఫిట్ చాలా బావుంటుంది. చాలా దేశాల్లో ఇప్పుడు ఇదే విధానం కొనసాగుతోంది. పూర్వపు రోజుల్లో ఈ విధానం పట్ల మన దేశంలో కొంత అపోహ ఉండేది. ఇప్పుడు విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం పెరగడం వల్ల ఆ అపోహలు తొలగిపోయాయి. లేబర్‌లో మూడు దశలు ఉంటాయి. రెండవ దశ నుంచి ఇది స్టార్ట్ చేయాలి. కొంచెం బీపీ తగ్గిపోయే అవకాశం ఉంటుంది. అంతకు మించి పెద్ద సమస్యలు ఉత్పన్నం కావు. కాకపోతే తొమ్మిదవ నెల నుంచే గర్భిణిని ఇందుకు సమాయత్తం చేయాల్సి ఉంటుంది. ఈ విధానంపై కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో పరిశోధన కొనసాగుతోంది. ఇందుకు సంబంధించి పీజీ అనెస్థీసియా విద్యార్థులు పలు పేపర్లు కూడా ప్రెజెంట్ చేశారు. యువతులకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఖర్చు కూడా తక్కువే. ప్రస్తుతం కార్పొరేట్ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంది. గర్భిణికి అవగాహన ఉండి కోరితేనే చేస్తున్నారు.

– ఎస్.మాణిక్యరావు, గైనకాలజీ హెచ్ఓడీ, కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రి

రాష్ట్రానికి శనిలా చంద్రబాబు, లోకేశ్, పవన్

- బహుజన పరిరక్షణ సమితి నేతల ధ్వజం
- 1,057వ రోజుకు చేరిన రిలే దీక్షలు



రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ : అధికార దాహంతో చంద్రబాబు ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియడం లేదని, ఆయనలో పిచ్చి పరాకాష్టకు చేరిందని బహుజన పరిరక్షణ సమితి నేతలు ఎద్దేవా చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1057వ రోజుకు చేరాయి. శిబిరాన్ని పలువురు ముఖ్య అతిథులు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెప్పుకొనేందుకు ఏమీ లేకపోవడంతో అన్నీ తానే కనిపెట్టానని చెప్పడాన్ని చూసి జనం నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఏపీకి శనిలా చంద్రబాబు, లోకేశ్, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌లు దాపురించారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పేదలు ఎప్పటికీ నిరుపేదలుగా ఉండాలన్నది బాబు దుర్మార్గపు ఆలోచన అని, అందుకే 14 ఏళ్లు సీఎంగా ఉన్నా పేదవాడికి ఎలాంటి మేలూ చేయలేదన్నారు. అమరావతి పేరుతో ఈ ప్రాంతంలో ఒక్క పేదవాడు కూడా లేకుండా చేయాలన్నది చంద్రబాబు దారుణమైన ఆలోచన అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిని కొందరి రాజధానిగా మార్చాలని చంద్రబాబు పడ్డ తాపత్రయం కారణంగానే ఈ ప్రాంతం వెనుకబాటుతనానికి గురైందన్నారు. తాత్కాలిక భవనాలు నిర్మించి చంద్రబాబు అండ్ కో రూ.3.50 లక్షల కోట్లు దోపిడీ చేశారని ఆరోపించారు. కరోనా సమయంలో పక్క రాష్ట్రంలో దాక్కుని ఒక్క పేదవాడిని కూడా ఆదుకోని బాబు, లోకేశ్, పవన్‌లు ఇప్పుడు రాష్ట్రం మీద పడి తిరుగుతుండటం దేనికి నిదర్శనమో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు పెరికే వరప్రసాద్, పల్లె బాబు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

తల్లి కర్మకాండలకు వెళ్లొస్తూ..

- కొడుకు, అతని కుమారుడు, అత్త దుర్మరణం
- భార్య, కుమార్తెకు తీవ్రగాయాలు
- వైఎస్సార్ జిల్లా చెన్నూరులో ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో ప్రమాదం
- ఒకే కుటుంబానికి చెందిన వీరంతా హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ వాసులు



ప్రమాదంలో నుజ్జునుజ్జుగా మారిన కారు



కృష్ణ, పద్మావతి, రిషి మృతదేహాలు

చెన్నూరు: తల్లి కర్మకాండలకు వెళ్లి తిరిగి వస్తూ కొడుకు, అతని కుమారుడు, అత్త దుర్మరణం చెందగా, భార్య, కుమార్తె తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలైన ఘటన వైఎస్సార్ జిల్లా చెన్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కడప–కర్నూలు జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... తెలంగాణ రాష్ట్రం ఖైరతాబాద్ ప్రాంతంలో నివాసం ఉండే కొండేటి కృష్ణ (48) తన తల్లి కర్మకాండల నిమిత్తం భార్య విజయరాణి, కుమార్తె నిహారిక, కుమారుడు రిషి(15), అత్త అన్నే పద్మావతితో కలిసి తిరుపతి వెళ్లారు. కర్మకాండల కార్యక్రమం పూర్తి చేసుకుని తిరిగి తన కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. చెన్నూరు ఆంధ్ర స్ప్రెస్ సమీపానికి రాగానే ఒక్కసారిగా కారు అదుపు తప్పి వేగంగా వెళ్లి ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణ, పద్మావతి, రిషి అక్కడికక్కడే మృతి చెందగా, విజయరాణి, నిహారికలు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న చెన్నూరు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన నిహారిక

రత్నగిరీశునికి ముత్యాల వస్త్రం

- రూ.8 లక్షల వ్యయంతో సత్యదేవునికి ముత్తంగి తయారీ
- సమర్పించనున్న దేవస్థానం పురోహిత సంఘం

అన్నవరం: దేవతామూర్తులకు బంగారు, వజ్ర, వైఢూర్యాలతో ఆభరణాలు తయారుచేసి భక్తితో అలంకరించి తరిస్తుంటాం. అలాగే మంచి ముత్యాలతో నఖశిఖ పర్యంతం ఉండే ఒక ముత్యాల వస్త్రం (ముత్తంగి) అలంకరించడం కూడా పలు దేవాలయాల్లో ఆనవాయితీగా వస్తోంది. శ్రీరంగంలో శ్రీరంగనాథుడు, తిరుమల బ్రహ్మోత్సవాల్లో మలయప్పస్వామి, భద్రాద్రిలో సీతారాములు ముత్తంగి అలంకరణలో దర్శనమిస్తూ ఉంటారు. అన్నవరం పుణ్యక్షేత్రంలో శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారు, దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి, ఈశ్వరుడు కార్తీకమాసం నుంచి ముత్తంగి అలంకరణలో దర్శనమివ్వనున్నారు. దీని తయారీకి అయ్యే ఖర్చు రూ.8 లక్షలు సమకూర్చేందుకు దేవస్థానం వ్రత పురోహిత సంఘం ముందుకు వచ్చింది.

ప్రాచీన కళను కాపాడుతూ..

ముత్తంగి తయారీ ప్రాచీనమైన కళ. దీన్ని హైదరాబాద్‌కు చెందిన సుధీర్ చరణ్ కుటుంబం వంశపారంపర్యంగా కాపాడుతూ వస్తోంది. తమిళనాడులోని శ్రీరంగంలో సుమారు 12 అడుగుల పొడవున పవళించి ఉండే శ్రీరంగనాథునికి 17వ శతాబ్దంలో నాయకర్ రాజులు ముత్తంగి తయారు చేయించి అలంకరించారు. వందేళ్ల తరువాత వన్నె తగ్గడంతో దాన్ని తీసి భద్రపరిచారని సుధీర్ చరణ్ 'సాక్షి'కి చెప్పారు. తరువాత 1932లో చెన్నైకి చెందిన ఆయన ముత్తాత కృష్ణాజీని శ్రీరంగం దేవస్థానం ప్రతినిధులు సంప్రదించి, భద్రపరిచిన ముత్తంగిని మళ్లీ ముత్యాలు, వజ్రాలు, కెంపులతో తయారు చేయించి శ్రీరంగనాథునికి అలంకరించారు.



భద్రాచలంలో స్వామివారి విగ్రహాలకు రూపొందించిన ముత్తంగి అలంకరణలతో సుధీర్ చరణ్, ప్రియాంక దంపతులు

ఎలా తయారు చేస్తారంటే..

ముత్తంగి తయారీ చాలా శ్రమ, నైపుణ్యం, ఏకాగ్రతతో కూడిన కళ. ఇందుకు అవసరమయ్యే ముత్యాల వ్యయం తక్కువే అయినప్పటికీ వాటిని వస్త్రంగా తయారు చేయడానికి నెలల తరబడి కష్టపడాల్సి ఉంటుంది. శిరస్సు దగ్గర నుంచి పాదాల వేళ్ల వరకూ దేవతామూర్తుల కొలతలు తీసుకుని, ముందుగా వెండి లేదా రాగి రేకుతో వస్త్రంలా తయారు చేసి, దానికి వివిధ సైజుల్లో ముత్యాలు అతికిస్తారు. వీటి మధ్యలో ఎటువంటి ఖాళీ ఉండదు. కేవలం స్వామి, అమ్మవార్ల ముఖాలు మాత్రమే కనిపిస్తాయి. మిగిలిన భాగమంతా మంచిముత్యాలే కనిపిస్తాయి.

సత్యదేవునికీ ముత్తంగి సేవ

సత్యదేవుడు, అమ్మవారు, శంకరులకు ప్రతి సోమవారం ముత్తంగి అలంకరించి, ప్రత్యేక పూజలు చేయించాలని నిర్ణయించాం. దీనికి దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ కూడా అంగీకరించారు. దాతల ద్వారా ముత్తంగి చేయించాలనుకున్నాం. అదే సమయంలో వ్రతపురోహిత సంఘం ముందుకు వచ్చింది.

– ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్, ఈవో, అన్నవరం దేవస్థానం

పాడేరులో బస్సు ప్రమాదం

▶ మొదటి పేజీ తరువాయి

మంత్రి పరామర్శించారు. అత్యవసర వైద్యం అవసరమైతే విశాఖ కేజీహెచ్ లేదా కార్పొరేట్ ఆస్పత్రులకు తరలించాలని, క్షతగాత్రులు పూర్తిగా కోలుకునే వరకు వైద్య సాయం అందించాలని స్పష్టం చేశారు. పాడేరు ఘాట్‌లో ప్రమాదాలు నివారించేందుకు రవాణ శాఖ అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపిస్తామన్నారు.

ఎలా జరిగింది..?

మధ్యాహ్నం 12 గంటల సమయంలో విశాఖ కాంప్లెక్స్ నుంచి ఆర్టీసీ బస్సు(ఏపీ 31జెడ్ 0285) పాడేరుకు బయలుదేరింది. ఈ క్రమంలో చోడవరంలో కొంతమంది ప్రయాణికులు ఎక్కారు. మొత్తం 34 మంది ప్రయాణికులతో బస్సు వెళుతోంది. పాడేరుకు 12 కిలోమీటర్ల దూరంలో ఘాట్‌లోని వ్యూపాయింట్ వద్ద మలుపులో రోడ్డు పక్కన చెట్టు కొమ్మలను తప్పించే ప్రయత్నంలో బస్సు అదుపు తప్పింది. రక్షణ గోడను ఢీకొట్టి వందడుగుల లోయలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం సూర్రెడ్డిపాలెంకు చెందిన నరవ నారాయణమ్మ(50), అల్లూరి జిల్లా పాడేరు మండలం జి.కొత్తూరు గ్రామానికి చెందిన గిరిజనుడు సీసా కొండన్న(55) తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాద ఘటనను ప్రత్యక్షంగా చూసిన ద్విచక్రవాహనదారులు గడ్డంగి రమేష్, ఆనంద్, కారులో వెళ్తున్న టి.శేషగిరి లోయలోకి దిగి బాధితులను కాపాడారు. గాయాలపాలైన వారిని రోడ్డుపైకి మోసుకొచ్చి 108 సాయంతో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. లోయలో బస్సు కింద పడి ఉన్న మృతదేహాలను బయటకు తీసేందుకు సీఐ సుధాకర్, ఎస్ఐ రంజిత్, స్థానికులంతా ఎంతో శ్రమించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా ఆస్పత్రిని సందర్శించి బాధితులను పరామర్శించారు.



సీస కొండన్న, నరవ నారాయణమ్మ మృతదేహాలు

మెడికవర్‌కు తరలింపు

క్షతగాత్రుల్లో కొందరిని మెరుగైన వైద్యం కోసం రాత్రి విశాఖలోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో రోలుగుంట మండలం యర్రవరం గ్రామానికి చెందిన ఒకే కుటుంబ సభ్యులు కిల్లో బోడిరాజు (39), బొట్ట చిన్నమ్ములు (48), బొట్ట దుర్గాభవాని (14), బొట్ట రామన్న (14), సామర్ల బాబురావు (50) ఉన్నారు. ఐసీయూకి తరలించి చికిత్స అందిస్తున్నారు. చిన్నమ్ములుకు తీవ్రగాయాలైనట్లు వైద్యులు వెల్లడించారు. ఆమె తలకు బలమైన గాయం కావడంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు.

క్షతగాత్రులలో కొందరి వివరాలు..

అల్లూరి జిల్లా చింతపల్లి మండలం కోటగున్నలకు చెందిన పాంగి సింహాద్రి, హుకుంపేట మండలం ఇసుకగరువుకు చెందిన వంతాల కోటిబాబు, అడ్డుమండకు చెందిన వంచంగిబోయిన రవిబాబు, పాడేరు మండలం దిగుమోదాపుట్టుకు చెందిన కిరసాని వెంకటేష్, కించూరు పంచాయతీ దోనెలకు చెందిన కోడా పద్మ, కిండంగి గ్రామానికి చెందిన జంబు మాధవి, డోకులూరు పంచాయతీ మండిపుట్టుకు చెందిన బోయిన నాగేశ్వరరావు, గెడ్డంపుట్టుకు చెందిన చల్లా పెంటమ్మ, జి.మాడుగుల మండలం గెమ్మెలి పంచాయతీకి చెందిన పి.చిట్టిబాబు, అనకాపల్లి జిల్లా వి.మాడుగుల మండలం లోవ కృష్ణాపురం గ్రామానికి చెందిన కిముడు సత్తిబాబు, చింతపల్లి మండలం కోటగున్నల గ్రామానికి చెందిన పాంగి సింహాద్రి, గెమ్మెలి నగేష్, హుకుంపేట మండలం రంగశీల పంచాయతీ ఒంటిపాకకు చెందిన బంటు రఘునాథ్, అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం సూర్రెడ్డిపాలేనికి చెందిన నరవ ఈశ్వరరావు, నాతవరం మండలం యర్రవరంలోని ఒకే కుటుంబానికి చెందిన బొట్టా చిన్నమ్ములు, బొట్టా నర్సింహమూర్తి, బొట్టా దుర్గాభవాని, బొట్టా రమణ, ముంచంగిపుట్టు మండలం సానియాపుట్టుకు చెందిన కిల్లో బొడినేష్, హుకుంపేట మండలం భీమవరం పంచాయతీ గంగరాజుపుట్టు గ్రామానికి చెందిన కొర్రా బొంజుబాబు, ముంచంగిపుట్టు మండలం కిలగాడకు చెందిన సమల లక్ష్మీకాంత్.


చెట్టు కొమ్మను తప్పించబోయి..



ఘాట్‌లో బస్సును నెమ్మదిగా నడుపుతున్నా. మలుపులో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న చెట్టు కొమ్మను తప్పించబోయే క్రమంలో బస్సు అదుపు తప్పింది. అదే సమయంలో ఓ బైక్ ఎదురుగా రావడంతో బస్సు లోయలోకి దూసుకుపోయింది. చెట్టు అడ్డుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దిగువ రోడ్డులో బస్సు బోల్తా కొట్టి ఉంటే ప్రాణనష్టం అధికంగా ఉండేది. ఇద్దరు ప్రయాణికులు మృతి చెందడం, అనేకమంది గాయపడడం ఎంతో బాధగా ఉంది.

–కిముడు సత్తిబాబు, బస్సు డ్రైవర్


మనవడు, మనవరాలిని చూసేందుకు వెళ్లి..



నారాయణమ్మ(ఫైల్)

బస్సు ప్రమాదంలో అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం సూరెడ్డిపాలేనికి చెందిన నారాయణమ్మ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. అనారోగ్యంతో ఉన్న తమ మనవడు, మనవరాలిని చూసేందుకు ఈశ్వరరావు, నారాయణమ్మ దంపతులు ఉదయం సబ్బవరం వద్ద బస్సు ఎక్కారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కోడలికి ఫోన్ చేసి దారిలో ఉన్నట్లు చెప్పారు. అంతలో ప్రమాదం జరగడంతో నారాయణమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. కళ్ల ముందే భార్య చనిపోవడంతో ఈశ్వరరావు గుండెలవిసేలా రోదించారు. ఆయనకు స్వల్ప గాయాలు కావడంతో పాడేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

ఆ చిన్నారి మృత్యుంజయురాలు..



పాడేరు ఘాట్‌లో జరిగిన బస్సు ప్రమాదంలో నెలల వయసున్న ఓ శిశువు సురక్షితంగా బయటపడింది. డుంబ్రిగుడ మండలం తూటంగి గ్రామానికి చెందిన తాంగుల జ్యోతి, సత్యనారాయణ దంపతులకు నాలుగు నెలల క్రితం శిశువు జన్మించింది. ప్రస్తుతం వీరు విశాఖలో ఉంటున్నారు. పాడేరు మండలం పి.గొందూరులో తమ బంధువుల ఇంటికి వచ్చేందుకు విశాఖలో బస్సెక్కారు. ప్రమాదంలో తల్లి జ్యోతి తన బిడ్డకు ఎలాంటి గాయాలు కాకుండా కాపాడుకుంది. ఆమె తలకు మాత్రం తీవ్ర గాయమైంది.

సముద్రంలో తల్లి, ఇద్దరు బిడ్డల గల్లంతు

- భార్యాబిడ్డలతో కలిసి సముద్ర మార్గంలో అత్తారింటికి వెళ్తుండగా దుర్ఘటన
- నిజాంపట్నం హార్బర్ సమీపంలో మునిగిపోయిన తెప్ప
- మత్స్యకారుల సాయంతో ఒడ్డుకు చేరుకున్న తండ్రి



గల్లంతైన సాయివర్ణిక, తన్విష్‌కుమార్, తరుణేష్ (ఫైల్)

నాగాయలంక/నిజాంపట్నం: భార్యాబిడ్డలతో కలిసి సముద్ర మార్గంలో తెప్ప (నాటు పడవ)పై అత్తారింటికి బయలుదేరిన ఓ కుటుంబం ప్రమాదం బారినపడింది. తెప్ప బోల్తా కొట్టడంతో తల్లి, ఇద్దరు చిన్నారులు గల్లంతవగా.. తండ్రి మరో బోటులో ఒడ్డుకు చేరుకున్నాడు. బాపట్ల జిల్లా నిజాంపట్నం హార్బర్ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఈలచెట్లదిబ్బ గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ సోంబాబు భార్య సాయివర్ణిక, కుమారులు తన్విష్‌కుమార్ (8), తరుణేష్ (11 నెలలు)తో కలిసి ఆదివారం ఉదయం 10.30 సమయంలో సముద్ర మార్గంలో తెప్ప (చిన్నపాటి మోటారుతో కూడిన బోటు)పై బాపట్ల జిల్లా నిజాంపట్నంలోని అత్తారింటికి బయలుదేరాడు. సోంబాబు కుటుంబం తరచూ ఇదే విధంగా నిజాంపట్నం వెళ్తుంటుంది. మార్గం మధ్యలో చేపల్ని వేటాడుతున్న తరుణంలో వారు ప్రయాణిస్తున్న తెప్ప ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో హార్బర్ సమీపంలో సముద్ర అలల తాకిడికి బోల్తా కొట్టింది. భార్య సాయివర్ణిక, ఇద్దరు కుమారులు సముద్రంలో గల్లంతవగా.. సోంబాబును సముద్రంలో చేపల వేట చేస్తున్న మత్స్యకారులు రక్షించి ఒడ్డుకు చేర్చారు. గల్లంతైన ముగ్గురి కోసం మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు గాలిస్తున్నారు. నిజాంపట్నం ఎస్ఐ రమేష్, మెరైన్ ఎస్ఐ కాటూరి శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. భార్యాబిడ్డలు గల్లంతవడంతో సోంబాబు భోరుమంటున్నాడు. ఈ ఘటనతో ఈలచెట్లదిబ్బ గ్రామంలో విషాదం నెలకొంది.



వివరాలు వెల్లడిస్తున్న సోంబాబు

క్లుప్తంగా...



కూలిన డీఆర్‌డీవో డ్రోన్

సాక్షి, బళ్లారి: కర్ణాటకలోని చిత్రదుర్గం జిల్లా హిరియూరు తాలూకా వద్దికెరె గ్రామం సమీపంలో తపస్07 ఎ–14 రకం డ్రోన్ కుప్పకూలింది. చిత్రదుర్గం వద్ద డీఆర్‌డీఓ ఏరోనాటికల్ టెస్టింగ్ రేంజ్ (ఏటీఆర్) ఉంది. నిత్యం ఇక్కడ డ్రోన్లు, మానవ రహిత విమానాల పరీక్షలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ఈ డ్రోన్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షిస్తుండగా చెళ్లకెర తాలూకా హిరియూరు వద్ద పొలంలో పెద్ద శబ్దంతో కుప్పకూలింది. దాని భాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదు. డీఆర్‌డీవో అధికారులు, పోలీసులు ధ్వంసమైన డ్రోన్‌ను అక్కడి నుంచి తరలించారు. సాంకేతిక లోపంతోనే అది కూలిందని, విచారణ జరుపుతున్నామని డీఆర్‌డీవో అధికారులు చెప్పారు.

పాకిస్తాన్‌లో రోడ్డు ప్రమాదం

18 మంది సజీవ దహనం



లాహోర్: పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దాదాపు 40 మంది ప్రయాణికులతో కరాచీ నుంచి ఇస్లామాబాద్ వెళ్తున్న ఓ బస్సు తన ముందున్న వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ వ్యాన్‌లో ఇంధన ట్యాంక్ ఉంది. దీంతో రెండు వాహనాలు వెంటనే నిప్పంటుకున్నాయి. ఈ ఘటనలో బస్సులోని పలువురు మహిళలు, చిన్నారులు సహా 18 మంది ప్రయాణికులు దుర్మరణం పాలయ్యారు. మరో 16 మంది గాయపడ్డారు. కొందరు బస్సు నుంచి బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటలకు లాహోర్‌కు 140 కిలోమీటర్ల దూరంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. కొందరు క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉందని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు పోలీసులు చెప్పారు. రోడ్డు ప్రమాదంలో 18 మంది ప్రయాణికులు మృతిచెందడం పట్ల పంజాబ్ ముఖ్యమంత్రి మొహిసిన్ నక్వీ విచారం వ్యక్తం చేశారు.

ఒక ఉపగ్రహం కూలిన వేళ

చంద్రయాన్ -2 వైఫల్యానికి ముందే ఇస్రో ఖాతాలో ఓ క్రాష్ ల్యాండింగ్

నేటి చంద్ర యాత్రలకు బాటలు వేసిన చంద్రయాన్ 'వైఫల్యం'

ఫ్లాష్ బ్యాక్

కొన్నేళ్ల క్రితం చంద్రయాన్–2ను భారత అంతరిక్ష సంస్థ ఇస్రో చందమామ మీద నేలకూల్చిన సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఇలా ఇస్రో నేలకూల్చిన శాటిలైట్లలో అదే మొదటిది కాదు. చంద్రయాన్ 1ను పదేళ్ల క్రితమే ఉద్దేశపూర్వకంగా క్రాష్ చేసింది.



అది 2008. నవంబర్ 14. మధ్యాహ్న వేళ. ఉక్కపోత చుక్కలు చూపుతోంది. గుజరాత్‌లోని రాజ్‌కోట్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం. టీమ్‌ఇండియా స్టార్ బ్యాట్స్‌మన్ యువరాజ్ సింగ్ శివాలెత్తుతున్నాడు. మహా మహా ఇంగ్లండ్ పేస్ బౌలర్లను వీర బాదుడు బాదుతున్నాడు. కేవలం 78 బంతుల్లో అతను చేసిన 138 పరుగుల సాయంతో భారత్ మరపురాని విజయం సాధించింది. దేశమంతా సంబరాల్లో మునిగి పోయింది. కానీ, అదే సమయంలో అక్కడికి 1,600 కిలోమీటర్ల దూరంలోని బెంగళూరులో పరిస్థితి మరోలా ఉంది. మరో దారిలేని పరిస్థితుల్లో, ఒక మినీ విస్ఫోటనానికి ఇస్రో భారంగా సిద్ధమవుతోంది. ఎందుకా విస్ఫోటనం? ఏమా కథ? అసలేం జరిగింది? చూద్దాం రండి...!

2008 అక్టోబర్ 22న చంద్రయాన్ మిషన్ ప్రయోగానికి ఇస్రో సిద్ధమైంది. భూ కక్ష్యకు ఆవలికి శాటిలైట్‌ను పంపడం భారత్‌కు అదే తొలిసారి. అప్పటిదాకా రష్యా, అమెరికా, జపాన్, యూరప్ స్పేస్ ఏజెన్సీల పేరిట ఉన్న ఘనత అది. చంద్రునిపై నీటి ఆనవాళ్లను తొలిసారిగా ప్రపంచానికి పట్టిచ్చిన ప్రయోగంగా చంద్రయాన్ చరిత్రలో నిలిచిపోయింది. అయితే అందరికీ తెలిసిన ఈ ఘనత వెనక బయటికి తెలియని మరో గాథ దాగుంది...

ప్రోబ్... కూలేందుకే ఎగిరింది

చంద్రయాన్ లో భాగంగా 32 కిలోల బరువున్న మూన్ ఇంపాక్ట్ ప్రోబ్‌ను చంద్రునిపైకి పంపింది ఇస్రో.

- 2008 నవంబర్ 17వ తేదీ రాత్రి 8 గంటల వేళ ఇంపాక్ట్ ప్రోబ్‌ను చంద్రుని ఉపరితలం మీద కావాలనే కుప్పకూల్చేందుకు సిద్ధమైంది.
- అందులో భాగంగా చంద్రునికి దాదాపు 100 కిలోమీటర్ల ఎత్తు నుంచి ప్రోబ్ తన అంతిమ ప్రయాణానికి సిద్ధమైంది.
- చంద్రయాన్ కక్ష్య నుంచి క్రమంగా విడివడటం మొదలు పెట్టింది.
- దానిలోని స్పినప్ రాకెట్లు జీవం పోసుకుని గర్జించాయి. అయితే, ప్రోబ్ వేగాన్ని పెంచేందుకు కాదు, వీలైనంత తగ్గించేందుకు! చంద్రుని ఉపరితలం కేసి తిప్పి అనుకున్న విధంగా క్రాష్ చేసేందుకు!!
- ఎట్టకేలకు, చంద్రయాన్ మిషన్ నుంచి విడివడి అరగంటకు క్రాష్ ల్యాండ్ అయింది. ప్రోబ్ కథ అలా కంచికి చేరింది.
- తద్వారా, అంతదాకా అందరాని చందమామతో తొలిసారిగా కరచాలనం చేసి ఇస్రో కొత్త చరిత్ర సృష్టించింది.

ఆ మూడింటి ముచ్చట్లు

ప్రోబ్ లో మూడు పరికరాలను ఇస్రో పంపింది. అవి ఫొటోలు, వీడియోలు తీసి భూమికి పంపే వీడియో ఇమేజింగ్ సిస్టం, ప్రోబ్ చంద్రునిపైకి పడ్డ వేగాన్ని కొలిచేందుకు రాడార్ ఆల్టిమీటర్, చంద్రుని వాతావరణాన్ని విశ్లేషించేందుకు మాస్ స్పెక్ట్రం మీటర్.

భావికి బాటలు...

కూల్చేయడమే అంతిమ లక్ష్యంగా ఇస్రో ప్రయోగించిన 'విఫల' చంద్రయాన్ మిషన్ తర్వాతి రోజుల్లో చంద్రయాన్–2, చంద్రయాన్ –3 ప్రయోగాలకు బాటలు వేసింది. ఆగస్టు 23న చంద్రునిపై సగర్వంగా దిగి చంద్రయాన్–3 సాధించబోయే అంతిమ విజయం కోసం దేశమంతా ఇప్పుడు ఎదురు చూసేందుకు మూల కారణంగా నిలిచింది...!

– సాక్షి, నేషనల్ డెస్క్

లూనా–25 ప్రయోగం విఫలం

చంద్రుడి ఉపరితలాన్ని ఢీకొట్టి పేలిపోయిన రష్యా ల్యాండర్

మాస్కో: చందమామపై పరిశోధనల కోసం రష్యా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లూనా–25 ప్రయోగం విఫలమైంది. చంద్రుడిపై అడుగుపెట్టకముందే ల్యాండర్ కుప్పకూలింది. అనియంత్రిత కక్ష్యలోకి ప్రవేశించి చంద్రుడి ఉపరితలాన్ని ఢీకొట్టి పేలిపోయింది. ఈ విషయాన్ని రష్యా అంతరిక్ష సంస్థ రోస్‌కాస్మోస్ ఆదివారం అధికారికంగా వెల్లడించింది. శనివారం లూనా–25తో కమ్యూనికేషన్ తెగిపోయినట్లు పేర్కొంది. ల్యాండర్ నియంత్రణ కోల్పోయి, మరో కక్ష్యలోకి పరిభ్రమించి, చివరికి చంద్రుడి ఉపరితలాన్ని ఢీకొట్టినట్లు స్పష్టం చేసింది. లూనా–25 స్పేస్‌క్రాఫ్ట్‌ను ఆగస్టు 10న వోస్తోచ్నీ కాస్మోడ్రోమ్ నుంచి రష్యా ప్రయోగించింది. షెడ్యూల్ ప్రకారం రెండు రోజుల క్రితం చంద్రుడి సమీపానికి చేరుకుంది. ఈ నెల 21న చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండ్ కావాల్సి ఉంది. అయితే, వ్యోమనౌకలో సాంకేతిక లోపం తలెత్తింది. శనివారం వేగం తగ్గింపు విన్యాసం చేపట్టారు. ఈ సందర్భంగానే సాంకేతిక లోపం తలెత్తినట్టు రోస్‌కాస్మోస్ తెలియజేసింది. ఆటోమేటిక్ స్టేషన్‌లో అత్యవసర పరిస్థితి ఏర్పడిందని, దీంతో వేగం తగ్గింపు విన్యాసం సఫలం కాలేదని వివరించింది. లూనా–25 స్పేస్‌క్రాఫ్ట్ చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద ఉపరితలాన్ని ఢీకొట్టిందని వెల్లడించింది. పేలిపోవడానికి కొన్ని గంటల ముందే లూనా–25 చంద్రుడి ఉపరితలానికి సంబంధించిన కొన్ని ఫొటోలను భూమిపైకి పంపించింది. ఇదిలా ఉండగా, రష్యా స్పేస్ ఏజెన్సీ చంద్రుడిపైకి వ్యోమనౌకను ప్రయోగించడం 47 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి. లూనా విఫలంతో చంద్రుడిపైకి చేరాలన్న రష్యా కల నెరవేరలేదు. ఇప్పటిదాకా సోవియన్ యూనియన్, అమెరికా, చైనా మాత్రమే చంద్రుడిపై తమ వ్యోమనౌకలను విజయవంతంగా దింపాయి. అయితే, చంద్రుడి దక్షిణ ధ్రువంపై ఇంకా ఏ దేశమూ అడుగుపెట్టలేదు. దక్షిణ ప్రాంతంలో దింపేందుకు భారత్, రష్యా సిద్ధపడగా లూనా విఫలంతో ఈ పోటీ నుంచి రష్యా తప్పుకున్నట్లయింది. భారత్ ప్రయోగించిన చంద్రయాన్–3 ల్యాండర్ ఈ నెల 23న సాయంత్రం జాబిల్లి ఉపరితలంపై దిగడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.



లూనా -25 ల్యాండర్ (ఫైల్)

మరింత దగ్గరగా చంద్రయాన్ ల్యాండర్ మాడ్యూల్



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): చంద్రయాన్–3 మిషన్‌లో రెండో భాగమైన ల్యాండర్ మాడ్యూల్ కక్ష్య దూరాన్ని మరోసారి తగ్గించారు. అందులోని ఇంధనాన్ని ఆదివారం వేకువజామున 2 గంటలకు స్వల్పంగా మండించి కక్ష్య దూరాన్ని తగ్గించే ప్రక్రియను రెండోసారి విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం ల్యాండర్ మాడ్యూల్ చంద్రుడికి 25X134 కిలోమీటర్లు ఎత్తుకు అంటే చంద్రుడికి దగ్గరగా తీసుకొచ్చారు. మొదటి విడతలో 113 కిలోమీటర్ల దూరాన్ని 25 కిలోమీటర్లకు, 157 కిలోమీటర్ల దూరాన్ని 134 కిలోమీటర్ల తగ్గించి చంద్రయాన్–3 మిషన్‌లో భాగమైన ల్యాండర్ మాడ్యూల్ చంద్రుడికి మరింత చేరువగా తీసుకొచ్చారు. ల్యాండర్ మాడ్యూల్ ఆరోగ్యకరంగా ఉందని ఇస్రో శాస్త్రవేత్తలు ప్రకటించారు. బెంగళూరులోని మిషన్ ఆపరేటర్ కాంప్లెక్స్ (ఎంఓఎక్స్), ఇస్రో టెలీమెట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్(ఇస్ట్రాక్), బైలాలులో ఉన్న ఇండియన్ డీప్ స్పేస్ నెట్‌వర్క్ (ఐడీఎస్ఎన్) కేంద్రాల్లో శాస్త్రవేత్తలు 23న సాయంత్రం 5.37 గంటలకు ల్యాండర్ మాడ్యూల్‌లో ఉన్న ఇంధనాన్ని స్వల్పంగా మండించి 6.04 గంటలకు చంద్రుడి ఉపరితలంపై దక్షిణ ధృవం ప్రాంతంలో సాఫ్ట్ ల్యాండింగ్ చేయడానికి కసరత్తు చేస్తున్నారు. దాదాపు 37 నిమిషాల పాటు జరగనున్న ఈ ఆపరేషన్ అత్యంత కీలకం కానుంది.

చంద్రుడిపై దిగడం విజయవంతమైతే

చంద్రయాన్–3 మిషన్ ప్రయోగంలో అత్యంత కీలకఘట్టం దగ్గర పడడంతో ప్రపంచమంతా ఎంతో ఉత్కంఠతో ఉంది. రష్యా ప్రయోగించిన లూనా–25 మిషన్ చంద్రయాన్–2 తరహాలోనే చంద్రుడి ఉపరితలాన్ని ఢీకొని ఆఖరి దశలో విఫలమైంది. దీంతో ఇస్రో శాస్త్రవేత్తల్లో కూడా ఒకింత ఆందోళన మొదలైంది. ప్రపంచమంతా ఎంతో ఆసక్తి చూస్తున్న ఈవెంట్‌ను 23న సాయంత్రం 5.27 గంటలకు ప్రత్యక్షప్రసారాన్ని కల్పిస్తున్నారు. చంద్రయాన్–3లో ల్యాండర్ చంద్రుడిపై దిగే అంశంలో ఇస్రో వెబ్‌సైట్, యూట్యూబ్, ఫేస్‌బుక్, డీడీ నేషనల్ టీవీ చానెల్‌తో సహా బహుళప్లాట్‌ఫారమ్‌ల ద్వారా అందుబాటులో ఉంచారు.

గూగుల్ అకౌంట్... వాడకుంటే డిలీటే!

రెండేళ్లపాటు ఉపయోగించకపోతే శాశ్వతంగా రద్దు

2023 డిసెంబర్ 1 నుంచి కొత్త పాలసీ అమలు

మీ గూగుల్ అకౌంట్‌ను ఈ మధ్య అసలే వాడటం లేదా? దాని వంక కన్నెత్తి చూసి రెండేళ్లయిందా? అయితే అది ఇక శాశ్వతంగా డిలీట్ అయిపోతుంది. ఈ మేరకు కొత్త పాలసీని 2023 డిసెంబర్ 1 నుంచి గూగుల్ అందుబాటులోకి తెస్తోంది. దీనికి సంబంధించిన వివరాలన్నీ తెలియజేస్తూ గూగుల్ ఈ వారమే తన యూజర్లందరికీ మెయిల్స్ పంపింది. తాను అందించే అన్ని సర్వీసులు, ప్రాడక్టులకూ ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. 'మా యూజర్లు అకౌంట్‌ను వాడటం మానేసినా వారి డేటా పూర్తిగా గోప్యంగా, సురక్షితంగా ఉండేలా చూడటమే మా లక్ష్యం. అకౌంట్ డిలీషన్ అందులో భాగమే'' అని గూగుల్ ప్రకటించింది.

వీటికి వర్తిస్తుంది

- గూగుల్ అకౌంట్‌ను రెండేళ్ల పాటు సైన్ ఇన్ చేయకపోతే, వాడకపోతే.
- ఒకసారి డిలీట్ చేసిన అకౌంట్ తాలూకు జీ మెయిల్ అడ్రస్‌ను ఇంకెవరికీ కేటాయించబోరు.
- సేఫ్టీ, సెక్యూరిటీ కారణాల రీత్యా తన పాలసీని ఇలా అప్డేట్ చేస్తున్నట్టు గూగుల్ తెలిపింది.
- అయితే అకౌంట్‌ను డిలీట్ చేసే ముందు గూగుల్ పలుమార్లు రిమైండర్ మెయిల్స్ పంపుతుంది. అవి సదరు అకౌంట్‌తో పాటు యూజర్ తాలూకు రికవరీ అకౌంట్‌కు కూడా వెళ్తాయి.
- ఏదైనా చర్య తీసుకోవడానికి కనీసం 8 నెలల ముందు నుంచే ఈ మెయిల్స్ రావడం మొదలవుతుంది.

Google

మీ గూగుల్ అకౌంట్ యాక్టివ్‌గా ఉండాలంటే...

- తరచూ లాగిన్ అవుతూ ఉన్నా...
- కనీసం రెండేళ్లకు ఒక సారైనా లాగిన్ అయినా...
- గూగుల్ డ్రైవ్ వాడినా...
- మెయిల్ పంపినా, చదివినా...
- యూట్యూబ్‌లో వీడియో చూసినా...
- ఏ గూగుల్ యాప్ డౌన్‌లోడ్ చేసినా... థర్డ్ పార్టీ యాప్, సర్వీస్ లను గూగుల్ ద్వారా సైన్ ఇన్ చేసినా మీ గూగుల్ ఖాతాకు ఎలాంటి ఢోకా ఉండదు.

మినహాయింపులున్నాయ్..

గూగుల్ అకౌంట్ డిలీషన్ పాలసీకి కొన్ని మినహాయింపులు ఉన్నాయి. వాటి ప్రకారం రెండేళ్ల పాటు వాడకంలో లేని అకౌంట్లను డిలీట్ చేసే కొత్త విధానం ఈ కింది వాటికి వర్తించదు

- యూట్యూబ్ చానల్స్, ఖాతాకు, కామెంట్లున్న గూగుల్ అకౌంట్
- డబ్బులతో కూడిన గిఫ్ట్ కార్డులున్న జీ మెయిల్ అకౌంట్
- పబ్లిష్డ్ అప్లికేషన్ ఉన్న అకౌంట్

– సాక్షి, నేషనల్ డెస్క్



తుక్కు రేసింగ్ కారుకు వేలంలో రూ.15 కోట్లు

కాలిఫోర్నియా: 1960వ దశకంలో రేసింగ్‌లో పాల్గొంటుండగా మంటల్లో చిక్కుకొని తుక్కుగా మారిన ఫెరారీ కారు తాజాగా వేలంలో రూ.15 కోట్ల(1.8 మిలియన్ డాలర్లు) ధర పలికింది. ఈ 'ఫెరారీ 500 మాండియాల్ స్పైడర్ సిరీస్–1' కారును 1954లో తయారు చేశారు. ప్రముఖ ఇటాలియన్ రేసర్ అల్బర్టో అస్కరీ 1952, 1953లో ఫార్ములా వన్ వరల్డ్ డ్రైవర్స్ చాంపియన్‌షిప్‌లో సాధించిన విజయాలకు గుర్తుగా ఫెరారీ సంస్థ దీన్ని తయారు చేసింది. రేసింగ్ డ్రైవర్ ఫ్రాంకో కోర్టెస్ 1954లో కారును కొనుగోలు చేశాడు. అనంతరం 1958లో ఇది అమెరికాకు చేరుకుంది. 1960లలో ఓ రేసులో ప్రమాదానికి గురై మంటల్లో కాలిపోయింది. 1978 వరకూ పలువురి చేతులు మారుతూ వచ్చింది. పూర్తిగా ధ్వంసమైన స్థితిలో ఉన్న ఈ కారును ఓ వ్యక్తి కొనుగోలు చేసి, దాదాపు 45 ఏళ్లపాటు అలాగే కాపాడుతూ వచ్చాడు. ఇటీవల ఆర్‌ఎం సోథ్‌బీ సంస్థ ఈ కారును వేలం వేసింది. ఏకంగా రూ.15 కోట్లు పలికింది. కారును బాగుచేసి, మళ్లీ రేసింగ్ ట్రాక్‌పై తీసుకొస్తానని దాన్ని కొనుక్కున్న వ్యక్తి చెప్పాడు.

ఉక్రెయిన్‌కు అత్యాధునిక ఎఫ్–16లు

కీవ్/ఇనెడోవిన్: రష్యాను దీటుగా ఎదుర్కోలేక డీలాపడిన ఉక్రెయిన్‌లో ఉత్సాహాన్ని నింపే పరిణామం. ఆ దేశానికి అత్యాధునిక ఎఫ్–16 యుద్ధ విమానాలను అందజేయాలనే నిర్ణయానికి అమెరికా పచ్చజెండా ఊపింది. దీంతో నెదర్లాండ్స్, డెన్మార్క్‌లు అమెరికా తయారీ ఎఫ్–16లను ఉక్రెయిన్‌కు అందజేసేందుకు ముందుకు వచ్చాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తాజాగా డెన్మార్క్, నెదర్లాండ్స్‌ల్లో పర్యటించారు. ఆదివారం ఆయన నెదర్లాండ్స్‌లోని ఎయిండ్ హోవెన్ ఎయిర్‌బేస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆ దేశ ప్రధాని మార్క్ రుట్‌తో సమావేశమయ్యారు. అక్కడున్న రెండు ఎఫ్–16 విమానాలను పరిశీలించారు. అనంతరం మార్క్‌రుట్ మీడియాతో మాట్లాడుతూ.. తమ షరతులకు ఉక్రెయిన్ అంగీకరించిన తర్వాతే ఎఫ్–16ల సరఫరా మొదలవుతుందని స్పష్టం చేశారు. ఆ షరతులు ఏమిటన్నది వెల్లడించలేదు. తమ వద్ద ప్రస్తుతం 42 ఎఫ్–16 విమానాలున్నాయని, వీటిలో కొన్నిటిని ఉక్రెయిన్‌కు ఉచితంగా అందజేస్తామని చెప్పారు. ఉక్రెయిన్‌కు తాము 19 ఎఫ్–16లను అందజేస్తామని డెన్మార్క్ ప్రధాని మెట్టి ఫ్రెడరిక్సన్ ప్రకటించారు. ఎఫ్–16 యుద్ధ విమానాల పైలెట్లకు 6 నుంచి 8 నెలల శిక్షణ అవసరముంటుందని అధికారులు చెబుతున్నారు. నెదర్లాండ్స్, డెన్మార్క్‌ల నిర్ణయం చారిత్రకమని జెలెన్‌స్కీ కొనియాడారు.



రష్యా దాడుల్లో ఏడుగురు మృతి

ఉక్రెయిన్‌లోని చెర్నిహివ్ నగరంపై శనివారం రష్యా జరిపిన భీకర క్షిపణి దాడుల్లో సోఫియా అనే ఆరేళ్ల చిన్నారి సహా ఏడుగురు చనిపోగా మరో 150 మంది క్షతగాత్రులయ్యారు. రష్యాలోని కుర్‌స్క్ ప్రాంత రాజధాని కుర్‌స్క్ రైల్వే స్టేషన్‌పై ఉక్రెయిన్ డ్రోన్ దాడి జరిపింది. రైల్వే స్టేషన్ పైకప్పునకు మంటలు అంటుకుని అయిదుగురు గాయపడ్డారు. కాగా, ఉక్రెయిన్ డ్రోన్ దాడితో మాస్కోలోని రెండు ఎయిర్‌పోర్టుల్ని కొద్ది గంటలపాటు మూసివేశారు.

మాలిలో దుండగుల కాల్పులు

21 మంది పౌరులు మృతి

బమాకో: పశ్చిమ ఆఫ్రికా దేశమైన మాలిలో గుర్తుతెలియని దుండగుల కాల్పుల్లో 21 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. సెంట్రల్ మాలిలోని మోప్తీ ప్రాంతంలో తాజాగా ఈ ఘోరం చోటుచేసుకుంది. బందీయాగార పట్టణం సమీపంలోని యారో అనే ఓ గ్రామంపై దుండగులు విరుచుకుపడ్డారని, జనంపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారని స్థానిక మీడియా వెల్లడించింది. ఈ కాల్పుల్లో 21 మంది ప్రజలు చనిపోయారని, మరో 30 మందికిపైగా గాయపడ్డారని తెలియజేసింది. మృతుల్లో మహిళలు, చిన్నారులు ఉన్నట్లు సమాచారం. కాల్పులకు గల కారణాలు తెలియరాలేదు. మాలిలో అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలైన అల్‌ఖైదా, ఐసిస్ చురుగ్గా పనిచేస్తున్నాయి. ఉగ్రముఠాల అండతో తిరుగుబాటుదారులు కొన్ని భూభాగాలను ఆక్రమించారు.

'నీట్' నుంచి మినహాయించేదాకా ఉద్యమిస్తాం

తమిళనాడు సీఎం స్టాలిన్

చెన్నై: జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష(నీట్) నుంచి తమిళనాడును మినహాయించేదాకా తమ ఉద్యమం ఆగదని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తేల్చిచెప్పారు. 'నీట్'ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అధికార డీఎంకే నేతృత్వంలో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలను, ఆందోళనలు నిర్వహించారు. నిరాహార దీక్షలు సైతం చేపట్టారు. నీట్ రద్దు అనేది రాజకీయపరమైన డిమాండ్ కాదని, అందిరికీ సమాన అవకాశాలు లభించాలన్నదే తమ ఉద్దేశమని స్టాలిన్ చెప్పారు. ఈ పరీక్ష నుంచి తమిళనాడు మినహాయించేలా అన్ని రకాల ప్రయత్నాలు చేస్తామని వెల్లడించారు. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇంటి ఎదుట ధర్నా చేస్తామని పేర్కొన్నారు. ఈ ధర్నాలో పాల్గొనాలని విపక్ష ఏఐఏడీఎంకేకు స్టాలిన్ సూచించారు. అయితే, కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కారు కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడే నీట్‌ను తీసుకొచ్చారని ఏఐఏడీఎంకే నేత, మాజీ సీఎం పళనిస్వామి గుర్తుచేశారు.

ఆ శాఖల అధికారులపైనే అత్యధిక ఫిర్యాదులు

న్యూఢిల్లీ: దేశంలో 2022లో అవినీతికి సంబంధించిన ఫిర్యాదులు అత్యధికంగా కేంద్ర హోంశాఖ అధికారులపైనే వచ్చాయి. ఆ తర్వాత రైల్వే శాఖ, బ్యాంకు అధికారులు ఉన్నారు. ఈ విషయాన్ని కేంద్ర విజిలెన్స్ కమిషన్(సీవీసీ) తన వార్షిక నివేదికలో వెల్లడించారు. గత ఏడాది అన్ని కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాలకు చెందిన అన్ని కేటగిరీల అధికారులు, ఇతర సిబ్బంది విషయంలో మొత్తం 1,15,203 ఫిర్యాదులు అందాయని తెలియజేసింది. వీటిలో 85,437 కేసులను పరిష్కరించామని, మిగిలినవి పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంది. అత్యధికంగా హోంశాఖ అధికారులపై 46,643, రైల్వే శాఖ అధికారులపై 10,580, బ్యాంకుల అధికారులపై 8,129 ఫిర్యాదులు తమకు అందాయని సీవీసీ స్పష్టం చేసింది. 'నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఢిల్లీ' ప్రభుత్వ అధికారులపై 7,370 ఫిర్యాదులు వచ్చాయని వివరించింది. ఇన్సూరెన్స్ సంస్థల్లో పనిచేసేవారిపై 987, ఉక్కుశాఖలో పనిచేసేవారిపై 923 కంప్లైంట్లు వచ్చినట్లు వెల్లడించింది.

పర్యాటకుల రెస్టారెంట్ బిల్లు కట్టిన ఇటలీ ప్రభుత్వం

రోమ్: ఇటలీకి చెందిన ముగ్గురు పర్యాటకులు పొరుగుదేశం అల్బేనియాకు వెళ్లారు. అక్కడ రెస్టారెంట్‌లో తిని బిల్లు కట్టకుండా చెక్కేశారు. ఇటలీ ప్రధాని మెలోనీ ఇటీవల కుటుంబంతో కలిసి అల్బేనియాలో పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా అల్బేనియా ప్రధాని ఈడి రమా ఈ విషయాన్ని ప్రస్తావించారు. దీనిని మెలోనీ తీవ్ర అవమానంగా భావించారు. దేశం పరువు తీశారంటూ తమ దేశస్తులపై మండిపడ్డారు. 'వెళ్లి ఆ నలుగురు ఇడియట్స్ బిల్లు కట్టండి'అంటూ అక్కడి తమ దౌత్యాధికారులను ఆదేశించారు. వారు వెళ్లి రూ.7,245 బిల్లును సదరు రెస్టారెంట్ నిర్వాహకులకు చెల్లించి వచ్చారు. నిబంధనలు, సంప్రదాయాలను పాటించాలని, ఇటువంటివి మరోసారి జరక్కుండా జాగ్రత్తపడాలని తమ దేశస్తులకు ఇటలీ ఎంబసీ సూచించింది. కొందరు వ్యక్తులు బిల్లు చెల్లించకుండానే రెస్టారెంట్ నుంచి వెళ్లిపోతున్నట్లుగా సదరు రెస్టారెంట్ విడుదల చేసిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది. దీనిపై రెస్టారెంట్ యజమాని మాట్లాడుతూ.. ఫుడ్ ఐటమ్స్ ఎంతో బాగున్నాయంటూ సదరు నలుగురు ఇటాలియన్లు తమను మెచ్చుకున్నారని కూడా తెలపడం విశేషం.

'వారసత్వ రాజకీయాలు విషతుల్యం'

భోపాల్: వారసత్వ రాజకీయాలు విషంతో సమానమని హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. వీటివల్ల ఒకే కుటుంబం చెప్పుచేతల్లో పార్టీ, ప్రభుత్వం ఉంటాయన్నారు. కాంగ్రెస్, డీఎంకే, శివసేన(ఉద్ధవ్)వర్గం కుటుంబ రాజకీయాలను నడిపిస్తున్నాయని ఆరోపించారు. కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ కుల ఉద్యమాలను ప్రోత్సహిస్తోందన్నారు. వీటివల్లే 2018లో మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయిందని చెప్పారు.

అంగుళం కూడా చైనా ఆక్రమించలేదనడం అబద్ధం

న్యూఢిల్లీ/లేహ్: లద్దాఖ్‌లోని అంగుళం భూమిని కూడా చైనా ఆర్మీ ఆక్రమించుకోలేదంటూ ప్రధాని మోదీ చేసిన ప్రకటన అబద్ధమని కాంగ్రెస్ నేత రాహుల్ అన్నారు. చైనా సైన్యం అక్కడి పచ్చిక బయళ్లను ఆక్రమించుకోవడంపై లద్దాఖ్ వాసులు ఆందోళన చెందుతున్నారని ఆయన తెలిపారు. తన తండ్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించేందుకు శనివారం రాహుల్ లద్దాఖ్‌కు చేరుకున్నారు. 'చైనా సైన్యం చొచ్చుకువచ్చి పచ్చిక బయళ్లను లాగేసుకుందని ఇక్కడి వారంతా చెబుతున్నారు. భూమి ఆక్రమణకు గురి కాలేదంటూ ప్రధాని చెబుతున్నది నిజం కాదని వాళ్లు స్పష్టంగా చెబుతున్నారు'అని రాహుల్ అన్నారు. కాగా, రాహుల్ చైనా తరఫున వకాల్తా పుచ్చుకుని మాట్లాడుతున్నట్లుగా ఉందని బీజేపీ మండిపడింది. ఇటువంటి ప్రకటనలతో రాహుల్ దేశం పరువు తీస్తున్నారని ఆరోపించింది.



సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
సోమవారం । 21 । ఆగస్టు । 2023

ఒకే ట్రైన్‌గా..మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లు

కొరుక్కుపేట: గురువాయూర్-పునలూర్ మధ్య నడిచే గురువాయూర్ ఎక్స్‌ప్రెస్, మదురై -సెంగోట్టైకి వెళ్లే మదురై ఎక్స్‌ప్రెస్, సెంగోట్టై - కొల్లం సెంగోట్టై ఎక్స్‌ప్రెస్‌ను ఒకే రైలుగా విలీనం చేసి మదురై, గురువాయూర్ మధ్య తిరిగే గురువాయూర్ ఎక్స్‌ప్రెస్‌గా నడుపనున్నారు. ఈ మేరకు సదరన్ రైల్వే అధికారులు కొత్త ట్రైన్ వివరాలను వెల్లడించారు. ఈ కొత్త రైలు 27న మదురై నుంచి ప్రారంభం కానుంది. అలాగే ఈనెల 28న గురువాయూర్‌లో ఆరంభమౌతుంది. రైలు నంబరు 16327 మదురై గురువాయూర్ ఎక్స్‌ప్రెస్ 27వ తేదీ ఉదయం 11.20 గంటలకు మదురైలో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 2.10 గంటలకు గురువాయూర్ చేరుకుంటుంది. అలాగే 16328 గురువాయూర్ మదురై ఎక్స్‌ప్రెస్ 28వ తేదీ ఉదయం 5.50 గంటలకు గురువాయూర్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 7.50 గంటలకు మదురైకి చేరుకుంటుంది.

న్యూస్‌రీల్

అమెరికా పర్యటనకు మంత్రి అన్బరసన్


అన్బరసన్

సాక్షి, చెన్నై: రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి టి అన్బరసన్ ఆదివారం అమెరికాకు వెళ్లారు. పది రోజులు ఆయన పలు నగరాల్లో పర్యటించనున్నారు. ఇటీవల కాలంలో వరుసగా పలువురు డీఎంకే మంత్రులు విదేశాలలో పర్యటించి వస్తున్న విషయం తెలిసిందే. గత నెల వ్యవసాయ మంత్రి ఎంఆర్‌కే పన్నీరు సెల్వం వివిధ దేశాలలో పర్యటించి చెన్నైకు వచ్చారు. ఈ పరిస్థితుల్లో ఆదివారం మరో మంత్రి అన్బరసన్ అమెరికా పర్యటనకు వెళ్లారు. పది రోజులు ఆయన అక్కడ పర్యటిస్తారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి, రాష్ట్రంలోకి పెట్టుబడుల ఆహ్వానించడం తదితర అంశాల కోసం ఆయన పర్యటన సాగనుంది. ఉత్తర, దక్షిణ అమెరికా, చిలీ వంటి ప్రాంతాలలో పర్యటించిన ఈనెల 31వ తేదీన తిరిగి చెన్నైకు మంత్రి అన్బరసన్ రానున్నట్లు అధికారులు వెల్లడించారు.

విద్యార్థుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడం తగదు

తిరుత్తణి: తిరుత్తణి సమీపంలోని నల్లాట్టూరు కుశస్థలి నదీ తీరంలో కొలువైన వీర మంగళ ఆంజనేయస్వామి ఆలయ మహాకుంభాభిషేకంలో తెలంగాణ గవర్నర్ తమిళిసై ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఆధ్యాత్మికం నిండిన తమిళనాడు, ఆధ్యాత్మికంతో అంతర్భాగమైన తమిళాన్ని పెంచి పోషించిందన్నారు. నీట్ వ్యవహారంలో విద్యార్థులను ఉత్తేజ పరచాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నిరాహార దీక్ష పేరిట విద్యార్థుల ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీసే రీతిలో వ్యవహరిస్తోందని ఆరోపించారు. నీట్ పరీక్షలను ఎదుర్కొనేందుకు విద్యార్థి లోకం సిద్ధమైన క్రమంలో వారి ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీసే రీతిలో వ్యవహరించడం తగదని హితవు పలికారు. నీట్ రద్దు చేసి అధికారం చేపడతామని రెండున్నరేళ్ల క్రితం చెప్పిన మాటలకు అనుగుణంగా నీట్ రద్దు చేసి ప్రస్తుతం నిరాహార దీక్ష చేస్తున్నారా..? అని డీఎంకే ప్రభుత్వాన్ని ఆమె ప్రశ్నించారు. నీట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదనే బాధతో ఆత్మహత్యలు చేసుకోవడం మంచిది కాదని హితవు పలికారు. వైద్యవిద్యలో అనేక విభాగాలున్నాయని, వాటిలో ఒక్కటి ఎంపిక చేసుకుని తమ ఆశయాలు సాధించుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- మరొకరికి తీవ్రగాయాలు

తిరువళ్లూరు: మరమ్మతులకు గురై ఆగిన లారీని వెనుక నుంచి మరో లారీ ఢీ కొనడంతో ఇద్దరు ఘటనా స్థలంలోనే మృతి చెందగా.. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా చోళవరం సమీపంలో లారీ మర్మమతులకు గురై రోడ్డుపై ఆగిపోయింది. ఇదే సమయంలో చెన్నై నుంచి గుమ్మిడిపూండి వైపు ఇనుప చువ్వలతో వెళ్తున్న మరో లారీ ఆగివున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు మూడు గంటల పాటు శ్రమించి మృత దేహాలను శవపరీక్ష నిమిత్తం వైద్యశాలకు తరలించారు. కాగా మృతి చెందిన వ్యక్తుల వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐసీఎఫ్ నుంచి ఆరంజ్ రంగు వందేభారత్ రైలు


పట్టాల మీదకు వచ్చిన ఆరెంజ్ రంగు వందే భారత్

సాక్షి, చెన్నై: ఐసీఎఫ్ ఆధ్వర్యంలో ఆరంజ్ వర్ణ వందేభారత్ రైలు రూపుదిద్దుకుంది. ఈ రైలు ట్రైల్ రన్ ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. భారతీయ రైల్వేలోనే సరికొత్తగా, అత్యాధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రైళ్ల తయారీలో ఐసీఎఫ్ దూసుకెళ్తోన్న విషయం తెలిసిందే. ఐసీఎఫ్ చరిత్రలో ఎన్నో మైలురాళ్లు చెన్నై నుంచి పట్టాలెక్కి ఉన్నాయి. ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో చెన్నై దేశానికే ఆదర్శంగా నిలుస్తూ, అగ్రస్థానాన్ని దక్కించుకుంటూ వస్తున్న విషయం తెలిసిందే. ఒక్కటా రెండా.. ఎన్నో అత్యాధునిక రైళ్లు, బోగీల నిర్మాణంలో ఐసీఎఫ్ ఘన కీర్తిని చాటుకుంది. స్వదేశీ పరిజ్ఞానంగా వందే భారత్ రైళ్లు ఇక్కడి నుంచే పట్టాల మీదకు వచ్చాయి. ఇది వరకు ఈ రైలు తెలుపు, నీలం వర్ణంతో వందే భారత్ రైళ్లు రూపుదిద్దుకున్నాయి. ఇప్పటి వరకు 32 రైళ్లు పట్టాల మీదకు వచ్చి సేవలందిస్తున్నాయి. తాజాగా వందేభారత్ రైలు వర్ణంలో మార్పులు జరిగాయి. 8 బోగీలతో కూడిన 33వ రైలును ఆరంజ్, గ్రే రంగులో తీర్చిదిద్దారు. ఇది వరకు ఉన్న వందేభారత్ రైలులోని అన్ని వసతులు ఇందులో కూడా ఉన్నాయి. ఈ రైలు ట్రైల్ రన్ ఆదివారం జరిగింది. ఐసీఎఫ్ నుంచి పాడి వరకు ఈ రైలు పట్టాల మీద నెమ్మదిగా కదిలింది. ఈ రైలును త్వరలో పూర్తిస్థాయిలో పట్టాలెక్కించనున్నారు. ఈ రైలును ఏమార్గంలో నడపనున్నారో అనే విషయం తెలియాల్సి ఉంది.

నీట్ వద్దే..వద్దు!

తమిళనాడులో నీట్ వద్దే.. వద్దు.. నినాదం ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా మారుమోగింది. నీట్ మినహాయింపు ముసాయిదాపై సంతకం చేయాలన్న డిమాండ్‌తో డీఎంకే యువజన, విద్యార్థి, వైద్య విభాగం నేతృత్వంలో మదురై మినహా అన్ని ప్రాంతాల్లో నిరసన దీక్షలు హోరెత్తాయి. చెన్నైలో చేపట్టిన దీక్షకు డీఎంకే యువజన విభాగం ప్రధాన కార్యదర్శి, మంత్రి ఉదయనిధి స్టాలిన్, ఇతర మంత్రులు, భారీ సంఖ్యలో డీఎంకే కార్యకర్తలు పాల్గొన్నారు.

- రాష్ట్రవ్యాప్తంగా డీఎంకే నిరసన
- కదంతొక్కిన ఆ పార్టీ యువజన, విద్యార్థి, వైద్య విభాగం కార్యకర్తలు
- పోరాటం ఆగదన్న ఉదయనిధి స్టాలిన్
- గవర్నర్‌కు దమ్ముంటే రాజకీయాల్లో పోటీ చేయాలి..
- డీఎంకే కార్యకర్తపై గెలిస్తే.. అందరం ఆయన మాటే వింటామని స్పష్టీకరణ


నిరసనలో పాల్గొన్న ఉదయనిధి స్టాలిన్, సహచర మంత్రులు


బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థుల చిత్ర పటాల వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి ఉదయనిధి స్టాలిన్

సాక్షి, చెన్నై: "వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) పరీక్ష నుంచి తమిళనాడును మినహాయించాలి" అని నినదిస్తూ ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా డీఎంకే శ్రేణులు కదంతొక్కాయి. వివరాలు.. ఆది నుంచి వైద్య కోర్సుల ప్రవేశంలో నీట్ పరీక్షను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. గత పాలకులు, ప్రస్తుత డీఎంకే పాలకులు నీట్‌కు వ్యతిరేకంగా తీర్మానాలు చేసి పంపినా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నుంచి స్పందన శూన్యమే. నీట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై గవర్నర్ ఆర్‌ఎన్‌రవి అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా, ముసాయిపై కేంద్రంతో చర్చించి రాష్ట్రపతి ఎలాంటి నిర్ణయం తీసుకోక పోవడాన్ని డీఎంకే పాలకులు తీవ్రంగా పరిగణించారు. నీట్ పుణ్యమా వైద్య సీట్లు దక్కక పోవడంతో తమిళ విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతుండడాన్ని డీఎంకే అనుబంధ యువజన, విద్యార్థి, వైద్య విభాగాలు తీవ్రంగా పరిగణించాయి. తమిళ విద్యార్థులకు న్యాయం చేయాలంటూ నిరసన దీక్షకు ఆదివారం పిలుపు నిచ్చాయి. పెద్దఎత్తున యువత, విద్యార్థి, వైద్య విభాగానికి చెందిన విద్యార్థులు, వైద్యులు తదితరులు దీక్ష నిర్వహించారు.

నిరసనల హోరు..

నీట్ రద్దు, మినహాయింపు ముసాయిదాను ఆమోదించాలని కోరుతూ, తమిళ విద్యార్థుల జీవితాల చెలగాటం వద్దని హెచ్చరిస్తూ మదురై మినహా రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన దీక్షలు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా అనుబంధ విభాగాల నేతలు పెద్దఎత్తున తరలి వచ్చిన ఆందోళనకు దిగారు. చెన్నై వళ్లువర్ కోట్టం వద్ద డీఎంకే యువజన విభాగం కార్యదర్శి, మంత్రి ఉదయ నిధి స్టాలిన్ అధ్యక్షతన నిరసన దీక్ష నిర్వహించారు. ఈ దీక్షను డీఎంకే మంత్రులు దురై మురుగన్, శేఖర్ బాబు, ఎం. సుబ్రమణియన్ తదితరులు ప్రారంభించారు. ఉదయ నిధితో పాటు యువజన విభాగం నేతలు ఉదయ 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దీక్షలో కూర్చున్నారు. ఇందులో డీఎంకే కుటుంబానికి చెందిన నేతల కుమారుడు, కుమార్తె ఇద్దరు వివాహం అనంతరం నేరుగా నిరసన దీక్ష వద్దకు చేరుకుని ఉదయ నిధికి తమ సంఘీభావం తెలియజేశారు. ముందుగా నీట్ రూపంలో వైద్య సీట్లు దక్కక బలవన్మరణాలకు పాల్పడిన 21 మంది విద్యార్థుల చిత్ర పటాలకు ఉదయనిధి స్టాలిన్ పుష్పాంజలి ఘటిస్తూ ఉద్వేగానికి లోనయ్యారు. తాను మంత్రిగానో, ఎమ్మెల్యేగా, ఓ సీఎం కుమారుడిగానో కాదు... సాధారణ వ్యక్తిగా మరణించిన విద్యార్థుల అన్నగా ఈ దీక్షలో కూర్చున్నాని ప్రకటించారు.

పదవి నుంచి తొలగించినా వెనక్కి తగ్గను..

ఆదివారం సాయంత్రం నిరసన దీక్ష విరామం సందర్భంగా ఉదయ నిధి ప్రసంగిస్తూ, తాను బాధ్యత గల మంత్రి పదవిలో ఉండి.. దీక్షలో కూర్చుంటే ఆ పదవి ఊడటం ఖాయమనే ప్రచారం సాగుతోందని అన్నారు. అయితే తనకు మంత్రి పదవి అనేది తృణ ప్రాయమని, పదవి ఊడినా వెనక్కి తగ్గబోనని, నీట్ రద్దు, తమిళ విద్యార్థుల హక్కులు, సంక్షేమమే తనకు ముఖ్యం అని వ్యాఖ్యానించారు. ఈ రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి..కాదు.. ఆర్‌ఎస్‌ఎస్ రవికి గర్వం మరీ ఎక్కువైందని, ఏ అర్హతతో ఆ పదవిలో ఉన్నారో ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ఆయన కేవలం పోస్టుమ్యాన్ మాత్రమేనని, ప్రభుత్వం నుంచి వచ్చే ముసాయిదాలను పోస్టుమ్యాన్ వలే కేంద్రం, రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మాత్రమే ఆయనది హితవు పలికారు. తాను ఇలాగే మాట్లాడుతాను, ఇలాగే వ్యవహరిస్తానని ఆర్‌ఎన్ రవి చెప్ప దయుచుకుంటే, ఆ పదవికి రాజీనామా చేసి తమిళనాట ఏదో ఒక చోట ఎన్నికలకు సిద్ధం కావాలని సవాల్ చేశారు. ఈ ఎన్నికల్లో ఓ వైపు ఆయన ఉంటే, మరో వైపు తమ కార్యకర్తని పోటీలో దించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో ఆర్‌ఎన్ రవి గెలిస్తే, ఆయన చెప్పినట్టుగానే అన్నీ వినేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ చేశారు. ప్రశ్నించే వాళ్లకు బెదిరించే వ్యక్తిగా గవర్నర్ మారాడంటూ ఏక వచనంతో తీవ్రస్థాయిలో ఉదయ నిధి విరుచుకు పడడం చర్చనీయాంశంగా మారింది.

డీఎంకే భావి నాయకుడు ఉదయనిధి : దురై మురుగన్

అంతకు ముందు సీనియర్ మంత్రి దురై మురుగన్ తన ప్రసంగంలో డీఎంకేకు భావి నాయకుడు అయ్యే అన్ని అర్హతలు ఉదయ నిధి స్టాలిన్‌కి ఉన్నాయని స్పష్టం చేశారు. వెనుకబడిన సామాజిక వర్గం విద్యార్థులు నీట్ కారణంగా వైద్య విద్యను అభ్యసించ లేని పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ రద్దు చట్టాన్ని తుంగలో తొక్కిన గవర్నర్‌కు తమిళ ప్రజలు గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందని అభిప్రాయపడ్డారు.

తప్పనిసరి పరిస్థితుల్లోనే పోరాటం : సీఎం స్టాలిన్

చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం స్టాలిన్ నీట్ పోరాటంపై స్పందించారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే డీఎంకే అనుబంధ విభాగాలు ఈ నిరసన చేపట్టాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. మొదటి నుంచి డీఎంకే నీట్‌ను వ్యతిరేకిస్తూ వస్తోందని, అయితే, అన్నాడీఎంకే పాలకుల అసమర్థత కారణంగానే రాష్ట్రంలో ఈ పరీక్ష ప్రవేశించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ ముసాయిదాల విషయంలో గవర్నర్ బహిరంగంగా అర్థ రహిత వ్యాఖ్యలు చేస్తుండడంతోనే పోరాటలపై కీలక నిర్ణయం తీసుకోక తప్పలేదన్నారు. గవర్నర్ సలహాలు, సూచనలు ఇవ్వాలే గానీ, ఆయనే ఈ రాష్ట్రానికి సర్వాధికారి అన్నట్లుగా వ్యవహరించడం శోచనీయమని, పద్ధతి మార్చుకోకుంటే తమిళ ప్రజల ఆగ్రహాన్ని ఆయన చవి చూడడం ఖాయమని హెచ్చరించారు.


నీట్‌ను నిషేధించాలన్న ఉదయనిధికి మద్దతు తెలుపుతున్న నవ దంపతులు


నిరసనలో పాల్గొన్న వైద్య విద్యార్థినులు

అవయవదానంపై అవగాహనకు సైక్లోథాన్


సైక్లోథాన్‌ను ప్రారంభిస్తున్న అవయవ దానం చేసిన దాతల కుటుంబ సభ్యులు

సాక్షి, చెన్నై: అవయవ దానంపై అవగాహన కల్పించే విధంగా ఆదివారం చెన్నైలో సైక్లిస్టుల ద్వారా సైక్లో థాన్ జరిగింది. క్రోంపేటలోని రేలా ఆసుపత్రి నేతృత్వంలో జరిగిన ఈ సైక్లోథాన్‌కు 500 మంది సైక్లిస్టులు, అవయ దాతలు, తాము మరణించిన తమ వారి అవయవాలు బతికే ఉండాలని కాంక్షిసూ దానం చేసిన, అనేక మంది మరణించిన వారి కుటుంబాలకు చెందిన వారు తరలి వచ్చారు. ఉదయం ఈ అవగాహన సైకిల్ ర్యాలీని రేలా సీఈఓ ఇలంకుమరన్‌తో పాటు పలువురు అవయవ దాతలు జెండా ఊపి ప్రారంభించారు. 12 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు పై బడ్డవారు సైక్లోథాన్‌లో దూసుకెళ్లారు. తాంబరం, పెరుంగళత్తూరు, పడప్పై, ఒరగడం, తిరుకచ్చూర్, పాలూరు, కొళత్తూరు, మణి మంగళం, ముడిచ్చూరు మీదుగా 110 కి.మీ దూరం ఈ అవగాహన సైక్లోథాన్ జరిగింది. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఇళంకుమరన్ మాట్లాడుతూ, అవయవ దానం గురించి అవగాహన అని పిలుపు నివ్వగానే, పెద్దసంఖ్యలో యువత, విద్యార్థులు, అనేక కుటుంబాలకు చెందిన వారు తరలిరావడం ఆనందంగా ఉందన్నారు. అవయవ దానంపై అవగాహనను మరింత విస్తృతం చేసే విధంగా కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ప్రస్తుతం కాలేయ మార్పిడి కోసం 193 మంది, కీడ్నీ మార్పిడి కోసం 114 మంది ఎదురుచూపుల్లో ఉన్నారని వివరిస్తూ, గత సంవత్సరం రాష్ట్రంలో 156 మంది మాత్రమే అవయవ దానం చేయడానికి ముందుకు వచ్చారని గుర్తు చేశారు. ఈ సంఖ్య పెరగాలని, పెంపు లక్ష్యంగా సమష్టిగా కార్యక్రమాలు విస్తృతం కావాల్సిన అవసరం ఉందన్నారు.

శ్రీవారి మహా సేవకుడు అన్నమయ్య


డాక్టర్ సామవేదం షణ్ముఖశర్మను సత్కరిస్తున్న దృశ్యం


ప్రవచన కార్యక్రమానికి హాజరైన భక్తులు

కొరుక్కుపేట: కలియుగదైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహానుభావుడు, మహా సేవకుడు అన్నమాచార్యుడు అని సమన్వయ సరస్వతి, వాగ్దేవీ వరపుత్ర, ధార్మిక వరేణ్య డాక్టర్ సామవేదం షణ్ముఖశర్మ ఉద్బోధించారు. శర్వాణి సంగీత సభ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నమయ్య దర్శించిన శ్రీ వేంకటేశ్వరుడు అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం ఆదివారం సమన్వయ సరస్వతి, వాగ్దేవీ వరపుత్ర డాక్టర్ సామవేదం షణ్ముఖశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. చెన్నై టి.నగర్‌లోని నార్త్ ఉస్మాన్ రోడ్డు, శ్రీ రామకృష్ణ మిషన్ మెట్రిక్ హైయ్యర్ సెకండరీ స్కూల్‌లోని ఇన్ఫోసిస్ హాలు వేదికగా నిలిచింది. వేంకటేశ్వర స్వామి నామాన్ని స్మరిస్తూ డాక్టర్ సామవేదం షణ్ముఖశర్మ ప్రవచనం సాగించారు. అన్నమాచార్య జీవితం అంతా స్వామివారి కోసమే అర్పిచారన్నారు. అన్నమయ్య కేవలం సంకీర్తలను మాత్రమే రచించలేదని.. శ్రీ వెంకటేశ్వర స్వామి వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పారన్నారు. పదకవితా పితామకుడు, తొలి వాగ్గేయకారుడిగా కీర్తిగడించారన్నారు. కార్యక్రమంలో భాగంగా అంతకు ముందు ఊరా ఆంజనేయులు తదితరులు స్వామివారి భక్తిపాటలను ఆలపించారు.

రెండేళ్లలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి

రెండేళ్ల డీఎంకే పాలనలో రాష్ట్రాభివృద్ధి 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి ఆరోపించారు. పదేళ్ల అన్నాడీఎంకే హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని డీఎంకే పాలకులు తుంగలో తొక్కేశారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం రాష్ట్రాన్ని ఓ అబద్ధాల కోరు పాలిస్తున్నారని స్టాలిన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

- డీఎంకే పాలనపై నిప్పులు చెరిగిన పళణి స్వామి
- సీఎం స్టాలిన్ ఓ అబద్ధాల కోరని వ్యాఖ్య
- మదురై వేదికగా బల ప్రదర్శన
- మహానాడుకు భారీగా తరలి వచ్చిన మద్దతుదారులు



మదురై మహానాడుకు తరలివచ్చిన అన్నాడీఎంకే కార్యకర్తలు (ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న పళనిస్వామి


హెలికాప్టర్ ద్వారా పూల వర్షం


కార్యకర్తలకు భోజన వసతి

సాక్షి,చెన్నై: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా పగ్గాలు చేపట్టినానంతరం తొలిసారి.. పళణిస్వామి ఆదివారం మదురై వేదికగా తన బలాన్ని చాటుకున్నారు. ఇక్కడి వలయకులం మైదానంలో అన్నాడీఎంకే వీర చరిత్రలో స్వర్ణోత్సవ చైతన్య పేరుతో మహానాడును ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున కేడర్ తరలివచ్చింది. ఉదయాన్నే ఇక్కడ జరిగిన కార్యక్రమంలో భాగంగా 51 అడుగుల స్తూపంపై పార్టీ జెండాను పళణి స్వామి ఎగుర వేశారు. ఈసమయంలో హెలికాప్టర్ ద్వారా పువ్వుల వర్షాన్ని కురిపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు కార్యక్రమాలు జరిగాయి. దివంగత నేతలు ఎంజీఆర్, జయలలిత, అన్నాడీఎంకే చరిత్రను చాటే విధంగా ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం తర్వాత నేతలు తమ ప్రసంగాల ద్వారా డీఎంకేను టార్గెట్ చేసి విమర్శనాస్త్రాలను ఎక్కు బెట్టారు. తరలి వచ్చిన కార్యకర్తల కోసం మూడు పూట్ల భోజన సౌకర్యాలు కల్పించారు. అయితే కొంత మంది ఈ వసతులపై అసంతృప్తిని వ్యక్తం చేశారు.

సాధించి చూపుతా..

మహానాడు వేదికగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి ప్రసంగిస్తూ, అన్నాడీఎంకే హయాంలో ఈ రాష్ట్రం అన్ని రంగాల్లో ఉన్నత స్థానంలో నిలించిందని వివరించారు. అయితే, డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కి వెళ్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధాల కోరుగా ఉన్న ఈ సీఎం, తన మాయ మాటలతో ఈ రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటన్నారని ఆరోపించారు. పైగా అన్ని రంగాలలో ప్రగతి పథంలో ఉన్నట్లు తప్పుడు సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ హయాంలో తీసుకొచ్చిన ప్రజా హిత పథకాలన్నీ తుంగలో తొక్కేశారని, ప్రాజెక్టులన్నీ కనుమరుగు చేసి, వాటి స్థానంలో కొత్త రంగు పులిమే పనిలో పడ్డారని విమర్శించారు. ఎన్నో విపత్తులను సమర్థంగా ఎదుర్కొని ప్రజలకు అండగా నిలబడ్డ పార్టీ తమదేనని ధీమా వ్యక్తం చేశారు. దివంగత నేతలు ఎంజీఆర్, జయలలిత మార్గదర్శకంలోని అన్నాడీఎంకేలో సామాన్య కార్యకర్త సీఎంగానే కాదు, పార్టీకి ప్రధాన కార్యదర్శి అయ్యేందుకు సైతం అవకాశం ఉందని వివరించారు.

అన్నింటా అవినీతి..

డీఎంకే హయాంలో అవినీతి పెట్రేగిందని, సగటున రోజుకు రూ.10 కోట్లు, టాస్మాక్‌లో రూ.100 కోట్లకు పైగా అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రైతులు, ప్రజల పక్షాన నిలబడి అన్నాడీఎంకే పోరాడుతుంటే, పాలకులు మాత్రం వారిని అష్టకష్టాలకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. కొత్త వైద్య కళాశాలలు, కొత్త జిల్లాలు, రైతు, జాలర్ల సంక్షేమమే లక్ష్యంగా బృహత్తర కార్యక్రమాలను తాము చేపట్టామని గుర్తు చేశారు. అయితే కొత్త జిల్లాల్లో అభివృద్ధి శూన్యమని, రైతు, జాలర్లకు కన్నీళ్లే మిగిలాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మహానాడు తమిళనాడు చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. ఇక్కడకు 15 లక్షల మంది కార్యకర్తలు తరలి వచ్చారని, స్వర్ణోత్సవ వేళ సరికొత్త రికార్డుగా ప్రకటించారు. ఈ మహానాడులో పార్టీ నేతలు కేపీ మునుస్వామి, తమిళ్ మగన్ హుస్సేన్, సెల్లూరు రాజు, ఆర్‌బీ ఉదయకుమార్, వలర్మతి, గోకుల ఇందిర, జయకుమార్‌తో పాటు ముఖ్యులందరూ హాజరయ్యారు. ఈ మహానాడు దృష్ట్యా, మదురై పరిసరాల్లో తీవ్ర ట్రాఫిక్ ఆటంకం ఏర్పడింది. పోలీసులు, ప్రైవేటు సెక్యూరిటీ భద్రతా విధుల్లో నిమగ్నమయ్యారు. కాగా, ఈ మహానాడు నిమిత్తం కర్ణాటక నుంచి ముత్తు అనే కార్యకర్త సైకిల్‌పై తరలి వచ్చి అందరినీ ఆకర్షించాడు.

ఇకపై పురట్చి తమిళర్..

ఈ మహానాడు వేదికగా పళణి స్వామికి పురట్చి తమిళర్ అన్న బిరుదును ప్రదానం చేశారు. దివంగత నేత ఎంజీఆర్‌ను పురట్చి తలైవర్ (విప్లవ నాయకుడు), జయలలితను పురట్చి తలైవి అని పిలవడం జరుగుతోంది. ఆ బాటలో ప్రస్తుతం ఏక నాయకత్వమే లక్ష్యంగా అన్నాడీఎంకేను తన గుప్పెట్లోకి తెచ్చుకున్న పళని స్వామికి పురట్చి తమిళర్ అన్న బిరుదును ప్రదానం చేశారు. అలాగే, ఈ మహానాడులో 32 తీర్మానాలు చేశారు. ఇందులో గృహిణులు అందరికీ రూ. 1000 నగదు పంపిణీ పథకం అమలు చేయాలని, తమిళనాడులోని కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థలలోనూ తమిళం తప్పని సరి చేయాలని, పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కల్పించాలని, తమిళ గ్రంథం తిరుక్కురల్‌ను జాతీయగ్రంథంగా ప్రకటించాలని ఈ తీర్మానాల ద్వారా డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా పళనిస్వామి నేతృత్వంలో ఓ వైపు మదురైలో మహానాడు జరిగితే చెన్నైలో మాజీ సీఎం పన్నీర్‌సెల్వం తన మద్దతు ముఖ్య నేతలతో సమావేశం కావడం గమనార్హం.

క్లుప్తంగా

ఎస్ఐపై దాడి

కొరుక్కుపేట: చెన్నై రాయపురం వెంకటేషన్ వీధికి చెందిన సుకుమార్ (57) ట్రిప్లికేన్ క్రైం బ్రాంచ్ పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. కాశిమేడు సీజీ కాలనీకి చెందిన ఆయన కుమార్తె పవిత్ర (29), దీపన్ చక్రవర్తితో తల్లిదండ్రుల సమక్షంలో 2017లో వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. ఈ నేపథ్యంలో నిత్యం చక్రవర్తి మద్యం తాగి వచ్చి, పవిత్రతో ఘర్షణ పడేవాడు. ఈ క్రమంలో శనివారం సుకుమార్ అనే వ్యక్తి వారించే క్రమంలో సుకుమార్‌పై దాడి చేశాడు. దీనిపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నవ వధువు అనుమానాస్పద మృతి

• భర్త అరెస్టు

అన్నానగర్: కడలూరు జిల్లా భువనగిరి సమీపంలోని అలంపాడి గ్రామానికి చెందిన మోహన్ కుమారుడు మామలైవాసన్ (27). ఫోన్ లైన్ మెషిన్ డ్రైవర్ అయిన ఇతనికి దిట్టక్కుడిలోని తాజనల్లూరు గ్రామానికి చెందిన రాజవేల్ కుమార్తె అభినయ(18)తో ఆరు నెలల క్రితం వివాహమైంది. ఈ క్రమంలో శనివారం రాత్రి అభినయ ముక్కుపై రక్తపు గాయాలతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. షాక్‌కు గురైన ఇరుగుపొరుగు వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆ తర్వాత మరుధూరు పోలీసులు అక్కడికి చేరుకుని అభినయ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విల్లుపురం ముండియంబాక్కం ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో తన కుమార్తె మృతిపై అనుమానం ఉందని అభినయ తల్లి గీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం భర్త మామలైవాసన్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

భవనంపై నుంచి పడి యువకుడి మృతి

అన్నానగర్: చెన్నై వడపళని దక్షిణ శివాలయం వీధికి చెందిన సుధాకర్ (37). ఈయన ఇటీవల అదే ప్రాంతంలోని అలఘర్ పెరుమాల్ కోవిల్ స్ట్రీట్‌లోని ఓ అపార్ట్‌మెంట్ భవనం టెర్రస్‌పై మేనల్లుడు కుమార్తె పుష్పవతి ఫంక్షన్‌లో పాల్గొన్నారు. ఈ క్రమంలో సుధాకర్ మద్యం మత్తులో అనూహ్యంగా సుధాకర్ 3వ అంతస్తు నుంచి జారి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు రక్షించి చికిత్స నిమిత్తం రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ అతనికి అత్యవసర చికిత్స అందిస్తూవచ్చారు. ఈనేపథ్యంలో సుధాకర్ ఆదివారం వేకువజామున మృతి చెందాడు. వడపళని పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కనుల పండువగా ఆలయ కుంభాభిషేకం



హాజరైన భక్తులు



పుణ్యజలాలతో ఆలయ గోపురాన్ని అభిషేకం చేస్తున్న అర్చకులు

తిరువళ్లూరు: పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ వైద్యవీరరాఘవస్వామి ఆలయ ఆవరణలోని శ్రీలక్ష్మీ వరాహ స్వామి వారి ఆలయ కుంభిభిషేకం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వివరాలు.. తిరువళ్లూరు వైద్య వీరరాఘవస్వామి ఆలయ ఆవరణంలో శ్రీ లక్ష్మి వరాహ స్వామి, ఆంజనేయస్వామి వారి ఆలయాలు హృదయనాశిని పుష్కరిణి వద్ద ఉన్నాయి. ఈ రెండూ ఆలయాలు శిథిలావస్థకు చేరడంతో మూలవర్, విమాన రాజగోపురం, ఆలయ పరిసరాలను పునఃనిర్మించాలని నిర్ణయించి గత ఏడాది పనులను ప్రారంభించారు. పనులు పూర్తయిన నేపథ్యంలో కుంభాబిషేకం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే గత 17న విఘ్నేశ్వరపూజ, వాస్తుశాంతి, లక్ష్మీహోమం, యాగశాల పూజలు నిర్వహించారు. కుంభాభిషేకం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 6.45గంటలకు యాగశాల వద్ద పుణ్యజలాలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజగోపురం, విమానకలశంపై పుణ్యజలాలను వదిలి కుంభాభిషేకం చేపట్టారు. కుంభాభిషేకం అనంతరం లక్ష్మీవరాహస్వామివారు, ఆంజనేయుడిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంక్ అసెట్ ఫెయిర్‌కు స్పందన



అసెట్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహేష్ కుమార్ బజాజ్

కొరుక్కుపేట: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో చేపట్టిన అసెట్ ఫెయిర్‌కు అనూహ్య స్పందన లభించింది. చెన్నై రాయపేటలోని ఎక్స్‌ప్రెస్ అవెన్యూ మాల్ వేదికగా ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇండియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహేష్ కుమార్ బజాజ్, చీఫ్ జనరల్ మేనేజర్ వీఎస్ మాయ సమక్షంలో జనరల్ మేనేజర్- రికవరీ ఆర్.కె.దాస్, జనరల్ మేనేజర్ రికవరీ అండ్ లీగల్ ఎస్. సెంథిల్ కుమార్, శివ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇండియన్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ఎల్ జైన్ మాట్లాడుతూ సురక్షిత ఆస్తుల నుంచి జాగ్రత్తగా క్యూరేట్ చేయబడిన భారతదేశంలోని నగరాల నుంచి విస్తృత పెట్టుబడి అవకాశాలను అందించడానికి వీలుగా ఈ అసెట్ ఫెయిర్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆస్తుల విక్రయమే లక్ష్యం ఈనెల 23, సెప్టెంబర్ 20వ తేదీలలో మెగా ఈ-వేలాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.. ఫెయిర్‌లో 727 నివాస, వాణిజ్య, పారిశ్రామిక అంశాలకు సంబంధించిన ఆస్తుల వివరాలకు సంబంధించిన స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

విజయనగర కాలం నాటి రాతి ఫలకం లభ్యం



లభ్యమైన రాతి ఫలకం

అన్నానగర్: తిరుపత్తూరు సమీపంలో ఆదివారం విజయనగర కాలం నాటి మధ్య రాతి ఫలకం లభ్యమైంది. తిరుపత్తూరు ప్యూర్ హార్ట్ కాలేజ్ తమిళ విభాగం ప్రొఫెసర్ కె.మోహన్ గాంధీ, ఇంగ్లిష్ విభాగం ప్రొఫెసర్ మధన కుమార్, ఇంజినీరింగ్ ఎం.మునిసామి, నేత్ర వైద్య నిపుణుడు వినోదిని, ఇంజనీర్ జార్జ్ విలియం రంగంలోకి దిగి ఓ రాతి ఫలకాన్ని గుర్తించారు. పంచనాంబట్టి గ్రామం తిరుప్పత్తూరు నుంచి సేలం ప్రధాన రహదారిలో 5 కి.మీ. పరిశోధనా బృందం పరిశీలన చేపట్టి విజయనగర కాలం నాటి రాతి ఫలకాన్ని వెలికి తీసిందని అధికారులు వెల్లడించారు.

టాస్మాక్ బార్ ఉద్యోగి హత్య

అన్నానగర్: నెల్లై సమీపంలో ఓ ముఠా దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న టాస్మాక్ బార్ ఉద్యోగి ఆదివారం మృతి చెందాడు. దీంతో అతడి అన్న, తమ్ముడుని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. నెల్లై సమీపంలోని పెట్టై అశోకర్ వీధికి చెందిన ఇశవరసన్ (32). ఇతను పేట్టై కరుంగాడు రోడ్డులోని టాస్మాక్ బార్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అభిప్రాయ భేదాల కారణంగా భార్య విడిపోయింది. గత 12వ తేదీ రాత్రి ఇశవరసన్ అశోకర్ వీధిలోని పెరుమాల్ దేవాలయం సమీపంలో నిలబడి ఉండగా ఓ బృందం అతనిపై కత్తి, రాడ్‌తో దుండగులు తీవ్రంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతను నెల్లై ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. చికిత్స ఫలించక ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఫిర్యాదు ఆధారంగా అదే ప్రాంతానికి చెందిన మారియప్పన్, అతని భార్య సుడలి, కుమారులు మాధవన్, చంద్రూ అనే నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేసి మాధవన్, చంద్రుని అరెస్టు చేశారు. మారియప్పన్, సుడలి ఇద్దరి కోసం వెతుకుతున్నారు. భూవివాదాల కారణంగానే హత్య జరిగినట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలింపు

• టిప్పర్ డ్రైవర్ అరెస్టు

సేలం: ఈరోడ్ జిల్లా అప్పకూడల్ రోడ్డులోని పున్నం జంక్షన్‌లో అప్పకూడల్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అనంతరం అటుగా వస్తున్న టిప్పర్ లారీని నిలిపి సోదాలు చేశారు. వీటిలో కంకర ఉన్నట్లు గుర్తించారు. అనంతరం టిప్పర్ లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. విచారణలో నిందితుడు రవిచంద్రన్ (31) తోప్పూర్ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అనంతరం లారీని సీజ్ చేశారు.

డీఎంకే నాయకుల నిరాహార దీక్ష



వేలూరు: గాంధీ విగ్రహం ఎదుట దీక్ష చేస్తున్న డీఎంకే కార్యకర్తలు



తిరువళ్లూరులో..

వేలూరు: నీట్ పరీక్షలను రద్దు చేయాలని కోరుతూ డీఎంకే పార్టీ యువజన విభాగం, వైద్య విభాగం ఆధ్వర్యంలో వేలూరు కోట మైదానంలో ఉన్న గాంధీ విగ్రహం ఎదుట ఆదివారం ఉదయం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే నందకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో నీట్ పరీక్షలను రద్దు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపినా కనీస గౌరవం కూడా ఇవ్వకుండా తమ ప్రభుత్వాన్ని వేధింపులకు గురి చేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని, రాష్ట్ర గవర్నర్ తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని ప్రజలు అన్నింటినీ చూస్తున్నారని త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ దీక్షలో పార్లమెంట్ సభ్యులు కదీర్ ఆనంద్, ఎమ్మెల్యేలు అములు, కార్తికేయన్, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, జెడ్పీ చైర్మన్ బాబు, మాజీ ఎంపి మహ్మద్‌సఖీ, కార్పొరేటర్‌లు, డీఎంకే నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తిరువళ్లూరులో..

తిరువళ్లూరు: రాష్ట్రంలో నీట్ పరీక్షల రద్దు విషయంలో గవర్నర్ తీరును నిరసిస్తూ డీఎంకే యువజన విభాగం పిలుపు మేరకు తిరువళ్లూరులో ఆదివారం ఉదయం ఆ పార్టీ నాయకులు నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ ఆందోళన కార్యక్రమానికి జిల్లా కన్వీనర్‌లు ఆవడి నాజర్, తిరుత్తణి చంద్రన్, గుమ్మిడిపూండి టీజే గోవిందరాజన్ తదితరులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఆవడి ఎమ్మెల్యే నాజర్ మాట్లాడుతూ ప్లస్-2 పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు సైతం నీట్ పరీక్షల్లో రాణించలేకపోతున్నారని వాపోయారు. లక్షలాది ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు డాక్టర్ కావాలన్న ఆశలపై నీట్ పరీక్ష నీళ్లు చల్లుతోందని ఆరోపించారు. ఈ పరీక్షను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తే విద్యావ్యవస్థతో పాటు ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వం పల్లకి మోస్తున్న అన్నాడీఎంకేను సైతం రాష్ట్రం నుంచి వెలివేయాలని పిలుపు నిచ్చారు. ఈ ఆందోళన కార్యక్రమంలో తిరువళ్లూరు ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్, పూందమల్లి ఎమ్మెల్యే కృష్ణస్వామి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ శేఖర్ తదితురులు పాల్గొన్నారు.

మళ్లీ చిత్ర నిర్మాణంలోకి ధనుష్



నటుడు ధనుష్, దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్

తమిళసినిమా: కోలీవుడ్ నుంచి హాలీవుడ్ స్థాయికి ఎదిగిన నటుడు ధనుష్. నటుడుగా , గీత రచయితగా, గాయకుడిగా, దర్శకుడుగా, నిర్మాతగా తన ప్రతిభను చాటుకుంటూ ఉన్నత స్థాయిలో రాణిస్తున్న ధనుష్ ప్రస్తుతం బిజీ హీరో. కథానాయకుడిగా 50 చిత్రాల మైల్ స్టోన్ టచ్ చేసిన ధనుష్ ప్రస్తుతం కెప్టెన్ పిల్లర్ చిత్రాన్ని పూర్తిచేసి తన 50వ చిత్రం షూటింగ్ కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం డిసెంబర్ 15వ తేదీన తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది. ఇందులో ధనుష్ గెటప్ ఇటీవల విడుదలైన టీజర్ చిత్రంపై భారీ అంచనాలను పెంచేస్తోంది. చిత్ర టీజర్ ఇప్పటికే 30 మిలియన్ల వ్యూస్‌ను దాటేసిందని టాక్. ఇందులోని వార్ సన్నివేశాలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. కాగా ధనుష్ ప్రస్తుతం స్వీయ దర్శకత్వంలో తన 50వ చిత్రంలో నటిస్తున్నారు. తదుపరి శేఖర్ కమ్ములు దర్శకత్వంలో తమిళం తెలుగు భాషల్లో రూపొందనున్న చిత్రంతో పాటు బాల్కీ దర్శకత్వంలో ఒక హిందీ చిత్రంలోనూ నటించమన్నారు. ఇకపోతే ధనుష్ నిర్మాతగా 3, ఎదుర్ నీచ్చల్, వేలై ఇల్లా పట్టాదారి, కాకి సాష్ట, కాకాముట్టై, మారి, నానుమ్ రౌడీథాన్, విచారణై, కాలా, వడ చెన్నై వంటి విజయవంతమైన చిత్రాలు నిర్మించారు. చివరిగా 2018లో మారి 2 చిత్రాన్ని నిర్మించారు. ఆ తర్వాత చిత్ర నిర్మాణానికి దూరంగా ఉన్నారు. అలాంటిది ఐదేళ్ల గ్యాప్ తర్వాత మళ్లీ చిత్ర నిర్మాణానికి సిద్ధమవుతున్నారు. ధనుష్ ఇప్పటివరకు 14 చిత్రాలను నిర్మించారు. తన వండర్ బార్ ఫిలింస్ సంస్థలో 15వ చిత్రం మారి మారి సెల్వరాజ్ దర్శకత్వంలో నిర్మించి కథానాయకుడుగా నటించనున్నట్లు ఇటీవలే వెల్లడించారు. కాగా తాజాగా ఆదివారం మరో చిత్రం గురించి ప్రకటన విడుదల చేశారు. కెప్టెన్ మిల్లర్ చిత్ర దర్శకుడు అరుణ్ మాదేశ్వరన్ దర్శకత్వంలో వండర్ బాల్ ఫిలిమ్స్ సంస్థలో చిత్రం చేయనున్నట్లు ధనుష్ వెల్లడించారు.

కోలీవుడ్ టాక్స్

చాలు ఇంతటితో ఆపేయండి



కీర్తి సురేష్

తమిళసినిమా : దక్షిణాదిలో మంచి పేరున్న యువ నటి కీర్తి సురేష్. గ్లామర్ పాత్రలైనా డీ గ్లామర్ పాత్రలైన తనదైన ముద్ర వేస్తూ ముందుకు సాగుతున్నారు. ఆ మధ్య తెలుగులో మహేష్ బాబు సరసన సర్కారు వారి పాటు చిత్రంలో గ్లామరస్ పాత్రలో మెరిశారు. కాగా తమిళ్ చిత్రం సాని కాగితంలోనూ ఇటీవల నటించిన తెలుగు చిత్రం దసరాలోనూ చక్కని అభినయంతో పేరు తెచ్చుకున్నారు. అలాగే ఇటీవల మామన్నన్ చిత్రంలో గ్లామర్ తావు లేకుండా చాలా సహజమైన నటన ప్రదర్శించారు. ఇలా కథానాయకిగా తనకంటూ ఒక మంచి ఇమేజ్‌ను సొంతం చేసుకున్న కీర్తి సురేష్ ఇంతకుముందు రజనీకాంత్‌కు చెల్లెలుగా అన్నాత్తే చిత్రంలో నటించారు. ఆ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించలేదు. ఇక తాజాగా తెలుగులో చిరంజీవికి చెల్లెలిగా నటించిన భోళాశంకర్ చిత్రం ఘోరంగా బోల్తా కొట్టింది. ఈ చిత్రాల అపజయాలను కీర్తి సురేష్ అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో కొందరు వీరాభిమానులు ఆమెకు అడ్వైజ్ ఇచ్చేస్తున్నారు. చాలా ఓవర్‌గా వెళుతున్నారు. ప్లీజ్ చెల్లెలిగా నటించడం ఇకపై ఆపేయండి అని సలహాలు ఇస్తున్నారు. ఓ ప్రముఖ కథానాయకిగా రాణిస్తున్న మీరు సీనియర్ హీరోలకు చెల్లెలిగా నటిస్తున్నారని, అలా రెండు చిత్రాల్లో నటించింది చాలని, ఇకపై ఏ హీరోకి చెల్లెలిగా నటించవద్దని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇమేజ్‌ని చెడగొట్టుకోకుండా ఇకపై కథానాయకిగానే నటించాలని, మీలో మంచి ప్రతిభ ఉందని దాన్ని వృథా చేసుకోవద్దని కీర్తి సురేష్‌కు అభిమానులు హితవు పలుకుతున్నారు. మరి అభిమానుల మాటలను కీర్తి సురేష్ అర్థం చేసుకుంటారా..? లేదా..? కాలమే నిర్ణయించాల్సి ఉంది.

ఆహాలో వేర మారి ఆఫీస్



వేరే మారి ఆఫీస్ వెబ్ సిరీస్ యూనిట్ సభ్యులు

తమిళసినిమా: ఆహా ఓటీటీ సంస్థ ప్రతిభావంతులైన యువ కళాకారులను ప్రోత్సహించే విధంగా పలు చిత్రాలను, వెబ్ సిరీస్‌లను నిర్మిస్తోంది. అలా ఈ సంస్థ తమ ఓటీటీలో స్ట్రీమింగ్ చేస్తున్న తాజా వెబ్ సిరీస్ వేర మారి ఆఫీస్. శివకాంత్ నిర్మించిన ఈ ఎఫ్ సిరీస్ ను చిదంబరం మణివన్నన్ దర్శకత్వం వహించారు. నటుడు విష్ణు విజయ్, ఆర్జే విజయ్, విక్కల్స్ విక్రమ్, డీజే పార్వతి, శ్యామ, లావణ్య, విజేత పబ్బు, సౌందర్య, నంజుండన్, కన్నదాసన్ సంజీవ్ మొదలగు వారు ప్రధాన పాత్రలు పోషించారు. ఆరు ఎపిసోడ్‌లుగా రూపొందిన ఈ వెబ్ సిరీస్ ఇప్పటికే మూడు ఎపిసోడ్స్ ఆహా నూరు శాతం ఎంటర్‌టైన్‌మెంట్ ఓటిటీ ప్లాట్ ఫామ్‌లో స్ట్రీమింగ్ అయ్యి 15 మిలియన్ల ప్రేక్షకులు వీక్షించినట్లు యూనిట్ సభ్యులు వెల్లడించారు. ఈ సంఖ్య మరింత పెరగాలనే ఆకాంక్షతో మరిన్ని ఎపిసోడ్స్ చేసే దిశగా శనివారం సాయంత్రం చెన్నై, వడపళనిలోని ఓ మాల్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహా సంస్థ ప్రధాన నిర్వాహకురాలు కవిత మాట్లాడుతూ వేర మారి ఆఫీస్ వెబ్ సిరీస్ ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ చేయడం సంతోషంగా ఉందన్నారు.వేర మారి ఆఫీస్ వెబ్ సిరీస్‌కు ఆహా ఓటీటీకు ఓ సారూప్యం ఉందన్నారు. ఈ కథ చిత్రాలకు, వెబ్ సిరీస్‌కు ప్రాముఖ్యత నివ్వాలనే ఉద్దేశంతోనే ఆహా ఓటీటీని ప్రారంభించినట్లు చెప్పారు. అదేవిధంగా ఇంతకుముందు పెట్టుకోవాలి, కారి రత్తసాక్షి వంటి విభిన్న వెబ్ సిరీస్‌ను అందించినట్లు చెప్పారు. ఇప్పుడు అదే కోవలోకి వేర మారి ఆఫీస్ చేరుతుందన్నారు. షూటింగ్ సమయంలో నిరుద్యోగ సమస్యలు, స్టార్ట్ అప్ కంపెనీల దినదినాభివృద్ధి వంటి సమకాలిన విషయాలను జోడించి మరింతగా మెరుగులు దిద్దుతున్నట్లు వివరించారు.


చికిత్స కోసం అమెరికాకు సమంత



సమంత

తమిళసినిమా: నటి సమంత ఇప్పుడు నటించినా, నటించకపోయినా, నవ్వినా, కంటతడి పెట్టినా అది వార్తే అవుతోంది. అదీ ఆమె స్టామినా. ఈమధ్య మయోసైటీస్ అనే అరుదైన వ్యాధికి గురైన ఈ సంచలన నటి దాని నుంచి బయటపడడానికి పలు రకాల వైద్య చికిత్సలను పొందుతూ వచ్చారు. దీంతో ఆ వ్యాధి నుంచి కొంచెం స్వావలంబన కలిగినా పూర్తిగా నయం కాలేదు. కాగా ఇటీవల వైద్య చికిత్స కోసం అంటూ నటనను ఏడాది పాటు రద్దు చేసుకుని విదేశాలకు వెళ్లారు. అయితే కోయంబత్తూర్, గోవా, సింగపూర్ వంటి వివిధ ప్రాంతాల్లో యోగా, ధ్యానం, డాన్స్ వంటివి చేస్తూ కొన్ని రోజులు గడిపారు. కాగా ఇటీవల హైదరాబాద్ కు తిరిగొచ్చిన ఆమె తాను నటించిన ఖుషీ చిత్రం ఆడియో వేడుకలో పాల్గొని సందడి జేశారు. ఆ వేదికపై ఆమె అభిమానుల ప్రేమే తనకు ప్రాణం అని పేర్కొన్నారు. ఇప్పుడు వైద్య చికిత్స కోసం వెళుతున్నానని, సంపూర్ణ ఆరోగ్యంతో నూతన ఉత్సాహంతో తిరిగి వచ్చి మళ్లీ చిత్రాల్లో నటించి మిమ్మల్ని ఖుషీ.. చేస్తానని పేర్కొన్నారు. కాగా తాజాగా నటి సమంత వైద్య చికిత్స కోసం అమెరికాకు బయలుదేరారు. అక్కడ న్యూయార్క్ నగరంలోని ప్రముఖ ఆసుపత్రిలో చికిత్స పొందనున్నారు ఇందుకోసం ఆమె అక్కడ కొన్ని నెలల పాటు ఉండబోతున్నట్లు సమాచారం. సమంత పూర్తిగా మయోసైటిస్ వ్యాధి నుంచి కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆమె అభిమానులు కోరుకుంటున్నారు.

సూపర్ స్టార్ ఒక్కడే.. అది రజనీకాంతే



అంగారకన్ చిత్ర యూనిట్

తమిళసినిమా: నటుడు సత్యరాజ్ మళ్లీ విలన్ అవతారమెత్తారు. జూలియస్ అండ్ జీరో మా ఇంటర్నేషనల్ పతాకంపై జోమోన్ ఫిలిప్, జీనా రోమోన్ కలిసి నిర్మిస్తున్న చిత్రం అంగారకన్. శ్రీపతి కథానాయకుడిగా నటించి, కథనం, క్రియేటివ్ దర్శకత్వం బాధ్యతలను నిర్వహించిన ఈ చిత్రంలో సత్యరాజ్ డేరింగ్ పోలీస్ అధికారిగా ప్రతి నాయకుడి పాత్రలో నటించారు. మలయాళ నటి నియా కథానాయకిగా నటించిన ఈ చిత్రంలో అంగాడి తెరు మహేష్, రెయినా కారత్, రోషన్, అప్పుకుట్టి, దియా, నేహా రోస్, గురు చంద్రన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. దర్శకుడు రామ్ గోపాల్ వర్మ శిష్యుడు మోహన్ డచ్చు ఈచిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కాగా నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న అంగారకన్ సెప్టెంబర్ 8వ తేదీన విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం చెన్నైలో చిత్ర యూనిట్ మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న నటుడు సత్యరాజ్ మాట్లాడుతూ చిత్ర దర్శకుడు శ్రీపతి తనకు కథ చెప్పే ముందే ఇందులో తాను హీరో, మీరు విలన్ ఓకేనా అని అడిగారన్నారు. బాహుబలి చిత్రంలో నటించినప్పుడు దర్శకుడు రాజమౌళి కూడా ఇలానే తనను అడిగారన్నారు. నటుడు ప్రభాస్ కాలును మీ తలపై పెట్టుకోవాలి అందుకు ఓకేనా..? అని ఆయన అడిగారన్నారు. కాగా ఈ చిత్ర దర్శకుడు శ్రీపతి కథ పూర్తిగా చెప్పినప్పుడు తనకు నచ్చిందన్నారు ఇందులో నటించడానికి మంచి అవకాశం ఉందన్నారు. వరుసగా తండ్రి పాత్రల్లో నటించడం బోర్ కొట్టడంతో మంచి విలన్ పాత్ర వస్తే నటించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. పార్టీ ప్రారంభించడం అనేది ప్రస్తుతం ఓటు బ్యాంకు రాజకీయం అన్నారు. అయితే ప్రజలకు మంచి సందేశం ఇవ్వడం కూడా రాజకీయమేనని, అలాంటి వారి వెనుక తాను ఉంటారని చెప్పారు. సూపర్ స్టార్ చర్చ గురించి మాట్లాడుతూ ఎళిసై మన్నర్,మక్కల్ తిలకం,, నడిగర్ తిలకం అంటూ కాలానికి తగ్గట్టుగా పట్టం మారుతూ ఉంటుందని తనకు తెలిసినంతవరకు నటుడు రజనీకాంత్ మాత్రమే నిజమైన సూపర్ స్టార్ అని సత్యరాజ్ పేర్కొన్నారు.

క్లుప్తంగా

పెళ్లయిన 9 నెలలకే పోలీసు ఆత్మహత్య

అన్నానగర్: పెళ్లయిన 9 నెలలకే మదురై పోలీసు ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. శివగంగై జిల్లా తిరుప్పువనం అల్లి పట్టణం ప్రాంతానికి చెందిన నారాయణన్ కుమారుడు రాజ్ ప్రభాకరన్ (26) మదురై ఆర్మీ ఫోర్సెస్ 6వ బెటాలియన్‌లో పోలీసు అధికారిగా పనిచేస్తున్నాడు. అక్కడి ఆర్మ్‌డ్ ఫోర్సెస్ గార్డ్స్ క్వార్టర్స్‌లో నివసిస్తున్నాడు. ఈ స్థితిలో శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ప్రాణాలతో పోరాడుతున్న అతడిని రక్షించి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ ఘటనపై తాళ్లకుళం పోలీసులు కేసు నమోదు చేసి, పోలీసు రాజ్ ప్రభాకరన్ ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. ఇతనికి 9 నెలల క్రితం వివాహమైంది. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు తలెత్తాయి. దీంతో రాజ్ ప్రభాకరన్ భార్య తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు విచారణలో తేలింది.

కారు ఢీకొని ఇద్దరు యువకుల మృతి

అన్నానగర్: బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు.. పుదుచ్చేరిలోని విల్లియనూర్ ప్రాంతానికి చెందిన స్నేహితులు భాస్కర్ (34), ప్రకాష్ (35) చెన్నైలో నిర్మాణ పనులు చేస్తున్నారు. వీరితో పని చేసే మరో స్నేహితుడికి అతని స్వగ్రామమైన విల్లుపురం జిల్లా సెంజి సమీపంలోని బాక్కం గ్రామంలో వివాహం జరిగింది. రిసెప్షన్‌లో పాల్గొనేందుకు వారు శనివారం రాత్రి చెన్నై నుంచి బైకులో బయలుదేరారు. సెంజీ–తిరువణ్ణామలై రహదారిపై పెరుంగాపూర్ రిజర్వు ఫారెస్టు సమీపంలో తిరువణ్ణామలై నుంచి సెంజి వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకులో వెళుతున్న భాస్కర్, ప్రకాష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న సెంజి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమ్మితం పుదుచ్చేరి జిప్మర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

స్పృహతప్పి పడిపోయిన మానసిక రోగి

కొరుక్కుపేట: తండయార్ పేట కలరా ఆసుపత్రిలోని పురుషుల మానసిక ఆరోగ్య ఆశ్రమంలో చికిత్స పొందుతున్న మహేష్ (36) శనివారం స్పృహతప్పి పడిపోయాడు. అతన్ని వెంటనే ఆర్రైవ్ కోఆర్డినేటర్ అరవింద్ స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కొత్త చాకలిపేట పోలీసులు కేసు నమోదు చేసి సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో విచారణ చేపట్టారు. మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న మహేష్‌ను రైల్వే సెక్యూరిటీ ఫోర్స్ పోలీసులు 2022 జూన్‌లో రక్షించి కిల్‌పాక్కం మెంటల్ ఆశ్రమంలో చేర్చారు. గతేడాది అక్టోబర్‌లో తండయార్ పేటలోని మానసిక ఆరోగ్య సంరక్షణ కేంద్రానికి తరలించారు. కొన్ని రోజులుగా మహేష్ రాత్రి పూట ఎవరినీ డిస్టర్బ్ చేయకుండా ఉన్నాడు. దీంతో ఆగ్రహానికి గురై షెల్టర్‌లోని అరుగురు అతడిపై దాడి చేశారు. మహేష్ ఛాతిపై, కుడి మోచేతికి గాయాలైనట్టు సమాచారం. పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

తరగతి గదుల తాళాలకు మలం పూసిన విద్యార్థి అరెస్టు

తిరుత్తణి: పాఠశాల తరగతి గదుల తాళాలకు మలం పూసిన విద్యార్థిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. తిరుత్తణి యూనియన్ మద్దూరు ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో నాలుగు తరగతి గదుల తాళాలకు మానవ మలం పూసిన ఘటన శుక్రవారం కలకలం రేపింది. సంఘటనకు సంబందించి డీఎస్పీ విఘ్నేష్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టి అదే పాఠశాలలో ప్లస్ టూ చదువుతున్న ఒక విద్యార్థిని అదుపులోకి తీసుకుని విచారించారు. పాఠశాలలో చోటుచేసుకున్న ప్రతి చిన్న సమస్యను సైతం తనకు ఆపాదిస్తున్నారని, తనంటే ఉపాధ్యాయులకు నచ్చడం లేదని, ఉపాధ్యాయులపై కోపాన్ని చూపించాలనే మలం తీసుకొచ్చి తాళాలకు పూసినట్లు విద్యార్థి తెలిపాడు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పళ్లిపట్టు: పళ్లిపట్టులో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. పలువురు యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తం దానం చేశారు. పళ్లిపట్టు లయన్స్ క్లబ్, మెగా ఫ్యాన్స్ అసోసియేషన్ సంయుక్తంగా స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఈశ్వర్‌ప్రసాద్, మెగా ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధీర్‌రాయల్ అధ్యక్షతన వహించారు. శిబిరాన్ని ఫారెస్ట్ రేంజర్ సుందరం ప్రారంభించారు. ఎన్‌టీఆర్ బ్లడ్ బ్యాంకు వారిచే చేపట్టిన రక్తదాన శిబిరంలో యువత ఆసక్తిగా పాల్గొని రక్తదానం చేశారు. ఉదయం నుంచి మాధ్యాహ్నం వరకు నిర్వహించిన శిబిరంలో 83 యూనిట్ల రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వ్యక్తులకు సర్టిఫికెట్లు, పండ్లు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం ఆర్ముగం, పళనిబాబు, లయన్స్‌క్లబ్ శ్రేణులు, మెగా ఫ్యాన్స్ అభిమానులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి



రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేస్తున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు

వేలూరు: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు వేలూరు, తిరువణ్ణామలై జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. వాడవాడలా రాజీవ్ చిత్ర పటాన్ని ఉంచి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వేలూరు కలెక్టరేట్‌లో కార్యాలయ సిబ్బంది అధ్వర్యంలో కలెక్టర్ కుమరవేల్ పాండియన్ రాజీవ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం తీవ్ర వాదానికి వ్యతిరేకంగా కార్యాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అదే విధంగా వేలూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ చిత్ర పటాన్ని ఉంచి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అందరికీ చాక్లెట్లు, స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు టీకా రామన్, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వాహీద్‌బాషా, తూర్పు డివిజన్ కార్యదర్శి గణేశన్, జార్జీ, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేలూరు కొత్త బస్టాండ్‌లో రాజీవ్ గాంధీ ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి స్వీట్లు పంచి పెట్టారు. అదే విధంగా తిరువణ్ణామలై కలక్టరేట్‌లో అధికారులు తీవ్ర వాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.

కొరుక్కుపేట: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 79వ జయంతి సందర్బంగా గిండీలోని చిన్నమలైలో రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ సభ్యులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. దక్షిణ చెన్నై తూర్పు జిల్లా అధ్యక్షుడు ముత్తలగన్ ఆధ్వర్యంలో ఎంపీ జయకుమార్ హాజరై రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో ఎమ్మెల్యే చంద్రశేఖర్ జిల్లా ఉపాధ్యక్షుడు లెఫ్టినెంట్ భాస్కరన్, జిల్లా అధ్యక్షుడు సెల్వం, పార్టీ శ్రేణులు నివాళులర్పించారు. ఎంపీ జయకుమార్ మాట్లాడుతూ భారత ఉపఖండం నేడు అగ్రరాజ్యాలతో సమానంగా ఉందంటే అందుకు ప్రధాన కారణం రాజీవ్ గాంధీ అని అన్నారు. ఆయన పునాది ఆధారంగానే భారతదేశం అభివృద్ధి చెందిందన్నారు. ఆన్‌లైన్, ఉపగ్రహాల ఆవిష్కరణలన్నింటికీ పునాది వేసిన వ్యక్తి రాజీవ్ గాంధీ అని వివరించారు. మణిపూర్ సహా ఈశాన్య రాష్ట్రాల ప్రజలతో రాజీవ్ గాంధీకి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు.

ఘనంగా ఆస్పత్రి కథలు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

కొరుక్కుపేట: పెరంబూరులోని డీఆర్‌బీసీసీసీ మహోన్నత పాఠశాలలో ఆదివారం పెరంబూరు తెలుగు సాహితీ సమితి దశమ వార్షికోత్సవం సందర్భంగా ఆస్పత్రి కథలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అరుణా శ్రీనాథ్ ప్రార్థనాగీతం ఆలపించగా, గజగౌరి వ్యాఖ్యాతగా, పెరంబూరు తెలుగు సాహితీ సమితి అధ్యక్షుడు తమ్మినేని బాబు సభాధ్యక్షుడిగా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా నెల్లూరు బాలసాహితీవేత్త డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ పాల్గొని టీఆర్‌ఎస్ శర్మ (శ్రీశ్రీ లక్ష్మిప్రియ)కి రచించిన ఆస్పత్రి కథలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. దాతృత్వ శిఖామణి టీఎస్ సత్యనారాయణ తొలి ప్రతిని స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ 90 ఏళ్ల వయస్సులోనూ పుస్తకాలు రచించడం గొప్ప విషయమని, ఆస్పత్రి కథలు పుస్తకాన్ని తాను ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. కవి, విమర్శకులు డాక్టర్ కాసల నాగభూషణం మాట్లాడుతూ సాహితీ సమితి చేస్తున్న సేవలను అభినందనీయమన్నారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం – నెల్లూరు సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ మాట్లాడుతూ టీఆర్‌ఎస్ శర్మ ఓ వైపు సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తూనే, మరో వైపు రచనలు చేయటం ముదావహం అని, దీనిని బట్టి తెలుగు భాష మీద ఆయనకు ఉన్న మమకారాన్ని తెలుసుకోవచ్చన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు పిఆర్ కేశవులు పుస్తక సమీక్ష చేశారు. జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య మాట్లాడుతూ సాహితీ సేవలను చేస్తున్న సమితి నిర్వాహకులను అభినందించారు. చివరిగా పెరంబూరు తెలుగు సాహితీ సమితి వ్యవస్థాపక కార్యదర్శి, పుస్తక రచయిత డాక్టర్ టీఆర్‌ఎస్. శర్మ (శ్రీ శ్రీలక్ష్మిప్రియ) తన స్పందనలో తనకు అన్నిరకాలుగా సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. వందన సమర్పణను క్రొవ్విడి రమాదేవి చేశారు. ముందుగా సాంస్కృతిక కార్యక్రమాల్లో చందూస్ నాట్యాలయ చిన్నారుల భరతనాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

6.5 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

అన్నానగర్ : కృష్ణగిరి నుంచి కర్ణాటకకు వ్యాన్లలో అక్రమంగా తరలించేందుకు యత్నించిన 6.5 టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు ఆదివారం ఉదయం స్వాధీనం చేసుకుని ముగ్గురు డ్రైవర్లను అరెస్టు చేశారు. కోయంబత్తూరు ఎస్పీ బాలాజీ ఆధ్వర్యంలో కృష్ణగిరి సివిల్ సప్లయిస్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ విభాగం పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్లు కృష్ణవేణి, మణికంఠన్, పోలీసులు గురుపరపల్లి సమీపంలో ఆదివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అటుగా వచ్చిన 2 గూడ్స్ వ్యాన్లను తనిఖీ చేశారు. అందులో 90 బస్తాల్లో 4.2 టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వ్యాన్ డ్రైవర్లను అరెస్టుచేశారు. వారు కత్తికానపల్లికి చెందిన మణికంఠన్, పొన్మలైకోవిల్ ప్రాంతానికి చెందిన లోకేష్ అని, కృష్ణగిరి నుంచి కర్ణాటకకు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించినట్లు తేలింది. అదేవిధంగా క్రిష్ణగిరి సమీపంలోని పూదూర్ గ్రామం వద్ద సబ్ ఇన్‌స్పెక్టర్ దివాకర్, పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. అటుగా వస్తున్న కార్గో వ్యాను ఆపి తనిఖీ చేయగా 41 బస్తాల్లో 2 టన్నుల రేషన్ బియ్యాన్ని కర్ణాటకకు అక్రమంగా తరలించినట్లు వెల్లడైంది. వ్యాన్ డ్రైవర్ కార్తీక్‌ను అరెస్టు చేశారు. వ్యాన్, రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

కేకుల తయారీపై శిక్షణ

తిరుపతి కల్చరల్: అఖిల భరాత మహిళా వ్యాపారవేత్తల సమాఖ్య ఆధ్వర్యంలో అత్యధిక పోషక విలువలుగల తృణధాన్యాలతో కేకులు, కుకీస్ తయారీ విధానంపై మహిళలకు శిక్షణ ఇస్తున్నట్టు తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కె.మోహన్‌కుమార్‌రాజు తెలిపారు. ఎంఆర్‌పల్లిలోని బేకర్స్ బై బాన్స్‌లో సోమ, మంగళవారం శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కిల్‌భవాని నీటి విడుదల పెంపు

సేలం: ప్రతి ఏటా ఆగస్టు 15వ తేదీన భవానీసాగర్ డ్యామ్ నుంచి కిల్ భవానీ కెనాల్‌కు నాన్సీ సాగునీటి కోసం నీటిని విడుదల చేస్తారు. ఈ ఏడాది కీల్ భవాని కాలువ రిటైనింగ్ వాల్ నిర్మాణం, పునరుద్ధరణ పనులు జరుగుతుండగా.. రైతుల డిమాండ్‌ను అంగీకరిస్తూ ఆగస్టు 15న యథావిధిగా నీటిని తెస్తామని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆగస్టు 15న భవానీసాగర్ డ్యామ్ నుంచి కిల్‌భవానీ కాలువకు నీటిని విడుదల చేశారు. 100 ఘనపుటడుగుల నీటిని విడుదల చేసిన కొద్ది సేపటికే నీటిని నిలిపివేశారు. దీంతో సాగునీరు అందక రైతులు షాక్‌కు గురయ్యారు. కాలువ మరమ్మతు పనులు పూర్తి కాకపోవడంతో నీటిని నిలిపివేస్తున్నామని, మూడు రోజుల్లో పనులు పూర్తి చేసి నీటిని తెస్తామని జలవనరుల శాఖ అధికారులు ప్రకటించారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం భవానీసాగర్ డ్యామ్ నుంచి కిల్‌భవానీ ఛానల్ ద్వారా సాగునీటి కోసం నీటి విడుదలను 500 క్యూబిక్ అడుగులకు పెంచారు. సాగునీటి కోసం నిరంతరం నీటిని విడుదల చేయడంతో డ్యామ్ నీటి మట్టం తగ్గుతోంది. ఆదివారం ఉదయానికి భవానీసాగర్ డ్యామ్ నీటిమట్టం 82.76 అడుగులు ఉంది. డ్యామ్‌లోకి సెకనుకు 162 ఘనపుటడుగుల చొప్పున నీరు వచ్చి చేరుతోంది. తాడపల్లి అరకకోటకు సాగునీటి కోసం 1450 క్యూబిక్ అడుగులు, కళింగరాయణ సాగునీటికి 350 క్యూబిక్ అడుగులు, తాగునీటి కోసం భవానీ నదికి 100 క్యూబిక్ అడుగుల నీటిని విడుదల చేస్తున్నారు.

కోట్టై మారియమ్మన్ ఆలయంలో విశేష పూజలు





గోపుర కలశాలకు అభిషేకం చేస్తున్న శివాచార్యులు, భక్తులపై పుణ్య జలాల సంప్రోక్షణ

సేలం: ఈరోడ్ జిల్లా పెరుందురై బస్టాండ్ సమీపంలోని కోట్ మరియమ్మన్ కోట్ మునియప్పన్ స్వామి ఆలయంలో ఆదివారం కుంభాభిషేకం కనుల పండువగా సాగింది. ఈ మహోత్సవం సందర్భంగా గత నాలుగు రోజులుగా తీర్థం తీసుకోవడం, మహా గణపతి హోమం, రెండోసారి పూజ, గోపుర కలశం స్థాపన, తృతీయపూజ, మంగళ సంగీత కార్యక్రమాలు చేపట్టారు. అలాగే విమాన కలశానికి కుంభాభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఇక ఆదివారం వేద మంత్రోచ్చారణల మధ్య మహా గణపతి మహా మారియమ్మన్ కుంభాభిషేకం నిర్వహించారు. ఈ కుంభాభిషేకం అనంతరం కోట మరియమ్మన్ కోట మునియప్పన్ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుంభాభిషేక కార్యక్రమంలో పాల్గొన్న వేలాది మంది భక్తులపై పవిత్ర జలాలను అర్చకులు పైపుల ద్వారా సంప్రోక్షణ చేశారు.

తల్లికి మత్తు మందు ఇచ్చి చిన్నారి కిడ్నాప్



విలేకరులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎస్పీ కిరణ్ శ్రుతి

- కాంచీపురంలో పట్టుకున్న పోలీసులు
- దంపతుల అరెస్టు



కిడ్నాప్ చేసిన పద్మ



కిడ్నాప్‌కు గురైన చిన్నారి

వేలూరు: ప్రభుత్వాసుపత్రిలో తల్లికి మత్తు మందు ఇచ్చి బిడ్డను కిడ్నాప్ చేసిన నిందితులను పోలీసులు కాంచీపురంలో అరెస్టు చేశారు. తిరువణ్ణామలై జిల్లా కన్నమంగళంకు చెందిన సుందర్ భార్య సూర్యకళ మూడు రోజుల క్రితం ప్రభుత్వాసుపత్రిలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం సూర్యకళను కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం వేలూరు అడుక్కంబరైలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చిన్నారితో పాటు సూర్యకళ కూడా వార్డులో చికిత్స పొందుతుంది. భోజన విరామ సమయంలో మాత్రమే బంధువులకు వార్డులోకి అనుమతి ఉంది. వార్డులో రోగితో పాటు ఒక మహిళను మాత్రమే అనుమతిస్తారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో రాణిపేట జిల్లా కావేరిపాక్కం సమీపంలోని అయ్యంబేట కాలనీకి చెందిన తిరునావకరసు భార్య పద్మ ఆసుపత్రిలోని సూర్యకళ ఉన్న వార్డుకు వచ్చింది. సూర్యకళతో సన్నిహితంగా ఉన్నట్లు నటిస్తూ ఆమెకు భోజనం పెట్టింది. ఆహారం తిన్న వెంటనే సూర్యకళ స్పృహ తప్పి పడిపోయింది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్న పద్మ వెంటనే పసి బిడ్డను అపహరించింది. సూర్యకళ స్పృహ వచ్చి చూడగా చిన్నారి కనిపించక పోవడంతో కేకలు వేసింది. వేలూరు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టారు. అడిషనల్ ఎస్పీ ప్రసన్నకుమార్, డీఎస్పీ తిరునావకరసు ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సీసీ టీవీపుటేజీ ఆధారాలను బట్టి దర్యాప్తు చేపట్టారు. చిన్నారిని అపహరించిన మహిళ తిరువణ్ణామలై బస్సు ఎక్కినట్లు గుర్తించారు. పద్మ బస్సు ఎక్కిన చోట నుంచి 500 సీసీటీవీ పుటేజీలను పోలీసులు పరిశీలించి ఆమె కాంచీపురంలో ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు అక్కడికి చేరుకుని పద్మ, ఆమె భర్త తిరునావకరసును అరెస్టు చేసి చిన్నారిని స్వాధీనం చేసుకున్నారు. పద్మ చిన్నారిని కిడ్నాప్ చేసి అనుమానం రాకుండా తిరువణ్ణామలై బస్సు ఎక్కి అక్కడి నుంచి వందవాసి మీదుగా కాంచీపురం చేరుకున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా వీరు తరచూ చిన్నారులను కిడ్నాప్ చేస్తున్నారా లేక బాలల కిడ్నాప్ ముఠా కోసం పనిచేస్తున్నారా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తులు వస్తే నమ్మకండి: ఎస్పీ కిరణ్ శ్రుతి

అనుమానాస్పదంగా కనిపించినా, గుర్తు తెలయని వ్యక్తులు వచ్చినా నమ్మవద్దని, జాగ్రత్తగా ఉండాలని ఇన్‌చార్జి ఎస్పీ కిరణ్ శ్రుతి అన్నారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ వేలూరు, తిరువణ్ణామలై, రాణిపేట, కాంచీపురం జిల్లాల్లోని సీసీటీవీ పుటేజీలను పరిశీలించి నిందితులను పట్టుకున్నామన్నారు.

కాంచీపురంలో స్వామి ఊరేగింపులో అపశ్రుతి

– ఒక వ్యక్తి మృతి, 8 మందికి గాయాలు

కొరుక్కుపేట: కాంచీపురంలో స్వామివారి ఊరేగింపులో అపశ్రుతి చోటుచేసుకుంది. కారు అదుపుతప్పి జనాలపైకి దూసుకెళ్లడంతో వ్యక్తి మృతి చెందగా, 8 మంది గాయపడ్డారు. పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆలయాల్లో గత నెల రోజులుగా ఆడి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. కాంచీపురం సేకుప్పేట్టైలోని కావడి వీధిలోని జయ వినాయగర్ ఆలయంలో శుక్రవారం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం రాత్రి స్వామిని ఊరేగిస్తుండగా ఊర్వబావాజీ వీధిలో కారు అదుపుతప్పి నడుచుకుంటూ వెళ్తున్న భక్తులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 9 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని అత్యవసర సిబ్బంది కాంచీపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఫొటోగ్రాఫర్ వెంకటేశన్ (42) మృతి చెందాడు. మదన్‌రాజ్, అక్బర్ పాషా, సుకుమార్, జ్ఞానోదయం, ధనుష్, గురుప్రసాద్, శరణ్, జ్ఞానశేఖర్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం కారణంగా ఉత్సవాలను మధ్యలోనే నిలిపివేసి స్వామివారిని ఆలయానికి తరలించారు. ప్రమాదానికి కారణమైన అదే ప్రాంతానికి చెందిన డ్రైవర్ శరవణపై స్థానికులు దాడి చేసి విష్ణుకంచి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి శరవణన్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలి హత్య

సేలం: ఈరోడ్‌లోని కొల్లంపాళయంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు హత్యకు గురైంది. పోలీసుల కథనం మేరకు.. కొల్లంపాళయంకు చెందిన మనోహరన్ రిటైర్డ్ రైల్వే ఉద్యోగి. ఆయన భార్య భువనేశ్వరి (53) వైరాపాళ్యంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. వారికి పిల్లలు లేరు. వారు తమ సొంత ఇంట్లో ఉంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 6.30 గంటలకు మనోహరన్ వాకింగ్ కోసం బయటకు వెళ్లాడు. ఇంట్లో భువనేశ్వరి మాత్రమే ఉంది. ఆయన తిగిరి 8.30 గంటలకు ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో భువనేశ్వరి గదిలో మంచంపై కత్తితో నరికిన స్థితిలో హత్యకు గురైంది. వెంటనే సూరంపట్టి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వేలిముద్రల నిపుణులు ఆధారాలు సేకరించారు. పోలీసు జాగిలం సంఘటనా స్థలానికి వచ్చి ఇంటి బయటకు వెళ్లింది. సూరంపట్టి పోలీసులు కేసు నమోదు చేసి ఆ ప్రాంతంలో అమర్చిన సీసీ పుటేజీని పరిశీలిస్తున్నారు. పట్టపగలు ఉపాధ్యాయురాలిని హత్య చేసిన ఘటన ఆ ప్రాంతంలో కలకలం రేగింది.

• అభినందనలు



వేలూరుకు వచ్చిన జార్ఖండ్ రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాక్రిష్ణన్‌ను వేలూరు వీఐటీ యూనివర్సిటీ చాన్సలర్ విశ్వనాథన్, ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను సత్కరించి అభినందించారు.


- వేలూరు

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ మహాకుంభాభిషేకం



ఆంజనేయస్వామి ఆలయ గోపుర కలశాలకు పవిత్ర పుణ్యతీర్థాలతో మహాకుంభాభిషేకం చేస్తున్న వేద పండితులు

- హాజరైన గవర్నర్లు తమిళిసై, సీపీ.రాధాకృష్ణన్



మహా కుంభాభిషేకంలో పాల్గొన్న గవర్నర్లు తమిళిసై, సీపీ.రాధాకృష్ణన్



పాల్గొన్న భక్తులు

తిరుత్తణి: నల్లాట్టూరు వీరమంగళ ఆంజనేయస్వామి ఆలయ మహాకుంభాభిషేకం వేడుకల్లో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శనం చేసుకున్నారు. తిరుత్తణి సమీపంలోని నల్లాట్టూరు కుశస్థలి నదీ తీరంలో కొలువైన స్వయంభ వీరమంగళ ఆంజనేయస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులు పూర్తి చేసి శుక్రవారం నుంచి ఆదివారం వరకు మహాకుంభాభిషేకం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో యాగశాలలు ఏర్పాటు చేసి నిత్యహోమ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో మహాపూర్ణాహుతి, హోమ పూజల అనంతరం మంగళవాయిద్యాల నడుమ పవిత్ర పుణ్య తీర్థాల కలశాలతో ఊరేగింపుగా వచ్చి గోపుర కలశాలకు అభిషేకం చేశారు. వీరమంగళ ఆంజనేయ స్వామి, సీతారామ లక్ష్మణులు, విష్ణు, దుర్గాదేవి, చక్రతాళ్వార్ సన్నిధి గోపుర కలశాలకు భక్తులు గోవింద నామస్మరణ నడుమ మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఇందులో తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, జార్కండ్ గవర్నర్ సీపీ.రాధాకృష్ణన్ పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు, వీరమంగళ ఆంజనేయస్వామి ఆలయ నిర్వాహక కమిటీ అధ్యక్షుడు చక్రవర్తినాయుడు అధ్వర్యంలో అతిథులకు స్వాగతం పలికి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెక్కభజనలు, సంగీత విభావరి భక్తులను ఆకట్టుకున్నాయి.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

సేలం: అనుమానాస్పద స్థితి మహిళ మృతి చెందిన సంఘటన ఈరోడ్ జిల్లా చత్రంపట్టి ప్రాంతం నంజై కొలనల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన పెరియసామికి ఒలగడానికి చెందిన భవాని పొరుగు కోకిల(30)తో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి 13 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. మూడు నెలలుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో 14న చత్రంపట్టికి వచ్చిన కోకిల తండ్రి కూతురు, అల్లుడు, మనవడిని తీసుకుని పట్టణానికి వెళ్లాడు. ఆ తర్వాత 16వ తేదీన మళ్లీ కోకిల తన భర్త, కొడుకుతో కలిసి చత్రంపట్టికి వచ్చింది. 17వ తేదీన కోకిల తన ఇంటి సమీపంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. పెరియస్వామి తన బంధువులతో కలిసి ఆమెను గణపతిపాళయం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. అక్కడి నుంచి ఈరోడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమె మృతి చెందింది. ఈ కేసులో కోకిల తండ్రి సుబ్రమణి మలయంపాలెం పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

క్లుప్తంగా...

జనం కోసమే బతికిన సచ్ఛీలుడు టంగుటూరి
మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్


ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్, ఉండవల్లి, ఎమ్మెల్యేలు వెలంపల్లి, విష్ణు తదితరులు

భవానీపురం (విజయవాడ పశ్చిమ): జనం కోసమే బతికిన సచ్ఛీలుడు ప్రకాశం పంతులు అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతిని పురస్కరించుకుని మల్లాది వెంకటసుబ్బారావు, సుందరమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఆంధ్రకేసరి టంగుటూరి స్మారకోపన్యాసం కార్యక్రమంలో ఉండవల్లి కీలకోపన్యాసం చేశారు. పేదరికం నుంచి ఎంతో డబ్బు సంపాదించిన వ్యక్తి ప్రకాశం పంతులు అని గుర్తుచేశారు. ఆ డబ్బును జనం కోసమే ఖర్చు చేశారు తప్ప ఆయన సొంతగా వాడుకోలేదన్నారు. రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్, సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్యే వెలంపల్లి ప్రసంగించారు.

29 కోర్టు హాళ్లలో లైవ్ ప్రసార సేవలు
తెలంగాణ

నేడు ప్రారంభించనున్న తెలంగాణ హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టులో కేసుల విచారణకు సంబంధించి ఆన్‌లైన్ లైవ్ ప్రసారాలను సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ప్రారంభించనున్నారు. ఉదయం 10.15 గంటలకు హైకోర్టులోని 29 హాళ్లలో విచారణల లైవ్ ప్రసార సేవలను ఆయన లాంఛనంగా ప్రారంభిస్తారు. ఆ తర్వాత 10.30 గంటల నుంచి లైవ్ ప్రసారాలు ప్రారంభం అవుతాయి. ఇప్పటికే మొదటి కోర్టు హాల్‌లో లైవ్ ప్రసార సేవలను ప్రారంభించిన విషయం తెలిసిందే. లైవ్ ప్రసారాలతో పెండింగ్ కేసులు తగ్గే అవకాశం ఉందని, కేసులు సత్వరమే పరిష్కారం అవుతాయని కోర్టు వర్గాలు చెబుతున్నాయి. ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు లైవ్ ప్రసారాలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

4 వేల ఏళ్ల నాటి ఎద్దు చిత్రం


గుట్ట పైభాగంలోని గుండుపై ఎద్దు చిత్రాన్ని చూపుతున్న శివనాగిరెడ్డి

సాక్షి, హైదరాబాద్/అడ్డాకుల: దాదాపు నాలుగు వందల అడుగుల ఎత్తులోని ఓ గుట్ట చిటారు గుండుపై రాయితో చెక్కిన ఎద్దు బొమ్మ ఇది. 4 వేల ఏళ్ల క్రితంనాటి చిత్రమిది. మహబూబ్‌నగర్‌కు చేరువలో ఉన్న మూసాపేట శివారులోని రామస్వామి గుట్టపైనున్న ఈ బొమ్మను ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి గుర్తించారు. స్థానిక రామలింగేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ తయారు చేసే పనిలో భాగంగా ఆదివారం ఆయన స్థానికులతో కలిసి వెళ్లారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న గుట్ట పైభాగానికి చేరుకోగా, అక్కడున్న గుండుపై ఈ చిత్రం కనిపించింది.

పిల్లి కూనలకు శునకమే తల్లి


పిల్లకూనలను అక్కున చేర్చుకున్న శునకం

గంగారం: ఓ శునకం.. జాతి వైరం మరిచి పిల్లి కూనలను అక్కున చేర్చుకుంది. పాలిస్తూ వాటిని కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం బావురుగొండకు చెందిన రైతు ఎల్లయ్య పెంపుడు కుక్క.. రెండు పిల్లి కూనలకు తన పిల్లల మాదిరిగానే పాలిచ్చి ఒడిలో దాచుకుంటోంది.

గాంధీ ఆస్పత్రికి ఐఎస్‌ఓ సర్టిఫికెట్

గాంధీ ఆస్పత్రి (హైదరాబాద్): తెలంగాణ వైద్య ప్రదాయినీ సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి రెండు విభాగాల్లో ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఐఎస్‌ఓ) సర్టిఫికెట్లు సాధించింది. టెరిటరీ లెవెల్ పబ్లిక్ హెల్త్ కేర్ సర్వీసెస్ విభాగంలో క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టం (ఐఎస్‌ఓ 9001: 2015), ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టం (ఐఎస్‌ఓ 45001: 2018)లకు క్వాలిటీ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (క్యూఆర్‌ఓ) సంస్థ ఐఎస్‌ఓ సర్టిఫికెట్లను ప్రదానం చేసింది. ఈ సర్టిఫికెట్ల కాలపరిమితి 2026 వరకు ఉంటుందని, ప్రభుత్వ ఆస్పత్రుల సెక్టార్‌లో ఐఎస్‌ఓ సర్టిఫికెట్ పొందిన మొట్టమొదటి ఆస్పత్రి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి అని సూపరింటెండెంట్ రాజారావు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రుల్లో పెరిగిన ఆరోగ్యశ్రీ సేవలు



2018-19లో 1.22 లక్షలు.. • 2022-23లో 4.42 లక్షలకు జంప్

- సేవలను మరింత పెంచడానికి చర్యలు
- మానవ వనరుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు పోస్టుల భర్తీ
- నాడు- నేడు కింద ప్రభుత్వాస్పత్రుల అభివృద్ధి, అత్యాధునిక వైద్య పరికరాలు
- తగినన్ని మందులు, ఇతర వనరులు సమకూర్చిన ప్రభుత్వం



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య, ఆరోగ్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఈ రంగానికి అత్యంత ప్రాధాన్యతను ఇచ్చిన ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం ద్వారా ఇప్పటికే ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేసింది. మానవ వనరుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు ఖాళీ పోస్టులు భర్తీ చేస్తోంది. ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య పరికరాలు, తగినన్ని మందులు, ఇతర వనరులు సమకూర్చింది. ఫలితంగా ప్రజలకు ప్రభుత్వాస్పత్రులపై నమ్మకం పెరిగింది. దీంతో గతంతో పోలిస్తే ప్రభుత్వాస్పత్రులకు వచ్చే వారి సంఖ్య రెట్టింపవుతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంతో పోలిస్తే ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రుల్లో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద వైద్య సేవలు గణనీయంగా పెరగడమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. 2019 అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు) నుంచి బోధనాస్పత్రుల వరకు అన్ని స్థాయిల్లో ఆరోగ్యశ్రీ సేవలను విస్తరించారు. దీంతో 2018–19లో 1,22,626 సేవలు మాత్రమే నమోదు కాగా 2022–23లో ఏకంగా 4,42,929కు చేరాయి. దీంతో అదే మేర ప్రభుత్వాస్పత్రులకు వచ్చే నిధులు పెరిగాయి. ఆరోగ్యశ్రీ కింద 2018–19లో ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో రూ.200 కోట్ల విలువ చేసే వైద్య సేవలు అందించగా.. గత సంవత్సరం ఈ మొత్తం ఏకంగా రూ.350 కోట్లకు పెరిగింది. డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలో ఆరోగ్యశ్రీ కింద అత్యధిక సేవలు అందిస్తూ విశాఖపట్నంలోని కేజీహెచ్ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. దీని తర్వాత విజయవాడ, కర్నూలు ప్రభుత్వాస్పత్రులు ఉన్నాయి.

ప్రభుత్వాస్పత్రుల వాటా పెంచడానికి ప్రత్యేక చర్యలు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మానవ వనరుల కొరతకు తావులేకుండా ఏకంగా 50 వేలకు పైగా వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది పోస్టులను భర్తీ చేసింది. ఎప్పుడు ఖాళీ అయిన పోస్టులను అప్పుడే వెంటనే భర్తీ చేస్తోంది. దీనికి తోడు నాడు-నేడు కింద ఆస్పత్రులకు కొత్త భవనాలు సమకూర్చడంతో పాటు పాత భవనాలకు మరమ్మతులు చేపట్టింది. అత్యాధునిక వైద్య పరికరాలతో ఆపరేషన్ థియేటర్‌లను తీర్చిదిద్దింది. ఈ నేపథ్యంలో ఆరోగ్యశ్రీ సేవల కోసం ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులకు వెళ్లేవారి సంఖ్యను వీలైనంత తగ్గించాలని వైద్య శాఖ నిర్ణయించింది. తద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలను గణనీయంగా పెంచడం ద్వారా వీలైనన్ని ఎక్కువ నిధులను రాబట్టడంపై దృష్టి సారించింది. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ కింద నమోదవుతున్న వైద్య సేవల్లో 69 శాతం మేర ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో, 31 శాతం ప్రభుత్వాస్పత్రుల నుంచి ఉంటున్నాయి. దీంతో ప్రభుత్వాస్పత్రుల వాటాను మరింతగా పెంచడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

సేవల పెంపునకు ప్రత్యేక చర్యలు..

ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలను మరింత పెంచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా వైద్యులు, సిబ్బంది వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలకు ఇన్సెంటివ్ నిధుల చెల్లింపునకు చర్యలు చేపట్టాం.
– ఎం.ఎన్.హరేంద్రిరప్రసాద్, సీఈవో, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ


గతంతో పోలిస్తే మెరుగుపడ్డ సేవలు..

బోధనాస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు గతంతో పోలిస్తే మెరుగుపడ్డాయి. వీటిని మరింతగా పెంచడానికి ఆస్పత్రులకు విభాగాల వారీగా లక్ష్యాలను నిర్దేశిస్తున్నాం. గతేడాది నిర్వహించిన కేసుల కంటే ప్రస్తుత ఏడాది 20 శాతం ఎక్కువ కేసులు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.
– డాక్టర్ నరసింహం, డీఎంఈ

ఆరోగ్యశ్రీ సేవలు వేల నుంచి లక్షల్లోకి..

ఇక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు 2018–19తో పోలిస్తే వేల నుంచి ప్రస్తుతం లక్షల్లోకి పెరిగాయి. అప్పట్లో ఏడాదికి 16 వేలు మాత్రమే ఈ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కేసులు ఉండేవి. వీటికి సంబంధించి నిధుల వాటా కేవలం రూ.34.94 కోట్లు మాత్రమే ఉండేది. వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా వినూత్న మార్పులు చోటు చేసుకున్నాయి. 2022–23లో ఏకంగా రూ.151 కోట్ల విలువ చేసే వైద్యాన్ని 2.05 లక్షల కేసుల్లో ఆరోగ్యశ్రీ కింద అందించారు.

‘ఘోస్ట్’ చందా.. మార్గదర్శి దందా!



▶ మొదటి పేజీ తరువాయి
ఏ చిట్ ఫండ్స్ సంస్థలు, ప్రైవేటు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు చేయని రీతిలో వినూత్న రీతిలో మార్గదర్శి సాగిస్తున్న ఆర్థిక అక్రమాలకు ఇది తాజా నిదర్శనం.

ఇలా ఎందుకు చేశారంటే..

ఇక్కడ మార్గదర్శి చిట్ ఫండ్స్ ఇలా ఎలా చేసిందనే సందేహం రావడం సహజం. ఎలా అంటే సుబ్రహ్మణ్యం ఆధార్ కార్డును తమ ఏజంట్ల ద్వారా సేకరించి ఆయనకు తెలియకుండానే చిట్టీ గ్రూపులో చందాదారునిగా చేర్పించింది. ఇలాంటి వారిని ‘ఘోస్ట్ చందాదారులు’ అని వ్యవహరిస్తారు. అంటే చందాదారులు లేకుండానే వారి పేరిట చిట్టీ గ్రూపుల్లో సభ్యత్వం కొనసాగిస్తారు. అయితే తాను చందాదారునిగా ఉన్నానని సుబ్రహ్మణ్యానికి తెలియదు కాబట్టి ఆయన చందా చెల్లించరు. ఆయన్ని ఎవరూ అడగరు కూడా. దాంతో అసలు విషయం బయటకు వచ్చే అవకాశమే లేదు. ఆయన పేరిట ఉన్న చిట్టీకి ప్రతి నెలా మార్గదర్శి చిట్ ఫండ్స్ యాజమాన్యం చందా చెల్లించకపోయినా, చెల్లించినట్టుగా రికార్డుల్లో నమోదు చేస్తుంది. ప్రతి నెల చందాదారునికి వచ్చే డివిడెండ్‌ను మాత్రం సుబ్రహ్మణ్యం పేరిట తానే తీసుకుంటుంది. ఒక నెల సుబ్రహ్మణ్యం పేరిట చిట్టీ పాట పాడతారు. ఆ చిట్టీ పాట మొత్తం (ప్రైజ్‌మనీ) మార్గదర్శి యాజమాన్యం తమ సొంత ఖాతాలో వేసుకుంటుంది. అంటే రూపాయి చందా చెల్లించకుండానే.. ప్రతి నెల డివిడెండ్ మొత్తం తీసుకోవడంతోపాటు చిట్టీ పాట పేరిట ప్రైజ్ మనీ కూడా కొల్లగొడుతోంది.

ఇలా వెలుగు చూసింది..

మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల్లో సోదాల్లో భాగంగా సందేహం కలిగిన చందాదారులను స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారులు సంప్రదిస్తున్నారు. ఆ విధంగా సూళ్లూరుపేటకు చెందిన సుబ్రహ్మణ్యం చీరాలలో చిట్టీ గ్రూపులో సభ్యుడిగా ఉండటం ఏంటనే సందేహం వచ్చి అధికారులు సంప్రదించడంతో అసలు వ్యవహారం బట్టబయలైంది. మార్గదర్శి చిట్ ఫండ్స్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 37 బ్రాంచీల పరిధిలో ఇలాంటి ఘోస్ట్ చందాదారులు భారీగా ఉండొచ్చనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. ఘోస్ట్ చందాదారుల దందాతోపాటు చందాదారులను దురుద్దేశంతో అప్పుల ఊబిలోకి నెట్టేస్తూ వారిని ఆర్థికంగా ఇక్కట్ల పాలు చేస్తోందని కూడా ఈ సోదాల్లో వెల్లడైంది. సీఐడీ అదనపు డీజీ సంజయ్, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రామకృష్ణ, సీఐడీ ఎస్పీ అమిత్ బర్దర్ మంగళగిరిలోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఘోస్ట్ చందాదారులు, చందాదారులకు తెలియకుండానే వారిని ష్యూరిటీగా చూపించడం తదితర మోసాలకు పాల్పడిన ఫిర్యాదులతో మార్గదర్శి చిట్ ఫండ్స్‌పై మూడు కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో వారు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఘోస్ట్ చందాదారులతో భారీగా అక్రమాలు

వ్యక్తులకు తెలియకుండానే వారి ఆధార్ నంబర్లు సేకరించి, చిట్టీ గ్రూపుల్లో సభ్యులుగా చూపిస్తున్నారు. ఆ విధంగా ఘోస్ట్ చందాదారుల పేరిట డివిడెండ్లతోపాటు చిట్టీ మొత్తాన్ని మార్గదర్శి చిట్ ఫండ్స్ తమ ఖాతాల్లో జమ చేసుకుంటూ మోసానికి పాల్పడుతోంది. ఇది చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధం. ఇతర చందాదారుల ప్రయోజనాలకు విఘాతం కూడా. ఎందుకంటే ఇతర చందాదారుల ఆర్థిక ప్రయోజనాలకు విరుద్ధంగా అంటే వారికి తక్కువ డివిడెండ్ వచ్చేలా చేస్తున్నారు. మరోవైపు ఘోస్ట్ చందాదారునికి ఎక్కువ వేలంపాట మొత్తం (ప్రైజ్‌మనీ) వచ్చేట్టుగా వేలం నిర్వహిస్తున్నారు.

వందకుపైగా ఫిర్యాదులు

చందాదారుల నుంచి ఫిర్యాదులు లేకుండానే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలను స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారులు ఖండించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ పాల్పడుతున్న మోసాలపై పెద్ద సంఖ్యలో చందాదారులు పోలీసులు, సీఐడీ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. మూడు రోజుల్లోనే దాదాపు వంద మందికిపైగా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అధికారులు వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నారు. కాగా, చందాదారులు పూర్తి వివరాలతో ఫిర్యాదులు చేసేందుకు సీఐడీ విభాగం ప్రత్యేకంగా వాట్సాప్ నంబర్ **9493174065** కేటాయించింది.

మూడు చోట్ల చీటింగ్ కేసులు నమోదు

చీరాల, అనకాపల్లి, రాజమహేంద్రవరం టూ టౌన్ పోలీస్ స్టేషన్లలో మార్గదర్శి చిట్ ఫండ్స్‌పై మూడు కేసులు నమోదు చేశారు. మూడు చోట్ల బ్రాంచి మేనేజర్లు (ఫోర్‌మెన్)లతోపాటు మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యంపై వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఆ మూడు బ్రాంచిల మేనేజర్లను సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వారిని అరెస్టు చూపించి న్యాయస్థానంలో హాజరు పరుస్తామని సీఐడీ అదనపు డీజీ సంజయ్ తెలిపారు.

- ▶ సూళ్లూరుపేటకు చెందిన సుబ్రహ్మణ్యానికి తెలియకుండా ఆయన్ను చీరాలలో చందాదారునిగా నమోదు చేసినందుకు చీరాల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు.
- ▶ అనకాపల్లికి చెందిన బి.వెంకటేశ్వరరావు నెలకు రూ.10 వేలు చొప్పున చందా చెల్లిస్తూ చిట్టీ గ్రూపులో చేరారు. 50 నెలల చందాలు చెల్లించిన తర్వాత ఆయన రూ.4,61,989కు చిట్టీ పాడారు. ఆయన ఎన్నిసార్లు మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రైజ్‌మనీ ఇవ్వలేదు. ఎట్టకేలకు ఆయనకు రూ.20 మాత్రమే వస్తుందని చెప్పారు. మిగిలిన మొత్తం ఆయన ష్యూరిటీ ఇచ్చిన మిగిలిన చిట్టీల్లో సర్దుబాటు చేసినట్టు చూపారు. అసలు తాను ఎవరికీ ష్యూరిటీ ఇవ్వలేదని చెప్పినా, బ్రాంచి మేనేజర్ వినిపించుకోలేదు. ఆయన సంతకాలు ఫోర్జరీ చేసిన పత్రాలు చూపించారు. ఆ కాపీలు కావాలని అడిగినా సరే ససేమిరా అన్నారు. దాంతో వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

అప్పుల ఊబిలోకి చందాదారులు

చిట్టీ గ్రూపు ప్రారంభంలోనే చందాదారుల నుంచి సంతకాలు తీసుకుని తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు. ఏకంగా చందాదారుల ఆస్తులను తమ పేరిట రాయించుకోవడం మార్గదర్శి చిట్‌ఫండ్స్ దారుణాలకు నిదర్శనం. ముందుగా తీసుకున్న సంతకాలను దుర్వినియోగం చేస్తూ ఓ చందాదారునికి కనీసం సమాచారం ఇవ్వకుండానే ఆయన్ను మరో చందాదారునికి ష్యూరిటీగా రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. దాంతో చిట్టీ పాట పాడిన చందాదారుడు వాయిదాలు చెల్లించ లేదు కాబట్టి, ష్యూరిటీగా పేర్కొన్న చందాదారుడు చెల్లించాలని రికార్డుల్లో చూపిస్తున్నారు. ఓ చిట్టీ పాట పాడిన చందాదారు ప్రైజ్‌మనీ తీసుకుని రెండు వాయిదాలు చెల్లించిన తర్వాత మిగిలిన వాయిదాలు చెల్లించకపోతే.. ఆ చిట్టీ పాటను రద్దు చేసి సంబంధిత నెలకు కొత్తగా చిట్టీ పాట నిర్వహించాలని చట్టం చెబుతోంది. కానీ దీన్ని మార్గదర్శి చిట్ ఫండ్స్ పట్టించుకోవడం లేదు. చిట్టీ వాయిదాలు చెల్లించలేని చందాదారులతో మాట్లాడి వారిని మరో చిట్టీ గ్రూపులో సభ్యులుగా చేరుస్తోంది. ఆ కొత్త గ్రూపులో డివిడెండ్‌తో పాత గ్రూపు వాయిదాలు చెల్లించవచ్చు అని చెబుతోంది. ఇలా ఒక చందాదారుని లెక్కకు మించి చిట్టీ గ్రూపుల్లో చందాదారుగా చూపిస్తోంది. దాంతో ఆ చందాదారు మార్గదర్శి చిట్ ఫండ్స్‌కు భారీగా బకాయిలు పడేట్టు చేస్తోంది. అతి సామాన్య పూజారిని ఏకంగా 22 చిట్టీ గ్రూపుల్లో చందాదారునిగా చేర్చారు. మరో వ్యక్తిని ఏకంగా 60 చిట్టీ గ్రూపుల్లో చందాదారునిగా చేర్చినట్టు చెప్పారు. కానీ ఆయన ఏకంగా 90 చిట్టీ గ్రూపుల్లో చందాదారునిగా చూపించినట్టు సోదాల్లో వెల్లడైంది. ఇలాంటి అక్రమాలకు అంతే లేదు. ఆ చందాదారుడు ఓ చిట్టీలో పాటపాడినప్పటికీ అతి తక్కువ అంటే నామమాత్రంగానే ప్రైజ్‌మనీ పొందుతున్నారు. ఎంతగా అంటే రూ.50 లక్షల చిట్టీ గ్రూపులో సభ్యుడైన ఓ చందాదారుడు రూ.46 లక్షలకు చిట్టీ పాట పాడితే రకరకాల కొర్రీలు వేస్తూ ఇచ్చింది కేవలం రూ.20 మాత్రమే. ఇలాగే మరో చందాదారుడు రూ.18 లక్షలకు చిట్టీ పాట పాడితే చేతికి వచ్చింది కేవలం రూ.200. మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో ఇలాంటి అక్రమాలు కుప్పలు కుప్పలుగా బయటపడుతున్నాయి.

మార్గదర్శి ఓ ‘నల్ల’ ఖజానా

- బ్రాంచి మేనేజర్ల పేరిట భారీగా బినామీ ఆస్తులు
- ఓ మేనేజర్ పేరిట రూ.100 కోట్ల ఆస్తి
- రూ.కోటి డిపాజిట్‌కు పైబడి వెయ్యి ఖాతాలు

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్ ఫండ్స్ నల్ల కుబేరుల అడ్డా అన్నది బట్టబయలైంది. తవ్వేకొద్దీ అక్రమాలు పుట్టలు పుట్టలుగా వెలుగు చూస్తున్నాయి. రాష్ట్రంలో అక్రమ సంపాదనను దాచుకునేందుకు రామోజీరావు సృష్టించిన ఓ మినీ స్విస్ బ్యాంకు అని ఆధారాలతో స్పష్టమవుతోంది. ఉభయతారకంగా నల్లకుబేరులు, రామోజీరావు ఈ బ్లాక్ మనీ దందా సాగిస్తున్నారన్నది తేటతెల్లమవుతోంది. మరోవైపు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్లు చందదారుల సొమ్మును భారీగా తమ సొంతానికి మళ్లించుకున్న గుట్టు కూడా రట్టు అవుతోంది. శని, ఆదివారాల్లో స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారుల సోదాల్లో ఈ వ్యవహారం వెలుగు చూసింది. మనీ లాండరింగ్ జరుగుతున్నట్టుగా వెల్లడి కావడం గమనార్హం. రూ.కోటి కంటే అధికంగా చిట్టీలు వేసిన, అక్రమ డిపాజిట్లు చేసిన వారు దాదాపు వెయ్యి మంది వరకు ఉన్నట్టు ఇప్పటి వరకు గుర్తించినట్టు సమాచారం. వారి మార్గదర్శి లెడ్జర్ పుస్తకాల్లోగానీ, ఆ చందాదారులకు ఇచ్చిన పాస్‌బుక్‌లోగానీ వారి పాన్ నంబర్లు, ఆధార్ నంబర్లు నమోదు చేయనే లేదన్నది వెల్లడైంది. కొందరు చందాదారులను సీఐడీ అధికారులు పిలిచి విచారించగా వారికి అన్ని కోట్ల రూపాయలు ఏలా వచ్చాయన్నది చెప్పలేకపోయారు. పాన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలను ఆన్‌లైన్ ఖాతాల్లో ఎందుకు లింక్ చేయలేదని మార్గదర్శి చిట్ ఫండ్స్ బ్రాంచి మేనేజర్లను ప్రశ్నిస్తే వారు విస్మయకర సమాధానమిచ్చారు. ఈ అక్రమాల్లో మేనేజర్లు కీలక పాత్ర పోషిస్తున్నట్టు స్పష్టమైంది. రాష్ట్రంలోని ముఖ్య పట్టణంలోని ఓ బ్రాంచి మేనేజర్‌ను పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. దాంతో రామోజీరావుతోసహా మొత్తం మార్గదర్శి చిట్ ఫండ్స్ యాజమాన్యం హడలెత్తిపోయింది. ఆ మేనేజర్, ఆయన కుటుంబ సభ్యుల పేరిట దాదాపు రూ.100 కోట్ల వరకు ఆస్తులు ఉన్నట్టు వెల్లడైంది. ఈ మేనేజర్ చాలా మంది పెద్దలకు బినామీ అన్నది స్పష్టమవుతోంది. ఇలా పలువురు మేనేజర్లు ఉన్నట్లు సమాచారం. కాగా, కొందరు బ్రాంచి మేనేజర్లు చందాదారుల చందా మొత్తాలను తమ సొంతానికి వాడుకుంటున్నట్టు కూడా వెల్లడైంది. విశాఖపట్నంలో దీనిని నిర్ధారించారు. ఇతర బ్రాంచి కార్యాలయాల్లో ఆరా తీస్తున్నారు. పలు చోట్ల అవకతవకలకు సంబంధించి లెడ్జర్ ఖాతాలు, చిట్టీ పాటల మినిట్స్ పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు.

మార్గదర్శి మేనేజర్ల అరెస్ట్

- చిట్ డబ్బులు చెల్లించకుండా మూడేళ్లుగా రాజమహేంద్రవరం మేనేజర్ కాలయాపన
- రూ.4.67 లక్షలు స్వాహా చేసిన కూర్మన్నపాలెం మేనేజర్

సాక్షి, రాజమహేంద్రవరం/అనకాపల్లి టౌన్: మార్గదర్శి రాజమహేంద్రవరం బ్రాంచ్‌లో చిట్ డబ్బులు తిరిగి ఇవ్వకుండా మూడేళ్లుగా తిప్పుకుంటున్న వైనం బహిర్గతమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన టూ టౌన్ పోలీసులు బ్రాంచ్ మేనేజర్‌ను అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు సౌత్ జోన్ డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రాజమండ్రి ఏఆర్ డిపార్ట్‌మెంట్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కోరుకొండ విజయ్‌కుమార్ మార్గదర్శిలో మోసంపై శనివారం టూటౌన్ సీఐ గణేష్‌కు ఫిర్యాదు చేశారు. విజయ్‌కుమార్ మార్గదర్శి చిట్స్‌లో 2019లో రూ.5 లక్షల చిట్ వేశారు. 50 నెలల కాల వ్యవధిలో నెలకు రూ.10 వేల చొప్పున చిట్‌కు నగదు చెల్లించాలి. తనకున్న ఆర్థిక అవసరాల రీత్యా ఆయన 2020 జూన్ 21వ తేదీన రూ.3 లక్షలకు చిట్ పాడారు. చిట్ డబ్బులు చెల్లించాల్సిన మార్గదర్శి మేనేజర్, బ్రాంచ్ అధికారులు ఆయనకు డబ్బులు ఇవ్వలేదు. అదేమని ప్రశ్నిస్తే ఇద్దరి ష్యూరిటీ కావాలన్నారు. వాళ్ల కోరిక మేరకే ఇద్దరి ష్యూరిటీ తీసుకువచ్చారు. ఇప్పుడైనా చీటీ డబ్బులు ఇవ్వాలని కోరగా.. మీరు ఇతరులకు ష్యూరిటీ పెట్టారు. అది క్లియర్ చేస్తే మీ చీటీ డబ్బులు ఇస్తామని మేనేజర్ సమాధానం చెప్పారు. ష్యూరిటీకి సంబంధించిన డబ్బులు హెడ్ కానిస్టేబుల్ స్నేహితుడు చెల్లించేశారు. అయినా.. ఇతనికి రావాల్సిన రూ.3 లక్షలు ఇవ్వకుండా మూడేళ్లుగా తిప్పుకుంటున్నారు. ఈ విషయమై హెడ్ కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. మార్గదర్శి రాజమండ్రి బ్రాంచ్ మేనేజర్ సత్తి రవిశంకర్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

తప్పుడు డాక్యుమెంట్లతో నగదు స్వాహా

తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి రూ.4.67 లక్షలు స్వాహా చేసిన కూర్మన్నపాలెం మార్గదర్శి మేనేజర్ వి.వెంకటేశ్వరరావును అరెస్ట్ చేసినట్టు అనకాపల్లి పట్టణ సీఐ దాడి మోహన్‌రావు చెప్పారు. 2016లో స్థానిక మార్గదర్శి బ్రాంచిలో చిట్ వేసిన కొండకొప్పాక గ్రామానికి చెందిన అండిబోయిన వెంకటేశ్వరరావు అదే ఏడాది చిట్ పాడుకున్నాడు. అప్పటినుంచి మేనేజర్ నగదు ఇవ్వకుండా తప్పుడు డాక్యుమెంట్ల ద్వారా రూ.4.67 లక్షలు డ్రా చేసి స్వాహా చేశాడని శనివారం రాత్రి బాధితుడు వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. దీంతో ఆదివారం కూర్మన్నపాలెం మార్గదర్శి బ్రాంచిలో మేనేజర్‌గా పనిచేస్తున్న వి.వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకున్నట్టు సీఐ చెప్పారు. సోమవారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తామని తెలిపారు.

చీటింగ్‌కు ‘మార్గదర్శి’గా కడప మేనేజర్

- అక్రమ మార్గంలో ఏజెంట్ కోడ్‌లతో చిట్స్
- సహోద్యోగుల సహకారంతో అక్రమార్జన
- ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోండి
- సీబీఐ అధికారికి ‘మార్గదర్శి’ పూర్వపు ఉద్యోగుల వినతి

కడప అర్బన్: మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాల్లో కొత్త కోణం వెలుగుచూసింది. చందాదారులను మోసం చేసి అక్రమార్జనకు పాల్పడటంలో మార్గదర్శి యాజమాన్యమే కాదు.. సంస్థలో కొందరు మేనేజర్లు కూడా సిద్ధహస్తులేనన్న విషయాన్ని ఆ సంస్థ పూర్వపు ఉద్యోగులు వెలుగులోకి తెచ్చారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ వైఎస్సార్ జిల్లాలో కడప బ్రాంచి మేనేజర్‌గా పనిచేస్తున్న డి. శేషుబాబు అక్రమార్జనను వివరిస్తూ, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ సీబీఐ విజయవాడ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఆయన ఏజెంట్స్ కోడ్‌లతో చిట్‌లు భారీ మొత్తంలో అక్రమంగా సంపాదించాడని తెలిపారు. ఆ ఫిర్యాదులో పేర్కొన్న వివరాలివీ.. శేషుబాబు ఆయన సొంత ఏజెంట్ వి. శ్రీనివాసులరెడ్డి (ఏజెంట్ కోడ్ నం: సిపి0000160) కోడ్ ద్వారా ఎక్కువ మంది చిట్ సభ్యులను చేర్పించారు. ఎస్.వి బాలాజీ (ఏజెంట్ కోడ్ నం. జె0000088), గౌరి (ఏజెంట్ కోడ్ నం: జె0000167), ఎ.వి మహేష్ (ఏజెంట్ కోడ్ నం: సిపి000077)తో పాటు ఇంకా ఇతర ఏజెంట్ కోడ్‌లలో కూడా చిట్‌లు వేసి విపరీతంగా సంపాదించాడు. తనకు అనుకూలమైన వారికి తక్కువ బిడ్ అమౌంట్ కేటాయిస్తారు. మిగిలిన వారికి (స్టాఫ్) ఎక్కువ బిడ్‌ను మేనేజరే ఇంత అని నిర్ణయిస్తారు. పాట సమయానికి కస్టమర్ వచ్చినప్పుడు కూడా బిడ్ ఎక్కువగా వచ్చేట్లు ఉద్యోగులతో పాడిస్తాడు. ఈ విధంగా సంపాదించిన సొమ్ముతో బంగారం, బెంగళూరులో సొంత ఇల్లు, కడపలో స్థలాలు, అపార్ట్‌మెంట్‌లో ఒక ఫ్లాటు కూడా కొన్నారు. మిగిలిన మార్గదర్శి ఉద్యోగులను స్టాఫ్ కోడ్‌లతో చిట్స్ వేయమనీ వేధిస్తాడు. చెప్పినట్లు చేయకుంటే దుర్భాషలాడతాడు. దీంతో కొందరు సీనియర్ స్టాఫ్ వేరే సంస్థలకు వెళ్లిపోయారు. శేషుబాబు కొందరు ఖాతాదారులకు ఇవ్వాల్సిన గిఫ్ట్‌లను కూడా అమ్మేసుకున్నారు. ఆయనకు అనుకూలమైన ఉద్యోగులైన శివసతీష్, రిసెప్షనిస్టు వరలక్ష్మమ్మ కూడా ఏజెంట్ కోడ్‌లలో వేసుకోవడానికి ప్రాధాన్యత కల్పించాడు. శివసతీష్ చిట్టీ కమీషన్ డబ్బులను వడ్డీలకు ఇచ్చి మరింత సంపాదిస్తున్నాడు. పాట పాడటానికి ఎవ్వరూ రాకపోతే శేషుబాబు, శివసతీష్, వరలక్ష్మమ్మ కలిసి తక్కువ బిడ్ పోతున్నా ఎక్కువ బిడ్ పోయేలా చేస్తారు. దీనిద్వారా అసలైన చందాదారులకు వడ్డీ ఎక్కువ పడుతుంది. కస్టమర్లకు బిడ్ వచ్చిన తర్వాత కూడా డబ్బు ఇవ్వడానికి వీరు ఇబ్బందులకు గురిచేస్తారని వారు సీబీఐకి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

మనిషి... మనుగడ



మంచిమాట

మనుగడ అనేది ప్రతి మనిషికీ ఉంటుంది. మనిషికి మాత్రమే మనుగడ ఉంటుందా? ప్రతి జీవికీ మనుగడ ఉంటుంది. ఏ జీవి మనుగడ దానిదే. కొన్ని జంతువుల మనుగడ మనిషికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రతి మనిషి మనుగడా తనకు, సమాజానికి ప్రయోజనకరంగానే ఉండాలి; ప్రయోజనకరంగా ఉండేందుకు మనిషి తన మనుగడను ఒక అవకాశంగా తీసుకుని, చేసుకుని ప్రయత్నించాలి.

మనుగడ ప్రయోజనకరంగా పరిణమించడానికి ఏ మనిషికి ఐనా మెదడు, మనసు ఈ రెండూ కీలకం ఐనవి. మనసు తిన్ననైంది కాకపోవడం మాత్రమే మనిషికి లోటు కాదు; మెదడు సరిగ్గా పనిచెయ్యక పోవడం మాత్రమే మనిషికి లోటు కాదు. మెదడుకు మనసు లేకపోవడమే, మనసుకు మెదడు లేకపోవడమే మనిషికి లోతైన లోటు! మెదడుకు మనసు ఉండాలి; మనసుకు మెదడు ఉండాలి. మెదడు, మనసు కలిసి ఉద్యుక్తం ఐతే, ఉన్ముఖం ఐతే, ఉద్యమిస్తే ఉన్నతం ఐన ఫలితం వస్తుంది. మనుగడ ఉచ్చస్థితికి చేరుతుంది.

సగటు మనిషి తన చేతిలోనే తాను ఓడిపోతూ ఉంటాడు; తన ప్రవర్తనవల్ల తాను సరిగ్గా ఉండడం జరగదు సగటు మనిషికి; చేసిన లేదా జరిగిన తప్పులు దిద్దుకోబడడం ఉండదు చాల మంది విషయంలో; చెడిపోవడం అన్నది చెరిగిపోవడం జరగడం లేదు పలువురిలో. వీటికి కారణం మెదడుకు మనసు లేకపోవడమే; మనసుకు మెదడు లేకపోవడమే.

> మనిషికి మెదడు, మనసు ఉంటాయి. అవి సరిగ్గా, మెరుగ్గా ఉంటే మనిషి సరిగ్గా, మెరుగ్గా ఉంటాడు; అవి మేలుగా ఉంటే మనిషి మేలుగా ఉంటాడు. మెదడు, మనసు రెండూ కలిసి జతగా పనిచేస్తూ ఉంటేనే మనిషి గొప్ప స్థితిని, స్థాయిని, గతిని ఆపై ప్రగతిని పొందుతూ ఉంటాడు.

మనిషి మెదడు, మనసు ఎప్పుడూ ఖాళీగా ఉండవు. ఏవేవో, ఎన్నెన్నో వాటిలో ఉంటూ ఉంటాయి. అవసరం ఐనవి తక్కువగా, ఎక్కువగా అనవసరం ఐనవి మెదడు, మనసుల్లో ఉండి మనిషి మనుగడ మందమైపోవడానికి, మొద్దుబారిపోవడానికి కారణాలు ఔతూ ఉంటాయి. మెదడు, మనసుల పనితీరువల్లే మనిషికి మేలు, కీడులు కలుగుతూ ఉంటాయి; మనిషిని పనికి వచ్చేట్టుగానూ, పనికిరానట్టుగానూ చేసేవి మెదడు, మనసులే.

మెదడుకు మనసును, మనసుకు మెదడును నేర్పుతో అనుసంధానం చేసుకోవడమూ, ఆ అనుసంధానంతో దైనందిన జీవనాన్ని ఎదుర్కోవడమూ తెలిసిన మనిషికి అభివృద్ధి అలవడుతుంది. మనిషి అభివృద్ధిని అలవాటు చేసుకోవాలి; మనిషికి అభివృద్ధిలో అభినివేశం ఉండి తీరాలి. అభివృద్ధిలేని మనిషి అక్కరకురాని మనిషి ఔతాడు ఆపై అక్కర్లేని మనిషి ఔతాడు. మనిషి మనుగడ అనవసరం ఐంది, పనికిరాంది కాకూడదు; మనిషి మనుగడ వెలవెలపోకూడదు. మనిషి మనుగడ విలువైంది కావాలి. మనిషి తన మనుగడకు తానే విలువను, వన్నెను సమకూర్చుకోవాలి. మెదడు, మనసుల్ని సంయుక్తంగా సంప్రయోగించి మనిషి తన మనుగడను విజయవంతంగా నడుపుకోవాలి.

‘తిండిని వెతుక్కుంటూ రోజూ తిని/ ఏవేవో అల్పమైన కథలు చెప్పుకుని/ మనసు ఒడిలి బాధల్ని అనుభవించి/ ఇతరుల్ని బాధించేవెన్నో చేసి/ తల నెఱవు వచ్చి ముసలితనాన్ని పొంది/ ఘోరమైన మరణానికి బలై / మాసిపోయే పలు విదూషకుల్లా నేను కూలిపోతాననుకున్నావా?’ అని, అని తమిళ్ కవి సుబ్రమణియ బారతి పేలవంగా ఉండడాన్ని తిరస్కరించారు. కూలిపోయేందుకు కాకుండా, విదూషకత్వంతో కాకుండా, మాసిపోయేందుకు కాకుండా, ఇతరుల్ని బాధించేందుకు కాకుండా, బాధల్ని అనుభవిస్తూ ఉండేందుకు కాకుండా, అల్పుడుగా కాకుండా, ఏదో తింటూ కాలం గడిపేందుకు కాకుండా మిన్నగా మసలేందుకు, మిన్నులా ఎత్తుల్లో నిలిచేందుకు మెదడుతో మనసును, మనసుతో మెదడును సంయుక్తం చేసుకుని మనిషి కార్యాచరణకు పూనుకోవాలి.

మనిషి మనుగడ ప్రయోజనకరంగా ఎందుకు ఫలించకూడదు? మనిషి తన మనుగడను పట్టుదలతో ప్రయోజనకరం చేసుకోవాలి. మెదడు, మనసుల సమన్వయంతో, సంయోగంతో మనిషి సంపూర్ణంగా సఫలం అవాలి. మనిషి తన మనుగడకు సత్ప్రయోజనాన్ని సాధించుకోవాలి; సమాజానికీ సాధ్యం ఐనంత ప్రయోజనకరంగా మనిషి మెదులుతూ ఉండాలి.

– రోచిష్మాన్

సన్నిధి

వాగ్గేయకార వైభవం



ఓం శాంతిః శాంతిః శాంతిః

మీరు ఎన్నిక్రతువులు చేయండి, ఎన్ని పూజలు చేయండి, యజ్ఞాలు చేయండి... చివరకు మీరు కోరుకునేది ఏది... కేవలం ప్రశాంతత. నేను రాజభవనంలో ఉన్నా, నేనెంత అందగాడినయినా, ఎంత విద్వాంసుడినయినా, ఎంత ఐశ్వర్యం ఉన్నా... మనసు అల్లకల్లోలంగా ఉన్నప్పుడు, తీవ్ర అశాంతితో ఉన్నప్పుడు ఇవేవీ మీకు శాంతినివ్వలేవు. ఒక పచ్చటి చెట్టు, రంగు రంగుల పూలతో, కాయలతో, పళ్ళతో ఉన్నప్పటికీ తొఱ్ఱలో అగ్నిహోత్రం ఉన్నప్పుడు అది లోపల.. లోపల ఎంత దహించుకు పోతుంటుందో... మనసులో అశాంతి ఉన్న వ్యక్తికూడా అలాగే బాధపడుతూ ఉంటాడు. అందుకే శాంతి కావాలి. మన సంప్రదాయం మనకు ఒక శాంతి మంత్రాన్నే ఇచ్చింది...ఓం శాంతిః శాంతిః శాంతిః

ఇది కేవలం ప్రాణులు మాత్రమే కాదు, అంతరిక్షం శాంతి పొందాలి, పృథివి శాంతి పొందాలి, వాయువు శాంతిపొందాలి. జలం శాంతి పొందాలి. ఏదీ కూడా వ్యగ్రతను పొందకూడదు. భూమికి అచల అని పేరు. అంటే కదలనిది..అని. భూమికి కోపం వచ్చి తన కట్టుతప్పి కదిలిందనుకోండి.. ఎంత ప్రాణ నష్టం? ఎంత ఆస్తి నష్టం ? అందుకే భూమి ప్రశాంతంగా ఉండాలి.

వాయుః శాంతిః వాయువు తన కట్టుతప్పి తీవ్రతను చూపిందనుకోండి.. ప్రభంజనం అంటాం. అన్నీ నేల కొరుగుతాయి. అదే వాయువు తాను ఉండాల్సిన కట్టుబాటులో ఉంటే... వాయుః ప్రాణః, సుఖం వాయుః.

అప్పుడు ప్రాణమూ వాయువే, సుఖమూ వాయువే. చల్లగాలి చక్కగా వీస్తుందనుకోండి. సుఖంగా అనిపిస్తుంది. ఏ ఇబ్బందీ లేకుండా ఊపిరిని ఒకే వేగంతో తీసి, ఒకే వేగంతో విడిచిపెడుతూ ఉన్నప్పుడు.. అంతకన్నా ఆయుర్దాయం మరేముంది! వాయువు ఎంతకాలం శరీరంలో తిరుగుతూ ఉంటుందో అంత కాలమే సంధిబంధాలు.. కాళ్ళు, చేతులు, మణికట్టు అన్నీ వంగుతాయి. అది ప్రసరించనప్పుడు శరీరం ఒక కఱ్ఱయిపోతుంది. అందుచేత వాయువు అత్యంత ప్రధానమైనది. దాని చేత ప్రాణులన్నీ చలనశీలంగా ఉంటాయి.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

వడిబాయక తిరిగే ప్రాణబంధుడా !.. అంటారు అన్నమాచార్యులవారు. ఒకే వేగంతో ఊపిరిని శరీరం లోపలికి, బయటికి పంపుతున్నాడే..ఆయనే వేంకటేశ్వరుడు. ఇక అంతకన్నా నాకు దగ్గరగా ఎవరున్నార్రా!!! అని అడిగాడు. వడిబాయక తిరిగే ప్రాణబంధుడా.. అని పిలిచాడు ఆయన వేంకటేశ్వరుడిని. అదే.. వాయుఃప్రాణః సుఖం వాయుః. ఊపిరిని తీసి విడిచి పెడుతున్న శరీరం ఆచంద్రార్కం.. శాశ్వతంగా ఉండదు. పడిపోతుంది. ఇప్పుడు వాయువుకున్న గొప్పదనం ఏమిటంటే.. అదే వాక్కుగా మారుతుంది. ఆ వాయువు చేత ప్రాణాలను నిలబెట్టుకున్నవాడు వాటిని సార్థక్యం చేసుకున్నప్పుడు శరీరం పడిపోయినా ఆ వ్యక్తి.. కాలంలో శతాబ్దాలు నిలబడిపోతాడు.. ఎలా! అది వాక్కుగా మారినందువల్ల...!

బౌద్ధవాణి

తలుపులు తాళాలు లేని ఇళ్ళు...



వారణాసిలో గంగానదీ ఒడ్డున ఒక సత్రం ఉంది. ఆ సత్రానికి ఒకరోజున ముగ్గురు బాటసారులు వచ్చారు. వారు ఉదయం భోజనం ముగించాక సత్రం మధ్యలో ఉన్న చెట్టు కింది రచ్చబండ మీద కూర్చొన్నారు. ఒకరి సమాచారం ఒకరు చెప్పుకున్నారు.

వారిలో పొడగరి సుదత్తుడు. అతను అంగరాజ్యం నుండి వచ్చాడు. బట్టతల వాడు సుశీలుడు కోసల రాజ్యవాసి. పొట్టిగా నల్లగా ఉన్న వాడు ధర్మధరుడు. అతను శాక్య రాజ్యం నుంచి వచ్చాడు.

‘‘మిత్రులారా! మన దగ్గర ధనం ఉంది. ఈ ప్రాంతంలో దొంగలు ఎక్కువ. మనం చూస్తూ ఉండగానే మాయం చేయగలరు. కళ్ల గప్పి సొమ్ములు కాజేసుకుపోగల నేర్పరులు.’’ అన్నాడు సుదత్తుడు.

‘‘ఇక్కడ కంటే మగధ రాజ్యం మరీనూ. పట్టపగలే దోపిడీలు చేస్తారు’’ అన్నాడు సుశీలుడు.

‘‘మా రాజ్యంలో ఆ బెడద ఉండదు’ అన్నాడు ధర్మధరుడు.

‘‘మా రాజ్యంలో కూడా... మా రాజ్యంలో కూడా’’ అన్నారు మిగిలిన ఇద్దరు!

‘‘నిజమా!’’ అని ప్రశ్నించాడు ధర్మధరుడు.

‘‘ఔను మిత్రమా! మా రాజ్యంలో ఇళ్ళన్నీ గట్టి గోడలతో ఉంటాయి. బలమైన తలుపులు ఉంటాయి. ఏ ఒక్కరూ నిర్లక్ష్యంగా ఉండరు. వస్తువులన్నీ ఎడాపెడా పడవెయ్యరు. పైగా.. రాజభటులు ఎప్పుడూ కావలి కాస్తూనే ఉంటారు. మన అజాగ్రత్తే దొంగలకు అవకాశం అవుతుంది. మనం నిర్లక్ష్యాన్ని కప్పి పుచ్చుకుని నేరం దొంగల మీద వేస్తాం’’ అన్నాడు అంగ రాజ్యానికి చెందిన సుదత్తుడు.

‘‘అసలు మా రాజ్యంలో అయితే.. దొంగతనం చేయాలి అంటేనే దొంగలకీ భయమేస్తుంది.

> ‘శిక్షించబడతాం’ అనే భయంతో కోరికల్ని వదిలిపెట్టకూడదు. భయంతో వదిలే కోరికలు తాత్కాలికమే. ఇక్కడ శిక్షలు లేవు, ఎవ్వరూ చూడడం లేదు’ అనుకుంటే వెంటనే కోర్కెలు తీర్చుకోవడానికి సిద్ధపడతారు. అవకాశం లేకపోవడం వల్లనో, శిక్షల భయం వల్లనో తప్పులకు దూరంగా ఉండటం కాదు... స్వీయ నిగ్రహం వల్ల ఉండాలి. అలా ఉండాలంటే మనస్సులో కామరాగాలు నశించాలి. వాళ్లే వీతరాగులు.

దొంగల విషయంలో మా మహారాజుగారు మహా క్రూరంగా వ్యవహరిస్తారు. కఠిన శిక్షలు అమలు చేస్తారు’’ అన్నాడు సుశీలుడు.

‘‘దొంగతనం చేయాలంటే.. దొంగలకి వెన్నులో వణుకు వస్తుంది. అందుకే మా రాజ్యంలో ఇళ్ళకు సరైన తాళాలు కూడా వెయ్యరు. దండం దశగుణం భవేత్... అంటూ ముగించాడు సుశీలుడు.

ధర్మధరుడు వాళ్ళిద్దరి మాటలు విని మౌనంగా ఉన్నాడు.

‘‘మిత్రమా! మరి మీ రాజ్యం’’అని అడిగాడు సుదత్తుడు.

‘‘మిత్రులారా! మా రాజ్యంలో మా ఇళ్ళకు తాళాలు ఉండవు.’’ అన్నాడు.

‘అంటే మా రాజ్యం లాగానే అన్నమాట’’ అన్నాడు ఆతృతగా సుశీలుడు.

‘‘కాదు మిత్రమా! ఈ సుదత్తుని రాజ్యంలో ప్రజలు తమ జాగ్రత్తల్లో ఉంటారు. ఇంటికి బలమైన గోడలూ, వాటి చుట్టూ రక్షక వలయాలూ.. ఇతరులకి దొంగతనం చేసే అవకాశమే ఇవ్వరు. కాబట్టి ఆ రాజ్యంలో దొంగతనాలు లేవు. ఇక మీ రాజ్యంలో కఠోరమైన శిక్షలు. కాబట్టి, శిక్షల భయంతో మీ రాజ్యంలో చోరులు లేరు. కానీ మా రాజ్యంలో వేరు. దొంగతనానికి కఠినమైన శిక్షలు లేవు. మా ఇళ్లకూ గట్టి రక్షణలూ లేవు. అయినా దొంగతనాలు జరగవు. కారణం! దొంగతనం చేయాలనే ఆలోచనే ఎవ్వరిలోనూ ఉండదు. పరుల సొమ్మును పాములా భావిస్తారు. మనో నిబ్బరంతో ఉంటారు. శీలవంతులుగా జీవిస్తారు. కాబట్టి మా రాజ్యంలో దొంగతనాలు తెలియవు. దొంగలకి శిక్షలు తెలియవు. వారి కోసం చెరసాలలూ లేవు.’’ అన్నాడు.

‘‘ఐతే.. మేము విన్నది నిజమే అన్నమాట’’ మీరందరూ వీతరాగులే’’ అన్నారు మిగిలిన ఇద్దరూ!

‘‘అవును.. తథాగత బుద్ధుని బోధనలు పాటిస్తాం. వీతరాగులుగానే జీవిస్తాం’’ అన్నాడు ధర్మధరుడు.

అలాంటి మనుషులు, వారి మనస్సులూ దుఃఖాలకి దూరమవుతాయి. అలాంటి మనుషులున్న సమాజం ఆదర్శనీయమవుతుంది. అల్లకల్లోలాలకు దూరమవుతుంది. ఆ సమాజంలో శాంతి తాండవిస్తుంది’’ అంటాడు బుద్ధుడు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

సెప్టెంబరులో స్టార్ట్



రజనీకాంత్

‘జైలర్’ సినిమా సక్సెస్ జోష్‌లో ఉన్నారు హీరో రజనీకాంత్. అయితే ఈ సినిమా రిలీజ్‌కి ముందే తన ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా హిమాలయాల్లో కొంత సమయం గడిపారు రజనీ. అలాగే దేశంలోని మరికొన్ని ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శిస్తున్నారాయన. అయితే రజనీకాంత్ ఆధ్యాత్మిక యాత్ర ఈ నెలాఖరుకల్లా పూర్తవుతుందట. దీంతో ‘జై భీమ్’ ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో తాను హీరోగా నటించాల్సిన సినిమాపై ఆయన పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరిస్తారని, సెప్టెంబరు రెండో వారంలో ఈ సినిమా షూటింగ్‌లో జాయిన్ అవుతారని కోలీవుడ్ టాక్. రజనీకాంత్ కెరీర్‌లో 170వ సినిమాగా తెరకెక్కనున్న ఈ మూవీలో ఓ కీలక పాత్రలో అమితాబ్ బచ్చన్, ప్రతినాయకుడి ఛాయలు ఉండే మరో కీలక పాత్రలో శర్వానంద్ నటిస్తారనే ప్రచారం సాగుతోంది. లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్ నిర్మించనున్న ఈ సినిమా 2024లో విడుదల కానుంది.

చిన్న విరామం తర్వాత..



రామ్ చరణ్

రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా ‘గేమ్‌చేంజర్’. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కాగా ఈ సినిమా లేటెస్ట్ షెడ్యూల్ చిత్రీకరణ ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైంది. అయితే ఈ షెడ్యూల్‌లో చిన్న విరామం ఇచ్చిన యూనిట్ తిరిగి షూటింగ్‌ని ప్రారంభించినట్లు ఫిల్మ్‌నగర్ టాక్. రామ్‌చరణ్‌తో పాటు కీలక తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట శంకర్. జయరాం, అంజలి, సునీల్, నవీన్‌చంద్ర కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు. ‘దిల్’ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.

బీదర్‌లో సైంధవ్



వెంకటేశ్

వెంకటేశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘సైంధవ్’. ఈ మూవీలో శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ కర్ణాటకలోని బీదర్‌లో ప్రారంభమైంది. వెంకటేశ్ పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట శైలేష్ కొలను. తాజాగా మొదలైన బీదర్ షెడ్యూల్ ఈ నెలాఖరు వరకూ సాగుతుందట. సెప్టెంబరులో ప్లాన్ చేసిన ఓ విదేశీ షెడ్యూల్‌తో ‘సైంధవ్’ చిత్రీకరణ దాదాపు పూర్తవుతుందని, వినాయక చవితి పండగ సందర్భంగా టీజర్‌ను విడుదల చేసే ఆలోచనలో చిత్ర యూనిట్ ఉన్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, హిందీ భాషల్లో ‘సైంధవ్’ చిత్రం డిసెంబరు 22న విడుదల కానుంది. ఈ సినిమాకు సహ నిర్మాత: కిషోర్ తాళ్లూరు, సంగీతం: సంతోష్ నారాయణ్.

ప్రతి పాత్ర కథని మలుపు తిప్పుతుంది - దుల్కర్ సల్మాన్

"నేను ఇప్పటి వరకూ గ్యాంగ్‌స్టర్ సినిమాలు చేయలేదు. తొలిసారి ‘కింగ్ ఆఫ్ కొత్త’ చేశాను. ఈ కథ రెండు పీరియడ్స్‌లో ఉంటుంది. పాటలు, యాక్షన్ సీక్వెన్స్, ఫుట్ బాల్.. ఇలా అన్ని వాణిజ్య అంశాలున్నాయి. ఇందులో ప్రతి పాత్ర కథని మలుపు తిప్పుతుంది. అది నాకు చాలా నచ్చింది" అని హీరో దుల్కర్ సల్మాన్ అన్నారు. అభిలాష్ జోషి దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్, ఐశ్వర్య లక్ష్మి జంటగా నటించిన చిత్రం ‘కింగ్ ఆఫ్ కొత్త’. జీ స్టూడియోస్, వేఫేరర్ ఫిల్మ్స్ నిర్మించిన ఈ సినిమా తెలుగు, మలయాళం, తమిళ్, హిందీలో ఈ నెల 24న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా దుల్కర్ సల్మాన్ పంచుకున్న విశేషాలు....



- అభిలాష్, నేను చిన్ననాటి స్నేహితులం. ఎప్పటి నుంచో సినిమా చేయాలనుకుంటే ‘కింగ్ ఆఫ్ కొత్త’కి కుదిరింది. మంచి గ్యాంగ్‌స్టర్ డ్రామా ఇది. స్నేహం కూడా ఉంటుంది. నేను ఏడాదికి మూడు సినిమాలు చేస్తాను. కానీ, ప్రేక్షకులకు మంచి సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలని ఈ మూవీ కోసం ఏడాది శ్రమించా. సాంకేతికంగా ఈ మూవీ పెద్ద స్థాయిలో ఉంటుంది.
- కొత్త అంటే మలయాళంలో టౌన్ అని అర్థం. అదొక ఫిక్షనల్ టౌన్. అయితే తెలుగులో కొత్త అనే పదానికి కొత్తది అనే అర్థం వస్తుంది. అందుకే డబ్బింగ్‌లో కోత అని చెప్పాం. ప్రేక్షకులకు నేను ఎక్కువగా లవర్ బాయ్‌గా గుర్తుంటాను(నవ్వుతూ). ఒకేరకమైన కథలు, పాత్రలు చేయాలని ఉండదు. ప్రేక్షకులతో పాటు నటుడిగా నాకు నేను సర్‌ప్రైజ్ అయ్యే పాత్రలు చేయాలని ఉంటుంది. ఈ మూవీ కోసం తెలుగు, మలయాళం, తమిళ్, హిందీ భాషల్లో నేనే డబ్బింగ్ చెప్పాను. ఓ రకంగా ఇప్పుడు నేను డబ్బింగ్ ఆర్టిస్ట్‌ని కూడా (నవ్వుతూ).
- ఐశ్వర్య లక్ష్మి చాలా ప్రతిభ ఉన్న నటి. ఈ మూవీలో తన పాత్ర కీలకంగా ఉంటుంది. నిమేష్ రవి విజువల్స్, జాక్స్ బిజోయ్ సంగీతం సినిమాకు ప్లస్. సినిమాని కాపాడాలి, మంచి సమయంలో రిలీజ్ చేయాలంటే మనమే నిర్మాణం, డిస్ట్రిబ్యూషన్‌లో ఉండాలని వేఫేరర్ ఫిల్మ్స్ స్టార్ట్ చేశాను. ప్రస్తుతం నేను, రానా కలిసి ‘కాంత’ చేస్తున్నాం. తెలుగు, ఇతర పరిశ్రమల నుంచి నేర్చుకున్న ఎన్నో విషయాలను మలయాళంలో అనుసరిస్తున్నాను. ప్రస్తుతం తెలుగులో వెంకీ అట్లూరిగారి దర్శకత్వంలో ‘లక్కీ భాస్కర్’ సినిమా చేస్తున్నాను. మరికొన్ని కథలు వింటున్నాను. ప్రభాస్‌గారి ‘కల్కి 2898 ఏడీ’లో నేను నటిస్తున్నానా? లేదా? అన్నది మేకర్సే చెప్పాలి.



కృతీసనన్

మిస్టరీ మొదలైంది



కాజోల్

బాలీవుడ్ హీరోయిన్స్ కాజోల్, కృతీ సనన్ కలిసి నటిస్తున్న తాజా చిత్రం ‘దో పత్తీ’. మిస్టరీ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాకి శశాంకా చతుర్వేది దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ ముంబైలో ప్రారంభమైంది. కృతీసనన్, కాజోల్ పాల్గొంటుండగా కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు శశాంక. ఈ సినిమాను రచయిత కనికా థిల్లాన్, కృతీసనన్ నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ఈ సినిమా డైరెక్ట్‌గా స్ట్రీమింగ్ కానుంది. మరోవైపు 2015లో షారుక్ ఖాన్ హీరోగా రోహిత్ శెట్టి దర్శకత్వంలో వచ్చిన ‘దిల్‌వాలే’ చిత్రంలో కాజోల్, కృతీసనన్ కలిసి నటించారు. మళ్లీ ఇప్పుడు ‘దో పత్తీ’ కోసం ఈ ఇద్దరూ సెట్స్‌లో జాయిన్ అవుతున్నారు.

కాంబినేషన్ రిపీట్



ధనుష్

హీరో ధనుష్, దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం ‘కెప్టెన్ మిల్లర్’. ఈ సినిమా డిసెంబరులో విడుదల కానుంది. అయితే ‘కెప్టెన్ మిల్లర్’ తర్వాత అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలోనే మరో సినిమా చేయనున్నారు ధనుష్. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ఇలా ధనుష్, అరుణ్ కాంబినేషన్ రిపీట్ కానుంది. అలాగే ఈ సినిమాకు ధనుష్ నిర్మాణ భాగస్వామిగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తన కెరీర్‌లోని 50వ సినిమాతో బిజీగా ఉన్నారు ధనుష్. ఈ మూవీలో ఆయన హీరోగా నటించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. ధనుష్ ఇప్పటికే కమిట్ అయిన సినిమాలు పూర్తి చేసిన తర్వాతనే అరుణ్ సినిమాని స్టార్ట్ చేస్తారట.

సూర్యతో జోడీ?



అదితీ

ప్రముఖ దర్శకుడు శంకర్ కుమార్తె అదితీ శంకర్ హీరో సూర్యకి జోడీగా నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి తమిళ చిత్ర వర్గాలు. సూర్య హీరోగా సుధా కొంగర దర్శకత్వంలో వచ్చిన ‘సూరరై పోట్రు’(తెలుగులో ఆకాశం నీ హద్దురా) సినిమా హిట్‌గా నిలిచింది. వీరి కాంబినేషన్‌లో మరో చిత్రం ‘సూర్య 43’(వర్కింగ్ టైటిల్) రూపొందనుంది. ఈ మూవీలో అదితీ శంకర్ హీరోయిన్‌గా ఫిక్స్ అయ్యారని టాక్.

మొదటి ప్రయాణం మరచిపోకూడదు - త్రినాథరావు నక్కిన



చంటి, లహరి, త్రినాథరావు నక్కిన

‘‘నాది, బెక్కెం వేణు గోపాల్‌గారి ప్రయాణం చిన్న సినిమా నుంచే ప్రారంభమైంది. అప్పట్లో మా సినిమా పోస్టర్, టీజర్, ట్రైలర్‌లను ఎవరు రిలీజ్ చేస్తారా? అని ఎదురు చూసేవాళ్లం. ఇప్పుడు పెద్ద సినిమాలు చేస్తున్నామని మా మొదటి ప్రయాణం మరచిపోకూడదు కదా?. అందుకే ఎవరైనా సపోర్ట్ కావాలని అడిగితే మా వంతు సపోర్ట్ చేయటానికి, ప్రోత్సహించటానికి వెనుకాడం’’ అని డైరెక్టర్ త్రినాథరావు నక్కిన అన్నారు. చంటి, లహరి జంటగా కేవీఆర్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం ‘ఏపీ 31’. ‘నెంబర్ మిస్సింగ్’ అన్నది ట్యాగ్ లైన్. అన్నపూర్ణేశ్వరి సినీ క్రియేషన్స్‌పై నారాయణ స్వామి.ఎం నిర్మిస్తున్నారు. ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను త్రినాథరావు నక్కిన, ఫస్ట్ లుక్‌ని నిర్మాత బెక్కెం వేణుగోపాల్ రిలీజ్ చేసి, ‘ఏపీ 31’ హిట్ కావాలన్నారు. ‘‘అందరి సపోర్ట్‌తో సినిమాను పూర్తి చేస్తున్నాం’’ అన్నారు కేవీఆర్.

మోసగాడి యాక్షన్



నరేందర్, రేఖ

చంద్రకాంత్ దత్త, నరేందర్, రేఖ నిరోషా ప్రధాన పాత్రల్లో బర్ల నారాయణ దర్శకత్వం వహించిన చిత్రం ‘చీటర్’. యస్ఆర్ఆర్ ప్రొడక్షన్స్‌పై పరుపాటి శ్రీనివాస్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 22న విడుదల కానుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని దర్శకుడు త్రినాథరావు నక్కిన విడుదల చేసి, మాట్లాడుతూ–‘‘చీటర్’ ఫస్ట్ లుక్ బాగుంది.. సినిమా హిట్ కావాలి’’అన్నారు. ‘‘యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన సినిమా ఇది. విడుదలైన పాటలకు మంచి స్పందన వచ్చింది’’ అన్నారు బర్ల నారాయణ. ‘‘మా సినిమా ఔట్‌పుట్ బాగా వచ్చింది’’ అన్నారు శ్రీనివాస్ రెడ్డి.



సిన్సినాటి ఓపెన్ ఫైనల్లో అల్‌కరాజ్‌తో జొకోవిచ్ ‘ఢీ’

కెరీర్‌లో 39వ మాస్టర్స్ సిరీస్ టైటిల్ సాధించేందుకు సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్... కెరీర్‌లో ఐదో మాస్టర్స్ సిరీస్ టైటిల్ నెగ్గేందుకు స్పెయిన్ స్టార్, ప్రపంచ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ అమీతుమీ తేల్చుకోనున్నారు. అమెరికాలోని ఒహాయో రాష్ట్రంలో జరుగుతున్న సిన్సినాటి ఓపెన్ మాస్టర్స్-1000 టోర్నీలో వీరిద్దరూ ఫైనల్లోకి దూసుకెళ్లారు. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్‌లో అల్‌కరాజ్ 2-6, 7-6 (7/4), 6-3తో హుబెర్ట్ హుర్కాజ్ (పోలాండ్)పై విజయం సాధించగా... జొకోవిచ్ 7-6 (7/5), 7-5తో అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)ను ఓడించాడు. ఈ క్రమంలో 36 ఏళ్ల జొకోవిచ్ ఈ టోర్నీ చరిత్రలో ఫైనల్ చేరిన పెద్ద వయస్కుడిగా గుర్తింపు పొందాడు. అల్‌కరాజ్‌తో ముఖాముఖి రికార్డులో జొకోవిచ్ 1-2తో వెనుకంజలో ఉన్నాడు.



రుతురాజ్, సామ్సన్ మెరుపులు

రెండో టి20లోనూ భారత్‌దే గెలుపు

- సిరీస్ 2-0తో టీమిండియా వశం
- 33 పరుగుల తేడాతో ఐర్లాండ్ ఓటమి

డబ్లిన్: సీనియర్లంతా విశ్రాంతి తీసుకున్న ఐర్లాండ్ పర్యటనలో యువ ఆటగాళ్లు బాధ్యతగా ఆడి టీమిండియాను గెలిపించారు. రెండో టి20లో 33 పరుగులతో గెలుపొందిన బుమ్రా బృందం మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. సిరీస్‌లోని చివరిదైన మూడో మ్యాచ్ ఈనెల 23న ఇదే వేదికపై జరుగుతుంది. రెండో టి20లో మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 185 పరుగులు చేసింది. ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ (43 బంతుల్లో 58; 6 ఫోర్లు, 1 సిక్స్), సంజూ సామ్సన్ (26 బంతుల్లో 40; 5 ఫోర్లు, 1 సిక్స్), ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ రింకూ సింగ్ (21 బంతుల్లో 38; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరిపించారు. మెకార్తీ 2 వికెట్లు తీశాడు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఐర్లాండ్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 152 పరుగులు చేసి ఓడిపోయింది. ఓపెనర్ ఆండీ బల్బిర్నీ (51 బంతుల్లో 72; 5 ఫోర్లు, 4 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేశాడు. బుమ్రా, ప్రసిధ్ కృష్ణ, రవి బిష్ణోయ్ తలా 2 వికెట్లు తీశారు.

రాణించిన గైక్వాడ్

భారీ షాట్లు ఆడే క్రమంలో బంతిని గాల్లోకి లేపిన టాపార్డర్ బ్యాటర్లు యశస్వి జైస్వాల్ (11 బంతుల్లో 18; 2 ఫోర్లు, 1 సిక్స్), వన్‌డౌన్ బ్యాటర్ తిలక్ వర్మ (1) అవుటయ్యారు. విండీస్ పర్యటనలో రాణించిన తిలక్ ఈ సిరీస్‌లోని రెండు మ్యాచ్‌ల్లో నిరాశ పరిచాడు. మెకార్తీ షార్ట్‌పిచ్ బంతిని తిలక్ పుల్ చేయగా అదికాస్తా అక్కడే చాలా ఎత్తుకు లేచింది. డీప్‌స్క్వేర్ లెగ్‌లో ఉన్న డాకెరెల్ క్యాచ్‌ను అందుకున్నాడు. 34 పరుగులకే 2 కీలక వికెట్లు కోల్పోయిన జట్టును రుతురాజ్, సంజూ సామ్సన్ ధాటిగా నడిపించారు. మూడో వికెట్‌కు 71 పరుగులు జోడించారు. వేగంగా ఆడుతున్న సామ్సన్ బంతిని వికెట్ల మీదికి ఆడుకొని నిష్క్రమించగా, అర్ధసెంచరీ అనంతరం రుతురాజ్ అవుటయ్యాడు. ఆఖర్లో రింకూ సింగ్, శివమ్ దూబే (16 బంతుల్లో 22 నాటౌట్, 2 సిక్స్‌లు) మెరుపులు మెరిపించారు.



సామ్సన్



రింకూ సింగ్



రుతురాజ్

బల్బిర్నీ పోరాటం...

తొలి మ్యాచ్‌లో బుమ్రా పడగొట్టినట్లే ఈసారి ప్రసిధ్ కృష్ణ ఒకే ఓవర్లో (3వ) కెప్టెన్ స్టిర్లింగ్ (0), టక్కర్ (0)లను డకౌట్ చేశాడు. టెక్టర్ (7), క్యాంఫర్ (18)లను రవి బిష్ణోయ్ స్పిన్‌తో బోల్తా కొట్టించాడు. దాంతో 10 ఓవర్లలో ఐర్లాండ్ స్కోరు 63/4. ఈ దశలో ఐర్లాండ్‌కు గెలుపుపై ఆశలేమీ లేవు. అయితే బల్బిర్నీ వీరవిహారం భారత శిబిరాన్ని వణికించింది. డాకెరెల్ (13; 1 సిక్స్)తో కలిసి జట్టు స్కోరును 100 పరుగులు దాటించాడు. కాసేపటికే డాకెరెల్ లేని పరుగుకు యత్నించి రనౌట్ కాగా... సిక్సర్ల మోత మోగిస్తున్న బల్బిర్నీ జోరుకు అర్ష్‌దీప్ బ్రేక్ వేశాడు. ఆ తర్వాత మ్యాచ్ పూర్తిగా భారత్ పక్షాన నిలిచింది. మార్క్ అడైర్ (15 బంతుల్లో 23; 3 సిక్సర్లు) భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. అయితే బంతులకి, పరుగులకి మధ్య కొండంత అంతరాన్ని ఈ సిక్సర్లు తగ్గించలేకపోయాయి.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (సి) క్యాంఫర్ (బి) యంగ్ 18; రుతురాజ్ (సి) టెక్టర్ (బి) మెకార్తీ 58; తిలక్ వర్మ (సి) డాకెరెల్ (బి) మెకార్తీ 1; సంజూ సామ్సన్ (బి) వైట్ 40; రింకూ సింగ్ (సి) యంగ్ (బి) అడైర్ 38; దూబే (నాటౌట్) 22; సుందర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 185.**

వికెట్ల పతనం: 1-29, 2-34, 3-105, 4-129, 5-184. **బౌలింగ్:** మార్క్ అడైర్ 4-0-36-1, జోష్ లిటిల్ 4-0-48-0, మెకార్తీ 4-0-36-2, క్రెయిగ్ యంగ్ 4-0-29-1, బెన్ వైట్ 4-0-33-1.

ఐర్లాండ్ ఇన్నింగ్స్: బల్బిర్నీ (సి) సామ్సన్ (బి) అర్ష్‌దీప్ 72; స్టిర్లింగ్ (సి) అర్ష్‌దీప్ (బి) ప్రసిధ్ కృష్ణ 0; టక్కర్ (సి) రుతురాజ్ (బి) ప్రసిధ్ కృష్ణ 0; టెక్టర్ (బి) రవి బిష్ణోయ్ 7; క్యాంఫర్ (సి) దూబే (బి) రవి బిష్ణోయ్ 18; డాకెరెల్ (రనౌట్) 13; అడైర్ (సి) తిలక్ వర్మ (బి) బుమ్రా 23; మెకార్తీ (సి) రవి బిష్ణోయ్ (బి) బుమ్రా 2; యంగ్ (నాటౌట్) 1; జోష్ లిటిల్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి) 152.**

వికెట్ల పతనం: 1-19, 2-19, 3-28, 4-63, 5-115, 6-123, 7-126, 8-148. **బౌలింగ్:** బుమ్రా 4-1-15-2, అర్ష్‌దీప్ 4-0-29-1, ప్రసిధ్ కృష్ణ 4-0-29-2, రవి బిష్ణోయ్ 4-0-37-2, వాషింగ్టన్ సుందర్ 2-0-19-0, శివమ్ దూబే 2-0-18-0.



స్వర్ణ పతకాలతో భారత పిస్టల్ షూటర్లు ఇషా సింగ్, మను భాకర్, రిథమ్ సాంగ్వాన్

భారత్ బంగారు గురి

- మహిళల 25 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో ఇషా సింగ్ బృందానికి స్వర్ణం
- పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ టీమ్ ఈవెంట్‌లోనూ భారత్‌కు పసిడి పతకం
- కాంస్యంతో పారిస్ ఒలింపిక్స్ బెర్త్ సాధించిన అఖిల్ షెరాన్

బకూ (అజర్‌బైజాన్): ప్రపంచ సీనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఆదివారం భారత షూటర్లు అద్వితీయ ప్రదర్శనతో అలరించారు. రెండు స్వర్ణ పతకాలు, ఒక కాంస్య పతకం సాధించడంతో పాటు భారత్‌కు పారిస్ ఒలింపిక్స్ ఐదో బెర్త్‌ను ఖరారు చేశారు. తెలంగాణ షూటర్ ఇషా సింగ్, హరియాణా అమ్మాయిలు రిథమ్ సాంగ్వాన్, మనూ భాకర్ బృందం మహిళల 25 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు బంగారు పతకం అందించింది. రిథమ్, ఇషా సింగ్, మనూ భాకర్ జట్టు 1,744 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచింది. వ్యక్తిగత విభాగంలో రిథమ్ 583 పాయింట్లు స్కోరు చేసి ఎనిమిదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఇషా సింగ్ 581 పాయింట్లతో 16వ స్థానంలో, మనూ 580 పాయింట్లతో 22వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత పొందలేకపోయారు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో రిథమ్ ఎనిమిది పాయింట్లు స్కోరు చేసి ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ టీమ్ ఈవెంట్‌లో అఖిల్ షెరాన్, ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, నీరజ్ కుమార్‌లతో కూడిన భారత జట్టు స్వర్ణ పతకం గెలిచింది. భారత బృందం మొత్తం 1750 పాయింట్లు స్కోరు చేసి ప్రథమ స్థానంలో నిలిచింది. క్వాలిఫయింగ్‌లో 585 పాయింట్లు స్కోరు చేసిన అఖిల్ ఐదో స్థానంతో ఫైనల్‌కు అర్హత పొందాడు. ఎనిమిది మంది మధ్య షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో అఖిల్ 450 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించాడు. అంతేకాకుండా భారత్‌కు పారిస్ ఒలింపిక్స్ ఐదో బెర్త్‌ను అందించాడు. ప్రస్తుతం పతకాల పట్టికలో భారత్ మూడు స్వర్ణాలు, మూడు కాంస్యాలతో కలిపి ఆరు పతకాలతో మూడో స్థానంలో ఉంది.



అఖిల్

అనాహత్ అదరహో

ఆసియా జూనియర్ బాలికల స్క్వాష్ టైటిల్ సొంతం

డాలియన్ (చైనా): భారత స్క్వాష్ రైజింగ్ స్టార్ అనాహత్ సింగ్ ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రదర్శన చేసింది. అండర్-17 బాలికల సింగిల్స్ విభాగంలో ఆసియా చాంపియన్‌గా అవతరించింది. 15 ఏళ్ల అనాహత్ ఫైనల్లో 3-1తో ఇనా క్వాంగ్ (హాంకాంగ్)పై విజయం సాధించింది. ఈ టోర్నీలో భారత్‌కు మూడు కాంస్య పతకాలు కూడా లభించాయి. అండర్-19 బాలుర సింగిల్స్‌లో శౌర్య, అండర్-19 బాలికల సింగిల్స్‌లో పూజ ఆర్తి, అండర్-15 బాలుర సింగిల్స్‌లో ఆర్యవీర్ సింగ్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాలు గెలిచారు.





100 మీటర్ల చాంప్ నోవా లైల్స్

వరుసగా నాలుగోసారి అమెరికా ఖాతాలో స్ప్రింట్ స్వర్ణం

బుడాపెస్ట్ (హంగేరి): ‘జమైకా చిరుత’ ఉసేన్ బోల్ట్ రిటైరయ్యాక... పురుషుల 100 మీటర్ల స్ప్రింట్ ఈవెంట్‌లో మళ్లీ అమెరికన్ అథ్లెట్లు ఆధిపత్యం చాటుకుంటున్నారు. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో వరుసగా నాలుగోసారి పురుషుల 100 మీటర్ల విభాగంలో అమెరికా ఖాతాలో స్వర్ణ పతకం చేరింది. ఆదివారం జరిగిన పురుషుల 100 మీటర్ల ఫైనల్లో అమెరికా అథ్లెట్ నోవా లైల్స్ పసిడి పతకం సాధించాడు. 26 ఏళ్ల నోవా లైల్స్ అందరికంటే వేగంగా 9.83 సెకన్లలో గమ్యానికి చేరి తొలిసారి ఈ విభాగంలో విశ్వ విజేతగా అవతరించాడు. లెట్సిలె టెబోగో (బోట్స్‌వానా; 9.88 సెకన్లు) రజతం... జార్నెల్ హ్యూస్ (బ్రిటన్; 9.88 సెకన్లు) కాంస్యం గెల్చుకున్నారు. ఒబ్లిక్ సెవిల్లె (జమైకా) కూడా 9.88 సెకన్లలో రేసును ముగించాడు. అయితే ఫొటో ఫినిష్ ఆధారంగా రజత, కాంస్య పతకాలను ఖరారు చేశారు. 2017 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో జస్టిన్ గాట్లిన్ (అమెరికా) ధాటికి ఉసేన్ బోల్ట్ కాంస్య పతకంతో సరిపెట్టుకొని అదే ఏడాది ఆటకు వీడ్కోలు పలికాడు. అనంతరం 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో క్రిస్టియన్ కోల్‌మన్ (అమెరికా), 2022 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఫ్రెడ్ కెర్లీ (అమెరికా) 100 మీటర్ల విభాగంలో వరల్డ్ చాంపియన్స్‌గా నిలిచారు. ఈసారి డిఫెండింగ్ చాంపియన్ ఫ్రెడ్ కెర్లీ సెమీఫైనల్లోనే నిష్క్రమించాడు.

భారత అథ్లెట్లకు నిరాశ

ఈ మెగా ఈవెంట్‌లో వరుసగా రెండోరోజు భారత అథ్లెట్లు నిరాశాజనక ప్రదర్శన కనబరిచారు. పురుషుల హైజంప్‌లో సర్వేశ్ కుషారే 2.22 మీటర్ల ఎత్తుకు ఎగిరి ఓవరాల్‌గా 20వ స్థానంలో నిలిచాడు. పురుషుల 400 మీటర్ల హర్డిల్స్‌లో సంతోష్ కుమార్ తన హీట్స్‌ను 50.46 సెకన్లలో ముగించి ఓవరాల్‌గా 36వ ర్యాంక్‌తో సరిపెట్టుకున్నాడు.



సూపర్ స్పెయిన్

తొలిసారి మహిళల ప్రపంచకప్ ఫుట్‌బాల్ టైటిల్ సొంతం

సిడ్నీ: ఏమాత్రం అంచనాలు లేకుండా ఆస్ట్రేలియాలో అడుగుపెట్టిన స్పెయిన్ మహిళల ఫుట్‌బాల్ జట్టు చివరకు అందర్నీ ఆశ్చర్యపరుస్తూ విశ్వవిజేతగా అవతరించింది. ఆదివారం జరిగిన మహిళల ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీ ఫైనల్లో స్పెయిన్ 1-0 గోల్ తేడాతో ఇంగ్లండ్ జట్టును ఓడించింది. ఆట 29వ నిమిషంలో ఓల్గా కర్మోనా చేసిన గోల్‌తో స్పెయిన్ ఆధిక్యంలోకి వెళ్లింది. ఆట 68వ నిమిషంలో స్పెయిన్‌కు పెనాల్టీ కిక్ రూపంలో రెండో గోల్ చేసే అవకాశం వచ్చింది. అయితే జెన్నీ హెర్మోసో కొట్టిన పెనాల్టీ షాట్‌ను ఇంగ్లండ్ గోల్‌కీపర్ మేరీ ఈర్ప్స్ ఎడమ వైపునకు డైవ్ చేస్తూ అడ్డుకుంది. మూడో ప్రయత్నంలో తొలిసారి ఈ మెగా టోర్నీలో ఫైనల్ చేరిన ఇంగ్లండ్ జట్టు స్కోరు సమం చేసేందుకు చివరి నిమిషం వరకు తీవ్రంగా శ్రమించింది. కానీ స్పెయిన్ డిఫెన్స్ పటిష్టంగా ఉండటంతో ఇంగ్లండ్‌కు నిరాశ తప్పలేదు. నిర్ణీత 90 నిమిషాల తర్వాత ఇంజ్యూరీ టైమ్ రూపంలో మరో 15 నిమిషాలు అదనంగా ఆడించారు. ఈ ఉత్కంఠభరిత నిమిషాలను అధిగమిస్తూ స్పెయిన్ తమ ఆధిక్యాన్ని కాపాడుకొని చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది.

- స్వీడన్‌తో జరిగిన సెమీఫైనల్లో స్పెయిన్ తరఫున 89వ నిమిషంలో ఓల్గా కర్మోనా రెండో గోల్ చేసి తమ జట్టును ఫైనల్‌కు చేర్చింది. 2015లో కర్లీ లాయిడ్ (అమెరికా) తర్వాత ఒకే ప్రపంచకప్‌లో సెమీఫైనల్లో, ఫైనల్లో గోల్ చేసిన ప్లేయర్‌గా ఓల్గా కర్మోనా గుర్తింపు పొందింది.
- 75,784 మంది ప్రేక్షకులు ఈ ఫైనల్‌ను ప్రత్యక్షంగా తిలకించారు.
- చాంపియన్‌గా నిలిచిన స్పెయిన్ జట్టుకు మొత్తం ఒక కోటీ 5 లక్షల డాలర్ల (రూ. 87 కోట్ల 30 లక్షలు) ప్రైజ్‌మనీ లభించింది. ఇందులో 42 లక్షల 90 వేల డాలర్లు స్పెయిన్ ఫుట్‌బాల్ సమాఖ్యకు... 62 లక్షల 10 వేల డాలర్లు జట్టులోని సభ్యులకు (23 మందికి 2 లక్షల 70 వేల డాలర్ల చొప్పున) లభించాయి.
- ఈ విజయంతో పురుషుల, మహిళల ప్రపంచకప్ టైటిల్ గెలిచిన దేశంగా స్పెయిన్ గుర్తింపు పొందింది. స్పెయిన్ పురుషుల జట్టు 2010 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచింది.

వరుసగా రెండు మ్యాచ్‌లు కష్టం: హెచ్‌సీఏ

షెడ్యూల్ మార్పు ఉండదని రాజీవ్ శుక్లా స్పష్టీకరణ

న్యూఢిల్లీ: భారత్ ఆతిథ్యమిచ్చే వన్డే వరల్డ్‌కప్ మరో 45 రోజుల్లో మొదలవనుంది. ఈ దశలో హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) వరుస రోజుల్లో రెండు ప్రపంచకప్ మ్యాచ్‌ల నిర్వహణ కష్టమవుతుందని అభ్యంతరం వ్యక్తం చేసింది. అక్టోబర్ 9, 10 తేదీల్లో జరిగే మ్యాచ్‌లకు మార్పు కోరింది. అయితే భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సీనియర్ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఇప్పుడున్న పరిస్థితుల్లో షెడ్యూల్ మార్పు కుదరదని స్పష్టం చేశారు. నిజానికి మెగా ఈవెంట్ షెడ్యూల్ చాలా ముందుగా విడుదల చేస్తారు. కానీ ఈసారి కేవలం నాలుగు నెలల ముందే జూన్‌లో ప్రకటించారు. ఇటీవలే షెడ్యూల్‌లో మార్పులు చేశారు. మళ్లీ మార్పు లంటే కష్టమేనని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. ఎందుకంటే మరో నాలుగు రోజుల్లోనే (ఈ నెల 25న) టికెట్ల విక్రయం కూడా జరగబోతుంది. లాజిస్టిక్ సమస్యలే కాదు... ఇతరత్రా సర్దుబాట్లకు అవకాశాల్లేవని బోర్డు వర్గాలు అభిప్రాయపడ్డాయి. అందువల్లే ఇకపై షెడ్యూల్లో మార్పులుండబోవని స్పష్టం చేసింది. అక్టోబర్ 5న ఇంగ్లండ్, న్యూజిలాండ్‌ల మధ్య అహ్మదాబాద్‌లో జరిగే మ్యాచ్‌తో ప్రపంచకప్ మొదలవుతుంది.

అసలేం జరిగింది?

తొలుత ఐసీసీ-బీసీసీఐ ఖరారు చేసిన షెడ్యూలు ప్రకారం అక్టోబర్ 9న ఉప్పల్ మైదానంలో న్యూజిలాండ్, నెదర్లాండ్స్‌ల మధ్య మ్యాచ్, 12న పాకిస్తాన్, శ్రీలంకల మధ్య మ్యాచ్‌లు జరగాలి. అయితే మెగా ఈవెంట్‌కే హైలైట్‌గా నిలువనున్న భారత్, పాక్ పోరు అహ్మదాబాద్‌లో ఒకరోజు ముందుకు (అక్టోబర్ 15 నుంచి 14కు) జరిపారు. దీంతో పాకిస్తాన్‌కు సరైన విరామం కోసమని పాక్, శ్రీలంక మధ్య 12న జరగాల్సిన మ్యాచ్‌ను 10న నిర్వహించడమే హెచ్‌సీఏకు కష్టాలను తెచ్చిపెట్టింది. 9, 10 తేదీల్లో మ్యాచ్‌లంటే పోలీసు శాఖ నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని సుప్రీం కోర్టు నియమిత అడ్మినిస్ట్రేటర్‌తో నడుస్తున్న హెచ్‌సీఏ తెలిపింది.



నేను హైదరాబాద్ వేదిక ఇన్‌చార్జ్‌గా ఉన్నాను. అక్కడ ఏమైన సమస్యలుంటే పరిష్కరించవచ్చు. కానీ షెడ్యూల్ మార్పు ఒక్క బీసీసీఐ చేతుల్లో ఉండదు. ఐసీసీ, పాల్గొంటున్న జట్లు, ఇతరత్రా సంస్థలు (సదుపాయాలు, లాజిస్టిక్స్) అందర్నీ ఒప్పించాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో మార్పు అసాధ్యం. –బోర్డు ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా

చాంపియన్ వృత్తి అగర్వాల్

భువనేశ్వర్: జాతీయ సబ్ జూనియర్, జూనియర్ అక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ స్విమ్మర్లు 14 పతకాలతో మెరిశారు. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో తెలంగాణ స్విమ్మర్లు ఆరు స్వర్ణాలు, ఐదు రజతాలు, మూడు కాంస్యాలు గెలిచారు. హైదరాబాద్ అమ్మాయి వృత్తి అగర్వాల్ గ్రూప్-1 బాలికల విభాగంలో వ్యక్తిగత చాంపియన్‌షిప్ టైటిల్‌ను సాధించింది. వృత్తి ఈ టోర్నీలోనాలుగు స్వర్ణాలు, ఒక రజతం సాధించింది. చివరిరోజు శివాని కర్రా 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్, 50 మీటర్ల బటర్‌ఫ్లయ్ ఈవెంట్స్‌లో తెలంగాణకు రెండు రజత పతకాలు అందించింది. గచ్చిబౌలి స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ కోచ్ ఆయుశ్ యాదవ్ వద్ద శివాని శిక్షణ తీసుకుంటోంది. నిత్యశ్రీ సాగి రెండు రజతాలు, ఒక కాంస్యం, సుహాస్ ప్రీతమ్ రెండు కాంస్యాలు నెగ్గారు.



రాయలసీమ కింగ్స్ ‘హ్యాట్రిక్’ విజయం

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ టి20 టోర్నమెంట్ రెండో సీజన్‌లో రాయలసీమ కింగ్స్ జట్టు వరుసగా మూడో విజయంతో ‘హ్యాట్రిక్’ నమోదు చేసింది. ఇక్కడి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్ ఐదు వికెట్ల తేడాతో గోదావరి టైటాన్స్ జట్టును ఓడించింది. ఆరు జట్లు పాల్గొంటున్న ఈ లీగ్‌లో రాయలసీమ కింగ్స్ 12 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉంది. ముందుగా బ్యాటింగ్ చేసిన గోదావరి టైటాన్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 150 పరుగులు చేసింది. త్రిపురాణ విజయ్ (25 బంతుల్లో 63 నాటౌట్; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌తో అజేయ అర్ధ సెంచరీ చేశాడు. రాయలసీమ కింగ్స్ బౌలర్లలో హరిశంకర్ రెడ్డి మూడు వికెట్లు, గిరినాథ్ రెడ్డి రెండు వికెట్లు తీశారు. అనంతరం రాయలసీమ కింగ్స్ 17.4 ఓవర్లలో 5 వికెట్లకు 153 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ హనుమ విహారి (12 బంతుల్లో 21; 3 ఫోర్లు, 1 సిక్స్), అభిషేక్ రెడ్డి (37 బంతుల్లో 53; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), తన్నీరు వంశీకృష్ణ (39 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. గోదావరి టైటాన్స్ బౌలర్లు ఏకంగా 21 ఎక్స్‌ట్రాలు ఇవ్వడం గమనార్హం.

తపస్వి ఆల్‌రౌండ్ ప్రదర్శన

మరో మ్యాచ్‌లో ఉత్తరాంధ్ర లయన్స్ 93 పరుగుల తేడాతో వైజాగ్ వారియర్స్‌పై ఘనవిజయం సాధించింది. ముందుగా ఉత్తరాంధ్ర లయన్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 206 పరుగులు చేసింది. కెప్టెన్ కోన శ్రీకర్ భరత్ (23 బంతుల్లో 45; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), వెంకట్ రాహుల్ (36 బంతుల్లో 53; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), పిన్నింటి తపస్వి (23 బంతుల్లో 38; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), సిర్లా శ్రీనివాస్ (13 బంతుల్లో 33 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. అనంతరం వైజాగ్ వారియర్స్ 14.4 ఓవర్లలో 113 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. తపస్వి, పృథ్వీరాజ్ మూడు వికెట్ల చొప్పున తీశారు.


ఆసియా కప్ టోర్నీకి నేడు భారత జట్టు ఎంపిక

న్యూఢిల్లీ: ఇంకొన్ని రోజుల్లోనే స్వదేశంలో వన్డే వరల్డ్‌కప్ జరగనుంది. దీనికంటే ముందు పూర్తిస్థాయి సన్నద్ధత కోసం ఆసియా కప్ వన్డే ఫార్మాట్‌లో జరుగనుంది. అంటే ఆసియా కప్‌కు ఎంపికయ్యే జట్టే దాదాపు వన్డే ప్రపంచకప్‌లో ఆడుతుందన్నది సుస్పష్టం. ఈ నేపథ్యంలో నేడు ఆసియా కప్‌లో పాల్గొనే జట్టు కోసం సీనియర్ సెలక్షన్ కమిటీ కీలక సమావేశం జరుగనుంది. ఇందులో కోచ్ రాహుల్ ద్రవిడ్, కెప్టెన్ రోహిత్ శర్మ కూడా పాల్గొంటారని బోర్డు వర్గాలు తెలిపాయి. గాయాల నుంచి కోలుకున్న స్టార్ ఆటగాళ్లు కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్‌ల ఫిట్‌నెస్, అదనపు పేసర్‌గా శార్దుల్ ఠాకూర్ లేదంటే ప్రసిధ్ కృష్ణలలో ఎవరికి అవకాశమివ్వాలనే అంశాలపై అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ చర్చించనుంది. సోమవారం ప్రకటించే భారత జట్టే ప్రపంచకప్‌కు ప్రొవిజనల్ జట్టుగా దాదాపు ఖాయమయ్యే అవకాశముంది.

ప్రణయ్, శ్రీకాంత్, లక్ష్య సేన్‌లపై భారత్ ఆశలు

నేటి నుంచి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

కోపెన్ హాగెన్ (డెన్మార్క్): ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో స్టార్ షట్లర్లు హెచ్‌ఎస్ ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్, లక్ష్య సేన్‌లపై భారత్ ఆశలు పెట్టుకుంది. నేటి నుంచి జరిగే ఈ మెగా టోర్నీలో భారత ఆటగాళ్లు ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నారు. మహిళల విభాగంలో మాజీ చాంపియన్ పీవీ సింధుకు తొలి రౌండ్లో బై లభించింది. మాజీ ప్రపంచ చాంపియన్ నొజోమి ఒకుహారా (జపాన్), తుయ్ లిన్ గుయెన్ (వియత్నాం) మధ్య తొలి రౌండ్ విజేతతో 2019 ప్రపంచ చాంపియన్ సింధు రెండో రౌండ్లో తలపడుతుంది. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్‌కు క్లిష్టమైన డ్రా ఎదురైంది. మొదటి రౌండ్లోనే అతను 14వ సీడ్ కెంటా నిషిమోటో (జపాన్)ను ఎదుర్కొంటాడు. 11వ సీడ్ లక్ష్య సేన్...జార్జెస్ జులియన్ పాల్ (మారిషస్)తో, 9వ సీడ్ ప్రణయ్... కెల్లే కొల్జనెన్ (ఫిన్లాండ్)తో పోటీపడతారు. పురుషుల డబుల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకింగ్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ఈసారి స్వర్ణంపై కన్నేసింది. గత ఏడాది జరిగిన ఈ టోర్నీలో మేటి డబుల్స్ జోడీ కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. మహిళల డబుల్స్‌లో 15వ సీడ్ పుల్లెల గాయత్రి-ట్రిసా జాలీ జంటకు తొలి రౌండ్లో బై లభించింది.







రెండో గేమ్ కూడా ‘డ్రా’

బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ ఓపెన్ విభాగంలో వరల్డ్ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) ఫైనల్ ప్రత్యర్థి ఎవరో నేడు తేలనుంది. భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద, అమెరికా గ్రాండ్‌మాస్టర్ ఫాబియానో కరువానా మధ్య రెండో సెమీఫైనల్ టైబ్రేక్‌కు దారి తీసింది. వీరిద్దరి మధ్య శనివారం తొలి గేమ్ ‘డ్రా’కాగా... ఆదివారం జరిగిన రెండో గేమ్‌లో కూడా ఫలితం తేలలేదు. తెల్లపావులతో ఆడిన ప్రజ్ఞానంద 47 ఎత్తుల్లో ‘డ్రా’ చేసుకున్నాడు.



స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	202	64,948
నిఫ్టీ ▽	55	19,310

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి


విదేశీ సూచీలు			
నాస్‌డాక్	13,291	▽	26
డోజోన్స్	34,587	△	26
ఎఫ్‌టీఎస్ఈ 100	7,262	▽	48
డాక్స్	15,574	▽	103
షాంఘై	3,132	▽	32
నికాయ్	31,462	▽	135

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

విదేశీ విద్యానిధికి 'డాలర్' రూట్!

- డాలర్ మారకంలో పెట్టుబడులు
- కరెన్సీ విలువ క్షీణతకు హెడ్జింగ్
- పదేళ్లలో 50% నష్టపోయిన రూపాయి
- ఉన్నత విద్య కోసం భారీ వ్యయం
- విదేశీ ఈక్విటీలు అనుకూలం

హైదరాబాద్‌కు చెందిన వర్ధన్‌కు ఇద్దరు పిల్లలు సంతానం. ఒకరు పదో తరగతి చదువుతుంటే, మరొకరు ఐదో తరగతిలో ఉన్నారు. వీరిద్దరినీ అండర్ గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోసం విదేశాలకు పంపాలన్నది అతడి లక్ష్యం. వర్ధన్ కేవలం ఆకాంక్షతోనే సరిపెట్టలేదు. తమ పిల్లలు మూడేళ్ల వయసులో ఉన్నప్పటి నుంచే ఆయన వారి భవిష్యత్ విద్య కోసం పెట్టుబడులు ప్రారంభించారు. అది కూడా డాలర్‌తో కోల్పోతున్న రూపాయి విలువ క్షీణతను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించారు. తన పెట్టుబడులను డాలర్ మారకంలో ఉండేలా చూసుకున్నారు. మరో రెండేళ్ల తర్వాత తన కుమారుడు గ్రాడ్యుయేషన్ కోసం విదేశాలకు వెళ్లాల్సి ఉంది. వర్ధన్ ముందస్తు ప్రణాళిక వల్ల నిశ్చింతగా ఉన్నాడు. విదేశాల్లో కోర్సుల కోసం పెద్ద మొత్తంలోనే ఖర్చు చేయాల్సి వస్తుంది. అందుకే పిల్లలు స్కూల్ ఆరంభంలో ఉన్నప్పటి నుంచే పెట్టుబడుల ప్రణాళికలు అమలు చేయాలి. ఈ విషయంలో వర్ధన్ అనుసరించిన మార్గం ఎంతో మందికి ఆదర్శం అవుతుంది. పిల్లలకు అత్యుత్తమ విదేశీ విద్యావకాశాలు ఇవ్వాలని కోరుకునే తల్లిదండ్రులు, అందుకు కావాల్సిన వనరులను సమకూర్చుకునే మార్గాలను చర్చించేదే ఈ కథనం.



ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరుగుతూ వెళుతోంది. భారత విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం 2021 జనవరి నాటికి 85 దేశాల్లో సుమారు 11 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో ఎక్కువ మంది కెనడాలో చదువుతున్నారు. ఆ తర్వాత అమెరికా, యూఏఈ, ఆస్ట్రేలియా, యూకే భారత విద్యార్థుల ముఖ్య ఎంపికలుగా ఉన్నాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏటేటా క్షీణిస్తూనే ఉండడాన్ని చూస్తున్నాం. గడిచిన 20 ఏళ్ల కాలాన్ని పరిశీలిస్తే డాలర్‌తో రూపాయి ఏటా సగటున 3 శాతం విలువను నష్టపోతూ వచ్చింది. 2009లో డాలర్‌తో రూపాయి విలువ 46.5గా ఉంటే, ఇప్పుడు 83కు చేరింది. ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే పిల్లల చదువు కోసం చెల్లించాల్సిన ఫీజులు, ఇతర ఖర్చులన్నీ కూడా డాలర్ రూపంలో ఉంటుంటే.. మనం సంపాదించేది రూపాయిల్లో. అందుకుని పిల్లల విద్య కోసం పెట్టుబడులను డాలర్ మారకంలో చేసుకోవడమే మెరుగైన మార్గం అవుతుంది. మొత్తంగా కాకపోయినా, పెట్టుబడుల్లో చెప్పుకోతగ్గ మేర డాలర్ మారకంలో ఇన్వెస్ట్ చేసుకోవాలి. ఒకవైపు డాలర్‌తో రూపాయి మారకం క్షీణిస్తూపోతుంటే, మరోవైపు ద్రవ్యోల్బణం సైతం కరెన్సీ విలువను కొంత హరిస్తుంటుంది. వీటిని తట్టుకుని పెట్టుబడులపై మెరుగైన రాబడులు వచ్చేలా చూసుకోవాలి. అప్పుడే లక్ష్యం తేలికవుతుంది.



యూఎస్ మార్కెట్లో ఇన్వెస్ట్‌మెంట్ దారి

నేరుగా స్టాక్స్
- దేశీయ బ్రోకరేజీ, విదేశీ బ్రోకరేజీ సంస్థ లేదా ఎన్ఎస్ఈ ఐఎఫ్ఎస్‌సీ ద్వారా ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.
- దేశీయ బ్రోకరేజీ సంస్థలు విదేశీ బ్రోకరేజీ సంస్థలతో జట్టు కట్టి సేవలందిస్తున్నాయి.
- ఎన్ఎస్ఈ, ఐఎఫ్ఎస్‌సీ ద్వారా కొన్ని విదేశీ స్టాక్స్‌లో పెట్టుబడులకు అవకాశం ఉంది.

ఈటీఎఫ్‌లు
- ఆర్‌బీఐ పరిమితుల వల్ల కొన్ని ఈటీఎఫ్‌లు మినహా.. మిగిలిన ఈటీఎఫ్‌లు అందుబాటులో ఉన్నాయి.
- కింగ్ ఎర్రర్, పెట్టుబడుల విధానంపై అవగాహన కలిగి ఉండాలి.
- ఈ పెట్టుబడులు ఆర్‌బీఐ లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ కిందకు వస్తాయి. ఏడాదిలో 2,50,000 డాలర్లు ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

రూపాయి విలువ క్షీణత..

గడిచిన కొన్ని దశాబ్దాల కాలంలో డాలర్‌తో రూపాయి ఎంతో నష్టపోయింది. ముఖ్యంగా గత దశాబ్ద కాలంలోనే 50 శాతం విలువను కోల్పోయింది. ఈ క్షీణత ఇక ముందూ కొనసాగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ''యూఎస్ ఫెడరల్ రిజర్వ్ కఠిన వైఖరి తీసుకోవడంతో రూపాయి క్షీణతను ఇక ముందూ చూడనున్నాం. ఎందుకంటే యూఎస్ ఫెడ్ వైఖరితో డాలర్ సరఫరా తగ్గుతుంది. అది వర్ధమాన మార్కెట్లలోకి పెట్టుబడుల రాకపై ప్రభావం చూపిస్తుంది''అని జీఎం ఫైనాన్షియల్ చీఫ్ ఎకనమిస్ట్ ధనుంజయ్ సిన్హా వివరించారు. రూపాయి విలువను కాపాడేందుకు ఆర్‌బీఐ సైతం ఫారెక్స్ నిల్వలను ఉపయోగించుకుంటోంది. డాలర్ ఇదే మాదిరిగా గరిష్ట స్థాయిలో కొనసాగితే, అధిక ముడి చమురు ధరల కారణంగా భారత్‌తో వాణిజ్య లోటు ఎగువనే ఉంటుందన్నది నిపుణుల విశ్లేషణగా ఉంది. ఇది రూపాయి విలువను మరింత కిందకు తోసేస్తుందన్న విశ్లేషణ వినిపిస్తోంది. ''స్వల్ప కాలంలో డాలర్‌తో రూపాయి విలువ 6–7 శాతం మేర క్షీణించొచ్చని భావిస్తున్నాం'' అని ధనుంజయ్ సిన్హా చెప్పారు. 1947లో స్వాతంత్ర్యం సిద్ధించే నాటికి మన రూపాయి విలువ డాలర్ మారకంలో 4గా ఉంటే, ఇప్పుడు 83 స్థాయిలకు చేరుకోవడం గమనించొచ్చు.

ఫీజులపై రూపాయి ప్రభావం

'విదేశాల్లో చదువుకు, ముఖ్యంగా అమెరికాలో.. ఎంతలేదన్నా అండర్ గ్రాడ్యుయేషన్‌కు 10 వేల నుంచి 50 వేల డాలర్ల వరకు ఖర్చు అవుతుంది. పీజీ చేసేందుకు 12,000 డాలర్ల నుంచి 80,000 డాలర్ల వరకు (స్కాలర్‌షిప్ కలపకుండా) వ్యయం చేయాల్సి వస్తుంది. వీటికి తోడు నివసించే ప్రాంతం ఆధారంగా జీవన వ్యయాలకు అదనంగా ఖర్చు చేయాలి. కరోనా మహమ్మారిని దృష్టిలో పెట్టుకుని విదేశాల్లోని విద్యా సంస్థలు ఇప్పటి వరకు ట్యూషన్ ఫీజుల పెంపులకు దూరంగా ఉన్నాయి. ఇప్పుడు ఖర్చులు భారీగా పెరిగాయంటే అది కేవలం కరెన్సీ కారణంగానే' అని విదేశీ విద్యా కన్సల్టెన్సీ సంస్థ ఏపీఎస్ వరల్డ్ సీఈవో అనిర్బన్ సిర్కార్ తెలిపారు. ఏటా రూపాయి విలువ క్షీణిస్తుందని భావిస్తే.. దీనికి అనుగుణంగా విదేశీ కోర్సుల వ్యయం పెరుగుతూ వెళుతుంది. ''విదేశీ విద్యా వ్యయం ఏటా పెరుగుతూనే ఉంది. దీనికి ద్రవ్యోల్బణం ఒక్కటే కారణం కాదు. డాలర్‌తో రూపాయి విలువ క్షీణిస్తుండడం కూడా కారణమే'' అని యూఎస్‌లో పెట్టుబడులకు వీలు కల్పించే వేదిక వెస్టెడ్ ఫైనాన్స్ సీఈవో విరమ్‌షా చెప్పారు.

•••


2012 జూలైలో రూపాయి విలువ డాలర్‌తో 55గా ఉంది. అప్పుడు అండర్ గ్రాడ్యుయేట్ కోర్స్ ట్యూషన్ ఫీజు ఏడాదికి 20,000 డాలర్లు ఉందని అనుకుందాం. నాడు డాలర్‌తో రూపాయి విలువ 55 ప్రకారం ఒక ఏడాదికి రూ.11 లక్షలు ఫీజు కోసం చెల్లించాల్సి వచ్చేది. అదే ఫీజు ఇప్పటికీ పెరగకుండా అక్కడే ఉన్నా కానీ, రూపాయి విలువ క్షీణత ఫలితంగా కోర్సు వ్యయం రూ.16.60 లక్షలకు పెరిగినట్టు అవుతుంది. అంటే రూ.5 లక్షలకు పైగా పెరిగింది. ద్రవ్యోల్బణం ప్రభావాన్ని కూడా కలిపి చూస్తే ఈ భారం ఇంకాస్త ఎక్కువే ఉంటుంది. అందుకని పిల్లల విదేశీ విద్య కోసం పొదుపు చేసే వారు కేవలం ద్రవ్యోల్బణం ఒక్కటే కాకుండా, రూపాయి క్షీణతను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

అంతర్జాతీయ పెట్టుబడుల మార్గం

విదేశీ విద్య కోసం చేసే పెట్టుబడులను అంతర్జాతీయ మార్కెట్లకు కేటాయించుకోవడం అర్థవంతంగా ఉంటుంది. జపాన్, బ్రిటన్, యూఎస్ తదితర దేశాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. పెట్టుబడులకు వైవిధ్యం కూడా తోడవుతుంది. భారత ఇన్వెస్టర్లలో ఎక్కువ మంది అమెరికన్ మార్కెట్లలోనే ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఇప్పటికైతే డాలర్ ఆధిపత్యానికి ఎలాంటి ఇబ్బంది లేదన్న విశ్లేషణ వినిపిస్తోంది. యూఎస్ పెట్టుబడులు కరెన్సీ విలువ పతనానికి హెడ్జింగ్‌గానే కాకుండా పెట్టుబడుల్లో వైవిధ్యానికీ వీలు కల్పిస్తాయన్నది నిపుణుల సూచన. ''విదేశీ విద్య కోసం, డాలర్ మారకంలో లక్ష్యాల కోసం యూఎస్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టుకోవడం మంచి విధానం అవుతుంది. దీని వల్ల గమ్యస్థానంలో (చదువుకునే) ద్రవ్యోల్బణానికి తోడు, రూపాయి విలువ క్షీణతకు హెడ్జింగ్‌గా పనిచేస్తుంది. చాలా దేశాల్లో రిటైల్ ద్రవ్యోల్బణంతో పోలిస్తే ఉన్నత విద్య ద్రవ్యోల్బణం ఎక్కువే ఉంటుంది'' అని ఫింజ్ స్కాలర్జ్ వెల్త్ మేనేజర్ సీఈవో రేణు మహేశ్వరి సూచించారు. డాలర్‌తో ఇన్వెస్ట్ చేసినప్పుడు, తిరిగి డాలర్‌తో ఉపసంహరించుకునేట్టుగా ఉంటే, అది అధిక ప్రయోజనాన్నిస్తుంది.

•••

ఉదాహరణకు 2012లో నిఫ్టీ 500 ఈటీఎఫ్‌లో, ఎస్అండ్‌పీ 500లో 100 డాలర్లు చొప్పున ఇన్వెస్ట్ చేశారని అనుకుందాం. నాడు డాలర్‌తో రూపాయి విలువ 55గా ఉంది. అప్పటి నుంచి ఈ రెండు సూచీలు ఏటా 13 శాతం రాబడులు ఇచ్చాయి. దీంతో నిఫ్టీ 500 ఈటీఎఫ్‌లో 100 డాలర్ల పెట్టుబడి నేడు రూ.18,000 అవుతుంది. ఎస్అండ్‌పీ 500 ఈటీఎఫ్‌లో పెట్టుబడి రూ.25,000 అయి ఉండేది. 40 శాతం అధికంగా ఎస్అండ్‌పీ 500 ఈటీఎఫ్‌లో రాబడులు వచ్చాయి. రెండు సూచీలు ఒకే విధమైన రాబడిని ఇచ్చినా.. రెండు దేశాల కరెన్సీ విలువల్లో మార్పుల ఫలితంగా ఎస్అండ్‌పీ 500లో అధిక రాబడులు వచ్చాయి. డాలర్‌తో రూపాయి క్షీణించడం వల్లే ఇలా జరిగింది.



ఏమిటి మార్గం..?

విదేశీ విద్య కోసం డాలర్ మారకంలో పెట్టుబడులు మేలైన మార్గం అన్నది నిపుణుల సూచన. కానీ, ఒక ఇన్వెస్టర్‌గా తాను చేసే పెట్టుబడులను అర్థం చేసుకుని, వాటి పనితీరును ట్రాక్ చేసుకునే విషయ పరిజ్ఞానం తప్పనిసరి. ఎందుకంటే అంతర్జాతీయ పెట్టుబడులపై ఎన్నో అంశాల ప్రభావం ఉంటుంది. దేశీయ అంశాలతో సంబంధం ఉండదు. అందుకని వాటిని విడిగా ట్రాక్ చేసుకోవాల్సిందే. ''అంతర్జాతీయ పెట్టుబడులను ఎంపిక చేసుకునే ముందు చార్జీలను తప్పకుండా చూడాలి. సరైన స్టాక్‌ను సరైన ధరల వద్ద కొనుగోలు చేసే నైపుణ్యాలు కూడా అవసరం'' అని మహేశ్వరి తెలిపారు. తమ మొత్తం పెట్టుబడుల్లో 10–15 శాతం మేర విదేశీ స్టాక్స్ కోసం వైవిధ్యం కోణంలో కేటాయించుకోవచ్చు. పిల్లల విదేశీ విద్యకు ఎంత ఖర్చు అవుతుందో, ఆ అంచనాల మేరకు కేటాయింపులు చేసుకోవాలి. స్టాక్స్ ఎంపిక తెలియని వారు, ఈ రిస్క్ తీసుకోకుండా విదేశీ స్టాక్స్‌తో కూడిన మ్యూచువల్ ఫండ్స్ పథకాలను ఎంపిక చేసుకోవచ్చు. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ యూఎస్ బ్లూచిప్ ఈక్విటీ ఫండ్ ఏడాది కాలంలో 17 శాతం వరకు రాబడులు ఇచ్చింది. డీఎస్‌పీ యూఎస్ ఫ్లెక్సిబుల్ ఈక్విటీ ఫండ్ 15 శాతం రాబడులు తెచ్చి పెట్టింది. ఇలాంటి ఎన్నో ఫండ్స్ అందుబాటులో ఉన్నాయి. డాలర్ మారకంలో పెట్టుబడులకు అవసరమైతే ఆర్థిక సలహాదారులను సంప్రదించడానికి వెనుకాడొద్దు.

సన్సేరా ఇంజనీరింగ్ | చాయిస్ ఇంటర్నేషనల్ | కొనొచ్చు

స్టాక్స్ వ్యూ

ప్రస్తుత ధర: రూ. 920 టార్గెట్: రూ. 1,064

ఎందుకంటే: ఆటోమోటివ్ విడిభాగాల కంపెనీ సన్సేరా ఇంజనీరింగ్ లిమిటెడ్(ఎస్ఈఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో అంచనాలను మించిన పనితీరు చూపింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో స్వీడిష్ అనుబంధ సంస్థ పటిష్ట వృద్ధిని సాధించింది. ఆదాయం 35 శాతం జంప్‌చేయగా.. మొత్తం ఎగుమతులు వార్షికంగా 33 శాతం ఎగశాయి. పూర్తి ఏడాదిలోనూ ఎగమతుల్లో భారీ వృద్ధి సాధించగలమని కంపెనీ యాజమాన్యం విశ్వాసాన్ని వ్యక్తం చేస్తోంది. ఇందుకు పటిష్ట ఆర్డర్ బుక్, కొత్త క్లయింట్ల జమ, సామర్థ్య విస్తరణ తదితర అంశాలు దోహదపడనున్నాయి. వార్షిక ప్రాతిపదికన ఈ ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మొత్తం ఆదాయం 24 శాతం, నిర్వహణ లాభం(ఇబిటా) 25 శాతం, నికర లాభం 31 శాతం చొప్పున వృద్ధి చెందే వీలుంది. ఈ క్యూ1లో ఆటో విభాగం ఐసీఈ బిజినెస్‌నుంచి ఆదాయం 20 శాతం పురోగమించింది. త్రైమాసిక ప్రాతిపదికన(గతేడాది క్యూ4తో పోలిస్తే) మార్జిన్లు 1.12 శాతం మెరుగుపడి 17.4 శాతానికి చేరాయి. గత క్యూ1తో చూస్తే నామమాత్ర వృద్ధిని సాధించాయి. నికర లాభం 31 శాతం జంప్‌చేసి రూ. 45 కోట్లకు చేరింది. ట్రాన్స్‌ఫార్మేషన్‌లో భాగంగా ఎస్ఈఎల్ ఆటోమోటివ్ నుంచి నాన్‌ఆటోమోటివ్, ఎక్స్ఈవీ అగ్నోస్టిక్ ప్రొడక్టుల సరఫరాలోకి ప్రవేశించింది. తద్వారా కంపెనీ సామర్థ్యాన్ని నిరూపించుకుంది. మధ్యకాలం నుంచి దీర్ఘకాలానికి కంపెనీ పటిష్ట ఫలితాలు సాధించే అవకాశముంది. రెండేళ్ల కాలంలో ఆదాయం 17 శాతం, ఇబిటా 22 శాతం, నికర లాభం 29 శాతం చొప్పున వృద్ధి సాధించవచ్చని అంచనా.



ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ | మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 785 టార్గెట్: రూ. 880

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) తొలి త్రైమాసికంలో రవాణా, లాజిస్టిక్స్ సర్వీసుల కంపెనీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మిశ్రమ పనితీరు ప్రదర్శించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో మొత్తం ఆదాయం వార్షికంగా 9 శాతం పుంజుకుని రూ. 950 కోట్లను తాకింది. ఇది మా అంచనాలకంటే 5 శాతం తక్కువకాగా.. సరుకు రవాణా 3 శాతం, సరఫరా చైన్ విభాగం వార్షికంగా 20 శాతం చొప్పున వృద్ధి చూపాయి. అధిక మార్జిన్లు ఆర్జించగల జల రవాణా(సీవేస్) విభాగం మాత్రం వార్షిక ప్రాతిపదికన 18 శాతం క్షీణించింది. నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు 0.9 శాతం నీరసించి 10.6 శాతానికి పరిమితమయ్యాయి. మా అంచనా 10.8 శాతంకాగా.. నికర లాభం 6 శాతం బలపడి రూ. 82.3 కోట్లకు చేరింది. వెరసి 5 శాతం అంచనాలను స్వల్పంగా అధిగమించింది. అంచనాలకంటే తగ్గిన పన్ను రేటు లాభాల్లో వృద్ధికి దోహదం చేసింది. అసంఘటిత రంగం నుంచి సంఘటిత రంగానికి పెరుగుతున్న డిమాండ్ కారణంగా సరుకు రవాణా సర్వీసుల బిజినెస్ లబ్ధి పొందే అవకాశముంది. ఆటోమోటివ్ రంగ పురోభివృద్ధి నేపథ్యంలో సరఫరా చైన్ విభాగం వృద్ధి బాటలోనే కొనసాగే వీలుంది. ఇక గరిష్ట మార్జిన్లు సాధించే సీవేస్ బిజినెస్ ఈ ఆర్థిక సంవత్సరంలో దాదాపు యథాతథ స్థితిలోనే కొనసాగవచ్చని అంచనా. ఈ విభాగానికి కొత్త నౌక జత కావలసి ఉంది. ఈ ఏడాది ద్వితీయార్ధం (అక్టోబర్– మార్చి) కాలంలో కొత్త నౌక అందుబాటులోకి రావచ్చని కంపెనీ భావిస్తోంది. వివిధ విభాగాల ఔట్‌లుక్ మెరుగుపడటంతో వచ్చే ఏడాదికి షేరువారీ ఆర్జన(ఈపీఎస్) అంచనాలను 4 శాతంమేర పెంచుతున్నాం. దీర్ఘకాలానికి షేర్ మంచి రాబడులు ఇస్తుందని భావిస్తున్నాం.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

బిగ్-సి మరో 150 స్టోర్లు

రూ.1,500 కోట్ల టర్నోవర్ లక్ష్యం • కంపెనీ ఫౌండర్ బాలు చౌదరి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మొబైల్స్ విక్రయాల్లో ఉన్న బిగ్-సి వచ్చే రెండేళ్లలో రూ.300 కోట్లతో కొత్తగా 150 ఔట్‌లెట్లను ఏర్పాటు చేస్తోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో కంపెనీకి 250 స్టోర్లున్నాయి. 2023–24లో టర్నోవర్ 50 శాతం వృద్ధితో రూ.1,500 కోట్లు లక్ష్యంగా చేసుకున్నామని బిగ్-సి ఫౌండర్, సీఎండీ ఎం.బాలు చౌదరి తెలిపారు. కంపెనీ రెండు దశాబ్దాల వేడుకల్లో భాగంగా బిగ్-సి బ్రాండ్ అంబాసిడర్, సినీ నటుడు మహేశ్ బాబుతో కలిసి ఈడీ వై.స్వప్న కుమార్, డైరెక్టర్లు జి.బాలాజీ రెడ్డి, ఆర్.గౌతమ్ రెడ్డి, కైలాశ్ లఖ్యానితో కలిసి ఆదివారమిక్కడ మీడియాతో మాట్లాడారు. '2002 డిసెంబర్ 23న బిగ్-సి మొదలైంది. మొబైల్స్ రిటైల్‌లో తెలంగాణ, ఏపీలో తొలి స్థానంలో నిలిచి రెండు దశాబ్దాల ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేశాం. మూడవ దశాబ్దంలోనూ అగ్ర స్థానాన్ని కొనసాగిస్తాం. 3 కోట్ల మంది కస్టమర్లను సొంతం చేసుకున్నాం. మరిన్ని ఎలక్ట్రానిక్స్, గ్యాడ్జెట్స్‌ను జతచేస్తాం. 1,500 మందిని కొత్తగా నియమించుకోవడం ద్వారా సిబ్బంది సంఖ్య రెండేళ్లలో 4,000లకు చేరుతుంది. ఒక్కో కుటుంబంలో మూడు తరాలకు సేవలు అందిస్తున్నాం' అని చెప్పారు.



మహేశ్‌బాబుతో గౌతమ్ రెడ్డి, స్వప్న కుమార్, బాలు చౌదరి, బాలాజీ రెడ్డి, కైలాశ్ లఖ్యాని (ఎడమ నుంచి)

తుది దశలో నేషనల్ ఈ కామర్స్ విధానం

- ప్రతిపాదిత జాతీయ ఈ–కామర్స్ విధానం తుది దశలో ఉన్నట్టు ఓ సీనియర్ ప్రభుత్వ అధికారి వెల్లడించారు. దీనికి సంబంధించి భాగస్వాముల అభిప్రాయాల స్వీకరణకు కొత్త ముసాయిదా పాలసీ విడుదల ఉండదని స్పష్టం చేశారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
21-8-2023	
విశాఖ	470–00
చిత్తూరు	503–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	435–00
విజయవాడ	435–00
రిటైల్ ధర (డజను)	72.00
20-8-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	410–00
వరంగల్	412–00
రిటైల్ ధర	4.70

ఎస్‌డబ్ల్యూపీతో స్థిరమైన ఆదాయం పొందొచ్చా?



Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఎస్‌డబ్ల్యూపీ అంటే ఏంటి? ఓ పథకంలో పెట్టుబడి పెట్టి, తదుపరి నెల నుంచి ఎస్‌డబ్ల్యూపీ ద్వారా ఆదాయం పొందొచ్చా? – కృతిక

మార్కెట్ల అస్థిరతలను అధిగమించేందుకు వీలుగా క్రమంగా ఇన్వెస్ట్ చేసుకునేందుకు సిప్ ఎలా ఉపయోగపడుతుందో..? అదే మాదిరి.. సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ) అనేది, పెట్టుబడిని క్రమానుగతంగా వెనక్కి తీసుకునేందుకు వీలు కల్పిస్తుంది. మార్కెట్లు కనిష్టాల్లో (తక్కువ విలువల వద్ద) ఉన్నప్పుడు పెట్టుబడినంతా వెనక్కి తీసుకోకుండా ఎస్‌డబ్ల్యూపీ సాయపడుతుంది. రిటైర్మెంట్ తీసుకున్న వారికి ఎస్‌డబ్ల్యూపీ అనుకూలంగా ఉంటుంది. కావాల్సినంత స్థిరమైన ఆదాయం పొందే ఏర్పాటు చేసుకోవచ్చు. ఎన్ని రోజులకు ఒకసారి ఆదాయం రావాలన్నది నిర్ణయించుకునే స్వేచ్ఛ ఉంటుంది. ఇన్వెస్టర్ ప్రతీ నెలా నిర్ణీత తేదీన, నిర్ణీత మొత్తాన్ని ఎస్‌డబ్ల్యూపీ ద్వారా రావాలని నిర్ణయించుకుంటే.. అదే రోజు ఆ మొత్తం బ్యాంకు ఖాతాకు జమ అవుతుంది. ఆ మేరకు పెట్టుబడుల నుంచి యూనిట్లు తగ్గిపోతాయి. సిప్‌కు విరుద్ధంగా పనిచేసేదే ఎస్‌డబ్ల్యూపీ. ఇక్కడ రెండు కీలక అంశాలను గుర్తుపెట్టుకోవాలి. ఎస్‌డబ్ల్యూపీ కోసం చేసే పెట్టుబడుల్లో కనీసం మూడింట ఒక వంతు అయినా ఈక్విటీల్లో ఉంచుకోవాలి. ఉపసంహరించుకునే మొత్తం ఏటా పెట్టుబడుల విలువలో 4–6 శాతం మించి ఉండకూడదు. దీనివల్ల పెట్టుబడికి నష్టం లేకుండా ఉంటుంది. ఉదాహరణకు మీ పెట్టుబడులపై రాబడి వార్షికంగా 8–9 శాతంగా ఉండి, మీరు 5 శాతాన్ని వెనక్కి తీసుకుంటున్నట్టు అయితే.. అప్పుడు మిగిలిన 3–4 శాతం రాబడి పెట్టుబడి వృద్ధికి తోడ్పడుతుంది. దీనివల్ల మీ పెట్టుబడి విలువ క్షీణించకుండా ఉంటుంది. ఎస్‌డబ్ల్యూపీ ద్వారా ఉపసంహరించుకునే మొత్తంలో కొంత పెట్టుబడి, కొంత లాభం ఉంటుంది. ఈ లాభంపైనే పన్ను పడుతుంది. డెట్‌లో అయితే కాలవ్యవధితో సంబంధం లేకుండా లాభం వ్యక్తిగత ఆదాయానికి కలుస్తుంది. ఈక్విటీల్లో అయితే ఏడాదిలోపు లాభంపై 15 శాతం చెల్లించాలి. ఏడాదికి మించిన లాభం మొదటి రూ.లక్షపై పన్ను లేదు. తదుపరి లాభంపై 10 శాతం పన్ను పడుతుంది.

ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్‌వోఎఫ్) ఎలా పనిచేస్తాయి? వీటి వల్ల లాభాలేంటి? – రవీంద్రనాథ్

ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్‌వోఎఫ్) అంటే సమీకరించిన పెట్టుబడులను తీసుకెళ్లి మరో మ్యూచువల్ ఫండ్ పథకంలో ఇన్వెస్ట్ చేసే పథకం. పెట్టుబడుల విధానానికి అనుగుణంగా డెట్ ఫండ్స్ లేదా ఈక్విటీ ఫండ్స్‌లో ఒకటి లేదా ఒకటికి మించిన పథకాల్లో ఇన్వెస్ట్ చేయవచ్చు. సాధారణంగా ఎఫ్‌వోఎఫ్‌లను ఆయా ఫండ్స్ హౌస్‌లు వాటికి సంబంధించిన ఈటీఎఫ్‌ల్లో ఇన్వెస్ట్ చేసేందుకు ప్రారంభిస్తుంటాయి. ఎఫ్‌వోఎఫ్‌లు ఇతర మ్యూచువల్ ఫండ్స్ పథకాల మాదిరే పనిచేస్తాయి. వీటిల్లోనూ సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో పెట్టుబడి పెట్టుకోవచ్చు. విదేశీ సూచీలు, విదేశీ మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసే ఎఫ్‌వోఎఫ్‌లు కూడా ఉన్నాయి. ఇతర పథకాల మాదిరే ఎఫ్‌వోఎఫ్‌ల్లోనూ ఎక్స్‌పెన్స్ రేషియో ఉంటుంది. ఎఫ్‌వోఎఫ్‌లు ఇతర పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తాయి కనుక రెండింటిలోనూ ఎక్స్‌పెన్స్ రేషియో భారం ఇన్వెస్టర్‌పైనే పడుతుంది. ఉదాహరణకు ఎఫ్‌వోఎఫ్‌లో 1 శాతం ఎక్స్‌పెన్స్ రేషియో ఉందనుకుంటే, అది ఇన్వెస్ట్ చేసే పథకం ఎక్స్‌పెన్స్ రేషియో 0.50 శాతం ఉంటే మొత్తం 1.5 శాతం ఎక్స్‌పెన్స్ రేషియో చెల్లించాల్సి వస్తుంది. ఎఫ్‌వోఎఫ్ ఇన్వెస్ట్ చేసే పథకంలో నేరుగా ఇన్వెస్టర్లు పెట్టుబడులకు అవకాశం లేనప్పుడు వీటిని పరిశీలించొచ్చు. ఎఫ్‌వోఎఫ్‌లను నాన్ ఈక్విటీ పథకంగా పరిగణిస్తారు. కనుక డెట్ పథకాలకు మాదిరే మూలధన లాభాలపై పన్ను అమలవుతుంది. ఒకవేళ ఎఫ్‌వోఎఫ్ దేశీయ ఈక్విటీ పథకాల్లోనే 90 శాతానికిపైగా పెట్టుబడి పెడితే ఈక్విటీకి మాదిరే మూలధన లాభాల పన్ను వర్తిస్తుంది.

క్లుప్తంగా...

నరసరావుపేటలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ



పలు జిల్లాల నుంచి అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌కు హాజరైన అభ్యర్థులు

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకంలో భాగంగా నరసరావుపేటలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఆదివారం నిర్వహించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో పాల్గొన్న ప్రతీ అభ్యర్థి ఉద్యోగ అర్హత సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఉద్యోగ నియామక ప్రక్రియ కోసం జిల్లా అధికార యంత్రాంగం అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసింది. శనివారం రాత్రికే పలు జిల్లాల నుంచి నిరుద్యోగ యువత పెద్దఎత్తున స్టేడియానికి చేరుకున్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, కల్నల్ పునీత్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం కె.వినాయకం తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ యాజమాన్య కోటా సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్ కోర్సులో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేట్ కళాశాలల్లో యాజమాన్య కోటా, కొత్తగా ప్రారంభిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లలో ప్రవేశాలకు తొలి దశ కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయిస్తూ ఆదివారం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థులు తమకు సీట్లు కేటాయించిన కళాశాలలో ఈ నెల 24వ తేదీ సాయంత్రం నాలుగు గంటల్లోగా రిపోర్ట్ చేయాలని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. ప్రైవేట్, మైనారిటీ కళాశాలల్లోని బి కేటగిరి, నంద్యాల, మచిలీపట్నం, ఏలూరు, రాజమండ్రి, విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు వంద శాతం తొలి కౌన్సెలింగ్‌లోనే భర్తీ అయ్యాయి. మరోవైపు ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎన్ఆర్ఐ కోటా సీట్లు 95 ఉండగా 44, స్విమ్స్‌లో 23 సీట్లకు గాను 15 భర్తీ అయ్యాయి. ప్రైవేట్ కళాశాలల్లో 421 ఎన్ఆర్ఐ కోటా సీట్లకు గానూ 252, మైనారిటీ కళాశాలల్లో 37 సీట్లకు గాను 6 సీట్లు భర్తీ అయ్యాయి. మిగిలిపోయిన సీట్ల భర్తీకి విశ్వవిద్యాలయం రెండో విడత కౌన్సెలింగ్ చేపట్టనుంది.

యూనికార్న్ స్టార్టప్స్‌లో మనవాళ్లదే హవా

యూఎస్‌లో 2022 వరకు 582 యూనికార్న్ స్టార్టప్స్.. అందులో 319 విదేశీ మూలాలున్న వ్యక్తులు ప్రారంభించినవే

ప్రవాస భారతీయులు ప్రారంభించినవి 66

యూనికార్న్ స్టార్టప్స్ సంఖ్యలో మొదటి రెండు స్థానాల్లో భారత్, ఇజ్రాయెల్

వెల్లడించిన నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ



అమెరికాలో భారతీయ విజయపతాక!

సాక్షి, అమరావతి: 'ఒక ఐడియా జీవితాన్నే మార్చేస్తుంది'.. ఇదే కోవలో వినూత్న ఆలోచనలతో వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకొని భారతీయులు అమెరికాలో సత్తా చాటుతున్నారు. భారతీయ విజయపతాకాన్ని సగర్వంగా ఎగురవేస్తున్నారు. యూనికార్న్ స్టార్టప్స్ స్థాపించడంలో అమెరికాలోని భారతీయులు మొదటి స్థానంలో నిలిచారు. 2022 వరకు యూఎస్‌లో 582 యూనికార్న్ స్టార్టప్స్ ఏర్పాటు కాగా, అందులో 319 స్టార్టప్స్ విదేశీయులు/విదేశీ మూలాలున్న వ్యక్తులు స్థాపించినవే. వీటిలో 66 యూనికార్న్ స్టార్టప్స్‌ను ప్రవాస భారతీయులు ఏర్పాటు చేయడం విశేషం. వీరిలో ఎక్కువ మంది ఉన్నత చదువుల కోసం యూఎస్‌కు వెళ్లిన వారే కావడం గమనార్హం. అలాగే కొంత మంది బాల్యంలోనే తల్లిదండ్రులతో కలిసి యూఎస్‌కు వచ్చిన వారూ ఉన్నారు. ఈ వివరాలను నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ (ఎన్ఎఫ్ఏపీ) తాజాగా వెల్లడించింది.

బిలియన్ డాలర్ల కంపెనీలుగా..

ఒక స్టార్టప్ కంపెనీ విలువ ఒక బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో రూ.8 వేల కోట్లు మించి) దాటితే దాన్ని 'యూనికార్న్ స్టార్టప్'గా వ్యవహరిస్తారు. ప్రవాస భారతీయులు స్థాపించిన యూనికార్న్ స్టార్టప్స్‌లో భారీగా ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వచ్చాయి. సరాసరి ఒక్కో కంపెనీ 859 ఉద్యోగాలు సృష్టించినట్లు ఎన్ఎఫ్ఏపీ అధ్యయనంలో తేలింది. అమెరికాలో నంబర్ 1 గ్రోసరీ డెలివరీ కంపెనీగా ఉన్న 'ఇన్‌స్టాకార్ట్'ను అపూర్వ మెహతా ఏర్పాటు చేశారు. ఆయన తల్లిదండ్రులు అపూర్వ చిన్నతనంలోనే అమెరికా వెళ్లారు. అక్కడే చదువుకున్న ఆయన తర్వాత విజయవంతమైన వ్యాపారవేత్తగా ఎదిగారు.

31 శాతం ఇండియా, ఇజ్రాయెల్ నుంచే..

కాగా అమెరికాలో మొత్తం యూనికార్న్ స్టార్టప్స్‌లో ఇండియా, ఇజ్రాయెల్‌కు చెందిన ప్రవాసులు స్థాపించిన కంపెనీలు 20 శాతం ఉన్నాయి. ఒక్కో యూనికార్న్ స్టార్టప్‌కి ఒకరి కంటే ఎక్కువ మంది వ్యవస్థాపకులు ఉన్నారు. వీరిలో ఇండియా, ఇజ్రాయెల్‌కు చెందిన ప్రవాసులు 31 శాతం మంది ఉండటం విశేషం. అలాగే దాదాపు సగం మంది ఇండియా, ఇజ్రాయెల్, యూకే, కెనడా, చైనా దేశాల నుంచే ఉన్నారు.

భారతీయులు స్థాపించిన యూనికార్న్ స్టార్టప్స్‌లో ముఖ్యమైనవి..

వ్యవస్థాపకులు	సంస్థ
1. అపూర్వ మెహతా	ఇన్‌స్టాకార్ట్
2. మోహిత్ అరాన్	నుటనిక్స్, కొహెసిటీ
3. అశుతోష్ గార్గ్	బ్లూమ్‌రీచ్, ఎయిట్‌ఫోల్డ్.ఏఐ
4. అజిత్‌సింగ్	థాట్‌స్పాట్
5. జ్యోతి బన్సల్	యాప్ డైనమిక్స్

యూఎస్ఏలో దేశాలవారీగా యూనికార్న్ స్టార్టప్స్

దేశం	స్టార్టప్స్		
1. ఇండియా	66	6. ఫ్రాన్స్	18
2. ఇజ్రాయెల్	54	7. జర్మనీ	15
3. యునైటెడ్ కింగ్‌డమ్	27	8. రష్యా	11
4. కెనడా	22	9. ఉక్రెయిన్	10
5. చైనా	21	10. ఇరాన్	8
		11. ఆస్ట్రేలియా	7

12. ఇటలీ, నైజీరియా, పోలండ్, రుమేనియా: 6 చొప్పున
13. అర్జెంటీనా, బ్రెజిల్, న్యూజిలాండ్, పాకిస్తాన్, దక్షిణ కొరియా: 5 చొప్పున

ముగిసిన సీటెట్-2023

సాక్షి, అమరావతి/హైదరాబాద్: జాతీయ స్థాయిలో ఉపాధ్యాయ ఉద్యోగాలకు పోటీ పడేవారి కోసం సెంట్రల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. డిగ్రీతో పాటు బీఈడీ అర్హత ఉన్న వారికి ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీ), ప్రైమరీ టీచర్స్ (పీఆర్‌టీ) రెండు పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించగా, డైట్ అర్హత ఉన్న వారికి పీఆర్టీ ఎంట్రన్స్ టెస్ట్‌కు హాజరయ్యారు. ఉదయం పీఆర్టీ, మధ్యాహ్నం టీజీటీ పరీక్ష నిర్వహించారు. కాగా.. ఏపీలోని 11 పట్టణాల్లో నిర్వహించిన పరీక్షకు సుమారు 20 వేల మంది అభ్యర్థులు హాజరైనట్టు అంచనా. ఇదిలా ఉండగా, కర్నూలు సెంటర్‌ను ఆప్షన్ పెట్టిన అభ్యర్థులకు గుంటూరు పట్టణంలో సెంటర్ కేటాయించడంతో అభ్యర్థులు ఇబ్బంది పడ్డారు. మరోవైపు, తెలంగాణ వ్యాప్తంగా దాదాపు 25 వేల మంది సీటెట్–2023 పరీక్షకు హాజరయ్యారు. హైదరాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్ కేంద్రాల్లో పరీక్ష జరిగింది.

పల్మనరీ మెడిసిన్ ఔట్

మెడికల్ కాలేజీకి అవసరమైన విభాగాల నుంచి తొలగింపు

- జాతీయ మెడికల్ కమిషన్ తాజా మార్గదర్శకాలు
- ఎమర్జెన్సీ మెడిసిన్, ఫిజికల్ మెడిసిన్ అండ్ రిహాబిలిటేషన్, రేడియేషన్ అంకాలజీలు కూడా ఔట్
- కొత్తగా సమీకృత వైద్య పరిశోధన విభాగం తప్పనిసరి
- ప్రత్యేకంగా యోగ విభాగం కూడా..



సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్ సీట్లతో మెడికల్ కాలేజీ పెట్టడానికి సంబంధించిన తాజా మార్గదర్శకాలను జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) విడుదల చేసింది. మూడేళ్ల తర్వాత ప్రస్తుత పరిస్థితులను ఆధారం చేసుకొని గత మార్గదర్శకాల్లో పలు మార్పులు చేర్పులు చేసింది. గతంలో మెడికల్ కాలేజీకి అనుమతి రావాలంటే 24 డిపార్ట్‌మెంట్లు తప్పనిసరిగా ఉండాలి. ప్రస్తుతం వాటిల్లో నాలుగింటిని తొలగించి, ఒక దాన్ని చేర్చారు. అంటే 21 విభాగాలు ఉంటే సరిపోతుంది. అయితే ఎంబీబీఎస్ విద్యార్థులకు కీలకమైన పల్మనరీ మెడిసిన్ విభాగం తొలగించడంపై విమర్శలు వస్తున్నాయి. దీనితో పాటు ప్రాధాన్యత కలిగిన ఎమర్జెన్సీ మెడిసిన్, ఫిజికల్ మెడిసిన్ అండ్ రిహాబిలిటేషన్, రేడియేషన్ అంకాలజీ విభాగాలను కూడా ఎన్ఎంసీ తొలగించింది. కొత్తగా సమీకృత వైద్య పరిశోధన విభాగాన్ని తీసుకొచ్చింది. అత్యవసర వైద్యానికి ప్రాధాన్యం ఇచ్చింది. సాధారణ పడకలను 8 శాతం తగ్గించి ఐసీయూ పడకలను మాత్రం 120 శాతం పెంచింది.

పల్మనాలజీ కిందే ఛాతీ, ఊపిరితిత్తుల వ్యాధులు

ఛాతీ, ఊపిరితిత్తులు సంబంధిత వ్యాధులు లేదా కరోనా వంటి సమయాల్లో పల్మనరీ మెడిసిన్ కీలకమైనది. టీబీ వ్యాధి కూడా దీని కిందకే వస్తుంది. వెంటిలేటర్ మీద ఉండే రోగులను పల్మనరీ, అనెస్తీషియా విభాగాల వైద్యులే చూస్తారు. అలాంటి ప్రాధాన్యత కలిగిన విభాగాన్ని తొలగించడంపై సంబంధిత వైద్యులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పల్మనరీని తీసేయడం వల్ల అనెస్తీషియా, జనరల్ మెడిసిన్ స్పెషలిస్టులపై భారం పడుతుందని అంటున్నారు. కాలేజీలో తొలగించిన విభాగాలకు చెందిన పీజీలు ఉండరు. దానికి సంబంధించిన వైద్యం కూడా అందుబాటులో ఉండదు.

పల్మనరీ మెడిసిన్ రద్దు సమంజసం కాదు

50 ఏళ్లుగా ఉన్న పల్మనరీ మెడిసిన్ విభాగం తప్పనిసరి నిబంధన తొలగించడం సరైన చర్య కాదు. 2025 నాటికి టీబీ నిర్మూలనను లక్ష్యంగా పెట్టుకున్న భారత్ పల్మనరీ వంటి కీలకమైన విభాగాన్ని తీసేయడం సమంజసం కాదు.
– డాక్టర్ కిరణ్ మాదల, సైంటిఫిక్ కమిటీ కన్వీనర్, ఐఎంఏ, తెలంగాణ


మరికొన్ని మార్గదర్శకాలు

- అనెస్తీషియా కింద పెయిన్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని తీసుకొచ్చారు. దీర్ఘకాలిక నొప్పులు, మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పులు వంటివి ఈ విభాగం కిందికి వస్తాయి.
- యోగాను ఒక విభాగంగా ప్రవేశపెట్టారు. ఈ మేరకు వేర్వేరుగా స్త్రీ, పురుష శిక్షకులు ఉండాలి.
- గతంలో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు 300 పడకలు అవసరం కాగా, ప్రస్తుతం వాటిని 220కి కుదించారు.
- స్కిల్ ల్యాబ్ తప్పనిసరి చేశారు. ఎంబీబీఎస్ విద్యార్థులు నేరుగా రోగుల మీద కాకుండా బొమ్మల మీద ప్రయోగం చేసేందుకు దీన్ని తప్పనిసరి చేశారు.
- గతంలో కాలేజీకి సొంత భవనం ఉండాలన్న నియమం ఉండేది. ఇప్పుడు 30 ఏళ్ల లీజుతో కూడిన భవనం ఉంటే సరిపోతుంది. కాలేజీ, అనుబంధ ఆసుపత్రి మధ్య దూరం గతంలో 10 కిలోమీటర్లు, 30 నిమిషాల ప్రయాణంతో చేరగలిగేలా ఉండాలన్న నియమం ఉండేది. ఇప్పుడు దీనిని కేవలం 30 నిమిషాల్లో చేరగలిగే దూరంలో ఉండాలన్న నియమానికి పరిమితం చేశారు.
- ఎన్ని సీట్లకు ఎన్ని జర్నల్స్, పుస్తకాలు ఉండాలన్నది స్పష్టం చేశారు.
- మెడికల్ కాలేజీకి అనుబంధంగా డాక్టర్లు, నర్సులతో పాటు మొత్తం 17 మంది సిబ్బందితో అర్బన్ హెల్త్ సెంటర్ ఉండాలి. ఎంబీబీఎస్ విద్యార్థులను ఇక్కడికి శిక్షణకు పంపుతారు.
- గతంలో ఎంబీబీఎస్, హౌసర్జన్లు, రెసిడెంట్లకు హాస్టల్ వసతి తప్పనిసరిగా ఉండేది. ఇప్పుడు రెసిడెంట్లకు తీసేశారు.

100 ఖాతాలు.. రూ.400 కోట్లు!

పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో కొల్లగొట్టేశారు

- దుబాయ్, తైవాన్, చైనాల్లో ఉన్న సూత్రధారులు
- గుట్టురట్టు చేసిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు
- సహకరిస్తున్న ముంబై వాసి భరత్ కుమార్ అరెస్టు





సాక్షి, హైదరాబాద్: విదేశాల్లో ఉంటూ ఇక్కడ పార్ట్‌టైమ్ జాబ్స్ పేరుతో ఎరవేసి ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్‌తో బాధితులను నిండా ముంచుతున్న సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న ముంబై వాసిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ–క్రిమినల్స్ ఫైనాన్షియల్ నెట్‌వర్క్‌ను పర్యవేక్షిస్తున్న ఇతను ప్రతి లావాదేవీకి 20 శాతం కమీషన్ తీసుకుంటున్నాడని, బ్యాంకు ఖాతాల్లో పడిన మొత్తాన్ని క్రిప్టో కరెన్సీగా మారుస్తూ విదేశాలకు తరలిస్తున్నాడని ద ర్యాప్తు అధికారులు గుర్తించారు. కేసులో పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నారు.

వ్యాపారం సాగక అడ్డదారి..

ముంబైకి చెందిన రోనక్ భరత్ కుమార్ కక్కడ్ వృత్తిరీత్యా డిజిటల్ మార్కెటింగ్ నిర్వాహకుడు. వివిధ కంపెనీలకు సంబంధించిన ప్రకటనలు తయారు చేయడం, వీటిని సోషల్ మీడియా ద్వారా ప్రమోట్ చేయడం చేస్తుండేవాడు. ఈ వ్యాపారం కోసం రొలైట్ మార్కెట్, బ్లాక్ వే డిజిటల్ పేర్లతో రెండు కంపెనీలు ఏర్పాటు చేశాడు. వీటి పేర్లతో కరెంట్ ఖాతాలు కూడా తెరిచాడు. కానీ వ్యాపారం ఆశించిన స్థాయిలో సాగకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాడు. ఇందులో భాగంగా టెలిగ్రామ్ యాప్ ద్వారా వివిధ వ్యాపారాలు, స్కీమ్‌లు తదితరాలకు సంబంధించిన గ్రూప్‌లను సెర్చ్ చేశాడు. ఓ గ్రూపు ద్వారా తైవాన్‌కు చెందిన స్వాంగ్ లిన్, యూరోపియన్ యూనియన్‌కు చెందిన ఇరీన్ పరిచయమయ్యారు.

క్రిప్టో కరెన్సీగా మార్చి..

దుబాయ్, భారత్‌లో ఉన్న పలువురికి చెందిన 100 బ్యాంకు ఖాతాల వివరాలు ప్ర శాంత్ నుంచి భరత్‌కు, అతన్నుంచి విదేశాల్లో ఉన్న స్వాంగ్ లిన్, ఇరీన్‌కు చేరాయి. వీరు తమ వలలో పడిన వారికి ఈ ఖాతాల నంబర్లనే ఇచ్చి డబ్బు డిపాజిట్/ట్రాన్స్‌ఫర్ చేయించేవారు. ఆ సొమ్మును ప్రశాంత్ తన ఖాతాల్లోకి బదిలీ చేసుకుని, క్రిప్టో కరెన్సీగా మార్చి భరత్‌కు పంపేవా డు. భరత్ తైవాన్‌లో ఉండే స్వాంగ్ లిన్‌కు పంపేవా డు. బ్యాంకు ఖాతాల నిర్వహణ, కరెన్సీ మార్పిడి బాధ్యతలు భరత్ కుమార్, ప్రశాంత్ నిర్వహిస్తుండ గా, బాధితులను మోసం చేయడం లిన్, ఇరీన్ చేసేవాళ్లు. తమకు చేరిన మొత్తం నుంచి లిన్, ఇరీన్ తమ వాటా మిగుల్చుకుని మిగిలింది చైనాలో ఉండే కీలక నిందితులకు పంపేవాళ్లు. ఇలా మొత్తం ఆరు నెలల్లో రూ.400 కోట్లు కొల్లగొట్టారు. నగరంలో నమోదైన ఓ కేసు దర్యాప్తులో ఈ వ్యవహారాలు గుర్తించిన సైబర్ క్రైమ్ పోలీసులు గత వారం భరత్‌ను అరెస్టు చేసి తీసుకువచ్చారు.

20% కమీషన్‌తో..

తొలుత భరత్‌ను సంప్రదించిన ఆ ఇద్దరూ తమకు ఇండియాలో కొన్ని వ్యాపారాలు ఉన్నాయని, అనేక మంది నిరుద్యోగులకు తాము పార్ట్‌టైమ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని, వారి నుంచి అడ్వాన్సులు తీసుకుంటామని చెప్పారు. వాటికి సంబంధించిన నగదు భారీగా జమ చేయడానికి బ్యాంకు ఖాతాలు కావాలని అడిగారు. అయితే ఈ ఖాతాలను వినియోగించి సైబర్ నేరాలు చేస్తారన్న విషయం తెలిసిన భరత్.. అదే అంశం వారితో చెప్పి బేరసారాలు చేశాడు. ప్రతి లావాదేవీపైనా 20 శాతం కమీషన్ తీసుకుని సహకరించేందుకు అంగీకరించాడు. భరత్ తన రెండు ఖాతాలతో పాటు దుబాయ్‌లో ఉండే స్నేహితుడు ప్రశాంత్‌ను సంప్రదించి అక్కడి భారతీయులకు సంబంధించిన బ్యాంకు ఖాతాలతో పాటు ఇక్కడ ఉండే వారి బంధువులవీ సేకరించాడు. ప్రశాంత్ దుబాయ్‌లోని తన కార్యాలయం ద్వారా పన్నులు లేకుండా నగదును దుబాయ్ కరెన్సీగా మార్చే వ్యాపారం చేస్తున్నాడు.

పేదలకు వైద్యం అందని ద్రాక్ష అన్న నానుడిని తిరగరాస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. పేదలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి తుది రూపు దిద్దుకుంటోంది. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలోని జిల్లా ప్రధాన ఆసుపత్రి ఇప్పటికే ప్రభుత్వ వైద్య కళాశాల బోధనాసుపత్రిగా అభివృద్ధి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఇక్కడ అన్ని రకాల వ్యాధులకూ వైద్య సేవలు అందుతున్నాయి. ఆసుపత్రిలో గైనిక్ విభాగాన్ని మరింత ఆధునీకరించారు. దీంతో పాటు గుండె సంబంధిత వ్యాధులకు వైద్య సేవలు కూడా ప్రారంభించారు.


- కంబాలచెరువు (రాజమహేంద్రవరం)



ప్రభుత్వ బోధనాసుపత్రికి వచ్చిన రోగులు

గుండెకు అండ

- రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో ఇప్పటికే హృద్రోగ వైద్య సేవలు
- త్వరలో శస్త్రచికిత్సలూ ప్రారంభం
- రూ.10 కోట్లతో ఆపరేషన్ థియేటర్‌కు ప్రతిపాదనలు
- గైనిక్ విభాగంలోనూ అధునాతన సేవలు



ప్రస్తుతం ప్రభుత్వ ఈ బోధనాసుపత్రిలో గుండె సంబంధిత వ్యాధులకు సాధారణ చికిత్సలు అందిస్తున్నారు. గుండె నొప్పితో వచ్చేవారికి తక్షణ ఉపశమనం ఇచ్చేందుకు ప్రాణాన్ని రక్షించే ఇంజక్షన్లు అందుబాటులో ఉంచారు. వ్యాధి నిర్ధారణకు అవసరమైన వైద్య పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రస్తుతం అవసరమైన వారికి నగరంలోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో గుండె సంబంధిత శస్త్రచికిత్సలు ప్రభుత్వ వ్యయంతో చేయిస్తున్నారు. కొద్ది నెలల్లోనే ఈ ప్రభుత్వ బోధనాసుపత్రిలోనే శస్త్రచికిత్సలు చేసేందుకు వీలుగా ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేస్తున్నారు. స్టెంట్లు, బైపాస్ సర్జరీ చేసే స్థాయిలో దీనిని తీర్చిదిద్దనున్నారు. దీనికి సంబంధించి రూ.10 కోట్లతో వైద్యాధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఇది నెలల వ్యవధిలోనే కార్యరూపం దాల్చే అవకాశం ఉందని ఆసుపత్రి హృద్రోగ వైద్య వర్గాలు తెలిపాయి. గుండె సంబంధిత వ్యాధులకు 24 గంటలూ వైద్య సేవలు అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉన్న హృద్రోగ బాధితులను వెంటనే ఆసుపత్రికి తీసుకువస్తే రక్తనాళాల్లోని బ్లాకులు కరిగించే విధంగా ఎస్‌టీకే (స్ట్రెప్టో కైనేజ్), హెపారిన్ ఇంజక్షన్లు సైతం ఆసుపత్రిలో అందుబాటులో ఉంచారు. జిల్లా ప్రభుత్వాసుపత్రిగా ఉన్నప్పుడు ఇక్కడ సర్జికల్, గైనిక్‌తో పాటు అన్ని రకాల సేవలకూ ఒకే ఐసీయూ ఉండేది. అయితే బోధనాసుపత్రి కావడంతో ఆయా వైద్య సేవలకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా సర్జికల్ ఐసీయూతో పాటు ప్రత్యేకంగా గైనిక్ ఐసీయూ ఏర్పాటు చేశారు. ఇందులో వెంటిలేటర్లు, ఏసీలు ఏర్పాటు చేశారు. ఈ రకమైన ప్రత్యేక గైనిక్ ఐసీయూ జిల్లాలోనే ఎక్కడా లేదని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి.

నిత్యం వైద్య సేవలు

వైద్య కళాశాల ఆసుపత్రిలో గుండె వ్యాధుల విభాగం ఏర్పాటు చేశాం. ప్రతి నెలా సుమారు 150 నుంచి 200 మంది వరకూ హృదయ సంబంధిత వ్యాధులతో ఆసుపత్రికి వస్తున్నారు. వారందరికీ మెరుగైన వైద్యం అందిస్తున్నాం. ప్రస్తుతం ఆపరేషన్ థియేటర్ లేదు. అది ఏర్పాటయ్యేంత వరకూ ప్రైవేటు ఆసుపత్రికి పంపి శస్త్రచికిత్సలు చేయిస్తున్నాం. గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు, ఉచితంగా మందులు పొందవచ్చు.
– పీవీవీ సత్యనారాయణ, హెచ్‌ఓడీ, కార్డియాలజీ విభాగం, ప్రభుత్వ వైద్య కళాశాల బోధనాసుపత్రి, రాజమహేంద్రవరం

స్వల్పంగా పెరిగిన గోదావరి

ధవళేశ్వరం: పరీవాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ధవళేశ్వరంలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి నీటి ఉధృతి ఆదివారం రాత్రి స్వల్పంగా పెరిగింది. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.70 అడుగులకు చేరింది. 1,54,108 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. ఎగువన భద్రాచలం వద్ద కూడా నీటిమట్టం స్వల్పంగా పెరుగుతూ, సాయంత్రం 21.60 అడుగులకు చేరింది. దీంతో ధవళేశ్వరం వద్ద నీటి ఉధృతి సోమవారం మరింత పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరి డెల్టా కాలువలకు 11,100 క్యూసెక్కుల జలాలు విడుదల చేశారు. తూర్పు 4,500, సెంట్రల్ 2,600, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు.



పచ్చందాలకు ప్రణాళిక

జేఎన్‌టీయూకేలో ఆహ్లాదకర వాతావరణం దిశగా అడుగులు

సునీల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5కోట్ల సీఎస్ఆర్ నిధులు

హర్షం వ్యక్తం చేస్తున్న విద్యావేత్తలు.. ఈ నెల 23న శంకుస్థాపన

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కళాశాల నుంచి వర్సిటీ స్థాయికి ఎదిగి నగర నడిమధ్యలో దాదాపు 100 ఎకరాలకు పైబడిన విస్తీర్ణంలో ఉన్న జేఎన్‌టీయూ కాకినాడలో సరికొత్త ప్రాజెక్టుకు అడుగులు పడుతున్నాయి. కార్పొరేట్ కళాశాలల్లో మాత్రమే ఉండే సరికొత్త మౌలిక సదుపాయాలు ఇక జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కళాశాలకు సమకూరనున్నాయి. కళాశాల నుంచి వర్సిటీగా అప్‌గ్రేడ్ అయి విశాలమైన స్థలంతో దానికి తగిన వనరులు అందుబాటులో ఉన్ననాడు నిర్లక్ష్యం చేశారు. ప్రముఖ కార్పొరేట్ సంస్థలు ఐటీసీఎల్, ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులు కేటాయిస్తామన్నా దీనిపై దృష్టి పెట్టినవారు లేరు. అయితే ప్రస్తుతం దాతల సహాయంతో మియావాకి ఫారెస్ట్, నక్షత్ర వనం, జంగిల్ రీడింగ్ బుక్ వంటి పర్యావరణ ప్రాజెక్టులు మరింత గ్రీనరీగా తయారు చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గత నెలలో స్నాతకోత్సవానికి విచ్చేసిన గ్రీన్‌కో ఫౌండర్ చలమలశెట్టి అనిల్‌కు వీసీ డాక్టర్ ప్రసాదరాజు దీనిపై ప్రతిపాదించగా సునీల్ చారిటబుల్ ట్రస్ట్ నుంచి వర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.5కోట్ల మంజూరు చేస్తామని చెప్పారు.

చేపట్టే పనులు ఇవే...

ఈ నిధులతో వర్సిటీలో భారీ వృక్షాల చుట్టూ ప్లాట్‌ఫారంలు, రోడ్డు కిరువైపులా ఫుట్‌పాత్ లైటింగ్స్, ఓపెన్ థియేటర్, పార్కు, ఆర్నమెంటల్ ట్రీస్, 2 వాటర్ బాడీస్, యోగా సెంటర్, ఓపెన్ జిమ్ వంటివి ఏర్పాటు చేసి నగరంలో సుందరమైన, స్ఫూర్తిదాయక ప్రాంతంగా రూపొందించడానికి ప్రణాళికలు రూపొందించారు. గత వారం వీసీ సమావేశపు హాల్లో దీనికి సంబంధించి ఇంజినీరింగ్, వర్సిటీ అధికారులు గ్రీన్‌కో ఆర్కిటెక్ టీమ్ ద్వారా ప్రజంటేషన్ ఏర్పాటు చేశారు. ఈ నెల 23 నుంచి ప్రారంభయ్యే పనులు 2024 ఏప్రిల్‌కు పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రెండేళ్లపాటు గ్రీన్‌కో ట్రస్టు ఉచితంగా నిర్వహణ బాధ్యతలను నిర్వహిస్తుంది.

పర్యావరణానికి ప్రాధాన్యం

వర్సిటీలో పర్యావరణాన్ని పెంపొందించి గ్రీన్ క్యాంపస్‌గా తయారు చేయాలనేది లక్ష్యం. వర్సిటీకి శాశ్వతంగా ఉండే విధంగా భారీ ప్రాజెక్టు చేపట్టాలని ఆశయంగా పెట్టుకున్నాను. సునీల్ ట్రస్ట్‌ను సంప్రదించగా వారికి ఉన్న గ్రీన్‌కో సంస్థ ద్వారా రూ.5కోట్లు కేటాయించడం సంతోషంగా ఉంది. ఉన్నత అధికారులతో వర్సిటీ 15వ వ్యవస్థాపక రోజైన ఈ నెల 23న శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నాము.
– జీవీఆర్ ప్రసాదరాజు, వీసీ, జేఎన్‌టీయూకే

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.